

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15
సంచిక: 172

బుధవారం 8-3-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ఎనిమిదేళ్లవయసులో సరదాగా తండ్రితో గ్రౌండ్‌కు వెళ్ళేది. అక్కడ కొంతమంది అమ్మాయిలు క్రికెట్ ఆడుతుంటే ఎంతో ఆసక్తిగా చూసేది. ఓ రోజు తనకూ క్రికెట్ ఆడాలని వుందనే అభిలాషను వ్యక్తపరిచింది. తల్లిదండ్రులు ప్రోత్సహించడంతో క్రికెట్ బాల్ అందుకుంది. నేడు ఏకంగా ఆంధ్రప్రదేశ్ తరపున ఉమెన్ ప్రీమియర్ లీగ్ స్థాయికి ఎదిగిపోయింది. ఇటీవల అండర్19 టీ20 వరల్డ్‌కప్‌ను భారత్ సొంతం చేసుకున్న జట్టుకు ఆడింది. ఆరేళ్లలోనే తన మీడియం పేస్‌తో ప్రత్యర్థుల్ని బెంబెలెత్తించే స్థాయికి చేరుకుంది విశాఖ ఉమెన్ క్రికెటర్ షబనమ్ మహ్మద్ షకీల్.
ఆటే శ్వాసగా రాణిస్తున్న రైట్ ఆర్మ్ మీడియం పేసర్ షబ్‌నమ్ మహిళా దినోత్సవ సందర్భంగా తన అంతరంగాన్ని సాక్షితో పంచుకుంది.

క్రికెట్.. బిర్యానీ.. అంతే..!

- షబ్‌నమ్

● **క్రికెట్ ప్రస్థానం ఎలా ప్రారంభమైంది...**

2017లో క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన వేసవి శిబిరాల్లో పాల్గొన్నాను. నాకు మొదట్నించీ బ్యాటింగ్ కంటే బౌలింగ్‌లోనే ఇష్టం ఉండేది. రెండేళ్లలో మీడియం పేసర్‌గా ఎదిగాను. పేస్‌లో వేరియేషన్స్‌తో బంతులు విసురుతుండటంతో అండర్ 16 జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. అనతికాలంలోనే ఆంధ్రజట్టుకు ఆడాను. రైల్వేస్ జట్టుతో ప్రాక్టీస్‌లో నెట్‌బౌలర్‌గా సీనియర్స్‌తో ఎలా ఆడాలో నేర్చుకున్నాను. అనంతరం ఏకంగా ఉమెన్ అండర్ 19 వరల్డ్‌కప్, జాతీయ జట్టుకు ఎంపికయ్యాను. ప్రస్తుతం ఉమెన్ ఐపీఎల్‌లో గుజరాత్ జెయింట్స్‌కు ఆడుతున్నాను.

● **చదువెలా సాగుతోంది...**

పదో తరగతి చదువుతున్నాను. ఏప్రిల్‌లో పరీక్షలున్నాయి. ఉమెన్ ఐపీఎల్ పూర్తికాగానే పరీక్షలు రాస్తాను. మా టీచర్లు ఓ ప్రత్యేక గ్రూప్ ఏర్పాటు చేశారు. సబ్జెక్ట్ డౌట్స్ వివరిస్తుంటారు. ప్రాక్టీస్, పాఠాలు ఏకకాలంలో సాగుతున్నాయి. ప్రస్తుతం ఉమెన్ ప్రీమియర్ లీగ్‌లో గుజరాత్ జెయింట్స్ తరపున ఆడుతూ ముంబయ్‌లో ఉన్నాను. ఇటీవలే అండర్ 19 ఉమెన్ వరల్డ్ కప్‌లోనూ ఆడాను.

● **ప్రస్తుత లక్ష్యం...**

సీనియర్ ఉమెన్ జట్టులో ఇండియా తరపున ఆడటమే నా లక్ష్యం. అండర్–19 వరల్డ్‌కప్‌కు ఆడిన జట్లలో నేనే చిన్నదానిని. ఇప్పుడు ప్రీమియర్ లీగ్‌లోనూ చిన్న దాన్ని. ఆంధ్రప్రదేశ్ నుంచి ఉమెన్ ఐపీఎల్‌కు ఎంపికైన తొలి క్రికెటర్‌ను. పదినేహేళ్ల ప్రాయంలోనే ఇది సాధ్యపడటం చాలా సంతోషాన్నిచ్చింది.

● **జూనియర్ వుమెన్ టీ20 వరల్డ్‌కప్‌లో...**

జూనియర్స్ వరల్డ్‌కప్ ఆడుతున్నప్పుడు, సీనియర్ల నుంచి చాలా సలహాలు తీసుకున్నాను. కోచ్‌లు సీనియర్ సభ్యులు ఎక్కువ మ్యాచ్‌లు ఆడాలని, అప్పుడే ఎక్స్‌పోజర్ వస్తుందని సూచించారు. ముందు మన బలహీనతలు తెలుసుకుని, వాటిని అధిగమించాలని కూడా చెప్పారు. అందుకు తగినట్టు గానే మ్యాచ్‌ల్లో సీనియర్స్‌ను జాగ్రత్తగా గమనిస్తున్నాను. అందరిలోకి చిన్నదాన్ని కావడంతో ఎంతో ఆప్యాయత చూపిస్తున్నారు.

● **ఇన్‌స్పిరేషన్ ఎవరు...**

జులన్ గోస్వామి ఆట తీరును జాగ్రత్తగా గమనిస్తుంటాను. ఫాస్ట్ బౌలింగ్‌లో ఆమె నా స్ఫూర్తి.

● **ఏ రంగంలో స్థిరపడాలనుకుంటున్నారు?**

యూనిఫామ్ వేసుకునే జాబ్ చేయాలనేది నా ఆకాంక్ష. దేశం పట్ల నాకు చాలా గౌరవం. డిఫెన్స్, పోలీస్ లాంటి రంగాల్లో పని చేయాలని ఉంది.

● **మీ హాబీలేంటి?**

నాకు చిన్నప్పటి నుంచి క్రికెట్ అంటేనే ఇష్టం ఏర్పడటంతో మిగిలిన విషయాల పట్ల పెద్దగా ఆసక్తి కలగలేదు. అందుకే హాలిడే ఎంజాయ్ చేయాలని, ఏవైనా కొత్త ప్రదేశాలకు వెళ్లాలనే ఆలోచన కూడా రాలేదు. నాన్న షకీల్ తన జట్టుకు ఆడుతుంటే సరదాగా చెల్లెలు షాజహానాతో కలిసి కామెంటరీ చెప్పేదాన్ని. అలా సరదాగా ప్రారంభమైన నా క్రికెట్ కెరీర్ నేడు ప్రీమియర్ లీగ్, జూనియర్ వరల్డ్ కప్ ఆడేస్థాయికి చేరింది. మ్యాచ్‌లలో భాగంగా ఆయా ప్రాంతాలకు వెళ్ళాను తప్ప ప్రదేశాలను చూడడం కోసం ఎక్కడికీ వెళ్లలేదు.

● **ఏ రంగు ఇష్టం?**

నీలం రంగు అంటే ఇష్టం. లాంగ్ ఫ్రాక్స్ వేసుకుంటూ ఉంటాను. ఇక బాగా ఇష్టమైనది నిద్ర. ఖాళీ దొరికితే ఎక్కువగా పడుకుంటాను. సరదాగా మ్యాచ్‌లు చూసే స్థాయి నుంచి సీరియస్‌గా మ్యాచ్‌లాడే స్థాయికి ఎదగడంతో తీరిక అనేది ఉండటం లేదు. ఈ నెల 27న తిరిగి విశాఖ చేరుకోగానే పరీక్షలపై దృష్టి పెట్టాలి. చెస్, బ్యాడ్మింటన్ సరదాగా ఆడుతుంటాను.

● **డైట్ ఎలా?**

నాకు బిరియానీ అంటే ఇష్టం. అమ్మ రాత్రికి పుల్కాల్లో రకరకాల వంటలు చేస్తుంది. డైట్ పట్ల చాలా శ్రద్ధ వహిస్తాను. ఆహారసూచనలను పాటిస్తాను. డ్రైఫ్రూట్స్ ఎక్కువగా తీసుకుంటాను. స్వీట్స్ జోలికి వెళ్ళను.

● **ఎలాంటి సినిమాలిష్టం?**

సినిమాల పట్ల పెద్దగా ఆసక్తి లేదు. ఇప్పటివరకు ఆట, చదువే నా లోకం. కానీ ఆటల మీద వచ్చిన సినిమాల్ని చూస్తాను. ఉదయాన్నే ఐదు గంటల కల్లా ప్రాక్టీస్ చేసుకోవడానికి గ్రౌండ్‌కు వెళ్తాను. కోచ్‌లు చెప్పిన వాటిని తూచ తప్పకుండా ఆచరించడం. వీలు దొరికినప్పుడల్లా సబ్జెక్ట్ బుక్స్ ముందేసుకు కూర్చోవడమే ప్రస్తుత నా దినచర్య.

– డాక్టర్ ఎ. సూర్యప్రకాశరావు మాడిమి, విశాఖపట్నం



స్విమ్మింగ్ చాలా ఇష్టం

పిజ్జా కూడా.. కానీ: త్రిష

తెలుగుతేజమైన గొంగడి త్రిష ఉమన్ క్రికెటర్‌గా మనందరికీ పరిచయమే. భద్రాచల వాసి త్రిష అండర్-19 వరల్డ్ కప్- 2023 ఫైనల్లో టీమిండియాను జగజ్జేతగా నిలపడంలో కీలకపాత్ర పోషించింది. 'సీనియర్ ఉమన్ క్రికెట్ టీమ్‌లో చోటు దక్కించుకోవడమే నా నిరంతర కృషి' అని చెబుతోంది త్రిష.

ఫిట్‌నెస్ కోచ్ అయిన తండ్రి రామిరెడ్డి ద్వారా మూడేళ్ల వయసులోనే క్రికెట్‌లో ఓనమాలు దిద్దిన త్రిష ఎనిమిదేళ్ల వయసులో హైదరాబాద్ అండర్–16 జట్టులో చేరింది. ఆమెలోని ప్రతిభను గుర్తించిన తల్లిదండ్రులు కూతుర్ని హైదరాబాద్‌లోని స్పోర్ట్స్ అకాడమీలో చేర్చారు. అక్కడ నుంచి ఆమె క్రికెటర్‌గా తనను తాను మెరుగుపరుచుకుంటూ భారతజట్టులో స్థానం దక్కించుకుంది. తెలంగాణ అమ్మాయిగా భారత క్రికెట్ జట్టులో విజయకేతనం ఎగురవేస్తున్న త్రిష తన ఆసక్తులను, భవిష్యత్తు కలను ఇలా వివరించింది...

''నేను మహిళల అండర్–19 కేటగిరిలో టీ20 వరల్డ్ కప్‌కి ఆడాను. రాబోయే రోజుల్లో ఇండియన్ సీనియర్ ఉమెన్ క్రికెట్ టీమ్‌లో చోటు సంపాదించాలన్నది నాకల. ఆ లక్ష్యం సాధించడానికే ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒక తపస్సులా ప్రాక్టీస్ చేస్తున్నాను. గెలుపు ఓటమి గురించి కూడా ఆలోచించకుండా లక్ష్యం కోసం చేసే ప్రయత్నంలో ఏదీ ఒత్తిడిగా అనిపించదు.

● **ఇతర అభిరుచులు...**

నాకున్న మరో అభిరుచి స్విమ్మింగ్. ఎంతసేపైనా వదలాలనిపించదు. అమ్మాయిలకు స్విమ్మింగ్ తప్పనిసరిగా వచ్చితీరాలని. నాకు స్విమ్మింగ్ చేసిన ప్రతీసారి అనిపిస్తుంటుంది. మంచి రిలాక్సేషనిస్తుంది స్విమ్మింగ్.

● **చదువూ ముఖ్యమే..**

ఇప్పుడు 12వ తరగతి చదువుతున్నాను. చదువు, ఆటలు కొనసాగిస్తూ వెళ్లడమే. ఎందుకంటే నా ఎదుగుదలకు ఈ రెండూ ముఖ్యమే అని భావిస్తాను. అయితే, ఎక్కువ సమయం క్రికెట్ సాధనను కేటాయించినప్పటికీ ఎగ్జామ్స్‌కి ప్రత్యేకంగా ప్రిపేర్ అవుతుంటాను.

● **ఇష్టాలు ఏవైనా కల తర్వాతే..**

నాకు స్నేహితులు చాలా తక్కువ. కొందరు క్రికెట్ ఫ్రెండ్స్ ఉన్నారు. కోచ్‌లు సూచించిన డైట్‌ని కచ్చితంగా ఫాలో అవుతాను. ఏ ఆహారం తీసుకుంటే నా హెల్త్‌కి మంచిదో, ఫిట్‌నెస్ పట్ల ఎంత శ్రద్ధ తీసుకోవాలో అవన్నీ పాటిస్తాను. పిజ్జా, బర్గర్ వంటివి ఇంట్రస్ట్ ఉన్నా సరే తీసుకోను. ప్రాక్టీస్‌లోని మా క్రికెట్ టీమ్ మెంబర్స్‌తోనే టైమ్ పాస్ అవుతుంది కాబట్టి, ఇతరత్రా ఆలోచనలు కూడా ఏవీ మైండ్‌లోకి రానివ్వను.

● **ప్రోత్సాహాన్నిచ్చేవి..**

ఉమెన్ క్రికెటర్ మిథాలీరాజ్, ఎం.ఎస్ ధోనీలకు పెద్ద అభిమానిని. వారు ఆడుతున్న తీరును చూస్తూ పెరిగినదాన్ని కాబట్టి, వారు నాకు రోల్‌మోడల్స్. స్ఫూర్తిదాయకమైన వారి మాటలు నన్ను నేను మెరుగుపరుచుకోవడానికి ఉపయోగించుకుంటాను'' అని తెలియజేసిన త్రిష లక్ష్య సాధనలో ఎన్నో విజయాలు దక్కించుకోవాలని కోరుకుందాం.

– నిర్మలారెడ్డి

అంతటా నేనే అన్నింటా నేనే

కంచెలు తెంచేశాం. హద్దులు చెరిపేశాం.
అంక్షలు తుడిచేశాం. అవరోధాలు ఎదిరించాం.
నేల, నింగి, నీరు, ఊరు... కొలువు, క్రీడ, కార్మిక వాడ...
గనులు, ఓడలు, రోదసి యాత్రలు..
పాలనలో.. పరిపాలనలో..
ఆర్థిక శక్తిలో.. అజమాయిషీలో
సైన్యంలోన సేద్యంలోన
అన్నీ మేమై... అన్నింటా మేమై...
అవకాశం కల్పించుకుంటాం.
అస్తిత్వం నిలబెట్టుకుంటాం.
స్త్రీని గౌరవించే సమాజం
స్త్రీని గౌరవించే సంస్కారం
ప్రతి ఇంటి నుంచి మొదలవ్వాలి.
ప్రతి రంగంలో పాదుకొనాలి.

అతివకు కాదేది అసాధ్యం



ఈమె పేరు రమాదేవి. విజయవాడ నగరం, రామలింగేశ్వర నగర్ నివాసి. భర్త వ్యసనపరుడై మరణించాడు. ఇద్దరు పిల్లలను పోషించుకోవడానికి ఇంత కష్టమైన పనిని చేయడానికి ముందుకు వచ్చింది. ఎయిర్ బ్రేక్ సిస్టమ్ మెకానిక్‌గా పని చేస్తోంది.



స్వరూపరాణిది పశ్చిమగోదావరి జిల్లా, దెందులూరు మండలం, గంగన్నగూడెం. ఆడవాళ్లు వేదాలను ఎందుకు చదవకూడదనే ప్రశ్నకు తానే జవాబుగా నిలవాలనుకుంది. వేదాలు ఔపోశన పట్టి, బ్యాంకు మేనేజర్ ఉద్యోగం నుంచి వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకుని పౌరోహిత్యం చేస్తున్నారు.



ఆటో నడుపుతున్న సరస్వతి సుమతిది నెల్లూరు నగరం. ఇంటర్ వరకు చదువుకున్న సుమతి పిల్లల పోషణ కోసం ఆటో నడుపుతూ, పిల్లలతో పాటు చదువును మళ్లీ మొదలు పెట్టి బీఎల్ పూర్తి చేసింది.



నెల్లూరు జిల్లా పొదలకూరు మండలం పులికల్లు సర్పంచ్ గొడ్డేటి వెంకటసుబ్బమ్మ... పొలం దుక్కి దున్నడంతోపాటు నిమ్మచెట్లకు తెగుళ్లు సోకితే స్ప్రేయర్‌తో క్రిమిసంహారక మందులను స్వయంగా పిచికారి చేస్తుంది.



కడప జిల్లా ప్రొద్దుటూరు పట్టణంలో పెట్రోలు బంకులో పెట్రోలు పడుతున్న పగిడేల ఉమా మహేశ్వరి.

కాచరమైన కళమ్మ ఉండేది కుషాయిగూడ హైదరాబాద్‌లో. మొదట భవన నిర్మాణ కార్మికురాలిగా ఉన్న కళమ్మ 30 ఏళ్లుగా ఇండ్లకు, దేవాలయాలకు పెయింటింగ్ వేస్తోంది.

మదనపల్లె పట్టణంలో రేణుక... డ్రైవింగ్ స్కూల్‌లో స్వయంగా తానే మహిళలకు డ్రైవింగ్ నేర్పిస్తోంది.

యదళ్ళపల్లి ఆదిలక్ష్మి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, సుజాతనగర్‌లో ఉంటుంది. గత 5 ఏళ్లుగా మెకానిక్‌గా పనిచేస్తోంది.

నాడు కూలీ... నేడు ఓనర్...

స్టీరింగ్ తిప్పింది



ట్రాక్టర్ నడుపుతున్న బడియా సావిత్రిది శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలం డొంకూరు గ్రామం. మత్స్యకార కుటుంబానికి చెందిన సావిత్రి పెద్దగా చదువుకోలేదు. కుటుంబ పోషణ కోసం ట్రాక్టర్ కూలీగా పనిచేసేది. ఆడవాళ్లు కార్లు, బైక్‌లు, బస్సులు, రైళ్లు, విమానాలు నడుపుతున్నారు. ట్రాక్టర్ కూడా నడపవచ్చు అనుకుంది. డ్రైవింగ్ నేర్చుకుంది. తనకు సొంతంగా ట్రాక్టర్ ఉంటే బావుణ్నని కలగన్నది. స్వయంసహాయక బృందంలో సభ్యురాలు కావడంతో గత ఏడాది ఆమెకు 'స్త్రీ నిధి' నుంచి 80వేలు, గ్రామ సంఘం నుంచి లక్ష రూపాయల లోన్ వచ్చింది. ఆ డబ్బు డౌన్ పేమెంట్‌గా కట్టి వాయిదాల పద్ధతిపై ట్రాక్టర్ కొన్నది. ప్రస్తుతం తన ట్రాక్టర్‌ను తానే నడుపుతూ వ్యవసాయ పనులు, ఇతరత్రా పనులు చేసుకుంటోంది సావిత్రి.







డోలు కొట్టి ఘనత చాటింది

ఆంధ్రప్రదేశ్‌లో ఆ అమ్మాయికి డోలు నేర్పించడానికి ఎవరూ పెద్దగా ఆసక్తి చూపలేదు. కట్ చేస్తే... సీన్ మారింది! సోమవారం హైదరాబాద్‌లో విమెన్స్ డే సందర్భంగా తెలంగాణ గవర్నర్ తమిళి సై ఆ అమ్మాయిని ఘనంగా సన్మానించారు. ఆమే **లలితా మనీషా!** ఆమె పరిచయం...



సోమవారం, మార్చి 6న హైదరాబాద్ రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళి సై కొంత మంది మహిళలకు సత్కారం చేస్తున్నారు. అదే సందర్భంగా ఏర్పాటైన గాత్ర కచ్చేరిలో అందరి దృష్టి లలిత మనీషా మీద పడింది. అందుకు కారణం ఆమె డోలు వాద్యం పై విన్యాసం చేస్తూ ఉండటమే. తెలుగునాట నాదస్వరం వాయించే స్త్రీలు కొద్దిమందైనా ఉన్నారు. కాని డోలు వాయించే వారు అతి తక్కువ. రెండు రాష్ట్రాలకు కలిసి డోలు విద్వాంసురాలిగా ఇటీవల గుర్తింపు పొందుతున్నది 24 ఏళ్ల లలిత మనీషా.

తెనాలి అమ్మాయి

లలిత మనీషాది తెనాలి. వీరి తల్లి మస్తాన్‌బీ, తండ్రి షేక్ వెంకటేశ్వర సాహెబ్ నాదస్వర విద్వాంసులు. ఇద్దరూ వందలాది ప్రదర్శనలు ఇచ్చారు. మస్తాన్ బీ వంశంలో 300 వందల ఏళ్లుగా నాదస్వరం కొనసాగుతూ ఉంది. అయితే డోలు వాయించిన మహిళలు లేరు. మస్తాన్ బీకి ఇద్దరు కూతుళ్లు. పెద్దమ్మాయి నాగ భ్రమరాంబ గాత్ర విద్వాంసురాలిగా శిక్షణ తీసుకుంది. ఇప్పుడు చదువు నిమిత్తం అమెరికా వెళ్లింది. చిన్నమ్మాయి లలిత మనీషా డోలు నేర్చుకోవడంలో ఆసక్తి చూపింది. 'నేను ఏడవ తరగతి చదువుతున్నప్పుడు వరసకు వదిన అయ్యే ఒకామె డోలు నేర్చుకోవడానికి ప్రయత్నించింది. ఆమెకు రాలేదు. నేను నేర్చుకోవడానికి ప్రయత్నించాను. నాకు వచ్చేసింది. డోలు వాయిద్యానికి తాళంతో పాటు శక్తి కూడా కావాలి. నాలో అవి రెండూ గమనించి మా అమ్మా నాన్నలు ప్రోత్సహించారు' అంటుంది మనీషా.



తెలంగాణ గవర్నర్ తమిళి సై చేతుల మీదుగా సన్మానం అందుకుంటూ...

కుంభకోణం వెళ్లి

డోలు వాయిద్యాన్ని సాధన చేయాలంటే ఇక్కడ అనుకూలంగా లేదని తొమ్మిదో తరగతి డిస్కంటిన్యూ చేసి కుంభకోణంలో డోలు విద్వాంసుడు టి.ఆర్.సుబ్రహ్మణ్యం దగ్గర సంవత్సరం పాటు శిష్యరికం చేసింది లలిత మనీషా. గురువు ఇంట్లోనే ఉంటూ డోలు నేర్చుకుని వచ్చింది. ఆ తర్వాత తెలుగు యూనివర్సిటీ నుంచి సర్టిఫికెట్ కోర్సు, డిప్లమా కూడా పూర్తి చేసింది. డిగ్రీ ఉండాలి కనుక బీసీఏ చేసి డోలు వాయిద్యంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేయాలనుకుంది. ఆ కోర్సు అన్నామలై యూనివర్సిటీ కింద చిదంబరంలో ఉంది. 'అక్కడ మా బేచ్‌లో మొత్తం 50 మంది విద్యార్థులు ఉంటే నేనొక్కదాన్నే అమ్మాయిని. అందుకని నన్ను అందరూ బాగా చూసుకునేవారు. మిగతా దక్షిణాది రాష్ట్రాలతో పాటు తమిళనాడులో కూడా డోలు వాద్యం మగవారిదే అని భావించడం వల్ల ఇప్పటి వరకూ ఒక్క ఆడపిల్ల కూడా ఆ కోర్సు చేయలేదు. దాంతో మొత్తం దేశంలోనే డోలు వాయిద్యంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసిన ఏకైక అమ్మాయిగా నేను నిలిచాను' అంటుంది మనీషా. నిజంగా ఇది తెలుగు వారి గర్వకారణమే.

మంగళవాయిద్యం

డోలు, సన్నాయి మంగళకరమైన వాయిద్యాలు. దక్షిణ భారతంలో శుభకార్యక్రమాలకు సన్నాయి మేళం తప్పనిసరి. అయితే కర్నాటక సంగీతంలో కూడా సన్నాయి, డోలు ప్రాశస్త్యం మెండుగా ఉంది. డోలు సహ వాయిద్యంగా ఉంటోంది. 'గాత్ర కచ్చేరిలో గాని వయొలిన్, ఫ్లూట్ కచ్చేరిలో గాని మృదంగాన్ని సహ వాయిద్యంగా తీసుకుంటారు. డోలును కూడా తీసుకునేవారు ఉంటారు. కర్నాటక సంగీతంలో డోలు వాయిద్యకారిణిగా నేను గుర్తింపు పొందాలనుకుంటున్నాను. డోలు వాయించడానికి 108 రకాల తాళాలు ఉన్నాయి. ఉద్దండులు లోతుకు వెళితే ఇంకా వినూత్న తాళాలు వేస్తారు. నేను ఇప్పటి వరకూ 35 రకాల తాళాలు డోలు మీద వేయగలను. మా అమ్మా నాన్నలతో కలిసి అనేక కచ్చేరీలు చేస్తున్నాను. శ్రీశైలం, భద్రాచలం, హరిద్వార్, పూరీ, ద్వారకా, కాశీ పుణ్యక్షేత్రాలలో కచ్చేరీలు ఇచ్చాను. అలాగే తమిళులు డోలు, సన్నాయి కచ్చేరీలను ఇష్టపడతారు. వారి ఆహ్వానం మేరకు మదురై, తంజావూరు... ఇలా అనేక నగరాల్లో ప్రదర్శనలు ఇచ్చాను. ఇంకా నేను చాలా సాధించాల్సి ఉంది' అంది మనీషా.


– ఇన్‌పుట్స్: **బి.ఎల్.నారాయణ**, సాక్షి, తెనాలి

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 15
సంచిక: 172
బుధవారం 8-3-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'



స్త్రీ.. శక్తి స్వరూపిణి.. భారాలు, దూరాలు ఆమె గమనాన్ని ఆపలేవు. గమ్యాన్ని చేరుకోకుండా ఆమెను అడ్డుకోలేవు. నేడు మహిళా దినోత్సవం సందర్భంగా స్ఫూర్తి ప్రదాతలైన మహిళామణులపై ప్రత్యేక కథనాలు..



విస్తరిస్తున్న హెచ్3ఎన్2

దేశాన్ని హెచ్3ఎన్2 అనే కొత్త వైరస్ భయపెడుతోంది. దగ్గు, జలుబు, జ్వరం లక్షణాలు కలిగిన ఈ కేసులు పెరుగుతున్నాయి.

వివరాలు 6లో ▸



లాలూను విచారించిన సీబీఐ

ల్యాండ్ ఫర్ జాబ్స్ కుంభకోణం కేసులో ఆర్‌జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్‌ను సీబీఐ అధికారులు 5 గంటలపాటు ప్రశ్నించారు.

వివరాలు 6లో ▸



ఢిల్లీ మద్యం కేసులో పిళ్లై అరెస్టు

ఢిల్లీ మద్యం విధానంలో అవకతవకల కేసులో హైదరాబాద్‌కు చెందిన అరుణ్ రామచంద్రన్ పిళ్లైను ఈడీ అరెస్టు చేసింది.

వివరాలు 12లో ▸



ఇద్దరు సీఎంల ప్రమాణం

నాగాలాండ్ సీఎంగా ఎన్‌డీపీపీ నేత రియో, మేఘాలయ ముఖ్యమంత్రిగా ఎన్‌పీపీ నేత కాన్రాడ్ సంగ్మా ప్రమాణం చేశారు.

వివరాలు 6లో ▸

ఆదా.. ఇదిగో



- శ్రీకాకుళంలో స్మార్ట్ మీటర్లతో 33.24 శాతం విద్యుత్ ఆదా
- ప్రయాస్ సంస్థ స్మార్ట్ మీటర్లు వద్దనలేదు
- అయినా అవి ఏడాదిన్నర క్రితం చేసిన సూచనలు
- 16,66,282 వ్యవసాయ సర్వీసుల్లో రైతులు రెడీ
- అలైడ్ మెటీరియల్, మీటర్లకు రూ.4,000 కోట్లు భరిస్తున్న ప్రభుత్వం.. పదేపదే తప్పుడు వార్తలపై చట్టపరమైన చర్యలు
- ఇంధన శాఖ ప్రత్యేక కార్యదర్శి కె.విజయానంద్

2 లో





ఉద్యోగులకు శుభవార్త

ఈ నెలాఖరుకల్లా రూ. 3 వేల కోట్ల బిల్లులు చెల్లింపు

- ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తాం
- జీపీఎఫ్ పెండింగ్ బిల్లులు క్లియర్ చేస్తాం
- మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు సజ్జల, ఆదిమూలపు
- ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడూ అనుకూలమే
- ఉద్యోగ సంఘాల నేతలతో చర్చల అనంతరం వెల్లడి





మీడియాతో మాట్లాడుతున్న మంత్రివర్గ ఉప సంఘం సభ్యులు సజ్జల రామకృష్ణారెడ్డి, ఆదిమూలపు సురేశ్, ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు తదితరులు

సాక్షి, అమరావతి: ఉద్యోగులు ప్రభుత్వంలో భాగమని, వారికి సంబంధించిన అన్ని అంశాలను పరిష్కరిస్తామని మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు సజ్జల రామకృష్ణారెడ్డి, ఆదిమూలపు సురేష్ చెప్పారు. సీఎం ఆదేశాల ప్రకారం ఈ నెలాఖరుకల్లా ఉద్యోగులకు చెల్లించాల్సిన రూ.3 వేల కోట్ల బకాయిలు చెల్లించాలని నిర్ణయించినట్లు తెలిపారు. వెలగపూడి సచివాలయంలో మంగళవారం ఉద్యోగ సంఘాల నాయకులతో మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు బొత్స సత్యనారాయణ, బుగ్గన రాజేంద్రనాథ్, ఆదిమూలపు సురేష్, సజ్జల రామకృష్ణారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు (ఉద్యోగుల సంక్షేమం) చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి (హెచ్ఆర్) చిరంజీవి చౌదరి సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం సజ్జల, ఆదిమూలపు ఆ వివరాలను మీడియాకు వెల్లడించారు. సజ్జల మాట్లాడుతూ.. ఉద్యోగుల సంక్షేమంపై ఎప్పటికప్పుడు చర్చిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వోద్యోగులను

మిగతా 2వ పేజీలో ▶

మహిళోదయం

జగనన్న మహిళా మార్ట్‌లతో రాణిస్తున్న అక్కచెల్లెమ్మలు

- రాష్ట్రంలోని 7 పట్టణాల్లో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు
- చౌకగా సరుకులు.. వాటాదారులకు అదనపు రాయితీ.. సంఘాల సభ్యులే పెట్టుబడిదారులు, నిర్వాహకులు
- స్త్రీనిధిగా ఒక్కొక్కరి వాటా రూ.150
- వారికి ఏటా 33 శాతం డివిడెండ్
- అన్నిచోట్లా ఒకే ధరలు.. నెలకు మొత్తం రూ.1.35 కోట్ల మేర వ్యాపారం

3 లో



ఆ 'స్కిల్' చంద్రబాబుదే

- స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణం సూత్రధారి ఆయనే
- బాబు చెప్పడంతోనే నిబంధనలకు విరుద్ధంగా సీమెన్స్ పేరిట కాంట్రాక్టు, నిధుల విడుదల
- సీఐడీ దర్యాప్తులో అప్పటి ముగ్గురు కీలక ఉన్నతాధికారుల వెల్లడి
- ఆ కాంట్రాక్టుతో తమకు సంబంధంలేదన్న సీమెన్స్ కంపెనీ
- సీమెన్స్ పేరిట షెల్ కంపెనీలతో కథ నడిపిన బాబు అండ్ గ్యాంగ్
- హవాలా మార్గంలో టీడీపీ పెద్దలకు చేరిన నిధులు




సాక్షి, అమరావతి: టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) కుంభకోణంలో కర్త, కర్మ, క్రియ అప్పటి సీఎం చంద్రబాబే అన్నది స్పష్టమైంది. జర్మనీకి చెందిన సీమెన్స్ కంపెనీ పేరుతో కథ నడపటం.. నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ నిధులు విడుదల చేయడం.. అందుకోసం ఉన్నతాధికారులపై

మిగతా 2వ పేజీలో ▶

10 నుంచి రాగి జావ

- మధ్యాహ్న భోజనంలో పిల్లలకు పౌష్టికాహారం
- 18న జగనన్న విద్యాదీవెన.. 23న జగనన్నకు చెబుదాం ప్రారంభం
- ఉగాదికి ఉత్తమ వలంటీర్ల ప్రకటన.. ఏప్రిల్ 10న సన్మానం
- ఏప్రిల్ 6న ఫ్యామిలీ డాక్టర్ పూర్తి స్థాయిలో అమలుకు సిద్ధం
- ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగియనుండడంతో మార్చి, ఏప్రిల్ కార్యక్రమాల అమలు తేదీలు ఖరారు



5 లో

జీఐఎస్ ఒప్పందాల అమలుకు చర్యలు

- సీఎస్ అధ్యక్షతన కమిటీ ప్రతి వారం సమావేశం కావాలి.. మంత్రులు, అధికారులకు సీఎం జగన్ సూచన
- పెట్టుబడుల సదస్సు విజయవంతంపై మంత్రులు, అధికారులకు అభినందన

2 లో







పదిహేనేళ్ల సమస్యకు పరిష్కారం..

ఈమె పేరు.. శారద. జేఎన్‌టీయూ హైదరాబాద్‌లో ఎంటెక్ (స్ట్రక్చరల్ ఇంజనీరింగ్) చదివారు. 1996లో జలవనరుల శాఖలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా విధుల్లో చేరారు. సాధారణంగా సాగునీటి ప్రాజెక్టుల పనులను క్షేత్ర స్థాయిలో పురుష ఇంజనీర్లే పర్యవేక్షిస్తారు. మహిళా ఇంజనీర్లు కార్యాలయ వ్యవహారాలకే మొగ్గుచూపుతారు. కానీ.. శారద మాత్రం విధుల్లో చేరినప్పటి నుంచి క్షేత్ర స్థాయిలో ప్రాజెక్టు పనులను పూర్తి చేయడానికే ప్రాధాన్యం ఇచ్చారు. సోమశిల ప్రాజెక్టు నార్త్ ఫీడర్ చానల్, సోమశిల–స్వర్ణముఖి లింక్ కెనాల్ సహా పలు ప్రాజెక్టుల పనులను క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించారు. 2017లో తెలుగుగంగ ప్రాజెక్టు ఎస్‌ఈగా కడపలో బాధ్యతలు స్వీకరించిన ఆమె.. సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు బ్రహ్మంసాగర్ లీకేజీలకు అడ్డుకట్ట వేయడంపై దృష్టి సారించారు. నిపుణుల కమిటీతో అధ్యయనం చేయించి.. డయాఫ్రమ్ వాల్ నిర్మించడం ద్వారా బ్రహ్మంసాగర్ లీకేజీలకు అడ్డుకట్ట వేశారు. తద్వారా పదిహేనేళ్ల సమస్యకు పరిష్కార మార్గం చూపారు. దీంతో 2021లో తొలిసారిగా ప్రాజెక్టులో గరిష్ట నిల్వ మేరకు 17.85 టీఎంసీలను నిల్వ చేశారు. దీంతో ఆయకట్టు చివరి భూములకు కూడా నీరు అందింది. పురుష ఇంజనీర్లకు దీటుగా మహిళలు సైతం క్షేత్ర స్థాయిలో పనిచేయగలరని శారద చాటిచెప్పారు.

ప్రభుత్వ ఆశయ సాధనను నెరవేరుస్తా..

సాగునీటి ప్రాజెక్టులను క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించి.. వాటిని పూర్తి చేయించడమే నా లక్ష్యం. ఆయకట్టుకు నీళ్లందించి.. రైతుల జీవితాల్లో వెలుగులు నింపాలన్న ప్రభుత్వ ఆశయ సాధనను నెరవేరుస్తా. – శారద, ఎస్‌ఈ



దేశ నిర్మాణంలో మహిళది కీలక భూమిక

గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్



సాక్షి, అమరావతి: రాష్ట్ర మహిళలకు గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మన దేశ నిర్మాణం, జాతీయ సమగ్రత పరిరక్షణలో మహిళలు కీలక భూమిక పోషిస్తున్నారని పేర్కొన్నారు. సహనం, ఓర్పునకు ప్రతీక అయిన మహిళలు కుటుంబ వ్యవస్థలోనూ, సమాజంలోనూ నాయకత్వ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. ఈ మేరకు రాజ్‌భవన్ వర్గాలు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశాయి.

సీఎం వైఎస్ జగన్ హోలీ శుభాకాంక్షలు



సాక్షి,అమరావతి: రంగుల పండుగ హోలీ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఆప్యాయత, ప్రేమ, సంతోషాల హరివిల్లు హోలీ అని పేర్కొన్నారు. వసంత రుతువు ఆగమనాన్ని తెలియజేసే విధంగా హోలీని దేశవ్యాప్తంగా ఆనందంగా, ఉల్లాసంగా జరుపుకొంటున్నారని సీఎం జగన్ తెలిపారు.

డివిజినల్ అకౌంట్స్ ఆఫీసర్ పోస్టుల ఎంపిక జాబితా విడుదల

సాక్షి, అమరావతి: రాష్ట్ర వర్క్స్ అకౌంట్స్ విభాగంలో డివిజినల్ అకౌంట్స్ ఆఫీసర్ పోస్టులకు నిర్వహించిన పరీక్షల్లో అర్హత సాధించి పోస్టులకు ఎంపికైన వారి జాబితాను ఏపీపీఎస్సీ మంగళవారం విడుదల చేసింది. ఈ మేరకు కమిషన్ కార్యదర్శి జె.ప్రదీప్‌కుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. పోస్టులకు ఎంపికైన వారి వివరాలను కమిషన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు వెల్లడించారు.

జీఐఎస్ ఎంఓయూల అమలుకు చర్యలు

- సీఎస్ అధ్యక్షతన కమిటీ ప్రతీవారం సమావేశం కావాలి
- మంత్రులు, అధికారులకు సీఎం జగన్ సూచన
- పెట్టుబడుల సదస్సు విజయవంతంపై మంత్రులు, అధికారులకు అభినందన



సీఎం జగన్‌ను కలిసిన మంత్రులు,అధికారులు

సాక్షి, అమరావతి : విశాఖపట్నంలో ఈ నెల 3, 4 తేదీల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ (జీఐఎస్)లో కుదిరిన ఎంఓయూల సత్వర అమలుకు చర్యలు తీసుకోవాల్సిందిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంత్రులు, అధికారులకు సూచించారు. దీంతో వీటి అమలు దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే చర్యలు ప్రారంభించింది. ఇందులో భాగంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన సీఎం ఓ కమిటీని ఏర్పాటుచేశారు. ఇది ప్రతీవారం సమావేశమై సదస్సులో కుదిరిన ఎంఓయూల అమలు దిశగా చర్యలు తీసుకోవాలని మంత్రులు, అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశించారు. మరోవైపు.. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ విజయవంతమవడంతో మంగళవారం సీఎం క్యాంపు కార్యాలయంలో సంబంధిత శాఖల మంత్రులు, పరిశ్రమల శాఖ అధికారులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందించారు. సీఎం క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్, గుడివాడ అమర్‌నాథ్, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల వలవన్, పరిశ్రమల శాఖ డైరెక్టర్ డా. జి. సృజన, ఏపీ హైగ్రేడ్ స్టీల్స్ లిమిటెడ్ ఎండీ ఎస్. షన్‌మోహన్ పాల్గొన్నారు.

సీఎంకు చిరుధాన్యాల చిత్రపటం బహూకరణ

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి చిరుధాన్యాలతో తయారుచేసిన చిత్రపటాన్ని పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ బహూకరించారు. విశాఖ నగరానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు మోకా విజయ్‌కుమార్ సిరిధాన్యాలను ఉపయోగించి ఈ చిత్రపటాన్ని రూపొందించారు.

తెలంగాణ

కల్యాణ క్రతువుకు శ్రీకారం

- భద్రాద్రి రామాలయంలో నవమి వేడుకలు ప్రారంభం
- స్వామివారికి ఘనంగా వసంతోత్సవం



భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో ఫాల్గుణ పౌర్ణమిని పురస్కరించుకుని చేపట్టిన తలంబ్రాల తయారీ కార్యక్రమంతో శ్రీ సీతారాముల కల్యాణోత్సవ పనులకు శ్రీకారం చుట్టారు. స్వామివారి ఉత్సవ మూర్తులను మేళతాళాలు, కోలాటాలు, మంగళవాయిద్యాల నడుమ ఉత్తర ద్వారం వద్ద ఆశీనులను చేశారు. అర్చకులు, వేదపండితుల ప్రత్యేక పూజల అనంతరం రుత్విక్కులు, వారి సతీమణులు సంప్రదాయబద్ధంగా పసుపు దంచి పెళ్లి పనులు ప్రారంభించారు. అనంతరం ప్రత్యేక గులామ్, పసుపు, సుగంధ ద్రవ్యాలు, అత్తరును బియ్యంలో కలిపి తలంబ్రాలు తయారు చేశారు. ఉమ్మడి ఖమ్మం, ఉమ్మడి వరంగల్ తదితర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు గోటితో వొలిచిన తలంబ్రాలను తీసుకొచ్చి వీటిలో కలిపారు. భారీ సంఖ్యలో భక్తుల రాకతో మిథిలా స్టేడియం ప్రాంగణం కిటకిటలాడింది. ఇక హోలీ పండుగను పురస్కరించుకుని రామాలయంలోని బేడా మండపంలో స్వామివారికి డోలోత్సవం, వసంతోత్సవం వైభవంగా జరిపించారు. ఊయలలో కొలువుదీరిన సీతారాములకు అర్చకులు లాలలు..జోలలు పాడారు. అనంతరం భక్తులు, ఆలయ అధికారులు, సిబ్బంది వసంతాలను చల్లుకుని ఆనందోత్సాహాలతో కార్యక్రమాన్ని ముగించారు.

ఏరోస్పేస్ డిఫెన్స్ డివిజన్ ప్రారంభం

మేడ్చల్: మేకిన్ ఇండియా భాగంగా రావల్‌కోల్ గ్రామంలోని లోకేష్ మెషీన్స్ లిమిటెడ్ కంపెనీలో ఏర్పాటు చేసిన ఏరోస్పేస్ డిఫెన్స్ డివిజన్‌ను రక్షణ మంత్రి సైంటిఫిక్ సలహాదారు, డీఆర్‌డీవో మాజీ చైర్మన్ జి.సతీష్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మేకిన్ ఇండియాలో భాగంగా ఇలాంటి దేశీయ నైపుణ్యమున్న సంస్థలో ఏరోస్పేస్, రక్షణ రంగాలకు ఆయుధాలు, పరికరాల తయారీకి ముందుకురావడం అభినందనీయమన్నారు. సంస్థకు ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం ఉంటుందని, లోకేష్ కంపెనీ అంతర్జాతీయ మార్కెట్‌కు తమ ఉత్పత్తులను అందించేలా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. తమ సంస్థలో ఏరో, రక్షణ రంగాలకు ఉపయోగపడే గన్‌లు, వాటి పరికరాలను తయారు చేస్తున్నట్లు లోకేశ్వర్‌రావు తెలిపారు.

ఆదా.. ఇదిగో

సాక్షి, అమరావతి

"శ్రీకాకుళంలో స్మార్ట్ మీటర్లను అమర్చడం, నెలవారీ రీడింగ్‌లు నమోదు చేయడం అభినందనీయం. వ్యవసాయ విద్యుత్ మీటరింగ్ కోసం విలువైన పాఠాలను అందించేలా ఈ ప్రయోగం చేపట్టిన డిస్కమ్‌లు, సంబంధిత విభాగాలను అభినందించాల్సిన అవసరం ఉంది"

– తుది నివేదికలో ప్రయాస్ సంస్థ ప్రశంసలివీ..



కె.విజయానంద్

వ్యవసాయ బోర్లకు స్మార్ట్ విద్యుత్ మీటర్లను అమర్చడం వల్ల రైతులకు మేలేగానీ కీడు జరగదు. ఈ విషయంలో ఎలాంటి సందేహాలు అవసరం లేదని రాష్ట్ర ప్రభుత్వం, ఇంధన శాఖ ఇప్పటికే అనేక సార్లు స్పష్టం చేసినా కొన్ని పార్టీలు, వాటి అనుకూల మీడియా పనిగట్టుకుని విషప్రచారం చేస్తూనే ఉన్నాయి. అన్నదాతలను అయోమయంలోకి నెట్టేయాలనే దురుద్దేశంతో వ్యవహరిస్తున్నాయి. స్మార్ట్ మీటర్ల వల్ల ఏ మీటర్‌లో ఎంత విద్యుత్ వినియోగం జరుగుతోందనేది ప్రతి 15 నిమిషాలకు ఒకసారి తెలుస్తుంది. అదే డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్, ఫీడర్ల వద్ద మీటర్లు పెట్టి రీడింగ్ తీస్తే వాటి పరిధిలోని నాలుగైదు మీటర్ల విద్యుత్ వినియోగం వస్తుంది. ఏ రైతు ఎంత విద్యుత్ వాడుతున్నారనేది కచ్చితంగా చెప్పడం కష్టం. పంటలు ఉన్నప్పుడు మీటర్ల దగ్గరికి వెళ్లడం చాలా కష్టం. అదే స్మార్ట్ మీటర్లతో ఈ సమస్యలన్నీ తీరుతాయి. రిమోట్ ద్వారా మీటర్‌ను ఆపరేట్ చేయవచ్చు. రీడింగ్ కోసం మీటర్ దగ్గరకు వెళ్లవలసిన అవసరం ఉండదు.

రక్షణ బాధ్యత ప్రభుత్వానిదే

దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా మీటర్ అమర్చడమే కాకుండా వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్, మోటార్ కాలిపోకుండా, రైతుల ప్రాణ సంరక్షణ బాధ్యత కూడా ప్రభుత్వమే తీసుకుంది. అందుకు అవసరమైన ఐదు రక్షణ పరికరాలను (అలైడ్ మెటీరియల్) మీటర్లతో పాటు ఏర్పాటు చేయనుంది. మిగతా రాష్ట్రాల్లో కేవలం మీటర్లే ఇస్తున్నారు. మన దగ్గర స్మార్ట్ మీటర్‌తో పాటు మోల్డెడ్ కేస్ సర్క్యూట్ బ్రేకర్(ఎంసీసీబీ)తో కూడిన షీట్ మౌల్డింగ్ కాంపౌనెంట్(ఎస్ఎంసీ) బాక్స్‌ను అందిస్తున్నారు. ప్రస్తుతం ఫ్యూజు కారియర్లు ఇనుముతో చేసినవి ఉండగా వాటి స్థానంలో తాకినా విద్యుత్ షాక్ కొట్టని మెటీరియల్‌తో ఈ బాక్సులు తయారవుతాయి. ఇప్పుడున్నట్లు మూడు ఫ్యూజులు కూడా ఉండవు. దానివల్ల మోటార్లు కాలిపోయే అవకాశం ఉండదు. అలాగే ఎర్తింగ్ పైప్ కూడా ఇస్తారు. ఓల్టేజ్ సమస్యల నుంచి కాపాడేందుకు షంట్ కెపాసిటర్లను అమర్చుతారు. ఈ ఏర్పాటు వల్ల విద్యుత్ ప్రమాదాల నుంచి రైతులకు, జీవాలకు, వాతావరణ పరిస్థితుల నుంచి స్మార్ట్ మీటర్లకు రక్షణ లభిస్తుంది. అలైడ్ మెటీరియల్, మీటర్లకు కలిపి ప్రభుత్వం రూ.4,000 కోట్లు భరిస్తోంది.

శ్రీకాకుళంలో ఇలా..

శ్రీకాకుళంలో పైలట్ ప్రాజెక్టుగా 2023 ఫిబ్రవరి నాటికి 29,302 సర్వీసులకు స్మార్ట్ మీటర్లను అమర్చగా 83.16 శాతం పని చేస్తున్నాయి. ఈ మీటర్ల ద్వారా 2021–22లో 33.24 శాతం అంటే 2.81 మిలియన్ యూనిట్లు విద్యుత్ ఆదా అయ్యింది. సగటున 6.66 శాతం మాత్రమే పాడవడం, కాలిపోవడం జరిగింది. భవిష్యత్తులో వాటి మరమ్మతుల ఖర్చు సరఫరా సంస్థ భరించేలా టెండర్లు రూపొందించారు. అధికారిక గణాంకాల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా స్మార్ట్ మీటర్లు పెడితే కేవలం రెండున్నరేళ్లలోనే పెట్టుబడి వెనక్కి వస్తుంది.

ఎవరు చెప్పారు?

వాస్తవాలను వక్రీకరిస్తూ తప్పుడు సమాచారంతో అబద్ధాలను అడ్డంగా అచ్చేసిన ఈనాడు రాతలను ఇంధన శాఖ తీవ్రంగా తప్పుబట్టింది. వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు పెట్టవద్దని, వాటివల్ల విద్యుత్ ఆదా జరగకపోగా ఖర్చు వృథా అని ఏ సంస్థగానీ, రైతులుగానీ చెప్పలేదని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ స్పష్టం చేశారు. ఇంధన శాఖ జాయింట్ సెక్రటరీ బీఏవీపీ కుమార్‌రెడ్డి, ఏపీ ట్రాన్స్‌కో సీఎండీ బి.శ్రీధర్, సెంట్రల్ డిస్కమ్ సీఎండీ జె.పద్మాజనార్దనరెడ్డితో కలసి విజయవాడలోని విద్యుత్ సౌధలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

- మీటర్లు అమర్చడం ద్వారా డిస్కమ్‌లలో జవాబుదారీతనం పెరగడంతో పాటు రైతులకు ఉచిత విద్యుత్ హక్కుగా లభిస్తుంది. 'ప్రయాస్' సంస్థ ఏడాదిన్నర క్రితం జరిపిన శాంపుల్ అధ్యయనంలో పలు సూచనలు మాత్రమే చేసింది. సగటు విద్యుత్ కొనుగోలు ధరను ప్రయాస్ ఎనర్జీ గ్రూప్ ఒక యూనిట్‌కి రూ.4.20 చొప్పున తీసుకుని లెక్కించడం వల్లే గణాంకాలు సరిగా లేవు. వాస్తవానికి సగటు సరఫరా ఖర్చు ఒక యూనిట్‌కి రూ.6.98 చొప్పున ఉంది. దీన్ని ఏపీఈఆర్‌సీ నిర్ణయించింది.
- ఫీడర్ల వద్ద నష్టాలు నమోదవుతున్నట్లు ప్రయాస్ చెబుతున్నా స్మార్ట్ మీటర్లు అమర్చిన తరువాత ఫీడర్ రీడింగ్ తీయలేదు. ఆ నష్టం విద్యుత్ చౌర్యం వల్ల జరిగి ఉండవచ్చు. ఇలాంటివి అరికట్టేందుకే స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నాం.
- రెండు, మూడు వారాల్లో స్మార్ట్ మీటర్ల టెండర్ల ప్రక్రియ పూర్తవుతుంది. రైతులను గందరగోళానికి గురిచేస్తూ పదేపదే తప్పుడు కథనాలు ప్రచురిస్తున్న పత్రికలు, ప్రసారం చేస్తున్న ఛానళ్లపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. వాటి యాజమాన్యాలకు లీగల్ నోటీసులు కూడా పంపుతున్నాం.
- మొత్తం 16,66,282 వ్యవసాయ సర్వీసుల్లో 16,55,988 మంది రైతులు బ్యాంకు ఖాతాలు తెరిచి నిరభ్యంతర పత్రాలిచ్చారు. 10,294 మందికి మాత్రమే ఖాతాలు లేవు. వారితో కూడా తెరిపించేందుకు డిస్కమ్‌లు ప్రయత్నిస్తున్నాయి.

ఆ 'స్కిల్' చంద్రబాబుదే

▶ మొదటి పేజీ తరువాయి

ఒత్తిడి తేవడం.. అనంతరం ఆ నిధులను షెల్ కంపెనీల పేరిట హవాలా మార్గంలో టీడీపీ పెద్దల ఖాతాల్లోకి చేర్చడం.. అంతా కూడా చంద్రబాబు పక్కా పన్నాగం ప్రకారమే సాగిందన్నది ఆధారసహితంగా వెల్లడైంది. టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.3,300 కోట్ల సీమెన్స్ ప్రాజెక్టు పేరిట ఏపీఎస్ఎస్‌డీసీ కుంభకోణంపై సీఐడీ దర్యాప్తులో కీలక విషయాలు వెలుగుచూశాయి. ఈ కేసులో ఇప్పటికే పలువురిని అరెస్టుచేసిన సీఐడీ అధికారులు తమ దర్యాప్తులో మరిన్ని కీలక ఆధారాలు రాబట్టినట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్టు సమయంలో అప్పటి ప్రభుత్వంలో కీలక స్థానాల్లో ఉన్న ముగ్గురు ఉన్నతాధికారులను సీఐడీ విచారించగా ఈ వాస్తవాలు వెలుగుచూశాయి. పూర్తిగా చంద్రబాబు ఆదేశాలతోనే నిబంధనలకు విరుద్ధంగా నిధులు విడుదల చేసినట్లు తేలింది.

ప్రజాధనాన్ని కొల్లగొట్టేందుకే..

ఇక్కనైపుణ్యాభివృద్ధి ప్రాజెక్టు పేరిట నిధులు కొల్లగొట్టడానికి చంద్రబాబు ఏపీఎస్ఎస్‌డీసీని ఓ సాధనంగా చేసుకున్నారు. అందుకోసం జర్మనీకి చెందిన సీమెన్స్ కంపెనీ పేరిట రూ.3,300 కోట్ల ప్రాజెక్టును తెరపైకి తెచ్చారు. వాస్తవానికి ఈ ప్రాజెక్టు గురించి సీమెన్స్ కంపెనీ ప్రధాన కార్యాలయానికి ఏమీతెలీదు. అప్పట్లో సీమెన్స్ కంపెనీ ఎండీగా వ్యవహరించిన సుమన్ బోస్‌ను అడ్డంపెట్టుకుని కథ నడిపారు. అందుకోసం చంద్రబాబు కనుసన్నల్లోనే ప్రాజెక్టును రూపొందించారు. ఆ పన్నాగంలో భాగంగానే 2014–15లో అప్పటి సీఎం చంద్రబాబును సుమన్ బోస్, డిజైన్ టెక్ కంపెనీ ఎండీ వికాస్ కన్విల్కర్ కలిశారు. ప్రభుత్వం 10 శాతం నిధులు సమకూరిస్తే సీమెన్స్, డిజైన్‌టెక్ సంస్థలు 90 శాతం నిధులు పెట్టుబడి పెట్టేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ వ్యవహారంలో ఏపీఎస్ఎస్‌డీసీకి అప్పట్లో డైరెక్టర్‌గా ఉన్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, చంద్రబాబు సన్నిహితుడు కే లక్ష్మీనారాయణ, ఎండీగా ఉన్న గంటా సుబ్బారావు కీలకంగా వ్యవహరించారు.

బాబు ఆదేశాలతో నిధుల విడుదల..

సీమెన్స్ కంపెనీ తన వాటా నిధులు ఒక్కరూపాయి కూడా వెచ్చించకుండానే ప్రభుత్వ వాటాగా రూ.371కోట్లు విడుదల చేయడంపై పెద్ద కథే నడిచింది. నిబంధనలకు విరుద్ధంగా నిధుల విడుదలకు అప్పటి ఆర్థిక శాఖ కార్యదర్శిగా ఉన్న సునీత సమ్మతించలేదు. ఆమె మూడు అభ్యంతరాలను నోట్ ఫైల్‌లో పేర్కొన్నారు.

- ఇంత పెద్ద ప్రాజెక్టును ముందుగా ఏదో ఒక జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా అమలుచేసి అధ్యయనం చేసిన తరువాత నిర్ణయం తీసుకోవాలి.
- సీమెన్స్ కంపెనీ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీని ఏర్పాటు చేయకుండానే ప్రభుత్వ వాటా నిధుల విడుదల సరికాదు.
- సీమెన్స్ కంపెనీ తన వాటా 90శాతం నిధుల్లో ఒక్క రూపాయి కూడా వెచ్చించలేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ వాటా 10శాతం కింద జీఎస్టీతో సహా రూ.371కోట్లు విడుదల చేయడం సరికాదు.

కానీ, సునీత అభ్యంతరాలను నాటి ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. అప్పట్లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించిన ఐవైఆర్ కృష్ణారావు సీఎం చంద్రబాబు చెప్పారు కాబట్టి ఆ నిధులు విడుదల చేయాలని నోట్‌ఫైల్‌లో పేర్కొన్నారు. దాంతో అప్పటి ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్న పీవీ రమేశ్ స్పందిస్తూ సీఎం, సీఎస్ ఆదేశాలతో నిధులు విడుదల చేస్తున్నట్లు ఫైల్‌లో రాసి నిధులు విడుదల చేశారు. ఈ వాస్తవాలన్నీ సీఐడీ దర్యాప్తులో వెల్లడయ్యాయి. ఇక ఈ కేసు దర్యాప్తులో భాగంగా సీఐడీ అధికారులు జర్మనీలోని సీమెన్స్ కంపెనీ ప్రధాన కార్యాలయాన్ని సంప్రదించారు. తమ కంపెనీ ఎండీగా చెప్పుకున్న సౌమ్యాద్రి శేఖర్ బోస్‌తో తమకు సంబంధమే లేదని సీమెన్స్ కంపెనీ లిఖితపూర్వకంగా సీఐడీ, ఏపీఎస్ఎస్‌డీసీకి స్పష్టంచేసింది. ఇక ఆ ఎండీ, డైరెక్టర్ల పేర్లు, హోదాలు 2 వేర్వేరు ఒప్పంద పత్రాల్లో పరస్పర విరుద్ధంగా ఉన్నాయని ఫోరెన్సిక్ నివేదికలు వెల్లడించడం గమనార్హం. ఈ కుంభకోణం నుంచి తప్పించుకునేందుకు ముందస్తు ఎత్తుగడతోనే ఇలా చేశారని నిపుణులు చెబుతున్నారు.

కూపీ లాగుతున్న ఈడీ

మరోవైపు.. ఏపీఎస్ఎస్‌డీసీ కుంభకోణంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) లోతుగా విచారణ మొదలుపెట్టింది. ఈ కేసులో నిందితులైన అప్పటి సీఎం చంద్రబాబుకు సన్నిహితులు, ఆ కుంభకోణంతో ప్రమేయమున్న షెల్ కంపెనీల ప్రతినిధులు మొత్తం 26 మందికి నోటీసులు జారీచేసింది. వారిలో పలువురిని ఇప్పటికే విచారించింది. షెల్ కంపెనీల బ్యాంకు ఖాతాల్లోకి మళ్లించి అవి ఏయే బ్యాంకు ఖాతాల నుంచి సింగపూర్‌కు వెళ్లాయి.. తిరిగి దేశంలోని ఏ ఖాతాలకు తిరిగి వచ్చాయన్న విషయంపై ఈడీ దర్యాప్తు ముమ్మరం చేసింది.

ఉద్యోగులకు శుభవార్త

▶ మొదటి పేజీ తరువాయి

కుటుంబ సభ్యులుగా భావిస్తున్నామని, అందరూ కలిసికట్టుగా పనిచేయడంవల్లే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతోందన్నారు. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు కొలిక్కివస్తున్నాయని చెప్పారు. కోవిడ్‌వల్ల ఉద్యోగులకు చేయాల్సిన వాటిని కొన్నింటినీ సమయానికి చేయలేకపోయామని తెలిపారు. చర్చల ద్వారానే ఆయా సమస్యలను పరిష్కరించుకోవచ్చని వారు చెప్పారు. వారి సమస్యలను ఎప్పటికప్పుడు చర్చించేందుకే సీఎం జగన్ మంత్రివర్గ ఉపసంఘాన్ని కొనసాగిస్తున్నారని తెలిపారు. ఉద్యోగులు ఏ విషయాన్నయినా ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చేందుకే ఈ వేదికను ఏర్పాటుచేశారని చెప్పారు. తమ ప్రభుత్వం ఎప్పుడూ ఉద్యోగులకు అనుకూలంగానే ఉంటుందన్నారు.

బిల్లులు పెండింగ్‌లో లేకుండా చేస్తాం

మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ.. ఉద్యోగులకు సంబంధించిన అన్ని పెండింగ్ బిల్లులను మార్చి 31లోపు క్లియర్ చేస్తామన్నారు. ఇప్పటివరకు ఉన్న జీపీఎఫ్ పెండింగ్ బిల్లులను క్లియర్ చేస్తామన్నారు. రిటైర్మెంట్‌కి సంబంధించి గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్‌ను పూర్తిగా చెల్లిస్తామన్నారు. మెడికల్ బిల్లుల్ని కూడా ఎటువంటి షరతులు లేకుండా చెల్లిస్తామని చెప్పారు. టీఏ, ఏపీజీఎల్ఐ కూడా ఇస్తామన్నారు. ఆర్థికపరమైన అన్ని అంశాలపై చర్చించామని, దీర్ఘకాలికంగా ఉండి గత ప్రభుత్వంలో కూడా పరిష్కారం కాని అంశాలపైనా స్పష్టత ఇచ్చామని, పరిష్కార మార్గం కనుగొన్నామన్నారు. ఉద్యోగ సంఘ నాయకులతో మంత్రివర్గం ఉపసంఘం తరచూ సమావేశమవుతుందని తెలిపారు. రాబోయే రోజుల్లో ఏ బిల్లులు పెండింగ్‌లో లేకుండా చూస్తామని మంత్రి చెప్పారు.

పెండింగ్ డీఏలపై చర్చిస్తామన్నారు

పెండింగ్ డీఏల విషయంలో చర్చిస్తామని హామీ ఇచ్చారు. సీపీఎస్ రద్దుపైనా చాలాసేపు చర్చించాం. త్వరలో మా సంఘం కార్యవర్గ సమావేశం ఏర్పాటుచేసుకుని ఉద్యమ కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటాం.

– బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఏపీ జేఏసీ అమరావతి, చైర్మన్

మార్చి 31లోగా 'బిల్లుల' చెల్లింపు



ఉద్యోగులకు ఈ నెల 31లోగా రూ.3 వేల కోట్లకు పైగా పెండింగ్ బిల్లులను చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. మహిళా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు 5 స్పెషల్ క్యాజువల్ లీవ్స్ ఇవ్వడానికి సుముఖత వ్యక్తం చేశారు. 2004కు ముందు ఎగ్జామ్స్ పాస్ అయిన వాళ్లకు సీపీఎస్ నుంచి ఓపీఎస్‌కు మారడానికి అనుమతించడానికి సానుకూలంగా స్పందించారు. వీఆర్‌ఏలకు డీఏ పునరుద్ధరణ, యూనివర్సిటీలు, ఇతర విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు 62 ఏళ్ల వయోపరిమితి ఉత్తర్వులు ఇవ్వడానికీ ఒప్పుకున్నారు. గ్రామ/వార్డు సచివాలయాల ఉద్యోగుల బదిలీలకు అవకాశం కల్పించడంతో పాటు, రెండో దశలో నియామకమైన వారికి త్వరగా ప్రొబేషన్ డిక్లరేషన్‌కు అంగీకరించారు. మేం పలు డిమాండ్లను ప్రభుత్వం ముందుంచాం. వీఆర్‌వోలకు ప్రమోషన్ కోటా 75% చేయడం, జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగులకు 010 కింద వేతనాల చెల్లింపుకు డిమాండ్ చేశాం. గ్రేడ్–2 వీఆర్‌వోలకు ప్రొబేషన్ డిక్లరేషన్, సమగ్ర శిక్ష ఉద్యోగాలకు వేతనాల పెంపు, గత ప్రభుత్వం కక్ష సాధింపుగా ఉద్యోగుల మీద పెట్టిన ఏసీబీ కేసుల్లో బాధితులకు త్వరగా న్యాయం చేయాలని కోరాం.

– ఎ. వెంకట్రామిరెడ్డి, ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘం, ప్రభుత్వోద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు

పెండింగ్ బిల్లులు చెల్లిస్తామన్నారు



ఉద్యోగుల బిల్లుల చెల్లింపులపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ లభించింది. డీఏ బకాయిలను 2 క్వార్టర్లలో క్లియర్ చేస్తామని హామీ ఇచ్చారు. రూ.3 వేల కోట్లు క్లియర్ చేస్తామన్నారు. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణపై చర్యలు తీసకుంటామన్నారు. వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేసే వారికి బయోమెట్రిక్ తొలగించాలని కోరాం.

– బండి శ్రీనివాసరావు, ఏపీ ఎన్జీవోల సంఘం అధ్యక్షుడు

జగన్ పాలనలోనే.. మహిళలకు మహోన్నత గౌరవం

అడగకుండానే వరాలిస్తూ చరిత్ర సృష్టిస్తున్నారు

- వారి కేంద్రంగానే ఏపీలో సంక్షేమ పథకాల అమలు
- మహిళల భవితను సమూలంగా మార్చేస్తున్న 'నవరత్నాలు'
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి రజిని
- 'ది హిందూ' దినపత్రిక ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం
- 'మహిళా సాధికారత, సమానత్వం' అనే అంశంపై చర్చలో మహిళా ప్రతినిధులు



విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ సభను జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న మంత్రి విడదల రజిని

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మహిళలకు మహోన్నత గౌరవం దక్కుతోందని, ఇది దేశ చరిత్రలోనే ఆంధ్రప్రదేశ్‌కు దక్కిన అరుదైన ఘనత అని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ది హిందూ జాతీయ దినపత్రిక ఆధ్వర్యంలో 'మహిళా సాధికారత, సమానత్వం' అంశంపై మంగళవారం చర్చ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి రచయిత్రి ప్రసూన సంధానకర్తగా వ్యవహరించగా హిందూ జీఎం ఎస్‌డీటీ రావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన చర్చలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి రజిని మాట్లాడుతూ.. తాము ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కరించాలని మహిళలు అడిగినా గత ప్రభుత్వం పట్టించుకోలేదని.. కానీ, సీఎం వైఎస్ జగన్ మాత్రం అడక్కుండానే మహిళలకు అనేక వరాలిస్తూ చరిత్ర సృష్టిస్తున్నారన్నారు. నవరత్నాల ద్వారా అమలుచేస్తున్న ప్రతి పథకం మహిళల అభ్యున్నతి కోసం ప్రవేశపెట్టిందేనని మంత్రి అన్నారు. ఇక చర్చా గోష్ఠిలో పాల్గొన్న వారు ఏమన్నారంటే..

మహిళాంధ్రప్రదేశ్‌గా ఏపీ..



రాష్ట్రంలో మహిళను నిర్ణయాత్మక శక్తిగా తీర్చిదిద్దిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దే. ఆంధ్రప్రదేశ్‌ను మహిళాంధ్రప్రదేశ్‌గా మార్చేశారు. అడక్కుండానే అన్నింట్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించారు. మహిళల కోసం ఇంతగా చేస్తున్న ప్రభుత్వం ఉంది కాబట్టే ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిరోజూ మహిళా దినోత్సవమే అని గర్వంగా చెప్పుకోవచ్చు.

– వాసిరెడ్డి పద్మ, ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్

దిశ బిల్లుతో అద్భుత ఫలితాలు



దేశంలో మరెక్కడా లేని విధంగా ఏపీలోనే దిశ బిల్లు రూపుదిద్దుకుంది. ఇది చాలా విప్లవాత్మక విజయాలను సాధిస్తోంది. అనేక రాష్ట్రాలు దీనిపై ఆసక్తి చూపిస్తున్నాయి. అనేక కేసుల్లో నెలరోజుల్లోపే శిక్షలు పడుతున్నాయంటే అది దిశ బిల్లు ఘనతే.

– కేజీవీ సరిత, ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ ఎస్పీ

ఆర్థిక, రాజకీయ స్వావలంబన మెరుగుపడింది



రాష్ట్రంలో మునుపెన్నడూ లేని విధంగా మహిళలకు ఆర్థిక, రాజకీయ స్వావలంబన మెరుగుపడటం సంతోషకరం. మహిళలు పనిచేసే ప్రాంతాల్లో భద్రతను పటిష్టం చేయడంతోపాటు అణగారిన వర్గాల మహిళల సమస్యలపై ప్రభుత్వం దృష్టిసారించాలి.

– చల్లపల్లి స్వరూపరాణి, ఏఎన్‌యూ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్

ఆడబిడ్డలపై మరింత గౌరవం, శ్రద్ధ

- అక్క చెల్లెమ్మలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు: సీఎం జగన్

సాక్షి, అమరావతి: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో అక్క చెల్లెమ్మలకు, అవ్వలకు సీఎం వైఎస్ జగన్ మంగళవారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. 21వ శతాబ్దపు ఆధునిక భారతీయ మహిళ ఆంధ్రప్రదేశ్‌లోనే అవతరించేలా ప్రతి ఒక్క నిర్ణయాన్ని తీసుకున్న తమ ప్రభుత్వం రాజకీయ పదవుల్లో కూడా చట్టాలు చేసి మరీ సగభాగం కల్పించిందని తెలిపారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఆడబిడ్డల పట్ల మరింత గౌరవం, శ్రద్ధ కనబర్చేలా ప్రతి కుటుంబం, మొత్తంగా సమాజం నిర్ణయాలు తీసుకోవాలని పిలుపునిచ్చారు.

మహిళల అభ్యున్నతే కొలమానం..

మానవాళిలో సగభాగం మాత్రమే కాకుండా అభివృద్ధిలో అంతకు మించిన పాత్ర పోషిస్తున్న మహిళల అభ్యున్నతే ఏ సమాజం ప్రగతికైనా కీలకమైన కొలమానమని సీఎం జగన్ పేర్కొన్నారు. మహిళల ఆర్థిక, సామాజిక, రాజకీయ, విద్య, ఉద్యోగ సాధికారత పట్ల దేశంలో మరే ప్రభుత్వంలో లేనంతగా తమ ప్రభుత్వం దృష్టి పెట్టిందని తెలిపారు. జగనన్న అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, 30 లక్షల ఇళ్ల పట్టాలు, 22 లక్షల ఇళ్ల నిర్మాణం, జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన, వైఎస్సార్ సంపూర్ణ పోషణ లాంటి పథకాలతో గర్భస్థ శిశువు నుంచి పండు ముదుసలి వరకు ప్రతి ఒక్కరి పట్ల ప్రేమ చూపిస్తున్న ఏకైక ప్రభుత్వం మనదేనన్నారు. దిశ యాప్, దిశ పోలీస్ స్టేషన్ల ద్వారా ఆడబిడ్డల రక్షణలో అందరికన్నా మిన్నగా అడుగులు ముందుకు వేశామని చెప్పారు.



నిశ్శబ్దాన్ని ఛేదించి ఎందరికో 'చేయూత'

హెచ్ఐవీ.. దశాబ్దం క్రితం వరకు దీనిపై నలుగురిలో మాట్లాడాలంటేనే వణుకు. ఆత్మహత్య ఒక్కటే శరణ్యమనుకునే వారు. కానీ.. మందులకు లొంగని ఈ వ్యాధి సోకినంత మాత్రాన జీవితం అక్కడితో ఆగిపోదని కోటగిరి రేణుక రుజువు చేశారు. ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం ఈదర గ్రామానికి చెందిన రేణుక భర్త కోటగిరి శ్రీనివాసరావుకు 1999లో హెచ్ఐవీ పాజిటివ్‌గా తేలింది. రేణుకకు కూడా ఈ వ్యాధి సోకినట్టు వైద్యులు గుర్తించారు. 2003లో శ్రీనివాసరావు మృతి చెందారు. భర్త మరణానంతరం రేణుక విజయవాడకు మారారు. హెచ్ఐవీ బాధితుల పట్ల ఉన్న చిన్నచూపు వల్ల తనలా ఇంకెంత మంది మహిళలు వేదనకు గురవుతున్నారోననే భావన రేణుకను కలచివేసింది. హైదరాబాద్‌కు వెళ్లి హెచ్ఐవీ బాధితుల 'కేర్ అండ్ సపోర్టింగ్'లో శిక్షణ పొందారు. అనంతరం ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నడుం కట్టారు. ఇందులో భాగంగా 2003లోనే 'తెలుగు నెట్‌వర్క్ ఆఫ్ పీపుల్ లివింగ్ విత్ హెచ్ఐవీ అండ్ ఎయిడ్స్' పేరిట స్వచ్ఛంద సంస్థను నెలకొల్పడంలో భాగస్వామి అయ్యారు. మరోవైపు అప్పట్లోనే చేయూత అనే సంస్థను సైతం నెలకొల్పి ఉమ్మడి కృష్ణా జిల్లాలోని హెచ్ఐవీ బాధితులకు వివిధ రకాలుగా అండగా నిలిచారు. బాధిత కుటుంబాల్లోని పిల్లల చదువులకు సాయం, పౌష్టికాహారం అందిస్తున్నారు. ఇప్పటి వరకు 200 మంది పిల్లల చదువులకు చేయూత ఎన్‌జీవో ద్వారా సాయం అందించారు. ప్రస్తుతం 400 మంది పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్నారు. ఆమె సహకారంతో బీఎస్సీ నర్సింగ్, ఫార్మసీ, ఇంజనీరింగ్ చదివిన వారు ప్రస్తుతం ఉద్యోగాలు చేస్తున్నారు.

చెప్పుకోవడానికి భయపడను

"నేను హెచ్ఐవీ పాజిటివ్ అని చెప్పుకోవడానికి భయపడను. అలా చెప్పుకోవడానికి ఇబ్బంది పడి.. నాలుగు గోడల మధ్య కుంగిపోకుండా బాధితులకు సాయం చేయడమే నా లక్ష్యం. తమ ప్రమేయం లేకున్నా.. ఏ తప్పు చేయకున్నా చాలామంది ఈ వ్యాధి బారినపడుతుంటారు. వ్యాధి సోకినంత మాత్రాన కుంగిపోవద్దు. ఇప్పుడు మన రాష్ట్రంలోనే ప్రభుత్వ రంగంలో మంచి వైద్యం అందుతోంది. ఎవరో.. ఏదో అనుకుంటారని బాధితులు ఆస్పత్రులకు వెళ్లడం మానేయొద్దు."

– కోటగిరి రేణుక, చైర్మన్, చేయూత స్వచ్ఛంద సంస్థ



శ్రీకాకుళానికి చెందిన సుగుణరెడ్డి, రత్నకుమారి, రమాదేవి, నాగలక్ష్మి, విజయ ఇంటిని చక్కదిద్దుకునే దిగువ మధ్యతరగతి గృహిణులు. 18,364 మంది మహిళా సమాఖ్య సభ్యులతో కలసి పట్టణంలో ఫిబ్రవరిలో జగనన్న మహిళా మార్టు ఏర్పాటు చేశారు. ఒక్కొక్కరి నుంచి రూ.150 చొప్పున మొత్తం రూ.27,54,600 స్త్రీనిధిగా సేకరించారు. మొదటి నెలలో రూ.10,75,013 మేర వ్యాపారం చేయడంతోపాటు రూ.లక్ష లాభం కూడా ఆర్జించారు.

కస్తూరి, ప్రీతి, ఇందిర, ప్రియ, హిమబిందు చిత్తూరుకు చెందిన మహిళా సమాఖ్య సభ్యులు. పట్టణంలో 26,850 మంది సభ్యులతో కలసి జగనన్న మహిళా మార్ట్ నెలకొల్పారు. రూ.40,27,500 స్త్రీనిధిని సేకరించి నెలకు రూ.32,56,152 మేర వ్యాపారం చేస్తున్నారు.



తిరుపతిలోని మహిళా మార్ట్

మహిళోదయం!

మన మహిళల సంఘటిత శక్తికి నిదర్శనంగా జగనన్న మార్ట్‌లు

ఏ బిజినెస్ స్కూల్‌లో పట్టాలు పొందలేదు.. ఆ మాటకొస్తే పెద్దగా చదువుకోలేదు.. గతంలో వ్యాపార అనుభవం కూడా లేదు. సంఘటితంగా మారి 'పొదుపు' బాట పట్టారు. సామాన్య మహిళలైన వీరంతా జగనన్న మహిళా మార్టుల ద్వారా వ్యాపారాల్లో ఎంతో బాగా రాణిస్తున్నారు. పులివెందుల, అద్దంకి, రాయచోటి, తిరుపతి, పుంగనూరు సహా మొత్తం ఏడు చోట్ల జగనన్న మహిళా మార్ట్‌లను సమాఖ్య సభ్యులే నెలకొల్పి విజయవంతంగా నడిపిస్తున్నారు. పట్టణ ప్రాంత పేదరిక నిర్మూలనా సంస్థ (మెప్మా) అందించిన శిక్షణతో ఇంత పెద్ద విజయాన్ని సాధించారు. ఏడు మార్టుల్లో 1.19 లక్షల మందికి పైగా స్వయం సహాయక సంఘాల సభ్యులు వాటాదార్లుగా రూ.1.79 కోట్లు పెట్టుబడిగా పెట్టారు. ప్రతి నెలా రూ.1.35 కోట్ల టర్నోవర్ చేస్తున్నారు. సభ్యులే కమిటీలుగా ఏర్పడి సరుకు కొనుగోలు, నాణ్యత, నిర్వహణ బాధ్యతలను చూసుకుంటున్నారు. ఇంటి సరుకుల కోసం చేసే ఖర్చును తగ్గించుకునేందుకు చేపట్టిన ఈ ప్రాజెక్టు పట్టణ ప్రాంత మహిళల్లో కొత్త శక్తిని నింపుతోంది.

- సాక్షి, అమరావతి



అద్దంకిలోని మహిళా మార్ట్‌లో కొనుగోలుదారులు

రెండేళ్ల క్రితం పులివెందులలో 'మెప్మా' అందించిన సాయంతో ప్రారంభమైన 'జగనన్న మహిళా మార్ట్' ప్రస్థానం ఏడు పట్టణాలకు విస్తరించింది. మహిళా సమాఖ్యలోని సభ్యులంతా దిగువ మధ్య తరగతి, నిరుపేద కుటుంబాలకు చెందినవారే. ఇంటి అవసరాల సరుకులు కొనేందుకు ప్రతి నెలా కనీసం రూ.5 వేల నుంచి రూ.7 వేల వరకు ఖర్చు చేస్తుంటారు. మహిళా మార్టుల్లో వాటాదార్లకు మేలు జరిగేలా చర్యలు తీసుకున్నారు. షాపులో సాధారణంగా ఇచ్చే డిస్కౌంట్ల కంటే సభ్యులకు 0.50% అదనంగా డిస్కౌంట్ ఇస్తున్నారు. దీంతో ఇప్పుడు ఒక్కో కుటుంబం నెలకు కనీసం రూ.700 నుంచి రూ.1,000 వరకు ఆదా చేయగలుగుతోంది. పేదలకు అది పెద్ద మొత్తమే. రూ.150 వాటాకు జీవితకాల సభ్యత్వంతోపాటు లాభాల్లో ఏటా 33 శాతం డివిడెంట్ రూపంలో చెల్లిస్తున్నారు. మూడేళ్లలో పెట్టిన పెట్టుబడి వెనక్కి రావడంతో పాటు కొనుగోళ్లలో అదనపు డిస్కౌంట్ దక్కుతోంది.

6 వేల నుంచి 37 వేల మంది సభ్యులు

పట్టణ ప్రాంతాల్లోని మహిళా సమాఖ్యల సభ్యులతో మెప్మా స్టోర్లను ఏర్పాటు చేస్తోంది. స్థానికంగా ఉన్న సభ్యులతో సమావేశాలు నిర్వహించి వ్యాపారంపై పూర్తి అవగాహన కల్పించాక వాటాదార్లుగా చేర్చుకుంటున్నారు. పట్టణాన్ని బట్టి ఒక్కో మార్టులో 6 వేల మంది నుంచి గరిష్టంగా 37 వేల మంది వరకు వాటాదార్లుగా ఉన్నారు. పులివెందుల స్టోర్‌లో 8 వేల మంది రూ.12 లక్షలు పెట్టుబడిగా పెట్టి ప్రతి నెలా రూ.20 లక్షలకు పైగా వ్యాపారం చేస్తున్నారు. తిరుపతిలో 37,309 మంది సభ్యులు కలిసి రూ.56 లక్షలు వాటాగా పెట్టి ప్రతి నెలా రూ.29.88 లక్షల మేర వ్యాపారం చేస్తున్నారు.

'స్వయం'కృషితో ఎదిగిన స్త్రీ శక్తి

మహిళా సమాఖ్యలు ప్రభుత్వం అందించే సాయాన్ని ఇన్నేళ్లు ఇంటి అవసరాలకే వినియోగించుకుంటుండగా వారికి ఆర్థిక స్వావలంబన ద్వారా సుస్థిర జీవనోపాధికి మార్గం చూపాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించారు. అందుకు అనుగుణంగా 'మెప్మా' ఎండీ విజయలక్ష్మి వినూత్న ఆలోచనకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వం అందించే ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకుంటూ సభ్యులంతా కలిసి సూపర్ మార్కెట్లు నెలకొల్పవచ్చని మహిళలకు వివరించారు. వారితో పలు దఫాలు సమావేశాలు నిర్వహించి ఎలా ముందుకెళ్లాలో మార్గనిర్దేశం చేశారు. సమాఖ్య సభ్యులపై భారం లేకుండా ఒక్కొక్కరి పెట్టుబడి కేవలం రూ.150గా నిర్ణయించారు. 'జగనన్న మహిళా మార్ట్' పేరుతో 2021 జనవరి 3న తొలి మార్ట్‌ను పులివెందులలో ఏర్పాటు చేశారు. ఏడాది కాలంలోనే ఈ స్టోర్ రూ.2.50 కోట్ల మేర వ్యాపారం చేయడంతో పాటు వాటాదార్లకు లాభాల్లో 33 శాతం డివిడెంట్‌గా చెల్లించింది. గతేడాది జనవరిలో రాయచోటిలో నెలకొల్పిన జగనన్న మహిళా మార్ట్ మొదటి నెలలోనే రూ.14 లక్షల మేర వ్యాపారం చేసింది. ఫిబ్రవరిలో ప్రకాశం జిల్లా అద్దంకిలో ప్రారంభమైన స్టోర్ సైతం రూ.10.72 లక్షల వ్యాపారం నిర్వహించింది. ఈ మూడు స్టోర్లు విజయవంతం కావడంతో తిరుపతి, పుంగనూరు, చిత్తూరులోనూ జగనన్న మహిళా మార్ట్‌లను మెప్మా ఎండీ అందుబాటులోకి తెచ్చారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో శ్రీకాకుళంలోనూ మార్ట్‌ను ప్రారంభించారు. ఏడుచోట్ల నెలకు రూ.1.35 కోట్ల మేర వ్యాపారం చేస్తున్నారు.

నాణ్యతే ప్రమాణంగా వ్యాపార శిక్షణ

వ్యాపారం ఏదైనా సరే నాణ్యతే పెట్టుబడిగా ఉంటే మంచి సరుకులు ఎక్కడున్నా కొనుగోలుదారులు వస్తుంటారు. ఈ సూత్రంతోనే స్టోర్ల భాగస్వాములైన మహిళా సమాఖ్య సభ్యులకు మెప్మా శిక్షణ ఇచ్చింది. స్టోర్ నిర్వహణ, సరుకుల కొనుగోలు, నాణ్యత పరిశీలనకు, ఖాతాల నిర్వహణకు వాటాదార్లుగా ఉన్న మహిళలతోనే కమిటీలు ఏర్పాటయ్యాయి. దీంతో వ్యాపార నిర్వహణ తేలికైంది. ఎక్కడ నాణ్యమైన సరుకులు దొరుకుతాయో అక్కడి నుంచే నేరుగా కొనుగోలు చేసి అమ్మకానికి ఉంచుతున్నారు. మహిళా సమాఖ్య సభ్యులు సొంతంగా తయారు చేసిన వస్తువులను సైతం ఇక్కడ విక్రయించే ఏర్పాట్లు చేశారు. మార్ట్‌ల్లో గృహ అవసరాలకు వినియోగించే అన్ని వస్తువులను అమ్ముతున్నారు. పెద్దగా లాభాలు ఆశించకుండా నాణ్యమైన సరుకులను అందిస్తుండటంతో ప్రజలకు వీటిపై నమ్మకం పెరిగింది. ప్రతి మార్ట్‌లోనూ ఒకే ధర ఉంటుంది. అన్నింటికీ ఒకే సాఫ్ట్‌వేర్ వినియోగిస్తుండడంతో నిర్వహణ తేలికైంది. జగనన్న మహిళా మార్టులు కార్పొరేట్ సూపర్ మార్కెట్లను తలదన్నేలా ఉండడమే కాకుండా లాభాల బాటలో నడుస్తున్నాయి.

ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా...



ముఖ్యమంత్రి జగన్ ఆలోచనల మేరకు పట్టణ పేద మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా జగనన్న మహిళా మార్ట్‌లను ఏర్పాటు చేస్తున్నాం. ఏడు స్టోర్లు విజయవంతంగా నడుస్తున్నాయి. స్వయం సహాయక గ్రూప్ మహిళలకు వీటి ఏర్పాటుపై అవగాహన కల్పిస్తున్నాం. స్వచ్ఛందంగా రూ.150 పెట్టుబడిగా పెడుతున్నారు. పులివెందుల స్టోర్ వాటాదారులు డివిడెంట్ కూడా తీసుకున్నారు. అన్ని స్టోర్లలోనూ ఒకే విధంగా మార్కెట్ కంటే తక్కువ ధరలుంటాయి. అన్ని స్టోర్లను అనుసంధానిస్తూ ఏకీకృత సాఫ్ట్‌వేర్ రూపొందించాం. స్థానిక మున్సిపాలిటీకి చెందిన వ్యాపార సముదాయల్లో షాపులను నెలకొల్పడం ద్వారా అద్దె భారం తగ్గుతోంది. సరుకులు కొనుగోళ్లను మార్ట్ కమిటీ సభ్యులే స్వయంగా చూసుకుంటున్నారు. మార్ట్‌లు అనుకున్న దానికంటే ఎక్కువ విజయవంతం కావడం ఆనందంగా ఉంది. ప్రతి మునిసిపాలిటీలో ఒక స్టోర్ ఏర్పాటు దిశగా కృషి చేస్తున్నాం.

- విజయలక్ష్మి, మెప్మా ఎండీ


రాయచోటిలోని మహిళా మార్ట్

మార్ట్	సభ్యులు	పెట్టుబడి (రూ.ల్లో)	నెలవారీ అమ్మకాలు (సగటున)
పులివెందుల	8,000	రూ.12,00000	రూ.13,50,823
రాయచోటి	9,567	రూ.14,35,000	రూ.13,52,171
అద్దంకి	6,833	రూ.10,25,000	రూ.10,51,098
పుంగనూరు	12,266	రూ.18,39,950	రూ.19,17,691
తిరుపతి	37,309	రూ.55,96,329	రూ.29,88,678
చిత్తూరు	26,850	రూ.40,27,500	రూ.32,56,152
శ్రీకాకుళం	18,364	రూ.27,54,530	రూ.10,75,013

'హవాలా' దోపిడీ

- రూ.1.89 కోట్లు పట్టుకున్న 'అనంత' పోలీసులు
- కేరళకు చెందిన శ్రీధరన్ ముఠా పనేనని నిర్ధారణ
- నలుగురు నిందితులు అదుపులోకి

సాక్షి ప్రతినిధి, అనంతపురం: హవాలా మార్గంలో తీసుకెళుతున్న సొమ్మును దోపిడీ చేసే ముఠాను అనంతపురం పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. హైదరాబాద్ నుంచి బెంగళూరు తరలిస్తున్న రూ.1.89 కోట్ల నగదును ఈ ముఠా హైవే–44 మీద దోపిడీ చేసి తీసుకెళుతుండగా పక్కా సమాచారంతో పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. నగదును స్వాధీనం చేసుకుని నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. కొందరు బెంగళూరులో బంగారం కొనుక్కొచ్చి హైదరాబాద్‌లో అమ్మి ఆ డబ్బును బెంగళూరు మీదుగా కోయంబత్తూర్, సేలం తదితర ప్రాంతాలకు తీసుకెళతారు. ఈ నేపథ్యంలోనే బెంగళూరుకు హవాలా సొమ్ముతో హైవేపై వెళుతున్న వాహనాన్ని అనంతపురం జిల్లా పరిధిలో ఈ ముఠా అటకాయించి దోపిడీ చేసింది. హవాలా సొమ్ము ఎక్కడి నుంచి ఎక్కడకు వెళుతుందన్న సమాచారం సేకరించడంలో ఆరితేరిన కేరళకు చెందిన శ్రీధరన్ ముఠా ఈ పనిచేసినట్టు పోలీసులు గుర్తించారు. ఈ వ్యవహారానికి సంబంధించి శ్రీధరన్‌కు నాలుగు రాష్ట్రాల్లో ఇన్‌ఫార్మర్లు ఉన్నారు. వారి ద్వారా హవాలా సొమ్ము సమాచారం తెలుసుకుంటారు. ఈ క్రమంలోనే హైదరాబాద్ నుంచి బెంగళూరుకు రూ.1.89 కోట్ల నగదు హవాలా మార్గంలో వెళుతున్నట్లు తెలుసుకుని తన ముఠాతో దోపిడీ చేయించాడు. కోటి రూపాయల కంటే తక్కువగా ఉంటే శ్రీధరన్ ముఠా రాదని తెలిసింది. హవాలా సొమ్ము పోయినా ఫిర్యాదు ఇచ్చేందుకు ఎవరూ ముందుకు రారనే నమ్మకంతో శ్రీధరన్ ఈ సొమ్మునే దోచుకుంటున్నట్లు సమాచారం.

శ్రీధరన్ కోసం బృందాలు

శ్రీధరన్ కోసం గాలింపు చేపట్టాం. కొన్ని బృందాలు కేరళకు వెళ్లాయి. అతనొక పేరుమోసిన ముఠా లీడర్. ఎక్కువగా హవాలా రాబరీలకే సారథ్యం వహిస్తాడు. ఎక్కడో ఉండి ఇక్కడి ముఠాలతో పనిచేయిస్తాడు. ఇప్పటికే కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో అతడిపై పలు కేసులు ఉన్నాయి. ప్రస్తుతం అదుపులో ఉన్న నలుగురు నిందితులను విచారిస్తున్నాం.

– డాక్టర్ కె.ఫక్కీరప్ప, ఎస్పీ, అనంతపురం

30 జేసీజే పోస్టుల భర్తీకి హైకోర్టు నోటిఫికేషన్

సాక్షి, అమరావతి/గుంటూరు లీగల్: రాష్ట్ర జ్యుడీషియల్ సర్వీసెస్‌లో 30 జూనియర్ సివిల్ జడ్జి (జేసీజే) పోస్టుల భర్తీకి హైకోర్టు నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో 24 పోస్టులను ప్రత్యక్ష భర్తీ ద్వారా, ఆరు పోస్టులను రిక్రూట్‌మెంట్ బై ట్రాన్స్‌ఫర్ ద్వారా భర్తీ చేస్తారు. ఈ నెల 17 నుంచి ఏప్రిల్ ఆరో తేదీ వరకు హైకోర్టు వెబ్‌సైట్ (ఆన్‌లైన్)లో దరఖాస్తులు సమర్పించేందుకు గడువు ఇచ్చారు. ఏప్రిల్ 24న కంప్యూటర్ ఆధారిత స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తారు. ఈ పరీక్షలో 40, అంతకన్నా ఎక్కువ మార్కులు సాధించిన వారిని 1:10 నిష్పత్తిలో రాతపరీక్షకు అనుమతిస్తారు. ఓసీ 15, ఈడబ్ల్యూఎస్–3, బీసీ–ఏ 3, బీసీ–బీ 1, బీసీ–సీ 1, బీసీ–డీ 1, బీసీ–ఈ 1, ఎస్సీ–4, ఎస్టీ–1 చొప్పున పోస్టులు ఉన్నాయి. ఈ మేరకు రిజిస్ట్రార్ (రిక్రూట్‌మెంట్) ఎస్.కమలాకర్‌రెడ్డి మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేశారు.

మైనారిటీల హక్కులు కాపాడుతాం:నారా లోకేశ్

పీలేరు: ముస్లిం మైనారిటీల హక్కులు కాపాడతామని టీడీపీ నేత, ఎమ్మెల్సీ నారా లోకేశ్ అన్నారు. యువగళం పాదయాత్రలో భాగంగా మంగళవారం అన్నమయ్య జిల్లా కలికిరి నుంచి చింతపర్తివరకు పాదయాత్ర నిర్వహించారు. టీడీపీ నాయకుడు వంగవీటి రాధ యువగళం పాదయాత్రకు సంఘీభావం తెలుపుతూ లోకేశ్‌తో కలిసి నడిచారు. ముస్లిం మైనారిటీలు, రైతులతో ముఖాముఖి నిర్వహించారు. లోకేశ్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ముస్లింలపై దాడులు పెరిగిపోయాయన్నారు. రంజాన్ తోఫా, దుల్హాన్ పథకం, విదేశీ విద్యాపథకాలకు మంగళం పాడారని విమర్శించారు. తాము అధికారంలోకి వస్తే వక్ఫ్ బోర్డును బలోపేతం చేసి, జ్యుడిషియల్ పవర్‌తో ఆస్తులు కాపాడతామని తెలిపారు.

జనసేన నేత ఆక్రమణ యత్నం

- కాలువ శుభ్రం సాకుతో రూ.కోటి విలువచేసే ప్రభుత్వస్థలం కబ్జాకు యత్నం
- సర్పంచ్ ఫిర్యాదుతో అడ్డుకున్న రెవెన్యూ అధికారులు

మదనపల్లె: అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలంలో జనసేన రాజంపేట పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి జంగాల శివరాం కాలువను శుభ్రం చేసే సాకుతో కోటి రూపాయల విలువైన ప్రభుత్వస్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నించారు. సర్పంచ్ ఫిర్యాదుతో రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అడ్డుకున్నారు. అంకిశెట్టిపల్లె పంచాయతీ టీచర్స్ కాలనీలో చిల్లరవంకకు ఆనుకుని శివరాంకు కొంతస్థలం ఉంది. చిల్లరవంకలోకి స్థానికంగా ఉన్న ఇళ్ల నుంచి మురుగు ప్రవహిస్తుంటుంది. దీన్ని సాకుగాచూపి ఆయన కాలువను శుభ్రంచేసే నెపంతో అధికారుల అనుమతి లేకుండా సుమారు 20 అడుగుల మేర వంకలో జేసీబీతో తవ్వకాలు జరిపి పోరంబోకు స్థలాన్ని ఆక్రమణకు సిద్ధం చేశారు. ఈ విషయాన్ని స్థానికులు సర్పంచ్ వై.శరత్‌రెడ్డి, వైస్ ఎంపీపీ పసుపులేటి రమణ దృష్టికి తీసుకెళ్లారు. క్షేత్రస్థాయిలో ఆక్రమణను గుర్తించిన వారు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదుచేశారు. తహసీల్దార్ సి.కె.శ్రీనివాసులు అక్కడికి వెళ్లి పరిశీలించిసమగ్ర సర్వే చేయాలని సర్వేయర్లకు సూచిస్తుండగా శివరాం వచ్చి ఆ స్థలం తనదేనంటూ ఫేక్ రికార్డులు చూపించేందుకు ప్రయత్నించారు. దీనిపై తహసీల్దార్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ రెవెన్యూ అధికారుల అనుమతి లేకుండా చిల్లరవంకలో తవ్వకాలు ఎందుకు జరిపారని ప్రశ్నించడంతో సమాధానం చెప్పలేక నీళ్లు నమిలారు. సర్పంచ్‌కి చెబితే వాళ్లే కాలువను శుభ్రం చేస్తారని, మీరెందుకు చేశారని అడిగారు. సర్వే చేయిస్తామని, ఆక్రమణ నిజమని తేలితే క్రిమినల్ కేసు నమోదు చేయిస్తామని తహసీల్దారు హెచ్చరించారు. ప్రభుత్వ రికార్డుల ప్రకారం చిల్లరవంకను సర్వేచేసి ఆక్రమణల నిగ్గు తేల్చాలని సర్వేయర్ ముబారక్‌ను ఆదేశించారు.

విద్యుత్ కంచె తగిలి 3 ఏనుగుల మృతి

రైతు మురుగేశన్ అరెస్టు

తిరువొత్తియూరు: తమిళనాడులోని ధర్మపురి జిల్లాలో వ్యవసాయ పొలానికి వేసిన విద్యుత్ కంచె తగిలి సోమవారం రాత్రి మూడు ఏనుగులు మృతిచెందాయి. దీంతో పోలీసులు రైతు మురుగేశన్‌ను అరెస్టు చేశారు. స్థానిక మారండహళ్లి పరిసర ప్రాంతాల్లో నీరు, ఆహారం కోసం ఏనుగులు అటవీ సరిహద్దు గ్రామాల్లోకి చొరబడుతున్నాయి. నెలరోజుల కిందట ఓ మగ ఏనుగు, రెండు ఆడ ఏనుగులు, రెండు గున్న ఏనుగులు ఉన్న గుంపు ఆ ప్రాంతంలో సంచరిస్తోంది. రాత్రి సమయంలో పంటలను ధ్వంసం చేస్తున్నాయి. మారండహళ్లి సమీపంలోని కాళీ గౌండన్ కొట్టాయి గ్రామానికి చెందిన మురుగేశన్ తన రెండెకరాల పొలంలో జొన్న, రాగి పంటలు వేశాడు. వాటి చుట్టూ అధికారుల అనుమతి లేకుండా విద్యుత్ కంచె ఏర్పాటు చేశాడు. సోమవారం అర్ధరాత్రి సమయంలో ఐదు ఏనుగులు మురుగేశన్ పొలం వద్దకు వచ్చాయి. అక్కడ విద్యుత్ కంచె తగిలి రెండు ఆడ ఏనుగులు, ఓ మగ ఏనుగు మృతిచెందాయి. రెండు గున్న ఏనుగులు తప్పించుకున్నాయి. సమాచారం అందుకున్న పాలకోడు అటవీశాఖ ఉద్యోగులు ఘటనాస్థలాన్ని పరిశీలించి దర్యాప్తు ప్రారంభించారు.

ఉన్నత పదవుల్లో మహిళల సంఖ్య పెరగాలి

- అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో హైకోర్టు సీజే జస్టిస్ పీకే మిశ్రా


జస్టిస్ శ్రీభానుమతి, జస్టిస్ సుజాత, జస్టిస్ జ్యోతిర్మయిలతో సీజే జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, హైకోర్టు న్యాయవాదులు

సాక్షి, అమరావతి: జనాభాలో సగభాగం ఉన్న మహిళలకు సమ ప్రాధాన్యతనివ్వకపోతే దేశ, సమాజం పురోగతి సాధించలేవని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా అన్నారు. మహిళలకు సముచిత స్థానం కల్పిస్తే ప్రపంచంలో భారతదేశం తిరుగులేని స్థానం సంపాదిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. రాష్ట్రపతి, గవర్నర్‌లుగా, సుప్రీంకోర్టు, హైకోర్టు జడ్జిలుగా పలువురు మహిళలు ఉన్నారని, అయినప్పటికీ ఉన్నత పదవుల్లో మహిళల సంఖ్య మరింత పెరగాల్సిన ఆవశ్యకత ఉందని చెప్పారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం హైకోర్టు న్యాయవాదుల సంఘం ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసింది. సీజే ప్రశాంత్‌కుమార్ మిశ్రా, మహిళా న్యాయమూర్తులు జస్టిస్ బి.శ్రీభానుమతి, జస్టిస్ వడ్డిబోయన సుజాత, జస్టిస్ ప్రతాప వెంకట జ్యోతిర్మయి, న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు కె.జానకిరామిరెడ్డి, అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్, బార్ కౌన్సిల్ చైర్మన్ గంటా రామారావు, రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ యర్రంరెడ్డి నాగిరెడ్డి, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ (డీఎస్‌జీ) ఎన్.హరినాథ్, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీజే జస్టిస్ మిశ్రా మాట్లాడుతూ మహిళలను పూజించడం, గౌరవించడం మన ధర్మమని చెప్పారు. మహిళలు ఆత్మస్థైర్యాన్ని పెంచుకోవాలని, అప్పుడే ఉన్నత శిఖరాలకు చేరుకోగలరని తెలిపారు. ఏపీ హైకోర్టులో గతంలో మహిళా న్యాయవాదుల సంఖ్య చాలా తక్కువగా ఉండేదని, ఇప్పుడు 28 శాతానికి పైగా మహిళలే ఉన్నారన్నారు. న్యాయవ్యవస్థతోపాటు ఇతర శాఖల్లో నిర్వహించే నియామక పరీక్షల్లో మహిళలే ఎక్కువగా ఉత్తీర్ణత సాధిస్తున్నారని చెప్పారు.

ఆత్మస్థైర్యం కోల్పోకూడదు

మహిళా న్యాయమూర్తులు జస్టిస్ శ్రీభానుమతి, జస్టిస్ సుజాత, జస్టిస్ జ్యోతిర్మయి మాట్లాడుతూ హైకోర్టులో మహిళా జడ్జిల సంఖ్య మరింత పెరగాల్సి ఉందన్నారు. జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకునేందుకు ఉన్న అడ్డంకులను మహిళలు తమకు తామే తొలగించుకోవాలన్నారు. మహిళలు ఎన్నడూ ఆత్మస్థైర్యం కోల్పోకూడదని, తమను తాము తక్కువగా భావించకూడదని తెలిపారు. కేవలం వాయిదాలు అడిగేందుకే కాకుండా వాదనలు వినిపించే అవకాశాలను మహిళా న్యాయవాదులు అందిపుచ్చుకోవాలన్నారు. సీనియర్ న్యాయవాది భాస్కరలక్ష్మి మాట్లాడుతూ మహిళా సంఘాలు నిర్వహించే కార్యక్రమాలకు పురుషులను సైతం ఆహ్వానించాలని, తద్వారా మహిళల కష్టాలను అర్థం చేసుకునే అవకాశం వారికి కలుగుతుందన్నారు. అనంతరం జస్టిస్ భానుమతి, జస్టిస్ సుజాత, జస్టిస్ జ్యోతిర్మయితోపాటు భాస్కరలక్ష్మిని న్యాయవాదుల సంఘం ప్రతినిధులు ఘనంగా సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు.

బెజవాడలో రైలు కోచ్ రెస్టారెంట్



విజయవాడ రైల్వేస్టేషన్ వద్ద కోచ్ రెస్టారెంట్ కోసం ఏర్పాటు చేసిన బోగీ

- రైల్వేస్టేషన్ వద్ద త్వరలో ప్రారంభం
- ప్రత్యేకంగా బోగీ ఏర్పాటు... చురుగ్గా సాగుతున్న పనులు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ప్రయాణికులతోపాటు విజయవాడ నగరవాసులు రైలు బోగీలో కూర్చుని తమకు నచ్చిన ఆహారాన్ని తింటూ సరికొత్త అనుభూతిని పొందేలా రైల్వేశాఖ వినూత్నంగా కోచ్ రెస్టారెంట్‌ను అందుబాటులోకి తీసుకురానుంది. ఈ మేరకు విజయవాడ రైల్వేస్టేషన్ ప్రధాన ప్రవేశమార్గం సమీపాన కోచ్ రెస్టారెంట్‌ను ఏర్పాటు చేస్తోంది. ఆహార ప్రియులను ఆకర్షించేందుకు ప్రైవేట్ వ్యాపారులు రొటీన్‌కు భిన్నంగా జైల్ రెస్టారెంట్, విమానం రెస్టారెంట్, ప్లాట్‌ఫాం రెస్టారెంట్ వంటి వినూత్న ఆలోచనలతో ముందుకు సాగుతున్నారు. ఇదే తరహాలో రైల్వేశాఖ కూడా కోచ్ రెస్టారెంట్‌లను ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టింది. దక్షిణ మధ్య రైల్వేలో తొలిసారిగా గుంటూరు స్టేషన్ వద్ద కోచ్ రెస్టారెంట్‌ను ప్రారంభించింది. అక్కడ విజయవంతం కావడంతో విజయవాడలోనూ ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. ఈ మేరకు అధికారులు విజయవాడ స్టేషన్ ప్రధాన ప్రవేశమార్గం సమీపంలో ప్రత్యేకంగా ట్రాక్ ఏర్పాటు చేసి దానిపై ఒక ఏసీ కోచ్‌ను పెట్టారు. ఆ బోగీలోని బెర్త్‌లు, ఎలక్ట్రికల్ పరికరాలు, టాయిలెట్లు వంటి వాటిని తొలగించి అధునాతన ఇంటీరియర్ డిజైన్‌తో తీర్చిదిద్దుతున్నారు. కస్టమర్లకు సౌకర్యవంతమైన సిట్టింగ్, కిచెన్ వంటివి ఏర్పాటు చేస్తారు. ఈ కోచ్ రెస్టారెంట్ 24 గంటలు అందుబాటులో ఉంటుంది. త్వరలోనే పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామని రైల్వే అధికారులు తెలిపారు.

'గగన్‌యాన్' పారాచూట్‌ల ప్రయోగాత్మక పరీక్ష విజయవంతం

సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): ఇస్రో ప్రతిష్టాత్మకంగా 2024లో చేపట్టనున్న గగన్‌యాన్ ప్రాజెక్టు కోసం 2 పారాచూట్‌ల్లో ప్రయోగాత్మక పరీక్షను విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్‌లో విజయవంతంగా నిర్వహించినట్లు ఇస్రో తెలిపింది. గగన్‌యాన్ ప్రాజెక్ట్‌లో భాగంగా మానవ సహిత ప్రయోగాన్ని చేయడానికి అనేక ప్రయోగాత్మక పరీక్షలను చేస్తోన్న విషయం తెలిసిందే. తాజాగా ఇస్రో చండీగఢ్ బాలిస్టిక్ రీసెర్చి లేబొరేటరీ (టీబీఆర్ఎల్)లో గగన్‌యాన్ పైలట్ అపెక్స్ కవర్ సెపరేషన్ (ఏసీఎస్) పారాచూట్‌ల రైల్‌ట్రాక్ రాకెట్ స్లైడ్ విస్తరణ పరీక్షలను విజయవంతంగా నిర్వహించింది. గగన్‌యాన్ ప్రయోగానికి ముందుగా క్రూ మాడ్యూల్ (వ్యోమగాముల గది)తో ప్రయోగాత్మకంగా ఒక ప్రయోగాన్ని నిర్వహించనుంది. ఇందులో క్రూ మాడ్యూల్‌ను సురక్షితంగా భూమి వైపునకు తీసుకొచ్చేందుకు ఈ పారాచూట్‌లను అమర్చుతారు. వీటి పనితీరు ఎలా ఉంటుంది అనే దానిపై ప్రయోగాత్మకంగా ఒక పరీక్షను ఇస్రో నిర్వహించి విజయాన్ని అందుకుంది. కేరళలోని తిరువనంతపురంలో ఉన్న విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్, ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఆగ్రాలో ఉన్న ఏరియల్ డెలివరీ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ సంస్థలు సంయుక్తంగా వీటిని తయారు చేశాయి. గగన్‌యాన్ ప్రయోగంలో భాగంగా క్రూ మాడ్యూల్ ప్రయోగం చేసినప్పుడు ఆ మాడ్యూల్ తిరిగి భూమివైపునకు తీసుకొచ్చే సమయంలో దాని వేగానికి అనుగుణంగా ఈ పారాచూట్‌లు విచ్చుకుని దాన్ని సురక్షితంగా సముద్రంపై పడేసేందుకు దోహదపడుతాయి. మానవసహిత ప్రయోగంలో భాగంగా వ్యోమగాములు ఈ క్రూ మాడ్యూల్‌లో కూర్చుని అంతరిక్షంలోకి వెళ్లి తిరిగి వచ్చేటపుడు భూమి వైపునకు అంటే సముద్రంలో దిగేందుకు ఈ పారాచూట్లు ఉపయోగపడతాయి.


పారాచూట్‌ల పరీక్షలను నిర్వహిస్తున్న ఇస్రో శాస్త్రవేత్తలు



ఆమె రెక్కలు తెగివున్నాయి;
ఎగరడం ఎలాగో తెలియదని
ఆమెను నిందిస్తారు.
– సైమన్ ది బువా

సాక్షి
బుధవారం, మార్చి, 8

వలస జీవులపై వికృత క్రీడ

అసత్యాల కన్నా అర్ధసత్యాలు ఎక్కువ ప్రమాదం. ఎక్కడో జరిగినదాన్ని మరెక్కడో జరిగినట్టు చూపెట్టి, బోడిగుండుకూ మోకాలికీ ముడిపెట్టే ఫేక్ వీడియోల హవా పెరిగాక ఈ ప్రమాదం ఇంకెంతో పెరిగింది. ఉత్తరాది వలస కార్మికులపై తమిళనాట దాడులంటూ సోషల్ మీడియాలో తెగ తిరిగిన ఘటన, దానిపై బిహార్ సహా దేశవ్యాప్తంగా రేగిన రచ్చ అందుకు తాజా నిదర్శనం. తమిళనాడు ప్రభుత్వం, పోలీసులు వెంటనే రంగంలోకి దిగి, వేరెక్కడో జరిగిన ఘటనల దృశ్యాల్ని ఇప్పుడు ఇక్కడ జరిగినట్టు వీడియోల్లో చూపారని నిర్ధారించాల్సి వచ్చింది. బిహార్ సీఎం తొందరపాటుతో హడావిడిగా తమిళనాడుకొచ్చిన బిహార్ ప్రభుత్వాధికారులూ నిజం తెలుసుకొని, సంతృప్తి వ్యక్తం చేయాల్సి వచ్చింది. గతంలో మహారాష్ట్ర, ఢిల్లీల్లోనూ ఇలాంటి ఘటనలే జరిగాయి. మొత్తం మీద ఈ వ్యవహారం ఫేక్ న్యూస్‌ల ముప్పుతో పాటు వలసదారులనే గుర్తింపు తీరని కళంకంగా మారి, హింసా ద్వేషాలను ప్రేరేపిస్తున్న వికృత ధోరణిని చర్చకు పెట్టింది.

స్వరాష్ట్రం, వలసపోయిన రాష్ట్రం – రెండింటి ఆర్థికాభివృద్ధిలో అంతర్ రాష్ట్ర వలసలది కీలక పాత్ర. అయితే, దేశంలో వలసలపై ప్రభుత్వ గణాంకాలు సమగ్రంగా లేవు. పాత లెక్కలే ఇప్పటికీ ఆధారం. 2011 జనగణన ప్రకారం మన దేశంలోనే అంతర్గత వలసదార్ల సంఖ్య 45.36 కోట్లు. అంటే దేశ జనాభాలో 37 శాతం మంది. ఇక, 2016 – 17 నాటి ఆర్థిక సర్వే ప్రకారం స్వస్థలం వదిలిపోతున్న మొత్తం వలస శ్రామికుల్లో దాదాపు సగం మంది సాపేక్షంగా తక్కువ అభివృద్ధి చెందిన ఉత్తరప్రదేశ్, బిహార్ రాష్ట్రాల జనాభాయే. ఈ అభాగ్య సోదరులను గోవా, ఢిల్లీ, మహారాష్ట్ర, గుజరాత్, తమిళనాడు, కేరళ, కర్ణాటకలు అధికంగా ఆదరిస్తున్నాయి. వెరసి, జీవనోపాధికై వస్తున్న ఉత్తరాది వారిని ఢిల్లీ తర్వాత ఎక్కువగా అక్కున చేర్చుకుంటున్నది దక్షిణ భారతావనే అనుకోవచ్చు.

పారిశ్రామిక కేంద్రంగా పేరున్న తమిళనాట 10 లక్షల మందికి పైగా వలస కార్మికులున్నారు. ఇది ఆ రాష్ట్ర కార్మిక విభాగం పక్షాన జరిపిన 2016 సర్వే లెక్క. అధికశాతం మంది బడుగు వేతన జీవులైన నైపుణ్యం లేని శ్రామికులు. ఎక్కువగా బెంగాల్, అస్సామ్, ఒడిశా, బిహార్, జార్ఖండ్‌ల నుంచి వచ్చినవారే. తిరుప్పూర్, ఈరోడ్ లాంటి వస్త్ర కేంద్రాల వృద్ధికి, రాష్ట్ర పురోగతికి వీరు వెన్నెముక. ఈ పరిస్థితుల్లో వలస కార్మికులపై తమిళనాట దాడులంటూ సంబంధం లేని పాత వీడియోలు సోషల్ మీడియాలో తిరగడం తాజా సమస్యకు కారణం. హిందీవారికి వ్యతిరేకంగా తమిళనాట ఏదో జరిగిపోతోందని నమ్మించడానికి ఒక వర్గం వీడియోలను ఆన్‌లైన్‌లో తెగతిప్పింది. దాంతో తమిళనాడు ఆ ఘటనలు వేరెక్కడివో, ఎవరెవరి మధ్య జరిగిన ఘటనల తాలూకువో వివరించాల్సి వచ్చింది. నిజం వెల్లడయ్యేలోగా కథ బిహార్ అసెంబ్లీకి ఎక్కింది.

నిజం కాళ్ళకు చెప్పులు తొడిగే లోపల అబద్ధం ఊరంతా చుట్టివస్తుందన్నట్టుగా అసత్యప్రచారం దేశం చుట్టింది. అయితే, బీజేపీయేతర పార్టీల ఏలుబడిలోని రాష్ట్రాల్లో ఈ తరహా వైరల్ ఫేక్ న్యూస్ వల్ల ఎవరికి, ఏ ప్రయోజనం ఉందనే అనుమానాలూ పైకి వచ్చాయి. సాక్షాత్తూ తమిళనాడు సీఎం సైతం ఘర్షణలు రేపి, తమ ప్రభుత్వాన్ని పడగొట్టే కుట్రకోణం గురించి ప్రస్తావించడం గమనార్హం. వాస్తవానికి ఏ రాష్ట్రం, ఏ భాషకు చెందినవారినైనా స్థానికులుగా కలుపుకొనే ఆత్మీయ, ఆతిథేయ సంస్కృతి దక్షిణాదిన, అందులోనూ తమిళనాట తరతరాలుగా ఉన్నదే. శాంతిభద్రతల పరిరక్షణలో అక్కడి పోలీసు యంత్రాంగం పేరున్నదే. అక్కడే ఇలా జరిగిందంటే – ఇతర రాష్ట్రాలకిది మేలుకొలుపు. కొందరి తుంటరితనం, స్వార్థ రాజకీయాలు సోదర భారతీయుల మధ్య విభజన గీతలు గీస్తే అది పెను ప్రమాదం. ఐకమత్యం, సౌభ్రాతృత్వాలకు గొడ్డలిపెట్టయ్యే ఏ వికృత ధోరణినీ ఎవరూ సహించకూడదు. సహకరించకూడదు.

హోలీకని రద్దీ రైళ్ళలో స్వరాష్ట్రాలకు తరలివెళ్ళిన వలస కార్మికుల్లో ఎందరు తిరిగొస్తారనేది ఇప్పుడు తమిళనాట హోటళ్ళ నుంచి పరిశ్రమల వరకు అన్నిటి ఆందోళన. ఏ రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలోనైనా అంతర్ రాష్ట్ర వలస కార్మికుల వాటా అవిస్మరణీయం. వారికి సౌకర్యాలు, సురక్షిత వాతావరణం కల్పించడం కీలకమంటున్నది అందుకే. దేశానికి స్వాతంత్య్రం వచ్చిన మూడు దశాబ్దాలకు కానీ పార్లమెంట్ 'అంతర్ రాష్ట్ర వలస కార్మికుల చట్టం–1979' చేయలేదు. అయినా ఇప్పటికీ వారి పరిస్థితి పూర్తిగా మారలేదు. వారి స్థితిగతులపై విస్తృత సర్వేలు జరపాలి. కేరళ నమూనా సర్వేలు అందుకు ఆదర్శం. సర్వేల సమాచారంతో సొంత, వలస రాష్ట్రాల్లో మెరుగైన విధానాలు చేపట్టవచ్చు.

వలసదార్ల వల్ల స్థానికులకు ఉద్యోగాలు పోతున్నాయనీ, మురికివాడలు, నేరాలు పెరుగుతున్నాయనీ రాజకీయ స్వార్థంతో పేలడం తేలిక. ఇలా 'బయటివార'నే ముద్ర వేసి స్థానికుల్ని రెచ్చగొడితే, తాత్కాలిక లబ్ధి ఉంటుందేమో కానీ, శాశ్వత నష్టం తథ్యం. భారత పౌరులెవరైనా దేశ భూభాగంలో ఎక్కడికైనా ఉపాధికై స్వేచ్ఛగా వెళ్ళవచ్చు, స్థిరపడవచ్చనేది మన రాజ్యాంగం (ఆర్టికల్ 19) కల్పించిన ప్రాథమిక హక్కు. కానీ, కరోనా వేళ 'ఇన్‌ఫెక్షన్ వాహకులు' అంటూ కన్న ప్రాంతం, ఉన్న ఊరు వలస కార్మికుల్ని 'అవాంఛనీయులు'గా చూశారు. వారిపై దాడులూ అనేకసార్లు రికార్డులకెక్కవు. ఈ పరిస్థితుల్లో వలసదార్లు సైతం స్థానికులతో ఏకమయ్యేలా తగిన చర్యలు చేపట్టడం ప్రభుత్వ విధి. అలాగే, సామాజిక న్యాయం, మానవ హక్కులను పరిగణనలోకి తీసుకొని కీలకమైన ఈ శ్రామిక పెట్టుబడిని కాపాడుకొనేలా సమగ్ర, వ్యవస్థీకృత విధానం అవసరం. అప్పుడే తమిళనాట తలెత్తిన తాజా ఫేక్ న్యూస్ రచ్చ లాంటివి నిర్వీర్యమవుతాయి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** బ.పాడ్యమి రా.7.12 వరకు, తదుపరి విదియ, **నక్షత్రం:** ఉత్తర రా.3.55 వరకు, తదుపరి హస్త, **వర్జ్యం:** ఉ.9.54 నుండి 11.37 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.46 నుండి12.33 వరకు, **అమృతఘడియలు:** రా.8.10 నుండి 9.55 వరకు.

సూర్యోదయం : 6.18
సూర్యాస్తమయం: 6.04
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

నాయకత్వ నిర్వచనం మారాలి!

భౌతిక దారుఢ్యం, ఆచరణాత్మకంగా ఉండటం వంటి వాటిని నాయకత్వ లక్షణాలుగా చూడడం వల్ల అనాదిగా పురుషులే నాయకత్వ స్థానాలలో కనిపిస్తున్నారు. కానీ మహిళలు నాయకత్వ బృందాలలో ఉన్నప్పుడు కరుణ వంటి లక్షణాలు కూడా ముఖ్యం అవుతున్నాయి. మహిళా నాయకత్వానికీ, సామాజిక సంక్షేమానికీ మధ్య ధనాత్మక సంబంధాన్ని అనేక అధ్యయనాలు తెలియజేస్తున్నాయి. 21వ శతాబ్దపు ఒక క్లిష్టమైన పోరాటం అందుబాటులో ఉన్న వనరులకూ, మానవ వైఖరులకూ మధ్య జరుగుతుంది. దీన్ని ఎదుర్కొనేందుకు బహుముఖ నాయకత్వం అవసరం. మెరుగైన సమాజం నిర్మించడం కోసం మహిళల విభిన్న అనుభవాలు, నైపుణ్యాలు ఎంతో అవసరం.

సందర్భం



గణపతిరాజు పావనీ దేవి

ఏది నాయకి?

2030 నాటికి ప్రపంచం సాధించాల్సిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో లింగ సమానత్వాన్ని ఐదో లక్ష్యంగా నిర్ణయించి, దీన్ని సాధించడంలో మహిళల సమాన భాగస్వామ్య అవసరాన్ని ఐకరాజ్య సమితి నొక్కి చెప్పింది. కానీ వాస్తవాలు ఇందుకు పూర్తి భిన్నంగా ఉండి, లింగ సమానత్వ లక్ష్యాన్ని ఎప్పటికి సాధించగలమనే ప్రశ్నను రేకెత్తిస్తునాయి.

ప్రపంచవ్యాప్తంగా నిర్ణయాలు తీసుకొనే అనేక స్థానాలలో మహిళల ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉంది. 1 సెప్టెంబర్ 2021 నాటికి కేవలం 24 దేశాలలో మాత్రమే మహిళలు దేశ, ప్రభుత్వ అధిపతులుగా ఉన్నారు. దీని ప్రకారం, అత్యున్నత అధికార స్థానాల్లో లింగ సమానత్వం మరో 130 సంవత్సరాల వరకు కూడా సాధించలేము. ప్రపంచంలోని మూడు వంతుల పార్లమెంటరీ స్థానాలను పురుషులు కలిగి ఉండటం రాజకీయాల్లో పురుషుల ఆధిపత్యాన్ని సూచిస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా మంత్రులుగా 21 శాతం మాత్రమే మహిళలు ఉన్నారు. మహిళా వ్యవహారాల శాఖలకే సాధారణంగా మహిళలు పరిమితం కావాల్సి వస్తోంది.

మహిళా నాయకత్వానికీ, సామాజిక సంక్షేమానికీ మధ్య ధనాత్మక సంబంధాన్ని అనేక అధ్యయనాలు తెలియజేస్తున్నాయి. భారత్‌లో మహిళల నేతృత్వంలో ఉన్న పంచాయతీ ప్రాంతాల్లో తాగు నీటి ప్రాజెక్టుల సంఖ్య పురుషుల నేతృత్వంలోని పంచాయితీల కంటే 62 శాతం అధికంగా ఉన్నదనీ, మున్సిపల్ కౌన్సిళ్లలో మహిళల ప్రాతినిధ్యానికీ, పిల్లల సంరక్షణకీ మధ్య ప్రత్యక్ష సంబంధం ఉన్నదనీ సర్వేలు చెపుతున్నాయి.

21వ శతాబ్దపు ఒక క్లిష్టమైన పోరాటం అందుబాటులో ఉన్న వనరులకూ, మానవ వైఖరులకూ మధ్య జరుగుతుంది. వాతావరణ మార్పు, ఆరోగ్యం, పర్యావరణ క్షీణత, సామాజిక అసమానతలు మొదలైన సమస్యలను ఎదుర్కొనేందుకు బహుముఖ నాయకత్వం అవసరం. మెరుగైన సమాజం నిర్మించడం కోసం తీసుకొనే నిర్ణయాలలో మహిళల విభిన్న అనుభవాలు, నైపుణ్యాలు ఎంతో అవసరం.

మహిళలకు సాధికారత చేకూర్చడానికి లింగ బడ్జెట్‌ను చాలా దేశాలు ఒక మార్గంగా ఎన్నుకున్నాయి. ఐఎంఎఫ్ ప్రకారం, ప్రపంచంలో 80 దేశాలు లింగ బడ్జెట్ విధానాన్ని అనుసరిస్తున్నాయి. భారతదేశం కూడా 2006 నుండి లింగ బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. మన లింగ బడ్జెట్‌లో సాధారణంగా రెండు రకాల పథకాలు గమనించవచ్చు. మొదటిది, మహిళలను మాత్రమే లక్ష్యంగా చేసుకుని ఖర్చు చేసే పథకాలు: ఉదాహరణకు బేటీ బచావో, బేటీ పఢావో. రెండవది పాక్షికంగా మహిళలను లక్ష్యంగా చేసుకుని ప్రవేశపెట్టినవి. ఇక్కడ పథక ప్రయోజనాలు కనీసం 30 శాతం మహిళలకు చేకూరుతాయి. అయితే రెండో కోవకు చెందిన పథకాలే ఆధిపత్యంలో ఉంటున్నాయి. ఉదాహరణకు 2021 బడ్జెట్‌లో మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ బడ్జెట్ 16 శాతం పెరిగింది. కానీ ఈ మొత్తం బడ్జెట్‌లో 80 శాతం అంగన్‌వాడీ, మిషన్ పోషణ్ 2.0 పథకాలకు కేటాయించడం జరిగింది.

సమాన అవకాశాలను కల్పించగలిగే ప్రగతిశీల సమాజాన్ని నిర్మించడానికి నిర్ణయాత్మక స్థానాలలో మహిళల పాత్ర, ప్రాముఖ్యతలను గుర్తించడం కీలకం. మార్పు అనేది దానికదే స్వతంత్రంగా రాదు. సమాజంలో సమానత్వం సృష్టించే సద్గుణ చక్రాన్ని సాధించడానికి వ్యవస్థలు మారాలి.

నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం



ఇప్పటివరకు ఈ ప్రపంచం ప్రధానంగా పురుషుల ఆలోచనలు, నాయకత్వంలో నడుస్తోంది. చారిత్రకంగా భౌతిక దారుఢ్యం, హేతుబద్ధత, ఆచరణాత్మకంగా ఉండడం వంటి వాటిని నాయకత్వ లక్షణాలుగా చూడడం వల్ల అనాదిగా పురుషులే నాయకత్వం స్థానాలలో కనిపిస్తున్నారు. నాయకత్వ నిర్వచనాన్ని మరింత బహుమితీయంగా మార్చి, నాయకత్వ లక్షణాలను విస్తృతం చేయాల్సిన సమయం ఆసన్నమైంది. మారుతున్న ఆర్థిక కార్యకలాపాలు, ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి శారీరక బలాల మీద కాకుండా నైపుణ్యాలపై ఆధారపడి ఉంది. సహజంగా మహిళలు వ్యూహాత్మక దృష్టితో ఆలోచించే విధానం సమాజ నిర్మాణం కోసం ఉపయోగపడుతుంది. మహిళలు నాయకత్వ బృందాలలో ఉన్నప్పుడు కరుణ వంటి లక్షణాలు నాయకత్వంలో భాగం అవుతున్నాయి.

వ్యాసకర్త ఆర్థిక శాస్త్ర లెక్చరర్

పితృస్వామ్యమే ముద్దాయి

స్త్రీ అనగానే కేవలం సౌందర్య భావనతో ప్రాచీన కవులు ఎన్నో కావ్యాలలో రకరకాలుగా వర్ణించారు. మహిళ అనే పదం ఈ మహిలో చాలా గొప్పది. ఒక మహిళను చూసే కళ్ళలో, మనసులో మార్పు వచ్చి తీరాలి. తనకు జన్మ నిచ్చిన స్త్రీ జాతిని గౌరవించకపోగా రకరకాలుగా అవమానించడం అమానుషం. క్షమించరాని నేరం. స్త్రీల దైన్యస్థితికి అతి ముఖ్యమైన కారణం పితృస్వామ్య వ్యవస్థ. నిజానికి ఆదిమ సమాజంలో మాతృస్వామ్యం ఉండేది. స్త్రీ కేంద్రంగా సమాజం నడిచేది. కాలక్రమంలో స్త్రీలు ఉత్పత్తి పరికరాలకు దూరమవడం, పురుషులు వాటిపై ఆధిపత్యం చలాయించడం, బానిస వ్యవస్థ, గుంపు పెళ్లి నుండి దంపతీ వివాహానికి వివాహ వ్యవస్థ పరిణామం చెందడం, వ్యక్తిగత ఆస్తి భావన పెరగడం, ఆయుధాల మీద పురుషుల ఆధిపత్యం వంటి అనేక కారణాల వల్ల స్త్రీ వెనక్కి నెట్టివేతకు గురై క్రమంగా పురుషాధిక్యత పాదుకు పోయింది.

సందర్భం



స్వప్న కొండ

ఈ సంవత్సరం 'ఆవిష్కరణ, సాంకేతికతల్లో లింగ సమానత్వం' అంశాన్ని థీమ్‌గా మహిళా దినోత్సవాన్ని జరుపుతున్నారు. ఇది ఆహ్వానించదగినది. ఎందుకంటే... 'ఐకాస', 'ఉమెన్స్ జెండర్స్ స్నాప్ షాట్– 2022' నివేదిక ప్రకారం డిజిటల్ ప్రపంచంలో మహిళలు లేకపోవడం వల్ల గత పదేళ్లలో తక్కువ, మధ్య ఆదాయ దేశాల స్థూల జాతీయ ఉత్పత్తి తగ్గింది. ఈ విషయంలో ఏమీ చేయలేక పోయినట్లయితే ఈ నష్టం 2025 నాటికి ఇంకా పెరుగుతుంది. స్త్రీలు విద్యావంతులు కానంత వరకూ ఏ దేశమూ బాగుపడదు. మన అభివృద్ధి అంతా స్త్రీల అభివృద్ధిపైనే ఆధారపడి ఉన్నది. అయితే పురుషులతో సమానంగా ఉద్యోగం చేస్తున్నా... భారతీయ సమాజంలో ఇంటి పని, వంట పని, పిల్లల పెంపకం స్త్రీ బాధ్యత కాబట్టి ఆమెపై ఒత్తిడి ఎక్కువగా ఉంటోంది. ఇలాంటి పరిస్థితుల్లోనూ అన్ని విధులనూ మహిళ అత్యంత చాకచక్యంగా నిర్వర్తిస్తోంది.

వ్యాసకర్త తెలుగు ఉపాధ్యాయురాలు

అపర కాళీమాత కూడా...

స్త్రీ ప్రకృతికి ప్రతీక. అందానికే నిర్వచనం. ఇంటికి దీపం. అమృతాన్ని వర్షించే అమ్మగా, అనునయించే అక్కగా, అనురాగాన్ని పంచే చెల్లిగా, ఆత్మీయతను కురిపించే భార్యగా ఆమె ఒక కుటుంబానికి ఎంత సుపరిచితురాలో... ఒక టీచరుగా, డాక్టరుగా, పోలీస్ ఆఫీసరుగా, పైలెట్‌గా, రైతుగా, కూలీగా, ఇంటిపనులు చేసే మనిషిగా... ఇలా అన్ని హోదాలలో కూడా సమాజానికి అంతే సుపరిచితురాలు. భారతీయ సంస్కృతిలో స్త్రీలకు సముచిత స్థానాన్నే అందించారు. మనం నిత్యం ఆరాధించే ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తి స్వరూపాలైన అమ్మవార్లు కూడా స్త్రీలే కదా. స్త్రీని ఒక దేవతలా చూడడం, ఆమెను జాగ్రత్తగా కాపాడుకోవడం అనేది అనాదిగా మన రక్తంలోనే జీర్ణించుకుపోయింది.

అయితే నేడు ఈ జాగ్రత్తనే కొన్ని సందర్భాలలో అతిగా ఆడపిల్లల స్వేచ్ఛకు ఆటంకంగా మారుతోంది. సమాజంలోని కొన్ని దుస్సంఘటనలకు వెరసి ఇంట్లోవాళ్ళు విధించే ఆంక్షలు ఆడపిల్లల అభివృద్ధికి అవరోధాలుగా పరిణమించడంతో పాటు, పిల్లలకూ తల్లిదండ్రులకూ మధ్య అగాథాలను సృష్టిస్తున్నాయి.

ప్రతి పరిణామం ఇంటి నుండే మొదలవ్వాలి. ఆది గురువులై అమ్మలు మంచి చెడుల వివేచన జ్ఞానాన్ని తమ పిల్లలకు రంగరించి ఎటువంటి ఆటుపోట్లనైనా ఎదుర్కొనే ధైర్యాన్ని అలవరచాలి. భర్త అడుగుజాడల్లో నడిచిన సీతగా, అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన సావిత్రిగా, యుద్ధభూమిలో తోడు నిలిచిన సత్యభామగా, బుద్ధి కుశలతతో త్రిమూర్తులనే పసిబిడ్డలను చేసి లాలించిన అనసూయగా ఉంటూనే, అవసరమైతే ఇంతులు అపర కాళీమాతలవ్వాలి. సమాజాభివృద్ధికి హేతువయ్యే ప్రతి పాత్రను సంపూర్ణంగా పండించాలి.

– డా॥ బి. నీలిమా కృష్ణమూర్తి
సహాయ కార్మిక అధికారి

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఎలా ఉండాలింక?



నటి సుస్మితా సేన్ యోగా ఫిట్‌నెస్ ఛాలెంజ్ ఫొటోలు ఇంకా నా కళ్లముందున్నాయి. అలాంటి ఆమెకు 47 ఏళ్ల వయసులో 95 శాతం బ్లాకేజ్‌తో తీవ్ర గుండెనొప్పి రావడం! ఇక ఆరోగ్యకరమైన జీవన విధానం అంటే ఏమిటి మరి?

– నీతూ గార్గ్, ఎంఎన్‌సీ మేనేజర్

చిన్నతనపు కల



స్కూల్లో ప్రతి ఆటనూ ఆడేదాన్ని, 'జెంటిల్‌మన్స్ గేమ్' (క్రికెట్) తప్ప. తర్వాత పదకొండు మందిని పోగేసి జట్టు కట్టడం నుంచి, 'డబ్ల్యూపీఎల్' చూసేదాకా రావడం నా వ్యక్తిగత విజయంలా అనిపిస్తోంది. నా చిన్నతనపు కలను నిజం చేసుకునేలా వచ్చే ఏడాది సెలక్షన్స్ కోసం ప్రయత్నిస్తాను. నాకు మాటింగులు లేకపోతే!

– సయామీ ఖేర్, నటి

వైఫల్య విధానం



స్వీడన్ కోవిడ్ విధానం నిజంగా విజయవంతం ఏమీ కాలేదు. చరిత్రను తిరగరాయడానికి ప్రయత్నించవచ్చు, కానీ వాస్తవాలు మారిపోవు. ఇతర 'నార్డిక్' దేశాలతో పోల్చితే స్వీడన్‌లో మొత్తం మరణాలు 1.5 – 2 రెట్లు ఎక్కువ.

– దీప్తి గురుదాసానీ, పరిశోధకురాలు

ప్రకృతే చికిత్స



ఏ థెరపీ కన్నా ప్రకృతి చవక. అందుకే వైఫై బలహీనంగా ఉన్నచోటుల్లో సంచరిద్దాం. హైకింగ్ బూట్లలో జీవితం బాగుంటుందని అనడానికి నేనే రుజువు.

– సెలీనా జైట్లీ, నటి

అదే ఆకాంక్ష



ప్రతీ నవ్వు వెనుకా, ఒక కఠినమైన బాల్యం ఉంటుంది. కానీ ఆశతో ఒక నమ్మకమైన భవిష్యత్తు ఇవ్వగలం. బాలికలు అందరూ చదవాలి.

– పూజ శాలి, న్యూస్ యాంకర్

ఇదే మహిళా సాధికారత!

అభిప్రాయం



పోతుల సునీత

'మహిళల స్థితిగతులు బాగుపడనిదే సమాజం అభివృద్ధి చెందదు. ఏ పక్షి అయినా ఒక రెక్కతో ఎగరలేదు' అని స్వామి వివేకానంద అన్నారు. ఆ ఒక రెక్కలా తాను ఉన్నానని మన జగన్ అన్న భరోసా ఇచ్చి... మన రాష్ట్రంలో మహిళా సాధికారత ఆచరణలో సాధించి చూపిస్తున్నారు. 'ఆమె' ఒక తల్లి, కూతురు, సోదరి, భార్య. వీటన్నింటికీ మించి ఒక పోరాట యోధురాలు. శక్తి యుక్తులు కలిగిన నారీమణి. అతని వెంట ఆమె కాదు... అన్నింటా ఆమే. అదే ఇప్పుడు ఆమె లక్ష్యం. ఆమె ఆకాశంలో సగం కాదు. ఇప్పుడు ఆమే ఆకాశం. ప్రపంచ చరిత్రలోనే మహిళా సాధికారతను ఆచరణలో చూపించిన ఏకైక నాయకుడు సీఎం వైఎస్ జగన్.

జగనన్న కాలనీల్లో పంపిణీ చేసిన 30 లక్షల 76 వేల ఇళ్ల పట్టాలు మహిళల పేరుపైనే అందించి భరోసా అందించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్. అక్క చెల్లెమ్మల పేరు మీదనే స్థలమిచ్చి, ఇళ్లు కట్టించి లక్షలాది రూపాయల స్థిరాస్తి అందించారు. అక్క చెల్లెమ్మలకు పథకాలలో లబ్ధి చేకూర్చడమే కాకుండా వారికి రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా కూడా ప్రాధాన్యత పెంచి మహిళా సాధికారతకు మరో పేరుగా నిలిచారు. 1993 నుంచి చట్టసభల్లో మహిళా రిజర్వేషన్‌కు పార్లమెంటులో బిల్లులు పెడుతూనే ఉన్నారు. కానీ ఆమోదం మాత్రం పొందడం లేదు. అయితే ప్రజాపాలనా వ్యవస్థలో సగం కంటే ఎక్కువ శాతం పదవులిచ్చిన తొలి ప్రభుత్వం వైసీపీదే. 1,356 పదవుల్లో 51 శాతం మహిళలకే ఇచ్చారు. 75 మున్సిపాలిటీల్లో 73 చోట్ల వైస్సార్సీపీ విజయకేతనం ఎగురవేస్తే అందులో 45 మంది అంటే 64 శాతం మంది మహిళలే చైర్మన్లుగా ఎంపికయ్యారు. 2123 మంది వార్డు మెంబర్లలో 1,161 మంది అంటే 55 శాతం మంది మహిళలు ఉన్నారు. అమ్మ ఒడి నుంచి డ్వాక్రా సున్నావడ్డీ దాకా పలు పథకాల్లో మహిళలకే పెద్ద ఎత్తున లబ్ధి కలుగచేశారు. వివిధ పథకాల ద్వారా మహిళలకు సుమారు లక్షా ఇరవై ఐదు వేల కోట్ల రూపాయలకు పైగా అందజేశారు.

మహిళలపై అత్యాచారాలకు శిక్ష ఒక్కటి మాత్రమే కాకుండా చట్టాల్లో మార్పు చేసి, వాటి మూలాలపై కూడా గురి పెడితే గానీ మార్పు సాధ్యం కాదు. మహిళలపై దాడులు జరిగినప్పుడు రాత్రుళ్ళు బయటకు ఎందుకు వచ్చారనీ, వస్త్రధారణ సరిగా లేనందువల్లనే అలా జరిగిందనే వ్యాఖ్యలతో వారిని కించపరచరాదు. ఇలాంటి పరిస్థితుల్లో మార్పు కోసమే... మహిళల భద్రత కోసం రూపొందించిన 'దిశా' చట్టం దేశ చరిత్రలోనే ఒక ఉజ్వల ఘట్టం. మహిళలకోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పోలీస్ స్టేషన్ల వల్ల తమకు ఏదైనా అన్యాయం జరిగితే ధైర్యంగా ఫిర్యాదు చేయగలుగుతున్నారు. మహిళల్లో ఇప్పుడున్న చైతన్యం, బతుకు పట్ల భరోసా చూస్తే మహాకవి గురజాడ అప్పారావు అన్నట్లు ఆధునిక స్త్రీ చరిత్రను తిరగరాసే సమయం వచ్చినట్లే అనిపిస్తోంది.

వ్యాసకర్త ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు

అప్పటికీ ఇప్పటికీ తేడా ఇదీ!

అభిప్రాయం



పూనూరు గౌతమ్ రెడ్డి

కాబోయే పరిపాలనా రాజధాని విశాఖపట్నం కేంద్రంగా ఈ నెల 3, 4 తేదీల్లో జరిగిన 'గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్' ఇప్పుడు దేశ వ్యాప్తంగా చర్చకు తెర లేపింది. పార్టీలు ముఖ్యం కాదు... ప్రభుత్వాలు ముఖ్యం అనే రీతిలో జరిగిన ఈ సదస్సు భవిష్యత్ తరాలకు ఆశాదీపంగా కనిపిస్తోంది. అందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పట్టుదల, కార్యదీక్ష ప్రస్ఫుటంగా కని పిస్తున్నాయి. అయితే, ఇదే తరహా పెట్టుబడుల సదస్సులను 2016, 2017, 2018ల్లో గత తెలుగు దేశం ప్రభుత్వం ఇదే విశాఖ కేంద్రంగా నిర్వహించింది. అప్పట్లో ఎంఓయూలు చేసుకునేందుకు టేబుల్స్ కూడా ఖాళీ లేకుండా పెట్టుబడిదారులు, అధికారులు నేల మీద కూర్చొని మరీ సంతకాలు చేసిన సందర్భాన్ని మనం చూశాం. కానీ, కనీసం ఒక్కటంటే ఒక్క ఎంఓయూ కూడా కార్యరూపం దాల్చలేకపోయింది. ఇది బాబుకు ప్రచార ఆర్భాటం తప్ప ప్రజా సంక్షేమం పట్టదనడానికి ఒక మచ్చుతునక మాత్రమే. ఇంకో విషయమేమంటే... అప్పట్లో జరిగిన ఎంఓయూలు అన్నీ అమరావతిని మాత్రమే కేంద్రంగా చేసుకుని జరిగినవే. కానీ ఇప్పుడు జరిగిన వన్నీ రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు వర్తించేలా ఉన్నాయి. ఇది మనం నిశితంగా గమనించాల్సిన అంశం.

అయితే, చంద్రబాబు నాయుడు హయాంలో 'సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్' పేరుతో మూడేళ్లపాటు సమ్మిట్‌లు నిర్వహించారు. వారి లెక్కలను మనం వాస్తవ రూపంలో చూస్తే... ప్రస్తుతం జగన్ సర్కార్‌తో ఈ రెండు రోజుల్లో జరిగిన ఒప్పందాలకంటే మూడు రెట్లు ఎక్కువగా ఉన్నాయి. వీటి ద్వారా 19.50 లక్షల మందికి ఉపాధి లభించబోతోందని చెప్పారు. తనను చూసి మాత్రమే పెట్టుబడులు వచ్చాయని చంద్రబాబు అప్పట్లో గొప్పగా చెప్పుకొచ్చారు. కానీ ఏ ఎంఓయూ కూడా కార్య రూపం దాల్చలేదు.

ఈరోజు జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో జరిగిన సమ్మిట్‌లో రిలయన్స్, టెస్లా, బ్లూ స్టార్... ఇలా దిగ్గజ కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చాయి. ఈ ఏడాది రూ. 13 లక్షల కోట్ల పైచిలుకు పెట్టుబడులతో 6 లక్షలపైచిలుకు ఉద్యోగాలు వచ్చేలా ఎంఓయూలు జరిగాయి. చంద్రబాబు ఆర్భాటంగా చేసిన ఎంఓయూలు కార్యరూపం దాల్చేందుకు కనీసం తపన పడిన పరిస్థితి లేదు. కానీ జగన్ మాత్రం అదే సమ్మిట్ వేదికగా ఈ ఎంఓయూలు కార్యరూపం దాల్చేందుకు సీఎస్ నేతృత్వంలో ఒక కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రతి వారం ఈ కమిటీ పర్యవేక్షించి మూడు మాసాల్లోగా వాటిని కార్యరూపం దాల్చేలా ఏర్పాట్లు చేశారు. ఇది ఒక నాయకుడికి రాష్ట్రం పట్ల, రాష్ట్ర ప్రజల పట్ల, రాష్ట్ర అభివృద్ధి పట్ల ఉన్న చిత్తశుద్ధి, నిబద్ధతకు తార్కాణం.



ఆనాడు 19 లక్షల పైచిలుకు ఉద్యోగాలొస్తాయంటే... ఈనాడు కేవలం 6 లక్షలకే పరిమితమని చెప్పారు సీఎం. ఇది ఉన్నది ఉన్నట్లుగా చెప్పే జగన్ శైలికి నిదర్శనం. ఇంకో విషయమేమంటే చంద్రబాబు హయాంలో మూడేళ్లపాటు జరిగిన సమ్మిట్‌కు అమరావతిలో 'నవనగరాలు' అంటూ అమరావతిని మాత్రమే హైలైట్ చేస్తూ పెట్టుబడులు ఆహ్వానించారు. ఈరోజు సుదీర్ఘ సముద్ర తీర ప్రాతం, పోర్టులు, విమానాశ్రయాలు, రోడ్ల కనెక్టివిటీ, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఉంది. పారిశ్రామిక పాలసీలు, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో మొదటి స్థానం అంటూ రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను చూపించి రాబట్టారు.

తన సంక్షేమ పథకాలు ఉచితాలు కాదు... అవన్నీ మానవ వనరుల అభివృద్ధికి ఉపయోగపడేలా చేస్తున్నానని జగన్ చెప్పిన మాటలకూ... ఉచితాలిచ్చి ప్రజలను సోమరిపోతులు చేస్తున్నారంటూ చెప్పిన చంద్రబాబు మాటలకూ మధ్య వ్యత్యాసం ఎంతో అందరికీ అర్థమవుతోంది. సంక్షేమంతోపాటు అభివృద్ధి కూడా ముఖ్య మేననీ, ఈ పెట్టుబడులతో అభివృద్ధి సాధ్యమవుతుందనీ జగన్ భావిస్తున్నారు. ఇదీ జగన్ విజన్. గాల్లో మేడలు కట్టాలన్న భావన జగన్ మాటల్లో కానీ, చేతల్లో కానీ ఎక్కడా కనిపించదు. అదే చంద్రబాబు ప్రతి మాటలోనూ ఇవి స్పష్టంగా కనిపిస్తాయి. ఇంకో విషయం ఏంటంటే బాబు నిర్వహించిన మూడేళ్ల సమ్మిట్‌లో కూడా సింగపూర్, శంకరన్, మలేషియా, పరమేశ్వరన్ పిళ్లై... ఇవే పేర్లు కనిపించేవి. కానీ, ఈరోజు ఆదానీ, టైరో, టెస్లా, బ్లూస్టార్... ఇలా అనేక రకాల సంస్థలు కనిపిస్తున్నాయి. ఈ తేడా మనం గమనించాలి.

బాబు రాష్ట్రానికి ఒక సీఈవోగా వ్యవహరించారే తప్ప ఒక ముఖ్యమంత్రిగా, బాధ్యతగల వ్యక్తిగా ఎప్పుడూ వ్యవహరించలేదు. ఇంకో విషయం ఏమిటంటే అప్పట్లో ఆర్భాటాలతో ఈ సమ్మిట్‌లు నిర్వహించారు. అదే జగన్ మాత్రం సాదాసీదా ఏర్పాట్లతో ఈ సదస్సు నిర్వహించారు. ఆయన మన కుటుంబంలోని వ్యక్తిగా... మన కుటుంబ సంక్షేమం, అభివృద్ధిని కోరుకుంటున్న పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోంది. పారిశ్రామిక వేత్తలను ఇంత పెద్ద స్థాయిలో ఆకట్టుకోవడానికి కచ్చితంగా ఆయన నాలుగు లేదా ఐదు మాసాల పాటు ప్రణాళికాబద్ధంగా కృషి చేసినట్లు అర్థమవుతోంది. ఇది ఒక నేత అంకిత భావానికీ, చిత్తశుద్ధికీ, దార్శనికతకూ అద్దం పడుతుంది. ఇదంతా రాష్ట్రంలోని విజ్ఞులైన ప్రతి ఒక్కరూ గుర్తిస్తున్నారు.

వ్యాసకర్త ఏపీ ఫైబర్‌నెట్ చైర్మన్
మొబైల్ : 98481 05455



ఇంతై.. 'ఇంతి'ంతై..

ఈమె పేరు కొండా ఉషారాణి.. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం నూతక్కికి చెందిన ఈమెకు తన 13వ ఏట వివాహమైంది. పెళ్లయిన మూడున్నరేళ్లకే భర్త చనిపోవడంతో తల్లితో పాటు తనకున్న ఇద్దరు పిల్లలను పెంచుకునేందుకు పొగాకు కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా చేరింది. వచ్చే జీతం సరిపోకపోవడంతో రుణం తీసుకొని ఇంట్లోనే బట్టల దుకాణం ప్రారంభించింది. అయితే దొంగలు పడి బట్టలన్నీ దోచుకెళ్లారు. దీంతో కొన్నాళ్లు దిగాలు పడ్డ ఉషారాణి తన బిడ్డలను పోషించుకోవడానికి పడి లేచిన కెరటంలా నిలబడింది. కంపెనీల నుంచి బయో ఎరువులను తీసుకొని మార్కెటింగ్‌కు శ్రీకారం చుట్టింది. 10 ఏళ్ల పాటు ఊరూరా తిరుగుతూ వాటిని అమ్ముతూ కుటుంబానికి ఆసరాగా నిలిచింది. అంతేకాకుండా గోశాల నుంచి సేకరించిన గోమూత్రం, పేడ వ్యర్థాలతో స్వయంగా బయో ఎరువులు తయారు చేస్తూ రైతులకు విక్రయించడం మొదలుపెట్టింది. ఆ తర్వాత సొంతంగా పాడి గేదెలను కొనుగోలు చేసి బయో ఎరువుల తయారీ యూనిట్ పెట్టింది. తాను స్వయంశక్తితో నిలదొక్కుకోవడమే కాకుండా పది మందికి ఉపాధి కల్పిస్తోంది. అంతటితో ఆగకుండా తనకున్న 1.40 ఎకరాలతో పాటు మరో ఆరెకరాలు కౌలుకు తీసుకొని ప్రకృతి సాగు చేపట్టింది. వరితో పాటు మిరప, మునగ, పసుపు, కాలీఫ్లవర్ పంటలను సాగు చేస్తోంది. ఇటీవల స్త్రీ (శాస్త్ర, సాంకేతిక, పరిశోధన, ఔత్సాహిక పారిశ్రామికవేత్తల ప్రోత్సాహం) అవార్డును అందుకుంది.

> **మొక్కవోని ధైర్యంతో ముందుకెళ్లా..**
>
> రెండో అబ్బాయి పుట్టిన మూడు నెలలకే భర్త చనిపోయారు. ఏం చేయాలో పాలుపోలేదు. జీవితం ఎన్నో పాఠాలు నేర్పింది. ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నా. అయినా మొక్కవోని ధైర్యంతో ముందుకెళ్లా
>
> – కొండా ఉషారాణి, మహిళా రైతు, నూతక్కి, గుంటూరు జిల్లా



క్లుప్తంగా...

అన్నవరంలో భక్తులకు డ్రెస్ కోడ్

- నేటి నుంచి సంప్రదాయ దుస్తుల్లో వస్తేనే వ్రతానికి అనుమతి
- శ్రీసత్యదేవుని దర్శనానికి మినహాయింపు



డ్రెస్ కోడ్ అమలుకు ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

అన్నవరం: కాకినాడ జిల్లా అన్నవరంలోని శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో వ్రతాలాచరించే భక్తులు బుధవారం నుంచి విధిగా సంప్రదాయ దుస్తులు ధరించాల్సి ఉంటుంది. పురుషులు పంచె, కండువా లేదా కుర్తా పైజామా, మహిళలు చీర, జాకెట్టు లేదా పైజామా కుర్తా ధరించాల్సి ఉంటుంది. జీన్స్, టీషర్ట్, టాప్స్, మిడ్డీస్ లాంటి ఫ్యాషన్ దుస్తులు ధరిస్తే వ్రతాలకు అనుమతించరని దేవస్థానం ఇన్‌చార్జి ఈవో చంద్రశేఖర్ అజాద్ స్పష్టం చేశారు. దేవస్థానంలో ఈ మేరకు బోర్డులు ఏర్పాటు చేసి ప్రచారం చేస్తున్నామని తెలిపారు. వ్రతాల టికెట్లు వెనుక భాగాన కూడా ప్రచురిస్తామని చెప్పారు. శ్రీసత్యదేవుని దర్శనానికి వెళ్లే భక్తులకు మాత్రం మినహాయింపు ఇస్తున్నట్లు వివరించారు.

వైభవంగా సింహాద్రి అప్పన్న డోలోత్సవం



సింహాచలం: ఫాల్గుణ పౌర్ణమిని పురస్కరించుకుని సింహగిరిపై వేంచేసిన శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి డోలోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. ఏటా చైత్రశుద్ధ ఏకాదశి రోజున జరిగే స్వామివారి వార్షిక కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని ఫాల్గుణ పౌర్ణమి రోజు డోలోత్సవాన్ని నిర్వహిస్తారు. సింహగిరి నుంచి కొండదిగువకి దిగివచ్చి తనకు పిల్లనివ్వాలని తన సోదరి పైడితల్లి అమ్మవారిని స్వామివారు అర్థించే సందర్భాన్నే డోలోత్సవంగా పిలుస్తారు. సింహగిరి నుంచి స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఉదయం కొండదిగువకు తీసుకువచ్చి అడవివరం గ్రామదేవత పైడితల్లి అమ్మవారి ఆలయానికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి పుష్కరిణి కల్యాణ మండపంలో ఉన్న ఉద్యానవన మండపంలో వేంచేయింపచేశారు. స్వామికి వసంతోత్సవం, చూర్ణోత్సవం ను నిర్వహించారు. తదుపరి డోలోత్సవాన్ని జరిపారు. విశేషంగా పారాయణాలు ఆలపించారు. స్వామికి అడవివరం వీధుల్లో గ్రామ తిరువీధి నిర్వహించారు. స్వామికి పెళ్లి కుదిరిన ఆనందంలో ఒకరిపై ఒకరు రంగులు జల్లుకుని ఆనంద డోలికల్లో మునిగితేలారు. ఈ నెల 22న ఉగాదిని పురస్కరించుకుని స్వామివారి పెళ్లిరాట, ఏప్రిల్ 2న రథోత్సవం, వార్షిక కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నారు.

10న విశాఖలో వన్డే టికెట్ల విక్రయం

విశాఖ స్పోర్ట్స్: ఆస్ట్రేలియాతో భారత్ ఆడనున్న రెండో వన్డే టికెట్లను ఈ నెల 10వ తేదీన ఆన్‌లైన్‌లో విక్రయించనున్నారు. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో జరిగే ఈ డే నైట్ మ్యాచ్ 19వ తేదీన మధ్యాహ్నం ఒకటిన్నర గంటలకు ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా స్టేడియంలో మ్యాచ్ వీక్షించేందుకు టికెట్లను పేటీఎం ద్వారా ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లోనూ విక్రయించేందుకు ఏర్పాట్లు చేశామని ఏసీఏ కార్యదర్శి గోపినాథరెడ్డి తెలిపారు. కనీస ధర రూ.600 కాగా రూ.6 వేల వరకు ఆరు డినామినేషన్లలో టికెట్ల విక్రయం జరగనుందన్నారు. రూ. 1,500, 2,000, 3,000లతో పాటు రూ.3,500 టికెట్లను ఆన్‌లైన్‌లో 10వ తేదీన ప్రారంభించనున్నామని తెలిపారు. ఆఫ్‌లైన్‌లో ఈ నెల 13న టికెట్లను ఉదయం 10 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు స్థానికంగా మూడు సెంటర్లలో విక్రయించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు.

పరమేశ్వరరెడ్డికి 14 రోజుల రిమాండ్

పులివెందుల: మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య కేసులో ఏ3 నిందితుడు ఉమా శంకర్ రెడ్డి భార్య స్వాతిపై దాడి చేసిన కేసులో పులివెందులకు చెందిన కసనూరు పరమేశ్వరరెడ్డి, అతని కుమారుడు సునీల్‌కుమార్‌రెడ్డిలకు కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. స్వాతి ఫిర్యాదు మేరకు వీరిద్దరినీ అదుపులోకి తీసుకుని జమ్మలమడుగు కోర్టులో హాజరుపరచినట్లు పులివెందుల అర్బన్ సీఐ రాజు తెలిపారు.



10 నుంచి రాగి జావ

మధ్యాహ్న భోజనంలో పిల్లలకు పౌష్టికాహారం

సాక్షి, అమరావతి: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ త్వరలో ముగియనుండటంతో కొద్ది రోజులుగా నిలిచిపోయిన పథకాలు, కార్యక్రమాలను అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. మంగళవారం తన కార్యాలయ అధికారులతో సమావేశమైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్చి, ఏప్రిల్ నెలల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలు, పథకాలపై చర్చించి అమలు తేదీలను ఖరారు చేశారు. ఎన్నికల కోడ్‌తో సంబంధం లేనందున మార్చి 10వతేదీ నుంచి మధ్యాహ్న భోజనంలో రాగి జావ అమలును ప్రారంభించాలని నిర్ణయించారు. పిల్లల్లో ఐరన్, కాల్షియం లోపాలను నివారించే లక్ష్యంతో మధ్యాహ్న భోజన పథకం మెనూలో రాగి జావను చేర్చిన విషయం తెలిసిందే. ఎన్నికల కోడ్ కారణంగా కొద్దిగా ఆలస్యమైన ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను ఏప్రిల్ 6 నుంచి పూర్తి స్థాయిలో అమలు చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకం ట్రయల్ రన్ ఇప్పటికే మొదలై విజయవంతంగా కొనసాగుతున్న విషయం తెలిసిందే.



మార్చి, ఏప్రిల్‌లో షెడ్యూల్ ఇలా..

- మార్చి 18న సంపూర్ణ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలు. జగనన్న విద్యాదీవెన లబ్ధిదారుల ఖాతాల్లోకి డీబీటి పద్ధతిలో నగదు జమ.
- మార్చి 22న ఉగాది సందర్భంగా ఉత్తమ సేవలందించిన వలంటీర్ల పేర్ల ప్రకటన. ఏప్రిల్ 10న అవార్డులు, రివార్డులు ప్రదానం.
- మార్చి 23న జగనన్నకు చెబుదాం కార్యక్రమం ప్రారంభం.
- మార్చి 25 నుంచి వైఎస్సార్ ఆసరా. ఏప్రిల్ 5 వరకూ కొనసాగనున్న కార్యక్రమం
- మార్చి 31న జగనన్న వసతి దీవెన.
- ఏప్రిల్ 6న ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ పూర్తి స్థాయిలో అమలు
- ఏప్రిల్ 10న ఉత్తమ సేవలందించిన వలంటీర్లకు సన్మానం
- ఏప్రిల్ 18న ఈబీసీ నేస్తం.

మార్చి 14వతేదీ నుంచి అసెంబ్లీ సమావేశాల నిర్వహణ అంశం కూడా సమావేశంలో ప్రస్తావనకు వచ్చింది. బీఏసీ సమావేశంలో చర్చించి సమావేశాల షెడ్యూలును ఖరారు చేయనున్నారు.

కర్నూలులో క్వింటా మిర్చి రూ.42,889

కర్నూలు (అర్బన్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం ఎండు మిర్చికి రికార్డు స్థాయి ధర లభించింది. తెలంగాణకు చెందిన వెంకటన్న అనే రైతు 2.10 క్వింటాళ్ల బ్యాడిగ రకం మిరపను తీసుకురాగా, క్వింటాకు రూ.42,889 ధర పలికింది. తెలంగాణకు చెందిన మరో రైతు తీసుకువచ్చిన బ్యాడిగ మిర్చి ధర కూడా రూ.40 వేలకు పైగానే పలికింది. బ్యాడిగ రకం మిర్చిని రంగుల తయారీలో ఎక్కువగా వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. మిర్చికి ఆశాజనకంగా ధరలు లభిస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



మార్కెట్‌కు వచ్చిన మిర్చి ఉత్పత్తులు

విజయవాడ ప్రభుత్వ దంతవైద్య కళాశాలకు 15 పీజీ సీట్లు

- ఐదు విభాగాల్లో కొత్తగా మంజూరు
- ఇప్పటికే మూడు విభాగాల్లో 9 సీట్లు
- దశాబ్దం తర్వాత మళ్లీ పీజీ సీట్లు వచ్చిన వైనం
- హర్షం వ్యక్తం చేస్తున్న దంత వైద్యులు



ప్రభుత్వం సమకూర్చిన అత్యాధునిక డెంటల్‌చైర్స్‌లో చికిత్స చేస్తున్న వైద్యులు

లబ్బీపేట (విజయవాడతూర్పు): విజయవాడలోని ప్రభుత్వ దంతవైద్య కళాశాలకు ఐదు విభాగాల్లో 15 పోస్టు గ్రాడ్యుయేషన్ (పీజీ) సీట్లు మంజూరయ్యాయి. దశాబ్దం కిందట మూడు విభాగాల్లో తొమ్మిది పీజీ సీట్లు రాగా, తాజాగా డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (డీసీఐ) ఐదు విభాగాల్లో 15 సీట్లు మంజూరు చేసింది. కొత్తగా మంజూరైన సీట్లుకు 2023–24 విద్యా సంవత్సరంలో అడ్మిషన్లకు అనుమతి ఇచ్చింది. దీంతో దంత వైద్యంలో పోస్టు గ్రాడ్యుయేషన్ కోసం ఇతర రాష్ట్రాలకువెళ్లకుండా ఇక్కడే అందుబాటులోకి వచ్చినట్లయింది. కొత్తగా మంజూరైన పీజీ సీట్లు మెరిట్ విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరమని దంత వైద్యులు పేర్కొంటున్నారు. రాష్ట్రంలో రెండు (విజయవాడ, కడప) ప్రభుత్వ దంతవైద్య కళాశాలలున్నాయి. దంత వైద్యంలో పీజీ చేసేందుకు ఇక్కడ సీట్లు అందుబాటులో ఉండేవి కాదు. దీంతో రాష్ట్రంలోని ప్రైవేటు దంతవైద్య కళాశాలల్లో చేరాల్సి వచ్చేది. లేదంటే ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం విజయవాడలోని ప్రభుత్వ దంతవైద్య కళాశాలలో ఇప్పటికే ఉన్న తొమ్మిది పీజీ సీట్లుకు అదనంగా మరో 15 సీట్లు మంజూరు కావడంతో ఏటా 24 మంది పీజీ చదివే అవకాశం లభించింది. అంతేగాకుండా రోగులకు మెరుగైన సేవలు అందనున్నాయి.

సౌకర్యాల కల్పనతో..

ప్రభుత్వ దంతవైద్య కళాశాలకు రోజూ 250 నుంచి 300 మంది వరకు రోగులు చికిత్సకు వస్తుంటారు. వారికి నాణ్యమైన దంతవైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం సౌకర్యాలు కల్పించింది. కొత్తగా డెంటల్ చైర్స్ ఏర్పాటు చేయడంతోపాటు, అత్యాధునిక పరికరాలను సమకూర్చారు. అన్ని విభాగాల్లో పూర్తిస్థాయిలో వైద్యులను నియమించారు. గత ఏడాది సెప్టెంబర్‌లో తనిఖీలు చేసిన డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా బృందం ఇక్కడి సౌకర్యాలపై సంతృప్తి వ్యక్తం చేసింది. ఆ బృందం నివేదిక ఆధారంగా ఐదు విభాగాల్లో 15 పీజీ సీట్లు మంజూరు చేస్తూ 2023–24 విద్యా సంవత్సరం నుంచి అడ్మిషన్లకు అనుమతిస్తూ డీసీఐ ఉత్తర్వులు జారీచేసింది.

గుండెపోటుతో ఇద్దరు విద్యార్థుల మృతి



ఫిరోజ్ ఖాన్ (ఫైల్)



తనూజ్ నాయక్ (ఫైల్)

చిలకలూరిపేట/మడకశిర రూరల్: వేర్వేరు ప్రాంతాల్లో గుండెపోటుతో ఇద్దరు విద్యార్థులు మృతి చెందారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేటలోని పసుమర్రుకు చెందిన పఠాన్ వజీర్ బాషా, మస్తాన్‌బీ దంపతులకు ఇద్దరు సంతానం. అమ్మాయి ఫర్హాన పెద్దది కాగా, కుమారుడు పఠాన్ ఫిరోజ్ ఖాన్ (17) చిన్నవాడు. ఫిరోజ్ చిలకలూరిపేటలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నాడు. సోమవారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో ఫిరోజ్ పెద్దగా గురకపెడుతూ శ్వాస తీసుకోవడంతో ఇబ్బంది పడుతుండగా తల్లిదండ్రులు అతడికి మంచినీళ్లు తాగించారు. అయినా మెలికలు తిరుగుతుండటంతో ఆందోళనకు గురై పట్టణంలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించగా అప్పటికే గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా, ఫిరోజ్ తండ్రి వజీర్‌బాషా గల్ఫ్‌లో ఉంటున్నాడు. 20 రోజుల క్రితమే ఆయన స్వదేశానికి వచ్చాడు. మరో ఘటనలో శ్రీసత్యసాయి జిల్లా మడకశిర మండలం ఎగువ అచ్చంపల్లి తండాకు చెందిన హనుమంతునాయక్, సునీతభాయి దంపతుల రెండో కుమారుడు తనూజ్ నాయక్ (19) గుండెపోటుతో మృతి చెందాడు. తనూజ్‌నాయక్ అనంతపురంలోని పీవీకేకే కళాశాలలో బీ ఫార్మసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 1న కళాశాల క్రీడా మైదానంలో కబడ్డీ ఆడుతూ ఉన్న పళంగా సొమ్మసిల్లి పడిపోయాడు. వెంటనే ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించి బెంగళూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందాడు.

రాజశ్యామల అమ్మవారికి పౌర్ణమి హారతి

సింహాచలం: పాల్గుణ పౌర్ణమిని పురస్కరించుకుని విశాఖ శ్రీశారదా పీఠంలో మంగళవారం రాజశ్యామల అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి అమ్మవారికి హారతి ఇచ్చారు. గత నెలలో హరియాణా రాష్ట్రం కురుక్షేత్రలో లక్ష చండీ మహా యజ్ఞం ఫలితం అఖండ భారతావనికి అందేలా చూడాలని అమ్మవారిని ప్రార్థించారు.



రాజశ్యామల అమ్మవారికి హారతి ఇస్తున్న స్వరూపానందేంద్ర సరస్వతి

ఫోన్‌లో రూ.10 కోట్ల లావాదేవీల చిట్టా!

- రమేష్‌నాయుడు ఫోన్‌లో రహస్యాలు
- టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి చిరంజీవి వ్యవహారాలన్నీ ఈయన చేతిలోనే
- దృష్టిసారించిన పోలీస్‌శాఖ
- ఇప్పటికే రూ.27 లక్షల నగదు స్వాధీనం

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో నగదు ప్రవాహంతో తెలుగుదేశం పార్టీ బరితెగింపులకు దిగుతోంది. ఇప్పటికే ఎన్నికల్లో భారీగా ఖర్చు చేయగలరన్న ధీమాతో బీసీ అభ్యర్థిని మార్చి మరీ.. వేపాడ చిరంజీవిరావును అభ్యర్థిగా ఆ పార్టీ అధిష్టానం ఖరారు చేసింది. ఈ నేపథ్యంలోనే ఎన్నికల్లో భారీగా ఖర్చు చేసేందుకు సమకూర్చుకున్న నగదులో రూ.27 లక్షలను చిరంజీవి అనుచరుడు కంచిపాటి రమేష్‌నాయుడు నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ నగదును రుణంగా తెచ్చిన తాను చిరంజీవి మీద అభిమానంతో ఆయన చెప్పిన వారికి ఇస్తున్నట్టు రమేష్‌నాయుడు పోలీసుల విచారణలో తెలిపినట్లు సమాచారం. రమేష్‌నాయుడు ఫోన్‌లోని పర్సనల్ ఫోల్డర్‌లో నగదు పంపిణీకి సంబంధించిన వ్యవహారాలన్నీ ఉన్నట్టు తెలిసింది. మొత్తం రూ.10 కోట్ల మేర నగదు లావాదేవీలకు సంబంధించిన వ్యవహారాలన్నీ ఫోన్‌లో ఉన్నట్లు తెలిసింది. ఈ ఫోల్డర్‌ను తెరిచేందుకు పాస్‌వర్డ్‌ను చెప్పేందుకు రమేష్‌నాయుడు నిరాకరిస్తున్నట్టు సమాచారం. ఫోన్ ఫోల్డర్‌లో ఉన్న సమాచారాన్ని సేకరిస్తే డబ్బు ప్రవాహం ఏ మేర ఉందన్న విషయం తెలిసే అవకాశం ఉందని భావిస్తున్నారు. టీడీపీ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి చిరంజీవికి, రమేష్‌నాయుడుకు మొదటినుంచి ఆర్థిక లావాదేవీలు ఉన్నట్టు తెలుస్తోంది. చిరంజీవి తాను సంపాదించిన అక్రమ ఆదాయంతో రమేష్‌నాయుడు ద్వారా లావాదేవీలను జరుపుతున్నట్టు ఆరోపణలున్నాయి. లెక్చరర్‌గా పనిచేసిన చిరంజీవి సరిగ్గా కాలేజీకి వెళ్లకుండా, ఒక ప్రైవేటు కోచింగ్ కేంద్రంలో పనిచేస్తూ భారీగా సంపాదించినట్టు తెలుస్తోంది. సదరు కోచింగ్ సెంటర్‌లో తన వద్ద కోచింగ్ తీసుకున్న పిల్లలనే ఇప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంతో పాటు పంపకాల కోసం ఉపయోగించుకుంటున్నట్టు తెలిసింది. కేవలం భారీగా ఖర్చు చేయగలరన్న అభిప్రాయంతోనే మొదట ప్రకటించిన బీసీ అభ్యర్థిని మార్చి మరీ చిరంజీవిని తెరమీదకు తెచ్చారని భావిస్తున్నారు.

'మిరాకిల్' కబ్జా భూములు స్వాధీనం

- ప్రభుత్వ భూముల్లో వేసిన రోడ్లు జేసీబీతో తొలగింపు

సాక్షి ఎఫెక్ట్

భోగాపురం: విజయనగరం జిల్లా భోగాపురం మండలంలో మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్ కంపెనీ ఆక్రమించిన 14.22 ఎకరాల ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. 'మిరాకిల్ భూ కబ్జా' శీర్షికన ఈ నెల 2వ తేదీన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ముంజేరు గ్రామ రెవెన్యూ పరిధిలో అక్రమిత భూముల్లో వేసిన రోడ్లను జేసీబీలతో తొలగించారు. ఈ సమయంలో కంపెనీలోకి వెళ్లేందుకు ప్రయత్నించిన అధికారులను కంపెనీ యాజమాన్యం, విద్యార్థులు అడ్డగించే ప్రయత్నం చేశారు. ఆర్డీవో సూర్యకళ అక్కడికి చేరుకుని మిరాకిల్ యజమాని లోకం ప్రసాద్, జనసేన పార్టీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి లోకం మాధవితో మాట్లాడారు. ప్రభుత్వభూమి ఆక్రమించడం నేరమని, అడ్డుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూముల్లో వేసిన రోడ్లను నాలుగు జేసీబీలతో తొలగించారు. ఈ విషయంపై లోకం ప్రసాద్ మాట్లాడుతూ చాలా సంస్థలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు వందల ఎకరాల భూములను కొనుగోలు చేస్తున్నారని, వాటిలో ప్రభుత్వ భూములును ఆక్రమిస్తున్నా పట్టించుకోని అధికారులు, తమపై మాత్రమే కక్షగట్టి ఆక్రమణలు తొలగిస్తున్నారని ఆరోపించారు. తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు, సీఐ కె.వి.వి.విజయనాథ్, ఎస్‌ఐ కృష్ణమూర్తి, రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



ఆర్డీఓ సూర్యకళను అడ్డగించి వాగ్వాదానికి దిగిన మిరాకిల్ సీఈఓ లోకం ప్రసాద్, విద్యార్థులు



సైకత 'మహిళ'

తిరుపతి జిల్లా చిల్లకూరు మండలంలోని ఏరూరు గ్రామానికి చెందిన సైకత శిల్పి మంచాల సనత్‌కుమార్ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సముద్ర తీరంలో మహిళ సైకత శిల్పం మంగళవారం రూపొందించారు. 'హ్యాపీ ఉమెన్స్ డే' అనే అక్షరాలను తీర్చిదిద్దారు. ఈ సైకత శిల్పం అందర్నీ ఆకట్టుకుంటోంది.

చిల్లకూరు (తిరుపతి జిల్లా)

బహుజనుల సంక్షేమం కోసమే ఉద్యమం

- రిలే దీక్షలో బహుజన నాయకులు



తాడికొండ: చంద్రబాబు హయాంలో అమరావతి ప్రాంత 29 గ్రామాల్లోని బహుజనులకు జరిగిన అన్యాయాన్ని ప్రజలకు తెలియచెప్పేందుకు, రాష్ట్రంలోని బహుజనుల సంక్షేమానికి పెద్దపీట వేసేందుకే తాము ఉద్యమం చేస్తున్నామని బహుజన పరిరక్షణ సమితి నాయకులు స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 891వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో మంగళవారం పలువురు మాట్లాడారు. ఏపీ అభివృద్ధికి బాబు అండ్ కోనే అడ్డంకిగా మారారని, అమరావతితో పాటు అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందడుగు వేస్తుంటే కోర్టుల్లో తప్పుడు కేసులు వేసి బాబు అడ్డుకోవడం అభివృద్ధిని నిరోధించడం కాదా అని ప్రశ్నించారు. విశాఖ వేదికగా జరిగిన గ్లోబల్ సమ్మిట్‌లో ఏపీకి పరిశ్రమలు వెల్లువెత్తడంపై అక్కసుతో ఉన్న ఎల్లో మీడియా చేస్తున్న విష ప్రచారాన్ని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో అల్లర్లు సృష్టించడమే లక్ష్యంగా యాత్రల పేరుతో బాబు, లోకేశ్, పవన్ కళ్యాణ్ కుటిల పన్నాగాలు పన్నుతున్నారని విమర్శించారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, పెరికే వర ప్రసాద్, ఈపూరి ఆదాం, పులి దాసు, గంటా సుందరరావు, సుంకర ముత్యాలరావు పాల్గొన్నారు.

మహిళా సిబ్బందితో ప్రత్యేక రైలు

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా విశాఖ నుంచి రాయగడకు

తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా సిబ్బందితో విశాఖపట్నం నుంచి రాయగడకు ప్రత్యేక రైలు బయల్దేరింది. ఈస్ట్‌కోస్ట్ రైల్వే ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ (ఈకార్వో) ప్రెసిడెంట్ పారిజాత సత్పతి.. వైస్ ప్రెసిడెంట్స్ కవితా గుప్తా, ప్రియాంక శ్రీదేవి, ఎగ్జిక్యూటివ్ సభ్యులతో కలిసి ఈ రైలును మంగళవారం విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో జెండా ఊపి ప్రారంభించారు. ఈ ప్రత్యేక రైలుకు సహనాకుమారి లోకోపైలట్‌గా, కె.నాగమణి అసిస్టెంట్ లోకో పైలట్‌గా, ఎం.కళ్యాణి ట్రైన్ మేనేజర్‌గా, ఎస్.అంబిలి, జి.అచ్యుతాంబ, కె.సంతోషిరావు, డి.రాధ టికెట్ తనిఖీ సిబ్బందిగా విధుల్లో ఉన్నారు. ఈ సందర్భంగా ఈకార్వో ప్రెసిడెంట్ పారిజాత సత్పతి మాట్లాడుతూ విశాఖ నుంచి మహిళా సిబ్బందిచే ప్రత్యేక రైలును నడిపించడం సంతోషంగా, గర్వంగా ఉందన్నారు. ఈ రోజు విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో ఆపరేషన్స్, కమర్షియల్, ఆర్పీఎఫ్.. ఇలా అన్ని విభాగాల్లోను మహిళలే విధులు నిర్వర్తించారని తెలిపారు. వాల్తేర్ డివిజన్ మహిళా సాధికారత విషయంలో ముందుంటుందని, అనేకమంది మహిళలను ట్రాక్ మెయింటెనెన్స్‌లో, ట్రైన్ ఆపరేషన్స్‌లో, ఆర్ఆర్ఐలో, ట్రైన్ మేనేజర్స్‌గా, టికెట్ తనిఖీ సిబ్బందిగా, కార్యాలయాల్లోను విధులు నిర్వర్తిస్తున్నారని గుర్తుచేశారు. వాల్తేర్ డివిజన్ ప్రత్యేకంగా మహిళల చేత కొన్ని విభాగాలనే నడుపుతున్నట్లు తెలిపారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఈకార్వో ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఆర్కే బీచ్‌లో వాకథాన్ నిర్వహించినట్లు ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎం (ఆపరేషన్స్) మనోజ్‌కుమార్ సాహూ, సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ ఆర్.ఎన్.ఎ.పరీడా, స్పోర్ట్స్ ఆఫీసర్ ప్రవీణ్ భటి, ఇతర బ్రాంచ్ అధికారులు, మహిళా సిబ్బంది, క్రీడాకారులు, ఆర్పీఎఫ్, సివిల్ డిఫెన్స్ సభ్యులు పాల్గొన్నారు.



ప్రత్యేక రైలుకు జెండా ఊపిన ఈకార్వో ప్రెసిడెంట్ పారిజాత సత్పతి

టెన్నిస్ క్రీడాకారుడు సాకేత్‌కు మంత్రి రోజా సన్మానం

సాక్షి, అమరావతి: అర్జున అవార్డు గ్రహీత, భారత టెన్నిస్ ఆటగాడు సాకేత్ మైనేనిని పర్యాటక, క్రీడల శాఖ మంత్రి రోజా సన్మానించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో మంత్రి రోజాను మర్యాదపూర్వకంగా సాకేత్ కలిశారు. సాకేత్ 2017లో ప్రతిష్టాత్మకమైన అర్జున అవార్డును అందుకున్నారు. అదే విధంగా డేవిస్ కప్‌లో దేశం తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

క్లుప్తంగా...

సిట్టింగ్‌ల్లో దాదాపు అందరికీ మళ్లీ టికెట్లు

బీజేపీ ఎమ్మెల్యేలకు యడియూరప్ప సంకేతాలు

బెంగళూరు: రాబోయే ఎన్నికల్లో కర్ణాటక బీజేపీ సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో దాదాపు అందరికీ మళ్లీ టికెట్లు దక్కుతాయని పార్టీ కీలక నేత యడియూరప్ప మంగళవారం సూచనప్రాయంగా చెప్పారు. ఎవరో నలుగురైదుగురు తప్ప, అందరికీ మరోసారి పోటీ చేసే అవకాశం ఉంటుందన్నారు. గుజరాత్ అసెంబ్లీకి గత ఏడాది ఎన్నికల్లో అధికార బీజేపీ సుమారు 45 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలకు మొండి చేయి చూపింది. ఇక్కడా అదే విధానం పునరావృతం అవుతుందేమోనని సొంతపార్టీ ఎమ్మెల్యేల్లో వ్యక్తమవుతున్న సందేహాలకు ఫుల్‌స్టాప్ పెట్టేందుకు ఆయన ప్రయత్నించారు. అసెంబ్లీ ఎన్నికలు సీఎం బొమ్మై సారథ్యంలోనే జరుగుతాయన్నారు. ఎన్నికల ఫలితాల తర్వాత జరిగే శాసనసభా పక్ష సమావేశంలోనే తదుపరి ముఖ్యమంత్రి ఎవరో పార్టీయే నిర్ణయిస్తుందంటూ.. సీఎం రేసులో తాను లేననే సంకేతాలిచ్చారు.

అమెరికాలో రైలు ఢీకొని.. తెలుగు వ్యక్తి దుర్మరణం

న్యూయార్క్: అమెరికాలోని న్యూజెర్సీలో రైలు ఢీకొని తెలుగు వ్యక్తి ఒకరు మృత్యువాత పడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లాకు చెందిన శ్రీకాంత్ దిగాల (39) న్యూజెర్సీలోని ప్లెయిన్స్‌బోరోలో ఉంటున్నారు. ఫిబ్రవరి 28న రైలు పట్టాల పక్కన నడుచుకుంటూ వెళ్తున్న శ్రీకాంత్‌ను బోస్టన్– వాషింగ్టన్ ఆమ్‌ట్రాక్ రైలు ఢీకొట్టింది. ఆయన అక్కడికక్కడే చనిపోయారు. శ్రీకాంత్‌కు భార్య, పదేళ్ల కొడుకు ఉన్నారు. భారత్‌లో ఉంటున్న వృద్ధ తల్లిదండ్రులు, అత్తమామలకు ఆయనే ఆధారం. వారికి చేయూతనిచ్చేందుకు స్థానిక భారతీయులు, తానా, కుటుంబసభ్యులు, స్నేహితులు ఇప్పటిదాకా సుమారు లక్ష డాలర్ల విరాళాలు సేకరించారు.

ప్రతి చర్యలకు మేం సిద్ధం

అమెరికా, దక్షిణ కొరియాలకు కిమ్ సోదరి వార్నింగ్

సియోల్: అమెరికా, దక్షిణ కొరియా సంయుక్త యుద్ధ విన్యాసాలను ఉత్తర కొరియా తీవ్రంగా తప్పు పట్టింది. తమపై దాడికొస్తే గట్టి ప్రతిచర్యలుంటాయని దేశాధినేత కిమ్ జోంగ్ ఉన్ సోదరి, దేశంలోనే అత్యంత శక్తిమంతమైన మహిళ కిమ్ యో జోంగ్ హెచ్చరించారు. ''అమెరికా, దక్షిణ కొరియా కొన్ని నెలలుగా చేస్తున్న విన్యాసాలను మాపై యుద్ధంగానే భావిస్తాం. వారి ప్రతీ అడుగునూ క్షణక్షణం గమనిస్తూనే ఉంటాం. మాకు న్యాయంగా అనిపించే ఏ చర్యనైనా తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నాం'' అని ఆమెను ఉటంకిస్తూ ఉత్తర కొరియా మీడియా వెల్లడించింది.

అంటార్కిటికా కరిగిపోతోంది!

రికార్డు స్థాయిలో తగ్గిన మంచు.. సముద్ర మట్టాలు పెరిగే ప్రమాదం..

కోల్‌కతా, చెన్నైలకు ముంపు ముప్పు.. గ్లోబల్ వార్మింగే ప్రధాన విలన్

పర్యావరణ మార్పులు, గ్లోబల్ వార్మింగ్ ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. వాటి దెబ్బకు హిమ ఖండమైన అంటార్కిటికాలోనే మంచు రికార్డు స్థాయిలో కరిగిపోతోంది! ఈ పరిణామంపై పర్యావరణ నిపుణులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా మేల్కొని దిద్దుబాటు చర్యలకు పూనుకోకుంటే పెను విపత్తులను చేజేతులా ఆహ్వానించినట్టే అవుతుందని హెచ్చరిస్తున్నారు!



అంటార్కిటికాలో సముద్రపు మంచు పరిమాణం ఫిబ్రవరి 25న ఏకంగా 17.9 లక్షల చదరపు కిలోమీటర్లకు పడిపోయింది. అక్కడి తేలియాడే మంచు పరిమాణాన్ని ఉపగ్రహ పరిశీలనల సాయంతో ఎప్పటికప్పుడు కచ్చితంగా లెక్కించడం మొదలు పెట్టిన గత 40 ఏళ్లలో నమోదైన అత్యల్ప స్థాయి ఇదే! ఇలా అంటార్కిటికాలో మంచు పరిమాణం అత్యల్ప స్థాయిలకు పడిపోవడం గత ఆరేళ్లలోనే ఏకంగా ఇది మూడోసారి కావడం ప్రమాద తీవ్రతకు అద్దం పడుతోంది. 2022లో అది 19.2 లక్షల చదరపు కి.మీ.గా తేలింది. 1979లో ఉపగ్రహ ఆధారిత గణన మొదలైన నాటినుంచీ అదే అత్యల్పం! ఈ రికార్డు గత ఫిబ్రవరిలో బద్దలై మంచు పరిమాణం 17.9 లక్షల చదరపు కి.మీ.గా నమోదైంది. అంటే ఏడాది కాలంలోనే ఏకంగా 1.36 లక్షల చదరపు కి.మీ. మేరకు తగ్గిందన్నమాట! ధ్రువ ప్రాంతాలపై పరిశోధనలు చేస్తున్న శాస్త్రవేత్తలను ఇదిప్పుడు ఎంతగానో కలవరపరుస్తోంది. అంటార్కిటికాలో ఎక్కడ చూసినా మంచు పరిమాణం బాగా తగ్గిపోతోందంటూ ఆస్ట్రేలియాలోని టాస్మేనియా యూనివర్సిటీలో అంటార్కిటికా ఖండపు మంచుపై ఎంతో కాలంగా పరిశోధనలు చేస్తున్న డాక్టర్ విల్ హాబ్స్ ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఖండపు పశ్చిమ భాగంలో గతేడాది మంచు ఊహాతీతంగా కరిగిపోయిందని, ఆ నష్టం నుంచి ఆ ప్రాంతాలింకా తేరుకోనే లేదని చెప్పారాయన. ''నిజానికి సముద్రపు మంచుకు పరావర్తన గుణం చాలా ఎక్కువ. కనుక సూర్యరశ్మికి పెద్దగా కరగదు. కానీ దాని వెనకాల నీరు చేరితే మాత్రం కిందనుంచి కరుగుతూ వస్తుంది. ఇప్పుడదే జరుగుతోంది'' అని వివరించారు.

– సాక్షి, నేషనల్ డెస్క్




తీరాలన్నీ మునకే!

- అంటార్కిటికా మహాసముద్రంలో ఉండే అపార హిమ రాశి తీరానికి కాస్త సమీపంలో ఉండే మంచుపై తుఫాను గాలుల ప్రభావాన్ని బాగా తగ్గిస్తుంది. ఆ హిమ రాశి ప్రస్తుత వేగంతో కరిగిపోతూ ఉంటే అలల తాకిడి వేగం బాగా పెరుగుతుంది. దాంతో సముద్రంలో తీరానికి సమీపంలో ఉన్న మంచూ క్రమంగా బలహీనపడి కరుగుతుంది. తర్వాత ఆ ఖండంలో నేలపై ఉన్న అపారమైన మంచుకు, హిమానీ నదులకు స్థిరత్వమిచ్చే ఈ ఆసరా శాశ్వతంగా కనుమరుగవుతుంది.
- పశ్చిమ అంటార్కిటికాలోని అముండ్సెన్, బెలింగ్‌హసన్ సముద్రాల్లో మంచు ఊహాతీత వేగంతో కరగడం శాస్త్రవేత్తలను మరీ కలవరపెడుతోంది. అంటార్కిటికాలో సగటు మంచు పరిమాణం 2014 దాకా ఎంతో కొంత పెరిగిన సమయంలో కూడా ఈ సముద్రాల్లో మంచు కరుగుతూనే వచ్చింది!
- పశ్చిమ అంటార్కిటికాలోనే ఉన్న త్వాయిట్స్ హిమానీ నదం కూడా క్రమంగా కరుగుతోంది. కేవలం ఇదొక్కటి గనక పూర్తిగా కరిగిందంటే సముద్ర మట్టాలు ఏకంగా అర మీటరు పెరుగుతాయి! అందుకే దీన్ని 'డూమ్స్‌డే గ్లేసియర్'గా పిలుస్తారు!
- గత ఫిబ్రవరిలో తొలిసారిగా అంటార్కిటికా ఖండపు తీర రేఖలో ఏకంగా మూడింట రెండు వంతులు ఏ మాత్రం మంచు లేకుండా సముద్రపు జలాలతో బోసిపోయి కన్పించిందట!
- అంటార్కిటికా సముద్రంలోని అపారమైన మంచు ఇలా కరుగుతున్న కొద్దీ ప్రపంచవ్యాప్తంగా సముద్ర మట్టాలు మీటర్ల మేరకు పెరుగుతాయి!
- దాంతో తీర ప్రాంతాలన్నీ ముంపు బారిన పడతాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మహా నగరాలెన్నో ఈ జాబితాలోకి వస్తాయి! అది కోట్లాది మందిని నిర్వాసితులను చేసి ఊహించని పెను విషాదానికి దారి తీస్తుంది.



ముున్ముందు మరింత ముప్పే!



సమీప భవిష్యత్తులో అంటార్కిటికాలో మంచు కరిగే వేగం తగ్గే సూచనలేవీ పెద్దగా లేవని సైంటిస్టులు చెబుతున్నారు. ''గ్లోబల్ వార్మింగ్ ప్రభావం అంటార్కిటికాపై కొన్నేళ్లుగా చాలా పడుతోంది. కనుక సముద్రపు మంచు కరిగే వేగానికి ఇప్పుడప్పట్లో అడ్డుకట్ట పడుతుందని భావించడం అత్యాశే'' అని యూనివర్సిటీ ఆఫ్ న్యూ సౌత్‌వేల్స్‌కు చెందిన ఓషనోగ్రాఫర్, వాతావరణ శాస్త్రవేత్త ప్రొఫెసర్ మాథ్యూ ఇంగ్లండ్ కుండబద్దలు కొట్టారు. అక్కడి మంచు ఈ స్థాయిలో కరగడం కచ్చితంగా పెను ప్రమాద సూచికేనని స్పష్టం చేశారు. శాస్త్రవేత్తలు ఇప్పుడు అంటార్కిటికా సముద్రంలోని మంచు ఈ స్థాయిలో కరిగిపోతుండటం వెనక గ్లోబల్ వార్మింగ్‌తో పాటు ఇంకేమేం కారణాలున్నాయో వెదికి వాటికి అడ్డుకట్ట వేసే పనిలో పడ్డారు.

కోల్‌కతా, చెన్నైలకు ముంపు ముప్పు..

సముద్ర మట్టాల పెంపు వల్ల ముప్పు ముంపున్న మహా నగరాల జాబితాలో కోల్‌కతా, చెన్నై ముందున్నాయి. గ్లోబల్ వార్మింగ్ ఇలాగే పెరుగుతూ ఉంటే 2100 నాటికి ఆ రెండు నగరాల్లో సముద్ర మట్టాలు 20 నుంచి 30 శాతం దాకా పెరిగే ప్రమాదముందని తాజాగా ఓ అధ్యయనంలో తేలింది. ఆసియాలో యాంగూన్, బ్యాంకాక్, హోచిమిన్ సిటీ, మనీలా కూడా ఇదే జాబితాలో ఉన్నాయి.

- సముద్ర ప్రవాహాల్లో మార్పుల వల్ల సముద్ర మట్టాల్లో పెరుగుదల ఒక్కో ప్రాంతంలో ఒక్కోలా ఉంటుంది. వీటి తో పాటు ఎల్ నినో తదితరాల ప్రభావాలను కూడా అధ్యయనం చేసి న మీదట ఈ నివేదికను రూపొందించారు.



విశేషాలు...

- సముద్ర మట్టాల్లో పెరుగుదల కేవలం వాతావరణ మార్పులతో పోలిస్తే అంతర్గత వాతావరణ మార్పులూ తోడైనప్పుడు మరో 20, 30 నుంచి ఏకంగా 50 శాతం దాకా ఎక్కువగా ఉంటుంది!
- దీన్ని పరిగణనలోకి తీసుకుంటే కోల్‌కతా, ముంబై తీర ప్రాంతాల్లో వరదలు 2006తో పోలిస్తే 2100 నాటికి కనీసం 18 రెట్ల నుంచి ఏకంగా 96 రెట్ల దాకా పెరిగే ఆస్కారముంది.
- అమెరికా పశ్చిమ తీరంతో పాటు ఆస్ట్రేలియాకు కూడా ఈ ముంపు సమస్య ఎక్కువగా ఉంటుంది.

పసిఫిక్‌లో కూలిన ఎంటీ–1

ఇస్రో సరికొత్త ప్రయోగం విజయవంతం

బెంగళూరు: మేఘా ట్రోపిక్స్–1 (ఎంటీ–1) అనే కాలం చెల్లిన ఉపగ్రహాన్ని తిరిగి భూమిపైకి తెచ్చేందుకు భారత అంతరిక్ష సంస్థ(ఇస్రో) చేపట్టిన అత్యంత క్లిష్టమైన ప్రయోగం సఫలీకృతమైంది. భూ కక్ష్యలోకి ప్రవేశించిన ఎంటీ–1ను నిర్దేశిత పసిఫిక్ సముద్రంలోని నిర్జన ప్రదేశంలో కూల్చేసింది. వాతావరణ పరిస్థితులపై అధ్యయనం కోసం 2011లో పీఎస్ఎల్‌వీ–సి18 రాకెట్ ద్వారా ప్రయోగించిన ఈ వెయ్యి కిలోల బరువైన ఉపగ్రహం 2021 నుంచి పనిచేయడం మానేసింది. అందులో మిగిలిపోయిన సుమారు 125 కిలోల ఇంధనంతో పేలుడు సంభవించి, ఇతర శాటిలైట్లకు ముప్పు వాటిల్లుతుందని ఇస్రో అంచనా వేసింది. అందుకే ముందు జాగ్రత్తగా ఆ ఉపగ్రహాన్ని తిరిగి కక్ష్య వెలుపలికి తీసుకురావాలనే క్లిష్టమైన ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. నియంత్రిత పునరాగమనం పద్ధతిలో చేపట్టిన ఈ సరికొత్త ప్రయోగం కోసం ఎంటీ–1లోని ఇంధనాన్నే ఉపయోగించుకుంది. ఇందులో భాగంగా శాటిలైట్‌ను కక్ష్య వెలుపలి నుంచి తక్కువ ఎత్తులోకి తీసుకువచ్చి, లక్షిత ప్రాంతంలో నష్టం కనిష్ఠంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటారు. తాము చేపట్టిన కార్యక్రమం మంగళవారం పూర్తిస్థాయిలో విజయవంతమైందని బెంగళూరులోని ఇస్రో కేంద్ర కార్యాలయం ట్వీట్ చేసింది. సాధారణంగా, భారీ ఉపగ్రహాలు లేదా రాకెట్లు భూ కక్ష్యలోకి వచ్చాక మండిపోతాయి. దీనివల్ల చిన్న శకలాలు భూమిపై పడితే పెద్దగా నష్టం వాటిల్లేందుకు అవకాశం ఉండదు. ప్రస్తుతం ప్రవేశపెట్టే శాటిలైట్లను నియంత్రిత పునరాగమనానికి వీలుగానే తయారు చేస్తున్నారని, ఎంటీ–1లో మాత్రం అలాంటి వెసులుబాటు లేదని ఇస్రో తెలిపింది.



భ్రమల్లో బీజేపీ: రాహుల్



లండన్: ''శాశ్వతంగా అధికారంలో ఉంటానని బీజేపీ భావిస్తోంది. కానీ అది నిజం కాదు. ప్రజాస్వామ్య వ్యవస్థల్ని కాపాడుకోవడానికి ప్రతిపక్షాలన్నీ ఏకమై, మరమ్మతు పనులు చేపట్టే అవకాశాలున్నాయి'' అని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ అన్నారు. బ్రిటన్ పర్యటన ముగించే ముందు సోమవారం సాయంత్రం లండన్‌లోని చాతమ్ హౌస్‌లో చర్చా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌కు కాలం చెల్లిందని, తామే ఎప్పటికీ అధికారంలో ఉంటామని బీజేపీ అనుకోవడం హాస్యాస్పదమన్నారు.


దేశాన్ని అవమానించారు: బీజేపీ

విదేశీ వేదికపై దేశాన్ని రాహుల్ అవమానించారంటూ బీజేపీ మండిపడింది. ఆయన పూర్తిగా మావోయిస్టుల ఆలోచన ధోరణిలో ఉన్నట్టుగా అర్థమవుతోందని కేంద్ర మాజీ మంత్రి రవిశంకర్ ప్రసాద్ ఆరోపించారు. ''రాహుల్ అరాచకంగా మాట్లాడుతున్నారు. దేశ ప్రజలు రాహుల్‌కు మద్దతు ఇవ్వకపోతే ఎన్నికల్లో ఆయన ఓడిపోతారు. అంతమాత్రాన తన అసహనాన్ని విదేశీ గడ్డపై వెళ్లగక్కి దేశాన్ని అవమానిస్తారా?'' అంటూ దుయ్యబట్టారు.

కోవిడ్ తరహాలో విస్తరిస్తున్న హెచ్3ఎన్2

ఎయిమ్స్ మాజీ డైరెక్టర్ రణదీప్ గులేరియా హెచ్చరికలు ● ఉత్తర భారతంలో విపరీతంగా పెరుగుతున్న కేసులు

న్యూఢిల్లీ: దేశాన్ని మరో కొత్త వైరస్ భయపెడుతోంది. హెచ్3ఎన్2 అనే కొత్త రకం వైరస్ కారణంగా దగ్గు, జలుబు, జ్వరంతో ప్రజలు బాధపడుతున్నారు. అచ్చంగా కోవిడ్ లక్షణాలు కలిగిన ఈ ఇన్‌ఫ్లుయెంజా కేసులు గత కొంత కాలంగా విపరీతంగా పెరుగుతున్నాయి. ఉత్తర భారతంలో ప్రతీ ఇద్దరిలో ఒకరు దగ్గు, జలుబు, తుమ్ములు, శ్వాస ఆడకపోవడం వంటి సమస్యలతో బాధపడుతున్నారు. ఈ వైరస్ కోవిడ్ తరహాలో తుంపర్ల ద్వారా ఇతరులకు సోకుతోందని, అందరూ జాగ్రత్తగా ఉండాలని ఢిల్లీలోని ఎయిమ్స్ మాజీ డైరెక్టర్ రణదీప్ గులేరియా హెచ్చరించారు. పండగల సీజన్ కావడంతో ప్రజలందరూ చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవడం, పది మందిలోకి వచ్చినప్పుడు మాస్క్ ధరించడం తప్పనిసరిగా చేయాలని అన్నారు. ముఖ్యంగా వృద్ధులు, ఇప్పటికే అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రతీ ఏడాది వేసవి కాలం సమీపిస్తున్నప్పుడు వైరస్‌లు ఉత్పరివర్తనం చెందుతూ అత్యధికులకు సోకుతూ ఉంటాయని, రోగ నిరోధక శక్తి తక్కువ ఉన్నవారు సులభంగా వీటి బారిన పడుతున్నారని గులేరియా తెలిపారు. ''హెచ్1ఎన్1 కారణంగా కొన్నేళ్ల క్రితం మన దేశాన్ని ఒక మహమ్మారి ఊపేసింది. ఇప్పుడు ఆ వైరస్ పలుమార్లు మ్యుటేషన్‌కు లోనై ప్రస్తుతం విజృంభిస్తున్న హెచ్3ఎన్2 రూపంలో ఉంది. ఇదంత ప్రమాదకరమైన వైరస్ కాకపోయినప్పటికీ దీనిని తట్టుకునే రోగనిరోధక శక్తి మనకి లేకపోవడం వల్ల త్వరగా వ్యాప్తి చెందుతోందని అన్నారు. చలి తగ్గి, ఎండ వేడి పెరుగుతున్న దశలో ఇలాంటి వైరస్‌లో విజృంభించడం సర్వసాధారణంగా జరుగుతూ ఉంటుంది. ఆసుపత్రుల్లో చేరే వారి సంఖ్య అంతగా లేకపోవడం గొప్ప ఊరటనిచ్చే అంశం.



వైరస్ లక్షణాలు

ఫ్లూ జ్వరానికి మరో రూపమే హెచ్3ఎన్2 వైరస్. ఇది సోకితే చలి, దగ్గు, జ్వరం, వాంతులు, విరోచనాలు ముక్కు కారడం, గొంతు నొప్పి, వళ్లు నొప్పులు వంటి లక్షణాలు ఉంటాయి

చికిత్స ఏమిటి?

ఈ వైరస్‌కు ప్రత్యేకంగా చికిత్స లేదు. సాధారణ ఫ్లూకి ఇచ్చే మందులే ఇస్తారు. హెచ్3ఎన్2 లక్షణాలుంటే పూర్తిగా విశ్రాంతి తీసుకొని, ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకుంటే త్వరగా కోలుకుంటారు.

ఎలా వ్యాపిస్తుంది ?

ఈ వైరస్ నోటి తుంపర్ల ద్వారా ఒక వ్యక్తి నుంచి మరో వ్యక్తికి వ్యాపిస్తుంది. మాట్లాడినప్పుడు, దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు వచ్చే తుంపర్లు వైరస్‌ను వ్యాప్తి చేస్తున్నాయి. గర్భిణులు, చిన్న పిల్లలు, వృద్ధులు అత్యధికంగా దీని బారిన పడుతున్నారు.

ఏం చెయ్యాలి..?

- మాస్కు ధరించాలి. జనసమ్మర్దానికి దూరంగా ఉండాలి
- చేతులు తరచూ సబ్బుతో కడుగుతూ ఉండాలి
- మీ నోటిని, ముక్కుని చేతులతో తాకవద్దు
- దగ్గు, తుమ్ము వచ్చినప్పుడు ముఖాన్ని కప్పుకోవాలి
- జ్వరం, ఒళ్లు నొప్పులు ఉన్నప్పుడు ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి

ఏమి చెయ్యకూడదు

- బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మకూడదు
- ఇతరులతో కరచాలనం చెయ్యవద్దు
- సొంత వైద్యం చెయ్యకూడదు.
- పక్కనే ఎవరైనా ఉంటే ఆహారం తీసుకోవద్దు.

నాగాలాండ్ సీఎంగా ఐదోసారి రియో




నాగాలాండ్ సీఎంగా నిఫ్యు రియో (కుడివైపు చివర) ప్రమాణం అనంతరం రాష్ట్ర తొలి మహిళా మంత్రి క్రూసెతో మోదీ కరచాలనం

కోహిమా: నేషనల్ డెమోక్రాటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ (ఎన్‌డీపీపీ) నేత నెఫియు రియో(72) నాగాలాండ్ సీఎంగా ఐదోసారి ప్రమాణం చేశారు. ఆయనతోపాటు ఇద్దరు ఎమ్మెల్యేలు డిప్యూటీ సీఎంలుగా, మరికొందరు కేబినెట్ మంత్రులుగా ప్రమాణం చేయించారు. వీరిలో ఎన్‌డీపీపీకి చెందిన ఏడుగురు, బీజేపీ నుంచి ఐదుగురు ఉన్నారు. వీరిలో మహిళా ఎమ్మెల్యే క్రూసె కూడా ఉన్నారు. రాష్ట్ర అసెంబ్లీకి మొట్టమొదటిసారిగా ఎన్నికైన ఇద్దరు మహిళా ఎమ్మెల్యేల్లో క్రూసె ఒకరు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో గవర్నర్ లా గణేశన్ వీరితో ప్రమాణ స్వీకారం చేయించారు. రాష్ట్ర అసెంబ్లీలోని 60 స్థానాలకు గాను ఇటీవలి ఎన్నికల్లో ఎన్‌డీపీపీ–బీజేపీ కూటమి 37 చోట్ల విజయం సాధించింది. రియో ప్రభుత్వానికి ఇతర పార్టీలు కూడా మద్దతు తెలుపుతూ లేఖలు అందజేశారు. దీంతో, ప్రతిపక్షం లేని అన్ని పార్టీలతో కూడిన ప్రభుత్వానికి సీఎం రియో నాయకత్వం వహించనున్నారు.

ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, బీజేపీ చీఫ్ జేపీ నడ్డా, అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పాల్గొన్నారు. రియో మొదటిసారిగా 2003లో నాగాలాండ్ సీఎం అయ్యారు. మళ్లీ 2008, 2013ల్లో కూడా సీఎం పదవి చేపట్టారు. 2014లో రాజీనామా చేసి లోక్‌సభకు ఎన్నికయ్యారు. మళ్లీ 2018లో సీఎం అయ్యారు. నాలుగు పర్యాయాలు సీఎంగా ఉన్న ఎస్‌సీ జమీర్ రికార్డును తాజాగా బద్దలు కొట్టారు.

మేఘాలయ సీఎంగా కాన్రాడ్ సంగ్మా ప్రమాణం



మేఘాలయ సీఎం కాన్రాడ్, కొత్త మంత్రులతో ప్రధాని మోదీ

షిల్లాంగ్: మేఘాలయ ముఖ్యమంత్రిగా నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పీపీ) చీఫ్ కాన్రాడ్ కె.సంగ్మా వరుసగా రెండోసారి ప్రమాణం చేశారు. ఆయన పార్టీకే చెందిన మరో ఏడుగురు ఎమ్మెల్యేలు, యూడీపీ నుంచి ఇద్దరు, బీజేపీ, హెచ్ఎస్‌పీడీపీల నుంచి ఒక్కొక్కరు చొప్పున మొత్తం 11మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. మంగళవారం షిల్లాంగ్‌లోని రాజ్‌భవన్‌లో గవర్నర్ ఫగూ చౌహాన్ వీరందరి చేత పదవీ ప్రమాణం చేయించారు. ఇందులో ఎన్‌పీపీకి చెందిన ఇద్దరు ఉప ముఖ్యమంత్రులుగా ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా, బీజేపీ చీఫ్ జేపీ నడ్డా, నెడా (నార్త్ ఈస్ట్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ)కన్వీనర్, అస్సాం సీఎం హిమాంత బిశ్వ శర్మ కూడా హాజరయ్యారు. నిబంధనల ప్రకారం.. నాగాలాండ్ అసెంబ్లీలోని 60 స్థానాలకు గాను సీఎంతో కలిపి మంత్రివర్గంలో 12 మందికి మించి ఉండరాదు. ప్రమాణ స్వీకారం చేసిన సీఎం కాన్రాడ్, మంత్రులకు ప్రధాని మోదీ ట్విట్టర్‌లో శుభాకాంక్షలు తెలిపారు. మేఘాలయ మరింతగా అభివృద్ధి పథకంలో నడిపించాలనే లక్ష్య సాధనలో వారు విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, పర్యాటకంతోపాటు మౌలిక సదుపాయాలను, రహదారులు, విద్యుత్, నీటి వసతులను మెరుగుపర్చడమే తమ ప్రభుత్వ లక్ష్యాలని ప్రమాణ స్వీకారం అనంతరం సంగ్మా పీటీఐకి చెప్పారు.

బంగ్లాదేశ్‌లో పేలుడు.. 17 మంది దుర్మరణం

ఢాకా: బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలోని ఓ వాణిజ్య సముదాయ భవనంలో మంగళవారం సాయంత్రం జరిగిన పేలుడులో 17 మంది చనిపోయారు. 100 మందికి పైగా గాయపడ్డారు. వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నందున మృతుల సంఖ్య పెరిగేలా ఉంది. అక్రమంగా నిల్వ ఉంచిన రసాయనాలే పేలుడుకు కారణమంటున్నారు. రెండు రోజుల క్రితం ఢాకాలో జరిగిన పేలుడులో ముగ్గురు చనిపోగా పలువురు గాయపడ్డారు. గత వారం తీర ప్రాంత చట్టోగ్రామ్‌లోని ప్రైవేట్ ఆక్సిజన్ ప్లాంట్ పేలుడులో ఏడుగురు చనిపోయారు.

70 శిక్షణ విమానాల కొనుగోలుకు.. రూ.6,800 కోట్ల ఒప్పందం

న్యూఢిల్లీ: భారత వైమానిక దళానికి 70 హెచ్‌టీటీ–40 రకం ప్రాథమిక శిక్షణ విమానాల కొనుగోలుకు హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్‌తో రక్షణ శాఖ రూ.6,800 కోట్ల ఒప్పందం కుదుర్చుకుంది. వీటిని ఆరేళ్లలోగా అందజేయాల్సి ఉంటుంది. మూడు కేడెట్ ట్రెయినింగ్ షిప్‌ల కోసం ఎల్‌అండ్‌టీతో మరో రూ.3,100 కోట్ల ఒప్పందం ఖరారు చేసినట్లు రక్షణ శాఖ తెలిపింది. ఈ షిప్‌లను 2026 నుంచి అందజేయాల్సి ఉంటుందని పేర్కొంది. మంగళవారం రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సమక్షంలో అధికారులు సంతకాలు చేశారు.

లాండ్ ఫర్ జాబ్స్ కుంభకోణం కేసు... లాలూను 5 గంటలు ప్రశ్నించిన సీబీఐ



న్యూఢిల్లీ: లాండ్ ఫర్ జాబ్స్ కుంభకోణం కేసులో ఆర్‌జేడీ చీఫ్, మాజీ రైల్వే మంత్రి లాలూ ప్రసాద్ యాదవ్‌ను సీబీఐ మంగళవారం ప్రశ్నించింది. ఢిల్లీలో కూతురు మిసా భారతి ఇంట్లో ఉన్న లాలూను అధికారులు 5 గంటలపాటు ప్రశ్నించారు. వివరాలను వీడియో రికార్డు చేశారు. ఈ కేసులో లాలూ భార్య, బిహార్ మాజీ సీఎం రబ్రీదేవిని సోమవారం విచారించడం తెలిసిందే. కిడ్నీ మార్పిడి చికిత్స చేయించుకున్న లాలూ గత డిసెంబర్ నుంచి ఢిల్లీలో క్వారంటైన్‌లో ఉంటున్నారు. ఈ కేసులో లాలూ, రబ్రీదేవి, మిసా భారతి సహా 14 మందిపై సీబీఐ చార్జిషీటు దాఖలు చేసింది. 15న విచారణకు రావాలంటూ సమన్లు జారీ చేసింది.

నాన్నకు ఏమన్నా జరిగితే ఊరుకోం

లాలూను సీబీఐ అధికారులు ప్రశ్నించడంపై సింగపూర్‌లో ఉంటున్న ఆయన మరో కూతురు రోహిణి ఆచార్య తీవ్రంగా స్పందించారు. 'సీబీఐ మా నాన్నను వేధిస్తోంది. ఆయనకు జరగరానిదేమైనా జరిగితే ఢిల్లీ పీఠం కదిలిపోతుంది' అంటూ ట్వీట్ చేశారు. ఆయనకు రోహిణియే కిడ్నీ ఇచ్చారు.

నిప్పులు చిమ్ముకుంటూ లక్ష్యానికి...

- నౌకా విధ్వంసక క్షిపణి ప్రయోగం విజయవంతం
- ఐఎన్ఎస్ విశాఖ నుంచి దూసుకెళ్లిన మిస్సైల్
- 70 కి.మీ. లోపు విమానాలు, హెలికాప్టర్లు తుత్తునియలు
- ఐఏఐ, డీఆర్‌డీఓ సంయుక్త అభివృద్ధి



దొండపర్తి (విశాఖ దక్షిణ): దేశ భద్రతలో భారత నౌకాదళం మరో మైలురాయిని సాధించింది. ఐఎన్ఎస్ విశాఖ నుంచి మధ్య శ్రేణి నౌకా విధ్వంసక క్షిపణిని మంగళవారం ప్రయోగించింది. నిప్పులు చిమ్ముకుంటూ నింగిలోకి దూసుకెళ్లిన మిసైల్ విజయవంతంగా లక్ష్యాన్ని ఛేదించింది. అత్యంత వేగంతో దూసుకొచ్చే శత్రు దేశాల యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు, గైడెడ్ బాంబులు, క్రూయిజ్ క్షిపణులు, యుద్ధ నౌకలను సైతం నాశనం చేసే సామర్థ్యం ఈ మధ్యస్థ శ్రేణి క్షిపణికి ఉంది. నేలపై నుంచి ఆకాశంలోని లక్ష్యాలను ఛేదించే(ఎంఆర్ఎస్ఏఎం) వ్యవస్థ దీనికి ఉంది. 70 కిలోమీటర్ల రేంజ్‌లో ఉన్న లక్ష్యాలను కచ్చితత్వంతో ఛేదించగల శక్తివంతమైన ఈ క్షిపణి వ్యవస్థను భారత రక్షణ పరిశోధన సంస్థ(డీఆర్‌డీఓ), ఇజ్రాయిల్ ఏరోస్పేస్ ఇండస్ట్రీస్ (ఐఏఐ) సంయుక్తంగా అభివృద్ధి చేశాయి. వీటిని భారత్ డైనమిక్స్ లిమిటెడ్ ఉత్పత్తి చేస్తోంది.

మీడియం రేంజ్ సర్ఫేస్ -టు -ఎయిర్ మిస్సైల్ (ఎంఆర్ఎస్ఏఎం) ప్రత్యేకతలు

- **పరిధి:** 70 కిలోమీటర్లు
- **మార్గదర్శకత్వం:** డ్యూయల్ (కమాండ్ –యాక్టివ్ రాడార్ సీకర్ (ఆర్ఎఫ్)
- **నియంత్రణ:** టీవీఎస్ అండ్ ఏరోడైనమిక్
- **ప్రొపల్షన్:** డ్యూయల్ పల్స్ –సాలిడ్ మోటార్
- **వార్ హెడ్:** ప్రీ–ఫ్రాగ్మెంట్
- **ప్రయాణ సమయం:** 230 సెకన్లు
- **పొడవు:** 4500 మిల్లీమీటర్లు
- **వ్యాసం:** 225 మిమీ
- **బరువు:** 275 కిలోలు
- **లాంచర్:** షిప్/వాహనం (నిలువు) లాంచ్.

భారత రక్షణ దళం శక్తివంతం

'ఆత్మనిర్భర్'లో భాగంగా భారత సైన్యం శక్తివంతమైన క్షిపణులను సిద్ధం చేసుకుంటోంది. ఉపరితలం నుంచి గగనతలానికి ప్రయోగించే మీడియం రేంజ్ క్షిపణిల తయారీ, అభివృద్ధికి బీడీఎల్‌తో 2017లో ఐఏఐతో ఒప్పందం చేసుకుంది. దాని ప్రకారం ఎదురుగా వచ్చే విమానాలు, హెలికాప్టర్లు, మిస్సైళ్లను, యుద్ధ నౌకలను సైతం ధ్వంసం చేసేలా ఈ క్షిపణి వ్యవస్థను అభివృద్ధి చేశారు. ఇప్పటికే ఒకసారి ఒడిశాలోని బాలాసోర్ తీరం నుంచి ప్రయోగించిన ఈ క్షిపణి సుదూర శ్రేణిలో ఉన్న హైస్పీడ్ ఏరియల్ లక్ష్యాన్ని ఛేదించింది. తాజాగా పరీక్షించిన ఎంఆర్ఎస్ఏఎం వ్యవస్థలో దేశీయంగా అభివృద్ధి చేసిన డ్యూయల్ పల్స్ రాకెట్ మోటర్‌ను వాడారు. అత్యాధునిక రేడియో ఫ్రీక్వెన్సీ సీకర్ ద్వారా శత్రు విమానాలు, హెలికాప్టర్లు, యాంటీ షిప్ మిస్సైళ్లను ధ్వంసం చేస్తుంది.

న్యూస్‌రీల్

మందేసి నిద్రపోయిన డాక్టర్



తన చాంబర్‌లో డాక్టర్ నిర్వాకం

తుమకూరు: ఆస్పత్రికి వచ్చే రోగులకు వైద్య సేవలు అందించాల్సిన వైద్యుడు డ్యూటీ సమయంలో మందు కొట్టి అక్కడే దర్జాగా నిద్రపోయాడు. తుమకూరు జిల్లాలోని తిపటూరు తాలూకాలో ఉన్న స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడు ఈ ఘనకార్యానికి పాల్పడ్డాడు. మంగళవారం చికిత్స కోసం వచ్చిన రోగులు ఆస్పత్రిలో ఎదురుచూస్తుండగా, వైద్యుడు మాత్రం నాకేం సంబంధం లేదన్నట్లు మద్యం నిషాలో తన టేబుల్‌పై కాళ్లు చాపి మత్తులోకి జారుకున్నాడు. కొంతమంది రోగులు వచ్చి తమకు ఆరోగ్యం బాగాలేదని, చూడాలని కోరగా, పనిమీద ఉన్నాను, బయటికి వెళ్లిపోండి అని గదమాయించాడు. కొందరు ఈ దృశ్యాలను వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. వైద్యుని నిర్వాకంపై జనం మండిపడ్డారు.

బీజేపీ ధనవంతుల పార్టీ

- మాకు 130 సీట్లు వస్తాయి: సిద్దు, డీకే



శివాజీనగర: బీజేపీ ఉన్నత వర్గాల పార్టీ, శ్రీమంతులకు అనుకూలంగా ఉంటుందని, పేదల గురించి ఆలోచించదని సీఎల్పీ నేత సిద్దరామయ్య ధ్వజమెత్తారు. మాజీ ఎమ్మెల్యే జే.నరసింహ స్వామి, కొళ్లేగాలకు చెందిన బీజేపీ మాజీ ఎమ్మెల్యే నంజుండస్వామి, విజయపురకు చెందిన మాజీ స్వతంత్ర ఎమ్మెల్యే మనోహర్ ఐనాపుర్, మైసూరు మాజీ మేయర్ పురుషోత్తమ్‌లు మంగళవారం బెంగళూరులో పార్టీ ఆఫీసులో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా సిద్దరామయ్య, కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్‌లు మీడియాతో మాట్లాడారు. బీజేపీ నాలుగు సంవత్సరాల అవధిలో ఎంతో సొమ్ము చేసుకొన్నారు. వారికి అభివృద్ధి పట్టదు, హిందుత్వ, లవ్‌జిహాద్ అని రాజకీయాలు చేస్తారని ఆరోపించారు. ఎన్నికలకు 50 రోజులు మాత్రమే గడువు ఉంది. బీజేపీవారు అర్జెంట్‌గా ఎన్నికలు జరపాలనుకుంటున్నారు, ఎప్పుడు జరిగినా సిద్ధంగా ఉన్నాం. కొందరు ఎమ్మెల్యేలు కూడా మా పార్టీలో చేరబోతున్నారు, మా సర్వే ప్రకారం 130 స్థానాల్లో గెలుపొందుతామని విశ్వాసముందని చెప్పారు.

ఎమ్మెల్యే మాడాళ్‌పై పోస్టర్లు

శివాజీనగర: లంచం కేసులో ఎమ్మెల్యే, కేఎస్‌డీఎల్ మాజీ అధ్యక్షుడు మాడాళ్ విరుపాక్షప్పకు వ్యతిరేకంగా పోస్టర్ల అభియాన్ జరుగుతోంది. బెంగళూరులోని పలుచోట్ల పోస్టర్లు వేశారు. ఆయన ఎక్కడ కనిపించినా పోలీస్ కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేయాలని, లోకాయుక్తకు సహకరించాలని రాసి ఉంది. చెన్నగిరి పట్టణంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఎమ్మెల్యే వ్యతిరేకంగా పోరాటానికి దిగారు. మాడాళ్ అదృశ్యమయ్యారని పోస్టర్లలో రాశారు.

బొమ్మై నాయకత్వంలోనే ఎన్నికలు

- కొందరికి టికెట్ రాకపోవచ్చు: యడ్డి

శివాజీనగర: సీఎం బొమ్మై నాయకత్వంలోనే బీజేపీ అసెంబ్లీ ఎన్నికలకు వెళ్తుంది, గుజరాత్ తరహాలో కొందరు సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్ రాకపోవచ్చని మాజీ సీఎం, బీజేపీ నేత యడియూరప్ప జోస్యం చెప్పారు. మంగళవారం కల్బుర్గిలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఇప్పటికి నలుగురు ఎమ్మెల్యేలకు టికెట్ రాకపోవచ్చు, మిగతావారికి ఢోకా లేదు అని చెప్పారు. రాష్ట్రంలో 140కు పైగా సీట్లలో గెలిచి అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ విజయసంకల్ప యాత్రలకు వస్తున్న ప్రజలను చూస్తే మాకు అనుకూలమైన వాతావరణం ఉందని రుజువైందన్నారు. మంత్రులు వీ.సోమణ్ణ, నారాయణగౌడే కాదు, ఎవరూ పార్టీని వీడబోరని అన్నారు. బీజేపీలోకి వచ్చేవారుంటే సంతోషంగా స్వాగతం పలుకుతామన్నారు. రాష్ట్రంలో ఈసారి ముఖ్యమంత్రి బొమ్మై నేతృత్వంలో ఎన్నికలు జరుగుతాయని, ఆ తరువాత బీజేఎల్పీ భేటీలో ముఖ్యమంత్రి ఎవరు కావాలనేది నిర్ధారణ అవుతుందని ఓ ప్రశ్నకు సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన పలుచోట్ల బీజేపీ సభల్లో పాల్గొని ప్రసంగించారు. మాజీ సీఎం జగదీశ్ శెట్టర్ పాల్గొన్నారు.



మైసూరు కేతమారనహళ్లిలో జరిగిన మారిహబ్బలో కుస్తీ పోటీల సందడి

పాల వెల్లువకు బ్రేకులు

- బెంగళూరు పరిధిలో 2 లక్షల లీటర్ల ఉత్పత్తి తగ్గుదల
- గిట్టుబాటు కాక పాడిరైతుల నష్టి



నగరంలో పాల విక్రయాలు (ఫైల్)



పాడి నిర్వహణ భారంగా మారిందని రైతుల ఫిర్యాదు

బనశంకరి: ఆరోగ్యానికి పాలు ఎంతో మేలు అన్నది తెలిసిందే. ఆ పాలను ఉత్పత్తి చేసే రైతులకు మేలు కలగానే ఉంది. బెంగళూరు నగర చుట్టుపక్కల ప్రాంతాల్లో పాల ఉత్పాదన పడిపోయింది. దీంతోపాటు బెంగళూరు మిల్క్ యూనియన్ (బమూల్) ఆఫీసులో కంప్యూటర్ సర్వర్ పనిచేయకపోవడంతో సాంకేతిక సమస్య తలెత్తి పాల సరఫరాకు అవరోధం ఏర్పడింది. పాల ఉత్పాదన రోజుకు 14 – 15 లక్షల లీటర్లు ఉండగా, ఇప్పుడు నుంచి 12 – 13 లక్షల లీటర్లకు తగ్గింది. మరికొన్ని రోజులు ఇదే పరిస్థితి కొనసాగవచ్చని సమాచారం. ఈ నేపథ్యంలో రానున్న రోజుల్లో సకాలంలో పాలు సరఫరా కావడం కష్టతరం కానుంది.

ప్రతి నెలా 3 వేల ఆవుల అమ్మకం

పాడి రంగంలో రైతులకు ఆసక్తి తగ్గిపోవడం వల్ల క్రమంగా పాల ఉత్పత్తి తగ్గుముఖం పడుతోంది. బమూల్ అంచనా ప్రకారం బెంగళూరులో 2500 నుంచి 3 వేల ఆవులను ప్రతినెలా పాడిరంగంలో లాభదాయకంగా ఉన్న ఇతర రాష్ట్రాల రైతులకు అమ్మేస్తున్నారు. ప్రతి లీటరు పాలకు పలు రాష్ట్రాల్లో రూ.40 అందిస్తుండగా, కర్ణాటకలో రూ.30 ఇస్తున్నట్లు పాడిరైతులు వాపోయారు.



ఇతర ఉత్పత్తులకు ఆటంకం

దీంతో పాల ఉత్పత్తి ఖర్చును తట్టుకోలేక ప్రతినెలా 15 నుంచి 20 మంది రైతులు పాడి రంగాన్ని వదిలేస్తున్నారని బమూల్ అధ్యక్షుడు నరసింహమూర్తి తెలిపారు.

సర్వర్ లోపంతో ఇబ్బందులు

పాల ప్యాకెట్లు, నెయ్యి ఇతర ఉత్పత్తుల ఉత్పాదనను బమూల్ కోతకోసింది. రోజూ నగరవ్యాప్తంగా 11 లక్షల లీటర్ల పాల విక్రయం జరుగుతోంది. మరోవైపు బమూల్ సర్వర్‌లో సమస్య తలెత్తింది. దీని వల్ల వాహనాల లోడింగ్‌కు ఇబ్బంది వచ్చింది. దీనిని సరిదిద్దడానికి హైదరాబాద్ నిపుణులను సంప్రదించగా బుధవారం వచ్చే అవకాశం ఉంది.

రంగు రంగేళి చిందుల హోలీ



మంగళవారం రాష్ట్రమంతటా హోలీ సంబరాలు మిన్నంటాయి. కలబురిగిలో జరిగిన సామూహిక వేడుకల్లో నృత్యాలు చేస్తున్న మగువలు



బెళగావిలో రంగుల్లో మునిగి తేలిన యువతులు





బెంగళూరు బసవనగుడిలో రంగు పొగతో బాలుడు, బాలలపైకి రంగుల వర్షం

ఏసీ పేలుడుపై ఎన్నో సందేహాలు

- భయకంపితమైన శక్తినగర్



మృతులు రంజిత, పిల్లలు (ఫైల్), భర్త



ఆస్పత్రిలో మృతదేహాలు

రాయచూరు రూరల్: రాయచూరు తాలూకా శక్తినగర్‌లో సోమవారం రాత్రి ఇంట్లో ఏసీ పేలి తల్లీ పిల్లలు సజీవ దహనం కావడం మిస్టరీగా మారింది. ఆర్‌టీపీఎస్ సమీపంలో ఓ క్వార్టర్‌లో ఏసీ విస్ఫోటం చెంది రంజిత (33), కూతురు మృదుల (13), కుమారుడు తారుణ్య (5)లు మృత్యువాత పడడం అంతటా సంచలనం కలిగింది. ఇళ్లలో ఏసీలు ఉన్న వారందరూ భయపడాల్సి వస్తోంది. శక్తినగర్ అంతటా ఆందోళన నెలకొంది.

కుటుంబ కలహాలపై అనుమానం

రంజిత భర్త సిద్ధలింగయ్య స్వామి స్థానిక ఆర్‌టీపీఎస్ థర్మల్ కేంద్రంలో జూనియర్ ఇంజనీర్‌గ పనిచేస్తున్నారు. వీరికి 14 ఏళ్ల కిందట వివాహమైంది. ఈయన తాగుడుకు బానిసయ్యాడని, నిత్యం తాగి వచ్చి భార్యతో గొడవ పడేవాడని ఇంటి చుట్టుపక్కల వారు చెప్పారు. కుటుంబ కలహాలతో ఏసీ విస్ఫోటం చెందేలా ఏమైనా చేశారా? అనే అనుమానం వ్యక్తం చేశారు.

ఏసీకి విద్యుత్ కనెక్షన్ తప్పుగా ఇచ్చి ఉంటే ఇలా పేలవచ్చని కొందరు పోలీసులు కూడా అన్నారు. మండ్య నుంచి వచ్చిన రంజిత కుటుంబ సభ్యులు కాలి బొగ్గుగా మారిన తమవారిని చూసి భోరున విలపించారు. మృతదేహాలకు శక్తి నగర్ ఆస్పత్రిలో మంగళవారం శవ పరీక్షలు జరిపిన అనంతరం మండ్యకు తరలించారు. భర్త కూడా వారితో పాటు వెళ్లిపోయాడు.

ఘరానా ప్రేమికుడు

- గర్భిణికి మూడుముళ్లు వేసి పరారీ
- ఐటీ సిటీలో వింత సంఘటన



పరారైన సాగర్ ఇతడే

యశవంతపుర: ప్రేమపేరుతో యువతిని లోబరుచుకున్నాడు, ఫలితంగా ఆమె 7 నెలల గర్భవతి అయ్యింది. పెళ్లిచేసుకోమంటే ప్రియుడు మొండికేశాడు, బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేస్తామనడంతో భయపడి తాళి కట్టి మరుక్షణమే పరారయ్యాడు. ఈ విచిత్ర సంఘటన బెంగళూరు సోలదేవనహళ్లి పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలు.. సాగర్ అనే యువకుడు ప్రైవేటు ల్యాబ్‌లో పని చేస్తున్నాడు. ఓ యువతిని పెళ్లి పేరుతో మభ్యపెట్టాడు. ప్రస్తుతం ఆమె 7 నెలల గర్భవతి. గర్భ విచ్ఛిత్తి కోసం అతడు కొన్ని మాత్రలను ఇచ్చాడు, విషయం తెలుసుకున్న యువతి కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయాలని నిర్ణయించారు. ఇది తెలుసుకున్న సాగర్ తన కుటుంబసభ్యులకు నచ్చజెప్పి యువతి మెడలో తాళి కట్టాడు. అలాగే రిజిస్ట్రార్ ఆఫీసులో చట్టపరంగా పెళ్లి చేయాలని యువతి తల్లిదండ్రులు నిర్ణయించగా సాగర్ పరారయ్యాడు. సోలదేవనహళ్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అదృశ్యమైన మహిళ ఆత్మహత్య

మూడు రోజుల క్రితం పరారైన మహిళ శవమై తేలింది. చిక్కమగళూరు జిల్లా మూడిగెరె తాలూకా గోణిబీడు తాలూకా ఉగ్గేహళ్లి గ్రామంలో నేత్ర అనే మహిళ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మూడురోజుల కిందటే నేత్ర భర్త జగదీశ్ ఆచారి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఇందుకు నేత్రనే కారణమని, ఆమెకు మరొకరితో అక్రమ సంబంధం ఉందని ఆచారి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటి నుంచి నేత్ర అదృశ్యమైంది. సోమవారం రాత్రి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొంది.

ప్రాణాలు తీసిన పాగల్ ప్రియుడు





హతురాలు ప్రతిభ, నిందితుడు మూకప్ప

హొసపేటె: తను ఇష్టపడిన యువతికి మరొకరితో పెళ్లయింది. ఎప్పుడో మూడు నాలుగేళ్ల కిందట ఇది జరిగింది. కానీ పాగల్ ప్రియుడు మాత్రం సైకోగా మారి ఆమెను పొట్టనపెట్టుకున్నాడు. ఈ ఘటన విజయనగర జిల్లా హరపనహళ్లి తాలూకా దుగ్గావతి గ్రామంలో సోమవారం సాయంత్రం జరిగింది. దుగ్గావతికి చెందిన ప్రతిభ (27)ను ఆమె తల్లిదండ్రులు రాణిబెన్నూరు నివాసి నాగరాజ్‌కు ఇచ్చి పెళ్లి జరిపించారు. మూడేళ్ల వయసు గల కుమారుడు ఉన్నాడు. గతంలో ఆమెను గ్రామవాసి మూకప్పనవర హనుమంతు ప్రేమిస్తున్నట్లు చెప్పుకుంటూ తిరిగేవాడు. ఊళ్లో జాతరకు తల్లిదండ్రులు ప్రతిభను పిలుచుకొచ్చారు. అక్కతో కలిసి ఆమె బయటకు వెళ్లి తిరిగివస్తుండగా హనుమంతు వెంటాడి చాకుతో దారుణంగా దాడి చేసి పారిపోయాడు. గొంతు, ఎద మీద తీవ్ర గాయాలతో కొన ఊపిరితో ఉన్న ప్రతిభను ఆటోలో ఆస్పత్రికి తీసుకెళ్తుండగా కన్నుమూసింది. దుండగున్ని పోలీసులు అరెస్టు చేశారు.

ప్రజారోగ్యం కోసం ప్రత్యేక వ్యవస్థ

బనశంకరి: బెంగళూరు నగర ప్రజల ఆరోగ్యం, విద్య పట్ల ప్రత్యేక దృష్టి సారించామని, ఇందుకోసం ప్రత్యేక వ్యవస్థ రూపొందిస్తామని ముఖ్యమంత్రి బసవరాజ బొమ్మై తెలిపారు. మంగళవారం జయనగరలో 100వ జన ఔషధ కేంద్రాన్ని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి మన్సుఖ్ మాండవియాతో కలిసి సీఎం ప్రారంభించి మాట్లాడారు. బెంగళూరు ప్రజల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధతో ప్రతి వార్డుకు నమ్మ క్లినిక్ ప్రారంభించామన్నారు. ఇప్పటికే 100 నమ్మక్లినిక్‌లు ప్రారంభించగా మరో 100 నమ్మ క్లినిక్‌లు ఈ వారంలోనే ప్రారంభిస్తామని తెలిపారు. 19 పీహెచ్‌సీ కేంద్రాలకు అప్‌గ్రేడ్ చేస్తామని, నాలుగు సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రులను నిర్మిస్తామని అన్ని చోట్ల జన ఔషధ కేంద్రాలను తెరుస్తామన్నారు. సంచార ఆసుపత్రి, డయాలసిస్ కేంద్రం ప్రారంభించామని, ఆ సమయంలో రోగుల ముఖంలో ఆనందం చూడటంతో సార్థక భావన కలిగిందని తెలిపారు. కార్యక్రమంలో మంత్రి ఆర్.అశోక్, ఎంపీ తేజస్విసూర్య, బెంగళూరు దక్షిణ జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఎస్ఆర్.రమేశ్, మాజీ కార్పొరేటర్ సీకే.రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.



ఫ్రీ మొబైల్ హెల్త్ క్లినిక్ వాహనాలను ప్రారంభిస్తున్న దృశ్యం

చీరల పంపిణీలో తొక్కిసలాట

బనశంకరి: శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర రాజకీయాల్లో గిఫ్ట్ పాలిటిక్స్ జోరందుకున్నాయి. ఓటర్లను ఆకట్టుకోవడానికి రాజకీయ పార్టీలు భారీ కసరత్తు చేస్తున్నాయి. బెళగావి రాయబాగ నియోజకవర్గంలో ఓ కాంగ్రెస్ నేత ఆదివారం చీరలు పంపిణీ చేయడంతో మహిళలు ఎగబడ్డారు. తొక్కిసలాట జరిగి పలువురు గాయపడ్డారు. గ్రామంలోని తోట వద్ద కొత్తగా తవ్విన బావి పూజ కార్యక్రమానికి వేలాదిమంది ప్రజలు వచ్చారు. ఈ సమయంలో మహిళలకు తాంబూలం ఇచ్చే నెపంతో చీరలు పంపిణీ చేశారు. చీరలు పంపిణీ విషయం తెలియగానే మహిళలు పెద్దఎత్తున రావడంతో తొక్కిసలాట జరిగింది. దీంతో పంపిణీని రద్దు చేశారు.

బెళగావిలో మద్యం బంద్

యశవంతపుర: హోలీ పండుగ సందర్భంగా రెండు రోజుల పాటు బెళగావి నగరంలో మద్యం నిషేధించారు. కామదహనం, రంగ పంచమి ఆచరిస్తున్న సందర్భంగా ముందస్తు చర్యల్లో భాగంగా మద్యాన్ని మంగళ, బుధవారం రెండు రోజుల పాటు నిషేధించారు. ఈ మేరకు బార్, వైన్‌షాపు యజమాన్యాలకు పోలీసులు నోటీసులిచ్చారు. శాంతిభద్రతల దృష్ట్యా మంగళవారం తెల్లవారు నుంచి గురువారం తెల్లవారు ఆరు గంటల వరకు నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నట్లు ఎస్పీ ఆదేశాలను జారీ చేశారు.

నేడు బీఎంటీసీలో మహిళలకు ఉచితం

బనశంకరి: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బీఎంటీసీ సంస్థ రాష్ట్ర మహిళలకు తీపి కబురు తెలిపింది. మంగళవారం అర్ధరాత్రి నుంచి రానున్న 24 గంటల వరకు మహిళలకు ఓల్వో బస్సులతో పాటు అన్ని ప్రభుత్వ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చునని సంస్థ ప్రకటించింది. మహిళలను గౌరవించాలనే ఉద్దేశంతో ఒక్కరోజు ఈ వెసులుబాటును కల్పించింది.

ఎమ్మెల్యే మాడాళ్‌కు ఊరట

- లంచం కేసులో ముందస్తు బెయిలు మంజూరు

శివాజీనగర: కర్ణాటక రాష్ట్ర సోప్స్, డిటర్జెంట్ లిమిటెడ్ (కేఎస్‌డీఎల్) సంస్థ మాజీ అధ్యక్షుడు, బీజేపీ ఎమ్మెల్యే మాడాళ్ విరుపాక్షప్పకు ఊరట దక్కింది. సంస్థకు రసాయనాల సరఫరా కోసం కాంట్రాక్ట్ పొందినవారి నుంచి ముడుపులు తీసుకున్న కేసులో మంగళవారం హైకోర్టు ఆయనకు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ముందస్తు బెయిలు కోసం ఆయన సోమవారం అర్జీ దాఖలు చేయడం తెలిసిందే. లంచం స్వీకరించినవారికి- తనకు ఎలాంటి సంబంధం లేదు. అయినా నాపై కేసు నమోదు చేశారు, లోకాయుక్త పోలీసులు నన్ను అరెస్ట్ చేసే అవకాశముంది. కాబట్టి ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని పిటిషన్‌లో కోరారు. న్యాయమూర్తి జస్టిస్ కే.నటరాజన్ విచారణ జరిపారు. షరతులతో బెయిలు మంజూరు చేశారు. విచారణకు లోకాయుక్త అధికారులు పిలిచిన 48 గంటల్లోగా వారి ముందు హాజరుకావాలి. రూ.5 లక్షల బాండ్‌ను ఇవ్వాలి. సాక్ష్యాధారాల నాశనానికి ప్రయత్నించరాదని ఆదేశిస్తూ మార్చి 17కు కేసును వాయిదా వేయడమైనది.

బెయిలు రాగానే ఎమ్మెల్యే ప్రత్యక్షం

బనశంకరి: నేను ఎలాంటి అక్రమ డబ్బు సంపాదించలేదు, నా ఇంట్లో లభించిన నగదు క్రషర్ వ్యాపారిది, వక్కలు విక్రయించగా వచ్చిన ఆదాయం, దీనికి పూర్తి ఆధారాలు ఉన్నాయని ఎమ్మెల్యే మాడాళ విరూపాక్షప్ప చెప్పారు. హైకోర్టులో బెయిల్ రాగానే చెన్నగిరిలో ఆయన ప్రత్యక్షమయ్యారు. గత శుక్రవారం నుంచి కనిపించకుండా పోవడం తెలిసిందే. అభిమానులు పూలమాలలు వేసి నినాదాలు చేశారు. లోకాయుక్త దాడి సమయంలో లభించిన డబ్బు నేను కష్టపడి సంపాదించినదని, నేను ఎక్కడికీ పారిపోలేదని చెప్పారు.

మహిళల మనుగడకు సవాళ్లు



అబలల చైతన్యంపై పాటలు ఆలపిస్తున్న మహిళా నాయకులు

తుమకూరు: సమాజంలో సామాన్య మహిళలకు ఎప్పుడు సరైన గౌరవం లభిస్తుందో అప్పుడు మాత్రమే మహిళా దినోత్సవం వేడుకలకు నిజమైన అర్థం ఉంటుందని జెడ్పీ సీఈఓ డాక్టర్ కే విద్యాకుమారి అన్నారు. రాష్ట్ర మహిళా దౌర్జన్య వ్యతిరేక సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ మహిళ దినోత్సవాన్ని నిర్వహించారు. బీజీఎస్ సర్కిల్ నుంచి అమానికెరె వద్ద ఉన్న గ్లాస్ హౌస్ వరకు మహిళలు ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సమాజంలో స్త్రీలకు మనుగడ అంత సులభం కాదని, అనేక కష్టాలు, నష్టాలు ఉన్నా కూడా భరించి వనితలు పనిచేస్తారని అన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అలాంటి మహిళలకు సమాజంలో సరైన గౌరవం లభించడం లేదని, ఆ గౌరవం దక్కినప్పుడే మహిళా దినోత్సవానికి సార్థకత అని అన్నారు.

కన్నబిడ్డ కోసం లైవ్‌లో విషం తాగి..

- దేవనహళ్లిలో ఓ తల్లి ఆవేదన





బాధితురాలు సుమయబాను ఇక్బాల్

దొడ్డబళ్లాపురం: కన్నబిడ్డ కోసం ఒక తల్లి లైవ్ వీడియో తీస్తూ పురుగుల మందు తాగిన సంఘటన దేవనహళ్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. తుమకూరుకు చెందిన సుమయ్యభాను లైవ్‌లో విషం తాగిన మహిళ. బాధితురాలు సుమయ్యభాను మొదటి భర్త మొహమ్మద్ ఆసిం ఇక్బాల్ దేవనహళ్లి సమీపంలోని ఓజోన్ అర్బానా అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్నాడు. రెండేళ్లక్రితం ఇక్బాల్ కన్న కూతురిపై అత్యాచారయత్నం చేశాడని కేసు నమోదైంది. భర్త చర్యలతో విసిగిపోయిన సుమయ్యభాను అతడికి విడాకులు ఇచ్చి రెండవ వివాహం చేసుకుంది. కోర్టులో మొదటి భర్తకు పుట్టిన కుమార్తెను తల్లి సంరక్షణకు ఇచ్చి అప్పుడప్పుడు కుమార్తెను చూడడానికి అనుమతి ఇస్తూ తీర్పు ఇవ్వడం జరిగింది. ఈ క్రమంలో కొద్ది రోజుల క్రితం కుమార్తెను చూడాలని వచ్చిన ఇక్బాల్ కుమార్తెను తీసుకుని దేవనహళ్లికి వచ్చేశాడు. తరువాత కుమార్తెను తల్లి వద్దకు పంపించలేదు. అనేకసార్లు తన కుమార్తెను తిరిగి ఇవ్వాలని సుమయ్యభాను వేడుకున్నా ఇక్బాల్ కనికరించలేదు. దీంతో కన్నబిడ్డను దక్కించుకోవాలనుకున్న సుమయభాను దేవనహళ్లి వద్ద మొదటి భర్త నివసిస్తున్న అపార్ట్‌మెంట్ వద్దకు వచ్చి వీడియో తీసుకుంటూ లైవ్‌లో విషం తాగింది. అస్వస్థురాలైన ఆమెను స్థానికులు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

క్లుప్తంగా

కైవార తాత జయంతి



గౌరిబిదనూరు: మంగళవారం కైవార నారాయణ తాత జయంతి కార్యక్రమాలు నగరంలో నిరాడంబరంగా నిర్వహించారు. నగరసభలో జరిగిన జయంతి కార్యక్రమంలో అధ్యక్షురాలు రూపా ప్రసంగిస్తూ కైవారం యోగి నారేయణ తాత తన రచనల ద్వారా సమాజంలో నెలకొన్న మౌఢ్యాన్ని తొలగించడానికి ప్రత్నించారని అన్నారు. ముందు జరగబోవు సంగతులను కాలజ్ఞానంలో పొందు పరిచారన్నారు. తాత బోధనలు ఎప్పటికీ మానవాళికి ఆదర్శమని అన్నారు. కార్యక్రమంలో కమిషనర్ గీత, ఇంజనీర్ రామచంద్రప్ప, ఉప తహశీల్దారు లక్ష్మి పాల్గొన్నారు.

మాకు 150 సీట్లు తథ్యం: కటీల్

శివాజీనగర: కొందరు షర్ట్, ప్యాంట్‌ను పోల్చుకొని సీఎం అయ్యే కలలు కంటున్నారని బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు నళిన్‌కుమార్ కటీల్ ఎద్దేవా చేశారు. మంగళవారం మల్లేశ్వరం బీజేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అలాంటివారి కలలు నెరవేరవు. రానున్న శాసనసభ ఎన్నికల్లో బీజేపీ 150కి పైగా నియోజకవర్గాల్లో గెలుపొంది అధికారంలోకి రానుందన్నారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి లక్ష్మీనారాయణ, పలువురు ఇతర పార్టీల నాయకులు బీజేపీలో చేరారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ పరిపాలన నచ్చి బీజేపీలో చేరానని తెలిపారు. హగరిబొమ్మనహళ్లి నియోజకవర్గం టికెట్‌ను కోరుతున్నట్లు తెలిపారు.

గ్యారెంటీ కార్డుల పంపిణీ



కార్డును అందజేస్తున్న దృశ్యం

సాక్షి,బళ్లారి: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రజలకు అందించే పథకాలపై మంగళవారం 35వ వార్డు కార్పొరేటర్ మించు శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్యారెంటీ కార్డులను ఇంటింటికీ పంపిణీ చేశారు. కాంగ్రెస్ అధికారంలో వస్తే రేషన్ కార్డులోని ఒక్కొక్కరికీ 10 కేజీల బియ్యం, గృహ లక్ష్మీ పథకం ద్వారా రూ.2వేలు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందజేస్తారని తెలిపారు.

భారీ విజయం కావాలి: కేంద్రమంత్రి

మైసూరు: వచ్చే ఎన్నికలు బీజేపీకి సెమీ ఫైనల్స్ లాంటివని, ఇందులో గెలిచి అధికారంలోకి రావాలని కేంద్ర విద్యుత్, పారిశ్రామిక శాఖ మంత్రి కృష్ణలాల్ గుర్జర్ అన్నారు. మంగళవారం మైసూరులో ఒక హోటల్లో మౌలిక వసతులు, నగరాభివృద్ధి సమితి అభియాన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ మామూలుగా గెలిస్తే సరిపోదని, సుమారు 150కి పైగా సీట్లను కైవసం చేసుకుని డబుల్ ఇంజిన్ ప్రభుత్వానికి బలం ఇవ్వాలని అన్నారు. ప్రధాని కులం, ధర్మం కంటే కూడా దేశ ప్రగతి కోసం ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు.

భరత్‌రెడ్డికి టికెట్ ఇవ్వాలి

సాక్షి, బళ్లారి: బళ్లారి సిటీ నుంచి కాంగ్రెస్ తరఫున టచ్ ఫర్ లైఫ్ ఫౌండేషన్ అధ్యక్షుడు, మాజీ జెడ్పీ మెంబర్ నారా భరత్‌రెడ్డికి టికెట్ ఇవ్వాలని అఖిల భారత వీరశైవ సమాజం జిల్లాధ్యక్షుడు చానాళ్ శేఖర్, ఏపీ అఖిల భారత వీరశైవ సమాజం ఉపాధ్యక్షుడు శివానందతో పాటు పలువురు లింగాయత్ సమాజ ప్రముఖులు డిమాండ్ చేశారు. మంగళవారం వారు నగరంలోని ఓ హోటల్‌లో విలేకరులతో మాట్లాడారు. భరత్‌రెడ్డికి కాంగ్రెస్ టికెట్ ఇస్తే ఖచ్చితంగా గెలుస్తారన్నారు. తామంతా ఈసారి ఆయనకు అండగా నిలుస్తామన్నారు. ఈసందర్భంగా ప్రముఖులు నరేంద్రబాబు, కొట్రయ్య, తిమ్మనగౌడ, కోళూరు మల్లికార్జునగౌడ, అభి, సుమంగళమ్మ, ఆనందగౌడ, శివకుమార్ పాల్గొన్నారు.

నారా కుటుంబ సభ్యులపై ఫిర్యాదు

సాక్షి బళ్లారి: కురుగోడు మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ సీనియర్ నేత నారాసూర్యనారాయణరెడ్డి, ఆయన తనయులు నారా భరత్‌రెడ్డి, నారా శరత్ రెడ్డిలపై బాధితులు జిల్లా ఎస్పీ రంజిత్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. నగరానికి చెందిన పూర్ణిమారెడ్డి, అరుణారెడ్డి, సునీల్‌కుమార్ అనే ముగ్గురు తమకు నారా కుటుంబ సభ్యుల నుంచి ప్రాణహాని ఉందని తెలిపారు. గ్రానైట్ వ్యాపారంలో తమ తండ్రి దేవరెడ్డితో కలిసి భాగస్వామ్య వ్యాపారంలో తమను మోసం చేసినట్లు వారిపై ఫిర్యాదు చేయడంతో తమను బెదిరిస్తున్నారని లిఖితపూర్వక ఫిర్యాదు అందించినట్లు తెలిపారు.

ప్రశాంతంగా జరుపుకోవాలి




మాట్లాడుతున్న సీఐ సురేష్ తళ్వార్

కంప్లి: హోలీని ప్రశాంతంగా, ఐక్యతతో జరుపుకోవాలని సీఐ సురేష్ హెచ్.తళ్వార్ తెలిపారు. హోలీ సందర్భంగా సోమవారం సాయంత్రం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన శాంతిసమావేశంలో ఆయన మాట్లాడారు. అపరిచితులపై రంగులు వేయరాదన్నారు. రసాయనాలు, చర్మానికి హాని కలిగే రంగులు వాడరాదన్నారు. ఈసందర్భంగా ఎస్ఐలు శారదమ్మ, విజయ్‌ప్రకాష్, వివిధ సమితుల ప్రముఖులు పాల్గొన్నారు.

కోట్ల మందికి కోవిడ్ టీకాలు కేంద్రం ఘనతే

- ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇంటికెళ్లడం గ్యారెంటీ
- కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖా మంత్రి ప్రహ్లాద్ జోషి



లబ్ధిదారులకు చెక్‌ను అందజేస్తున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు

బళ్లారి రూరల్: కరోనా కష్టకాలంలో 2.30 కోట్ల మందికి ఉచితంగా టీకాలు వేసి కాపాడింది నరేంద్ర మోదీ ప్రభుత్వమేనని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. మంగళవారం మున్సిపల్ మైదానంలో ఏర్పాటు చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. దేశంలో 11 కోట్ల ఇళ్లకు మంచినీరు, 3 కోట్ల ఇళ్లకు నీటి సరఫరాను బీజేపీ ప్రభుత్వం జలజీవన్ మిషన్‌ద్వారా అందించిందన్నారు. వచ్చే ఏడాది 4 కోట్ల ఇళ్లకు నీటిని సరఫరా చేస్తామన్నారు. 1.37 కోట్ల పక్కా ఇళ్ల నిర్మాణం, 48 లక్షల మంది వీధివ్యాపారులకు రుణాలు మంజూరు చేసిన ఘనత, 85 ఏళ్ల భారత చరిత్రలో స్వదేశీ వ్యాక్సిన్ తయారు చేసిన పేరు నరేంద్రమోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఈ సందర్భంగా మహిళాశిశు సంక్షేమ శాఖా మంత్రి హాలప్ప ఆచార్ మాట్లాడుతూ రైతులకు, మహిళలకు అనేక పథకాల ద్వారా సాయం అందించినట్లు తెలిపారు. రూ.3.50 కోట్లతో ఉచితబస్ పాస్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు.

రాయల స్వర్ణయుగం మళ్లీ మోదీ పాలనలోనే– మంత్రి శ్రీరాములు

శ్రీకృష్ణదేవరాయల కాలంలోని స్వర్ణయుగం మళ్లీ నరేంద్రమోదీ పాలనలో సాగిందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీరాములు అన్నారు. ఆయన పథకాల లబ్ధిదారుల సమ్మేళనాన్ని ప్రారంభించి మాట్లాడుతూ అంబేడ్కర్, బుద్ధతత్వాలతో కుల, మత తారతమ్యం లేకుండా ప్రజలందరికీ పథకాల ద్వారా ప్రయోజనాన్ని అందించామన్నారు. గ్యారెంటీ, వారెంటీ కార్డులను తాము ఇవ్వటం లేదని పరోక్షంగా కాంగ్రెస్‌ను ఎద్దేవా చేశారు. డబుల్ ఇంజన్ ప్రభుత్వమైన బీజేపీ పాలనలో జిల్లాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం నుంచి 23,570 మందికి వివిధ పథకాల ద్వారా లబ్ధిని అందించినట్లు తెలిపారు. అభివృద్ధి కోసం రూ.1649 కోట్లను వెచ్చించినట్లు తెలిపారు. రైతులకు ఏడాదికి రూ.6వేలు ఇవ్వడానికి రూ.4కోట్లను జమ చేసినట్లు తెలిపారు. కిసాన్ క్రెడిట్ కార్డు ఉన్న రైతులకు రూ.10వేలు ఇచ్చినట్లు తెలిపారు.

32 వేల ఇళ్ల పట్టాలు పంపిణీ చేశాం–ఎమ్మెల్యే

నగరంలో 32 వేల ఇళ్లపట్టాలు పంపిణీ చేసినట్లు ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మున్సిపల్ పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ఇప్పుడు కూడా పట్టాల పంపిణీని ముగించుకొని ఈ కార్యక్రమానికి హాజరైనట్లు తెలిపారు. డీఎంఎఫ్ నిధులతో అనంతపురం రోడ్డు విస్తరణ పనులు ఆరంభమయ్యాయన్నారు. అత్యంత సుందరంగా గడిగి చెన్నప్ప సర్కిల్‌లో క్లాక్ టవర్ రూపుదిద్దుకొంటోందన్నారు. నగరంలో రోడ్లు, మురుగునీటి కాలువల నవీకరణ, పాఠశాల గదుల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. నగర వీధుల్లో విద్యుత్ స్తంభాలకు ఎల్ఈడీ బల్బుల ఏర్పాటు తదితర అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. తాను చదువుకొన్న మున్సిపల్ పాఠశాలలోను ఆధునాతన తరగతి గదుల నిర్మాణం పూర్తి చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్‌ను గ్యారెంటీగా ఇంటికి పంపించండని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ దేవేంద్రప్ప, మాజీ ఎంపీ శాంత, ప్రముఖులు జీ.విరుపాక్షగౌడ, ఎమ్మెల్సీ వైఎం. సతీష్, ఏపీఎంసీ అధ్యక్షుడు యూ.బసవరాజు, జిల్లాధికారి పవన్‌కుమార్, బుడా అధ్యక్షుడు మారుతీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వంతెన పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బసనగౌడ

రాయచూరు రూరల్: గ్రామాల్లో అభివృద్ధి పనుల పూర్తికి ప్రజల సహకారం అవసరమని గ్రామీణ ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ పేర్కొన్నారు. మంగళవారం చిక్కసూగూరు వద్ద వంతెన పనులను పరిశీలించి ఆయన మాట్లాడారు. గ్రామాలకు సంచరించడానికి వీలు కలిగేలా పనులను సత్వరం పూర్తి చేయాలని అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచించారు.

ఆర్‌సీబీతో ఒప్పందం

బనశంకరి: సౌందర్య సాధనాలు, ఉపకరణాల ఉత్పత్తి సంస్థ వేగా, మహిళా ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్)లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టుతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపింది. తన మొదటి క్రీడా బాగస్వామిగా ప్రకటించింది. వేగా ప్రధాన మార్కెటింగ్ అధికారి ఈతి సింపాల్ మాట్లాడుతూ ఆర్‌సీబీకి మద్దతుగా నిలుస్తామని, హేర్ డ్రైయర్లు, హేర్‌కలర్స్, స్కేలర్స్, ఫేస్‌కేర్, ట్రిమర్లు తదితర ఉత్పతులకు ప్రచారకర్తలుగా ఉంటారని తెలిపారు.

మిన్నంటిన హోలీ సంబరాలు



హోలీ సంబరాల్లో పాల్గొన్న యువతులు

బళ్లారి అర్బన్: నగరంలోని మంగళవారం హోలీ సంబరాలను ఆయా వీధుల్లో ఘనంగా జరుపుకొన్నారు. హోలీ సందర్భంగా కాలనీల్లో చిన్నారులు, యువతీ యువకులు ముఖాలకు రంగులను అంటించుకొని, రంగు నీటిని ఒకరిపై మరొకరు చల్లుకొని హోలీ పండుగను ఆచరించారు. బెంగళూరు రోడ్డులో మార్వాడీ వ్యాపారులు, మహిళలు హోలీ సంబరాల్లో పాల్గొన్నారు.



ఉట్టిని పగులగొడుతున్న యువకులు

రాయచూరు రూరల్ : జిల్లాలో రంగుల హోలీ కేళిని ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. నగరంలోని బెస్త వారపేట ఉప్పార సమాజం ఆధ్వర్యంలో సోమవారం రాత్రి కామదహనం చేశారు. మంగళవారం ప్రజలు హోలీ ఆడుతూ రంగులు చల్లుకున్నారు. బంగికుంటలో ఉట్టిని పగలగొట్టే పోటీలు నిర్వహించారు.

నిందితుల అరెస్ట్ కోసం ధర్నా



ఆందోళనలో పాల్గొన్న విరుపాక్షి

రాయచూరు రూరల్: దేవదుర్గ తాలూకా జేడీఎస్ కార్యకర్తలపై దాడి చేసిన నిందితులను బంధించాలని జిల్లాధ్యక్షుడు విరుపాక్షి డిమాండ్ చేశారు. ఆయన సోమవారం రాత్రి ఎస్పీ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టి మాట్లాడారు. ఆదివారం దేవదుర్గ తాలూకా జాలహళ్లిలో జేడీఎస్ పంచరత్న యాత్ర, ఇంటింటికీ కుమారణ్ణ నినాదంపై ప్రచార జాతా నిర్వహిస్తుండగా అభ్యర్థిని కరెమ్మపై దాడి చేసిన బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలను అరెస్ట్ చేయాలని కోరుతూ ఎస్పీకి వినతిపత్రం సమర్పించారు. ఆందోళనలో నగర అభ్యర్థి వినయ్‌కుమార్, నరసింహనాయక్, శివశంకర్, మహంతేష్ పాటిల్, తిమ్మారెడ్డి, లక్ష్మిపతి, యూసఫ్‌ఖాన్‌లున్నారు.

సహకార సంఘాల బలోపేతం

మైసూరు: రాష్ట్రంలో ఉన్న సుమారు 5,700కు పైన ఉన్న ప్రాథమిక కృషి పత్తిన సహకార సంఘాలకు ఒక సాఫ్ట్‌వేర్ తయారీకి రూ. 40 కోట్లను మంజూరు చేసినట్లు సహకార శాఖ మంత్రి ఎస్.టి.సోమశేఖర్ అన్నారు. మంగళవారం మహారాజ కళాశాల మైదానంలో ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల సమ్మేళనాన్ని నిర్వహించారు. సంఘాల ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్, కళ్యాణ మండపాలు కూడా నిర్వహించే చేస్తామన్నారు.

కనువిందుగా దొడ్డబసవేశ్వర రథోత్సవం



పాల్గొన్న అశేష భక్తజన సందోహం

కంప్లి: కురుగోడులోని అతిపెద్ద 13 అడుగుల ఎత్తుగల ఏకశిలా దొడ్డబసవేశ్వరుడి జాతర, రథోత్సవం మంగళవారం కన్నులపండువగా జరిగింది. రథోత్సవం సందర్భంగా రాష్ట్ర నలమూలల నుంచి లక్షలాది సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా అమరనారాయణ రథోత్సవం

కోలారు : కైవార క్షేత్రంలోని ప్రసిద్ధ అమరనారాయణస్వామి బ్రహ్మ రథోత్సవ వేడుకలను మంగళవారం హోలీ పున్నమి సందర్భంగా వైభవంగా నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చి స్వామి దర్శనం చేసుకున్నారు. రథాన్ని వివిధ రకాల పూలతో అలంకరణ చేశారు. రథ శాంతి హోమం తదితర పూజలను నిర్వహించారు. శ్రీకృష్ణ గంధోత్సవ సేవ అనంతరం సర్వాంగ సుందరంగా అలంకరించిన రథంలో శ్రీదేవి, భూదేవి సమేత ఉత్సవ విగ్రహాలను ఉంచి ఊరేగించారు. భక్తులు రథంపైకి అరటి పండ్లు విసిరి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థప్రసాద వితరణ జరిగింది.

శ్రీనివాసపురంలో..

శ్రీనివాసపురం : తాలూకాలోని మద్దేరిలో యోగా లక్ష్మీనరసింహస్వామి రథోత్సవ వేడుకలను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. రథోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించిన రథంలో స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ప్రతిష్టించి గ్రామంలో ఊరేగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు రథోత్సవంలో పాల్గొన్నారు.

13న రైల్వే క్రియా సమితి ఢిల్లీ పయనం



మాట్లాడుతున్న కేఎం.మహేశ్వరస్వామి

బళ్లారి టౌన్: రైల్వే డిమాండ్ల పరిష్కారం కోసం ఈనెల 13న కర్ణాటక రైల్వే క్రియా సమితి బృందం ఢిల్లీకి వెళ్తున్నట్లు సమితి రాష్ట్ర అధ్యక్షుడు కేఎం.మహేశ్వరస్వామి పేర్కొన్నారు. మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం నడుస్తున్న ప్రత్యేక రైళ్లను పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేస్తామన్నారు. గతంలో ఈ రైళ్లు పర్మనెంటు రైలుగా ఉండేవని, అయితే కరోనా కారణంగా స్తంభింప చేసిన రైళ్లను ప్రస్తుతం ప్రత్యేక రైళ్లుగా నడుపుతున్నందున ప్రయాణికులపై అదనంగా చార్జీలు పడుతున్నాయన్నారు. బళ్లారి నుంచి ఇతర మార్గాలకు రైళ్లను నడపాలని, బళ్లారి రైల్వేస్టేషన్‌లో మరో గూడ్స్ రైళ్ల స్టేషను, బైపాస్ రైల్వే స్టేషను, మరో రెండు ప్లాట్‌ఫారాలను నిర్మించాలని, మోతీ సర్కిల్ నుంచి కోట ప్రాంతానికి స్కైవాక్ వంతెన నిర్మించాలనే డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని రైల్వే మంత్రికి, రైల్వే మండలికి సమర్పిస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా సమితి నేతలు హాలేశ్వర గౌడ, బండేగౌడ తదితరులు పాల్గొన్నారు.

ముఠా దాడిలో వ్యక్తికి గాయాలు

హుబ్లీ: నిష్కారణంగా వ్యక్తిపై ముఠా దాడికి పాల్పడిన ఘటన సోమవారం రాత్రి హుబ్లీలోని మహబూబ్ నగర్ యల్లాపుర వీధిలో చోటు చేసుకుంది. కాగా ఈ దాడి దృశ్యాలు అక్కడే ఉన్న అంగడి బయట ఉన్న సీసీ టీవీ కెమెరాలో నిక్షిప్తమయ్యాయి. మైను అనే యువకుడిపై సమీర్ ముఠా దాడి చేసింది. మహబూబ్ నగర్‌లో మెడికల్ షాపు బంద్ చేసుకొని వెళ్తుండగా సమీర్ ముఠా మైనుతో గొడవకు దిగింది. దాడికి కారణాలు తెలియరాలేదు. ముందుగా ఓ వ్యక్తి బాధితుడిని అడ్డుకొని వాగ్వాదానికి దిగడం కనిపించింది. గాయపడిన మైనును హుబ్లీ ఆస్పత్రిలో చేర్పించి బెండిగేరి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

కోతుల దాడిలో మహిళకు గాయాలు



గాయపడిన హులిగమ్మ

కంప్లి: రామసాగర గ్రామంలో కోతుల దాడులు నానాటికీ పెచ్చు మీరి ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలోని 5వ వార్డులో ఒక వీధిలో వ్యవసాయ కూలీ తళవార హులిగమ్మపై కోతులు దాడి చేసి శరీరమంతా గాయపరిచాయి. మిద్దెపై పని చేసుకుంటున్న సమయంలో ఈ ఘటన జరిగి నిచ్చెన మీదుగా కిందికి దిగుతుండగా కిందపడి చేతికి, నుదుటిపైన గాయాలయ్యాయి. గోరు చుట్టుపై రోకలి పోటులా కోతుల దాడికి గాయాలై ఒక వైపు నిచ్చెన నుంచి కిందపడి మరో వైపు గాయపడింది. గ్రామస్తులు దానశెట్టి విరుపాక్షి, డీ.పంపణ్ణ, ఉజ్జిని గాళేష్, జడేష్‌లు ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ అటవీ శాఖాధికారులు గ్రామంలోని కోతులను పట్టి దూరంగా తరలించాలని ఒత్తిడి చేశారు.

అత్యుత్తమ మహిళ అవార్డుకు శాంతమ్మ ఎంపిక



శాంతమ్మ

రాయచూరు రూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అత్యుత్తమ మహిళగా నగరంలోని నూతన ఆశ్రయ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం–3లో విధులు నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త శాంతమ్మ ఎంపికైన నట్లు మహిళా శిశు అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరక్టర్ చేతన్ కుమార్ తెలిపారు. ఈనెల 8వ తేదీన బెంగళూరులోని రవీంద్ర కళాక్షేత్ర ఆడిటోరియంలో జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై, మహిళా శిశు సంక్షేమ శాఖా మంత్రి హాలప్పాచారి, మరో మంత్రి శశికళ జొల్లె చేతుల మీదుగా ఈ అవార్డును శాంతమ్మకు అందజేసి సత్కరిస్తారని ఆయన ఓ ప్రకటనలో తెలిపారు.

యోగి నారాయణ సేవలు అపారం



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే తదితరులు

బళ్లారి అర్బన్: కాలజ్ఞాని యోగి నారాయణ జయంతి సందర్భంగా మంగళవారం వడ్డరబండలోని బలిజ కళ్యాణ మండపం నుంచి బలిజ సమాజ బాంధవుల సమక్షంలో యోగినారాయణ చిత్రపటానికి ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి, మేయర్ రాజేశ్వరి, సమాజ ప్రముఖులు పూజలు నిర్వహించి ఊరేగించారు. అనంతరం సభాంగణంలో ఏర్పాటు చేసిన కాలజ్ఞాని యోగి నారాయణ 297వ జయంతిని ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. కాలజ్ఞాని యోగినారాయణ సేవలు అపారమన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. పలువురిని ఘనంగా సత్కరించి ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో బలిజ సంఘం అధ్యక్షుడు మురళి, కార్యదర్శి రమేష్ బుజ్జి, సమాజ ప్రముఖులు పాల్గొన్నారు.

కంప్లిలో..

కంప్లి: రాష్ట్ర బలిజ సమాజాన్ని కేటగిరి 2ఏలో చేర్చేందుకు ప్రభుత్వం ఆసక్తి చూపాలని రామసాగర బలిజ సమాజ అధ్యక్షులు జీకే. వామదేవప్ప తెలిపారు. గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన యోగినారాయణ యతీంద్ర 297వ జయంతిలో ఆయన మాట్లాడారు. బలిజ సమాజ భవన నిర్మాణం, యోగి నారాయణ యతీంద్ర దేవస్థాన నిర్మాణానికి స్థలం అందించేందుకు పంచాయతీ కృషి చేయాలన్నారు. ఈసందర్భంగా టీఏ. లోకేష్, భరత్, జీ.శరణప్ప, సిబ్బంది హనుమంతప్ప, సోమశేఖర్, అంబిక, పంపాపతి పాల్గొన్నారు. తాలూకా కార్యాలయంలో కూడా నిర్వహించిన జయంతిలో ప్రముఖులు కవితాళ బసవరాజు, ఇంగళిగి నారాయణ, కే.శంకర్, మహిళా సంఘం అధ్యక్షురాలు శారదమ్మ లోకేష్, పదాధికారులు సావిత్రమ్మ, సునంద, పద్మావతమ్మ పాల్గొన్నారు.

హొసపేటలో..

హొసపేటె: యోగినారాయణ జయంత్యుత్సవాన్ని మంగళవారం జిల్లాధికారి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. యోగినారాయణ చిత్రపటానికి తహసీల్దార్ కార్తీక్ పూలమాలలు వేసిన అనంతరం మాట్లాడుతూ యోగినారాయణ సమాజంలో నెలకొన్న ఒడిదొడుకులను అరికట్టేందుకు నిరంతరంగా కృషి చేశారని కొనియాడారు. యోగి నారాయణ అడుగుజాడల్లో నడవాలని కోరారు. ఈసందర్భంగా తహసీల్దార్ మేఘ, బలిజ సంఘం అధ్యక్షుడు రవికుమార్, కాళిదాసు, గీతా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కోలారు వార్తలు...

ఓటు హక్కుపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరాజ

కోలారు: త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు హక్కు ఎలా వినియోగించాలో ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగించాలని జిల్లా కలెక్టర్ వెంకటరాజ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఈవీఎంల వినియోగం, వీవీ ప్యాట్ పనితీరుపై ఎన్నికల అధికారులు, రాజకీయ పార్టీలు, మీడియా ప్రతినిధులకు అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈసారి ఎం–3 పేరుతో కూడిన ఓటరు యంత్రాలను ఉపయోగిస్తున్నారు. వీటి గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ఈ ఓటరు యంత్రంలో ఒకేసారి ఒక అసెంబ్లీ నియోజకవర్గంలో గరిష్ట అభ్యర్థుల వరకు ఓటు వేయడానికి కంట్రోల్ యూనిట్‌తో అవకాశం కల్పించారన్నారు. ఎస్పీ ఎం నారాయణ, సీఈఓ యుకేష్‌కుమార్, అదనపు ఎస్పీ భాస్కర్‌లు పాల్గొన్నారు.

మహిళలకు క్రీడాపోటీలు

కోలారు: నగరంలోని జూనియర్ కళాశాల మైదానంలో మంగళవారం మార్చి 8న నిర్వహించే మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని క్రీడా పోటీలను నిర్వహించారు. పోటీలను ప్రారంభించి స్త్రీ శిశు సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ గోవిందగౌడ మాట్లాడుతూ క్రీడా పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొంటుండడం హర్షణీయమన్నారు. నేడు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. మహిళా సంక్షేమం కోసం అనేక పథకాలను అమలవుతున్నాయి. వివిధ రంగాల్లో మహిళలు రాణించడానికి విపులంగా ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. యువ సబలీకరణ, క్రీడాశాఖ ఏడీ శశికళ, జిల్లా వ్యాయామ శిక్షకులు మంజునాథ్, మురళీమోహన్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థానాలను చేరాలి

శ్రీనివాసపురం: విద్యార్థులు ప్రభుత్వ పథకాలను వినియోగించుకుని ఉన్నత స్థానాలకు చేరాలని కేవీఐసీ అసిస్టెంట్ డైరెక్టర్ కెంపరాజు తెలిపారు. మంగళవారం దళసనూరులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన జాగృతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నేడు ఐటీఐ విద్యార్థుల కోసం కేంద్రం అనేక స్వయం ఉపాధి పథకాలను అందిస్తోందన్నారు. కార్యక్రమంలో కేవీఐసీ టెక్నికల్ ట్రైనర్ శశికాంత్, ప్రిన్సిపాల్ వీరణ్ణ హళకట్టి, బోధకుడు ఎంఎం వెంకటేష్, హెచ్ఆర్ సుబ్రమణ్యం, కావ్య, లక్ష్మీనారాయణగౌడ తదితరులు పాల్గొన్నారు.

మరోసారి సేవాభాగ్యం కల్పించండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రూపా శశిధర్

కేజీఎఫ్: గత ఐదేళ్లుగా నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనులను గుర్తించి మరోసారి సేవ చేసే అవకాశం కల్పించాలని ఎమ్మెల్యే రూపా శశిధర్ ప్రజలను కోరారు. మంగళవారం ఎన్‌జీ హుల్కూరు జీపీలోని గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో ఆమె మాట్లాడారు. తాలూకా కేంద్రంలో రూ.12 కోట్లతో తహసీల్దార్ కార్యాలయంతో పాటు ప్రభుత్వ భవనాలకు స్వంత కట్టడాలను నిర్మించామన్నారు. నగరంతో పాటు తాలూకాలోని అన్ని గ్రామాల్లో మౌలిక సౌకర్యాలను కల్పించామన్నారు. రాష్ట్రంలో తమ పార్టీ అధికారంలో లేకున్నా ప్రభుత్వంతో పోరాడి నిధులను తెచ్చానన్నారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాధాకృష్ణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్వరలో లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నంజేగౌడ

మాలూరు: ఆశ్రయ పథకం కింద 1369 మంది లబ్ధిదారులకు త్వరలో ఇళ్ల స్థలాల హక్కు పత్రాలను అందిస్తామని ఎమ్మెల్యే కె వై నంజేగౌడ తెలిపారు. మంగళవారం పురసభ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆశ్రయ సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. నోటీసు బోర్డులో ప్రకటించిన జాబితాలోని లబ్ధిదారులందరికీ లాటరీ ద్వారా స్థలాలను అందిస్తారన్నారు. ఎలాంటి అవకతవకలు లేకుండా లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా చేపట్టారన్నారు. ప్రస్తుతం అన్ని అడ్డంకులు తొలగినందున ఇళ్ల స్థలాల పంపిణీ తేదీని ప్రకటిస్తారన్నారు. ఈ సందర్భంగా పురసభ అధ్యక్షురాలు ఎస్ మంజునాథ్, ముఖ్యాధికారి పవన్‌కుమార్, అధికారి మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

పర భాషల దాడితో వెనుకంజ

కోలారు: సరిహద్దు జిల్లాల్లో ఇతర భాషల ప్రభావం, ఆంగ్ల భాషపై వ్యామోహంతో పాటు హిందీని రాష్ట్ర ప్రజలపై రుద్దడం వల్ల కన్నడ భాష వెనుకబడుతోందని కన్నడ జాగృతి వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కె మంజునాథ్ దేవ ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం చెన్నయ్య రంగమందిరంలో నిర్వహించిన గడినాడు కన్నడ జాగృతి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. అనంతరం కన్నడ భాషాభివృద్ధికి సేవలందించిన వారిని సన్మానించారు. వేదిక గౌరవ అధ్యక్షుడు కుమారస్వామి, జిల్లా అధ్యక్షుడు రమేష్‌గౌడ, మహిళా అధ్యక్షురాలు నాగరత్న పాల్గొన్నారు.

నియామకం

కోలారు: రూరల్ అసెంబ్లీ అధ్యక్షురాలిగా సి శాంతను నియమిస్తూ మంగళవారం కాంగ్రెస్ కార్యాలయంలో మాజీ ఎంపీ కెహెచ్ మునియప్ప నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నెరవేర్చాలన్నారు. బీసీ సెల్ ఉపాధ్యక్షుడు ఎస్.మంజునాథ్, కార్యాధ్యక్షుడు యూ.శ్రీనివాస్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు జయదేవ్, మహిళా అధ్యక్షురాలు రత్నమ్మ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రసాద్‌బాబు పాల్గొన్నారు.

సమానత కోసం పోరాడదాం



మాట్లాడుతున్న హెచ్‌ఎం శైలజ

గంగావతి: మహిళలపై నేటికీ వివక్షతకు వారికి సమాజంలో సమానత లభించకపోవడమే కారణమని మహిళా విభాగ నాయకురాలు హెచ్‌ఎం.శైలజ పేర్కొన్నారు. ఆమె నగరంలో కన్నడ సాహిత్య సమ్మేళన వేదికపై ఏర్పాటు చేసిన మహిళా గోష్టిలో మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, ఇతర రంగాల్లో వెనుకబాటును అనుభవిస్తున్నారన్నారు. అందుకే మహిళా లోకం చైతన్యవంతులై సమానత్వం కోసం పోరాటం చేయాలన్నారు. సమ్మేళన అధ్యక్షులు సీహెచ్.నారినాళ్ అధ్యక్షత వహించగా ప్రిన్సిపాల్ ఎం.జగదేవి, ప్రముఖ సాహితీవేత్తలు రుద్రమ్మ హాసినాళ్, డాక్టర్ సోమక్క, లలిత కర్నకల్లు వివిధ అంశాలపై ఉపన్యసించారు.

క్లుప్తంగా

ఇంటి వద్దకే కావేరి తీర్థం

మైసూరు: మడికేరిలో కావేరి జన్మస్థలమైన తల కావేరి పవిత్ర క్షేత్రానికి చెందిన ప్రసాదం, తీర్థం పంపిణీని మడికేరి కలెక్టర్ బీసీ సతీశ్ మంగళవారం ప్రారంభించారు. మంగళవారం మడికేరిలో ఉన్న జిల్లాధికారి కార్యాలయం సమావేశం హాల్లో ఈ–ప్రసాదం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... హిందూ ధార్మిక సంస్థలు, ధర్మదాయ దత్తి, దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో పోస్టాఫీసు ద్వారా ఈ–ప్రసాదం ఆన్‌లైన్ ద్వారా పొంద వచ్చు. ఇంటి వద్దకే పోస్టు ద్వారా వస్తుంది. ప్రసాదంలో కావేరి తీర్థం, పంచకజ్జాయ, కుంకుమ, శ్రీగంధం ఉంటుందని తెలిపారు.

సమాన హక్కులు కల్పించాలి



తుమకూరు: సుస్థిరమైన భారత్ నిర్మాణం జరగాలంటే మహిళలకు సమాన అవకాశాలు కల్పించాలని జెడ్పీ సీఈఓ విద్యాకుమారి అన్నారు. మంగళవారం తుమకూరు నగరంలోని జిల్లా ఆస్పత్రి ఆవరణంలో ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా యంత్రాంగం, జిల్లా పంచాయతీ, జిల్లా ఆరోగ్య శాఖ, వివిధ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా దినోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా సైక్లోథాన్ జాతాను ఆమె జెండా ఊపి ప్రారంభించారు.

పేకాటరాయుళ్లు అరెస్ట్

దొడ్డబళ్లాపురం: దొడ్డ తాలూకా దడిఘట్టమడుగు గ్రామంలో నిర్జనప్రదేశంలో కొందరు పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు హొసహళ్లి ఎస్సై విజయలక్ష్మి సిబ్బందితో కలిసి దాడి చేసారు. దాడిలో ఐదుగురిని అరెస్ట్ చేసి రూ.8180 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు.

రిటైర్డ్ పోలీస్ అనుమానాస్పద మృతి

దొడ్డబళ్లాపురం: రిటైర్డ్ పోలీసు ఒకరు బెంగళూరు మెజెస్టిక్ వద్ద అనుమానాస్పదంగా మృతి చెందాడు. దొడ్డబళ్లాపురం తాలూకా మధుర నహొసహళ్లికి చెందిన మునిఆంజనేయ అనే వ్యక్తి బెంగళూరు సిటీ మెజెస్టిక్ బస్టాండ్ వద్ద మృతి చెందాడు. సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు ఇంటి నుంచి స్నేహితులతో కలిసి ధర్మస్థలం వెళ్లాలని బయలుదేరి వెళ్లిన మునిఆంజనేయ మంగళవారం తెల్లవారుజామున మెజెస్టిక్ వద్ద శవమై కనిపించాడు. ముని ఆంజనేయ వద్ద ఉన్న నగలు, నగదు కనిపించలేదు. దీంతో మునిఆంజనేయ మృతిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉప్పారపేట పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఘనంగా బ్రహ్మ రథోత్సవం



దొడ్డబళ్లాపురం: దొడ్డ తాలూకా తూబుగెరె గ్రామంలోని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి దేవాలయంలో మంగళవారం బ్రహ్మరథోత్సవం ఘనంగా జరిగింది. మంగళవారం మధ్యాహ్నం అభిజన్ లగ్నంలో రథోత్సవం జరిపించారు. రథోత్సవం తిలకించడానికి తాలూకాలోని గ్రామాల నుంచి పక్క జిల్లాల నుంచి కూడా భక్తులు వేలాదిగా తరలివచ్చారు. రథోత్సవంలో భాగంగా దేవాలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. దేవనహళ్లి ఎమ్మెల్యే నిసర్గ నారాయణస్వామి, దొడ్డబళ్లాపురం తహసీల్దార్ మోహనకుమారి, సబ్ తహసీల్దార్ వెంకటేశ్, మాజీ ఎమ్మెల్యే వెంకటస్వామి, మాజీ ఎమ్మెల్యే నరసింహస్వామి తదితరులు హాజరయ్యారు.

బనశంకరీదేవికి విశేష అలంకరణ



బనశంకరి: కదిరి పౌర్ణమి, హోలీ సందర్భంగా బనశంకరీదేవి విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవారం వేకువజామున సుప్రభాతసేవ అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు సత్యనారాయణశాస్త్రి, చంద్రమోహన్ అమ్మవారికి అభిషేకం, అర్చనలు చేపట్టి విశేష అలంకరణ పూజలు చేశారు.

విధానసౌధలోకి మద్యం !

బనశంకరి: విధానసౌధ కెంగల్ గేట్ వద్ద మద్యం తీసుకువస్తూ పొరపాటుగా అది కిందపడి పగిలిపోవడంతో ఓ కానిస్టేబుల్ బండారం బయటపడింది. మంగళవారం కానిస్టేబుల్ తన బ్యాగులో మద్యం బాటిల్ దాచి పెట్టుకుని వెళుతుండగా ఒక్కసారిగా చేయి జారి కిందపడటంతో ముక్కలైంది. వెంటనే వాటిని ఎత్తుకుని పారిపోయాడు. మీడియా వచ్చేలోపు అదృశ్యమయ్యాడు. కానిస్టేబుల్ పేరు తెలియరాలేదు.

25న చిక్క జిల్లాకు ప్రధాని రాక

చిక్కబళ్లాపురం: నగరం సమీపంలోని ముద్దేనహళ్లి గ్రామంలో రూ. 350 కోట్లతో నిర్మించిన వైద్య కళాశాలను ఈనెల 25న ప్రధాని మోదీ ప్రారంభిస్తారని సత్యసాయి ట్రస్ట్ ప్రతినిధి తెలిపారు. 350 పడకల ఆస్పత్రి ఇప్పటికే నిర్వహణలో ఉందని, రోగులు చికిత్స పొందుతున్నారు. దీనికి అనుబంధంగా సత్యసాయి గ్రామంలో వైద్య కళాశాలను నిర్మించారు. కళాశాలకు సత్య రాజేశ్వరి భవనంగా నామకరణం చేశారు.

రమణీయం.. శ్రీనివాసుడి రథోత్సవం



ఉత్సవ మూర్తికి పూజలు చేస్తున్న దృశ్యం, చిత్రంలో ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి



అగర వీధుల్లో ముందుకు కదులుతున్న రథం

- అగరలో మారుమోగిన గోవింద నామస్మరణ

బొమ్మనహళ్లి: నగరంలోని బొమ్మనహళ్లి హెచ్ఎస్ఆర్ లేఔట్ అగర గ్రామంలో శ్రీనివాసుడి బ్రహ్మరథోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఆలయ అర్చకులు అనంతపురం చంద్రమౌళి ఆధ్వర్యంలో పది మంది అర్చకులు తెల్లవారుజామునే స్వామి వారికి ప్రత్యేక అలంకరణలు, పూజలు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తికి ప్రత్యేక అలంకరణ చేసి రథంపై అధిష్టించారు. ఈ సందర్భంగా ఆలయ ట్రస్టీ విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే ఎం.సతీష్ రెడ్డి, సినీ నిర్మాత ఉమాపతి శ్రీనివాస్‌గౌడ, మాజీ కార్పొరేటర్ గురుమూర్తి రెడ్డి, శ్రీసాయిరామ్ విద్యాసంస్థల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఇబ్బలూరు మునిరాజు రథానికి పూజలు చేశారు. అనంతరం భక్తులు రథాన్ని లాగారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు రమేశ్‌రెడ్డి, శేఖర్ రెడ్డి అన్నదానం చేశారు.

రక్తదాతలకు సన్మానం



మైసూరు: ఆరోగ్యవంతమైన సమాజంతోనే అభివృద్ధి సాధ్యమని మైసూరు నగర నగర బీజేపీ మహిళ మోర్చ అధ్యక్షురాలు హేమా నందీష్ అన్నారు. మంగళవారం నగరంలోని న్యూ సయ్యాజీ రావు రోడ్డులో ఉన్న జీవధార రక్తనిధి కేంద్ర ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం సందర్భంగా ఆరోగ్య రక్షణ కోసం భారత్ అనే అంశంపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 20 సార్లు రక్తదానం చేసిన మహిళలను సన్మానించారు. డాక్టర్.సంగీత, నళిని, ఊర్మిళ, ఉన్నికృష్ణ, నందిని, ఆశా, జైన్, సోనాల్, వింధ్యా మదన్, పూనం, సింధూ, రాధిక, పవిత్రలను సన్మానించారు.

భార్యపై కొడవలితో దాడి



గాయపడిన చంద్రమ్మ

విజయపుర(బెంగళూరు గ్రామీణ): గొడవపడి భర్త కొడవలితో దాడి చేయడంతో భార్యకు గాయాలయ్యాయి. విజయపుర పరిధిలో ఉన్న గొబ్బరగుంటె గ్రామంలో సోమవారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. మునికృష్ణప్ప(48) భార్య చంద్రమ్మ (45)కు మధ్య గొడవలతో కొంతకాలంగా విడివిడిగా ఉంటున్నారు. వీరికి ముగ్గురు పిల్లలు ఉండగా, తల్లి వద్దే ఉంటున్నారు. మాట్లాడాలని చెప్పి భార్య ఇంటికి వెళ్లిన భర్త కొడవలితో ఆమెపై దాడి చేశాడు. ఆమె చేతులు అడ్డుపెట్టడంతో గాయాలయ్యాయి. దుండగుడు పరారయ్యాడు. బాధితురాలిని బెంగళూరు విక్టోరియా ఆస్పత్రికి తరలించారు.

మండ్యలో జోరుగా విజయ సంకల్ప యాత్ర



మండ్య: మండ్య జిల్లాలో బీజేపీ చేపట్టిన విజయ సంకల్ప యాత్ర జోరుగా సాగుతోంది. మంగళవారం మండ్య నగరంలోని బన్నూరు రోడ్డులో ఉన్న శ్రీకన్నికా దేవాలయం వద్ద పూజలు నిర్వహించిన కేంద్ర మాజీమంత్రి, మాజీ సీఎం డివి.సదానందగౌడ వందలాది మంది కార్యకర్తలతో భారీ బైక్ ర్యాలీ రోడ్డు షో నిర్వహించారు. నగరంలో నోరడి రోడ్డు మీదుగా బార్ సర్కిల్, హోసహళ్లి సర్కిల్, విశ్వేశ్వరయ్య రోడ్డు మార్గంలో మహావీర సర్కిల్‌కు చేరుకున్నారు. మధ్యలో కార్యకర్తలు పూలవర్షం కురిపించారు.

అర్కేశ్వర స్వామి తేరు ఉత్సవం



మండ్య: మండ్య నగరంలోని గుత్తలు లేఔట్‌లో ఉన్న శ్రీ అర్కేశ్వర స్వామి రథోత్సవం మంగళవారం వేలాది మంది భక్తుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. రథోత్సవానికి ముందు ఆలయంలో వివిధ ధార్మిక పూజలు చేశారు.

అరకలగూడు నుంచి జేడీఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తా

యశవంతపుర: వచ్చే విధానసభ ఎన్నికల్లో జేడీఎస్ అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు మాజీ మంత్రి ఎ.మంజు అధికారికంగా ప్రకటించుకున్నారు. అరకలగూడు తాలూకా హన్యాళులో తన మద్దతుదారులతో సమావేశం నిర్వహించి రాజకీయ భవిష్యత్‌పై చర్చించారు. అనంతరం జేడీఎస్ అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు ప్రకటించారు. గెలిపిస్తామంటూ కార్యకర్తలు ప్రమాణం చేశారు. అరకలగూడు నుంచి పోటీ చేస్తామని ప్రకటించగానే దేవెగౌడ, కుమారస్వామి జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు.

గరుడ వాహనంపై ఊరేగిన నృసింహుడు



కదిరి: అశేష భక్తజన గోవింద నామస్మరణల మధ్య శ్రీ ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి మంగళవారం రాత్రి గరుడ వాహనంపై తిరువీధుల్లో తన భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాలకు అధిపతి అయిన బ్రహ్మదేవుడు తన ఇష్ట వాహనమైన గరుత్మంతుని నారసింహుడికి వాహనంగా పంపుతారని, అందుకే ఈ ఉత్సవాన్ని బ్రహ్మ గరుడ సేవ అంటారని ఆలయ ప్రధాన అర్చకులు నరసింహాచార్యులు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో సమస్త వాహనాల్లో సర్వ శ్రేష్ఠమైన గరుడ వాహనంపై స్వామివారిని దర్శించుకుంటే స్వర్గం ప్రాప్తిస్తుందని, ఇహపరమైన ఈతి బాధల నుంచి విముక్తి కల్గుతుందని భక్తుల నమ్మకం. నారసింహుని బ్రహ్మోత్సవాల సమయంలో ముక్కోటి దేవతలకు ఆహ్వానం పలికేది గరుత్మంతుడే కాబట్టి ఈ వాహన సేవకు అంతటి ప్రాధాన్యత ఉంది. స్వామి వారు ప్రధాన రాజగోపురం వద్దకు రాక మునుపే ఆ ప్రాంతం భక్తులతో కిక్కిరిసిపోయింది.

తుమకూరు చెత్తమయం



- రెండురోజుల నుంచి పౌర కార్మికుల సమ్మె

తుమకూరు: జీతాలను పెంచాలని, కాంట్రాక్ట్ కార్మికులను పర్మనెంటు చేయాలని, పలు ఇతర డిమాండ్లను నెరవేర్చాలని మునిసిపాలిటీ కార్మికులు సోమవారం నుంచి సమ్మెకు దిగారు. ఫలితంగా తుమకూరు నగరంలో వీధుల్లో ఎక్కడి చెత్త అక్కడే రాశులుగా పేరుకుపోయింది. అపరిశుభ్రత తాండవిస్తోంది. నగర పాలికే ముందు కార్మికులు టెంటు వేసి ధర్నా సాగిస్తున్నారు. చెత్త సేకరణ నిలిచిపోయింది. చెత్తను తొలగించి పరిశుభ్రతను కాపాడాలని నగరవాసులు డిమాండ్ చేశారు.

నగరంలో ఓ రోడ్డులో చెత్త



ధర్నా చేస్తున్న కార్మికులు

ఘనంగా యోగినారేయణ జయంతి



తాత చిత్రపటానికి పూజలు చేస్తున్న మంత్రి సుధాకర్



శ్రీ యోగినారేయణ యతీంద్రుల చిత్ర పటాన్ని పల్లకీలో ఊరేగిస్తున్న దృశ్యం

చిక్కబళ్లాపురం: మానవ కులానికి జీవిత సత్యాన్ని తెలిపిన ఆధ్యాత్మిక గురువు కైవారం శ్రీ యోగినారేయణ యతీంద్రులు అని రాష్ట్ర ఆరోగ్య, వైద్యశాఖ మంత్రి సుధాకర్ తెలిపారు. కన్నడ, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నగరంలోని జూనియర్ కళాశాల నందిరంగ మందిలో శ్రీ యోగినారేయణ యతీంద్రుల జయంతి కార్యక్రమంలో తాత చిత్రపటానికి పూలు వేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా బలిజ సముదాయ విద్యార్థి భవనం కోసం ఒక ఎకరా భూమి మంజూరు పత్రాన్ని కలెక్టర్ నాగరాజు అందజేశారు. కార్యక్రమంలో బీఎంటీసీ ఉపాధ్యక్షుడు నవీన్ కిరణ్, ఖదీ గ్రామోద్యోగ మండలి అధ్యక్షుడు కేవీ నాగరాజు, నగరసభ అధ్యక్షుడు ఆనందరెడ్డి బాబు, ఎస్పీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న వ్యాన్

- బాలిక మృతి



రోడ్డు ప్రమాద దృశ్యం

కెలమంగలం: బైక్‌ను పికప్‌వ్యాన్ ఢీకొన్న ప్రమాదంలో చిన్నారి మృతి చెందగా భార్యాభర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. కెలమంగలం సమీపంలోని యూ.పురం గ్రామానికి చెందిన నాగరాజ్ (30), భార్య మునియమ్మ (26) కూతురు క్రిత్తిక (4)తో కలిసి మంగళవారం సాయంత్రం ధర్మపురి జిల్లా పాలక్కోడు ప్రాంతంలోని బంధువుల ఇంటికి బైక్ మీద బయలుదేరారు. కెలమంగలం– రాయకోట రోడ్డు కూతనపల్లి వద్ద రాయకోట వైపు నుంచి వెళ్లుతున్న పికప్ వాహనం ఢీకొట్టింది. క్రిత్తిక ఘటనా స్థలంలోనే మృతి చెందగా నాగరాజ్, మునియమ్మలు తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికులు భార్యాభర్తలను చికిత్స కోసం క్రిష్ణగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు చిన్నారి మృత దేహాన్ని డెంకణీకోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

రైలుకింద పడి తల్లీపిల్లల ఆత్మహత్య

- చిచ్చుపెట్టిన భర్త మద్యం వ్యసనం



అమ్ము, సుభిక్ష, భీష్మర్ (ఫైల్)

క్రిష్ణగిరి: కూలిపనులకెళ్లి సంపాదించే డబ్బును భర్త మద్యానికి ఖర్చు పెట్టడం, ఇల్లు గడవక కష్టాలతో భార్య ఇద్దరు పిల్లలతో కలిసి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకొన్న ఘటన కల్లావి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాల మేరకు క్రిష్ణగిరి జిల్లా ఊత్తంగేరి తాలూకా కల్లావి ప్రాంతానికి చెందిన సురేష్(38). ఇతని భార్య అమ్ము (34). వీరికి ఐదు మంది పిల్లలున్నారు. సురేష్ కూలిపనులు చేస్తూ వచ్చిన డబ్బుతో పూర్తిగా మద్యం తాగేవాడు. దీనిపై ఇంట్లో తరచూ గొడవలు జరిగేవి. రెండు రోజుల కిందట కూడా ఘర్షణ జరిగి అమ్ము, కూతురు సుభిక్ష(7), కొడుకు భీష్మర్ (4)ను తీసుకెళ్లి సేలం– చెన్నై మార్గంలో జోలార్‌పేట నుంచి చెన్నైకు వెళ్తున్న ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకొన్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు కల్లావి పోలీసులు, మొరపూర్ రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ముగ్గురి మృతదేహాలను స్వాధీనపరుచుకొని ఊత్తగేరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. తల్లి మరణంతో మిగతా ముగ్గురు పిల్లలు రోదించారు.

హోసూరు వార్తలు..

ఘనంగా తేరు



కెలమంగలం: డెంకణీకోట సమీపంలోని వెలసిన ప్రసిద్ధ శ్రీ గవి లక్ష్మీనరసింహస్వామి ఆలయ రథోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఆలయంలో గత రెండు రోజులుగా విశేష పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. మంగళవారం ఉదయం ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి రథంపై ఉంచి ఊరేగించారు. డెంకణీకోట, చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దఎత్తున భక్తులు పాల్గొని తేరును లాగారు. స్థానికులు భక్తులకు చల్లని పానీయాలు, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.

బైకిస్టులపై దూసుకెళ్లిన బస్సు

- ఒకరు మృతి

హోసూరు: ముందు వెళ్తున్న ఆటోను ఢీకొని రోడ్డుపై బోల్తాపడిన ద్విచక్రవాహనం మీద కర్ణాటక ఆర్టీసీ బస్సు దూసుకెళ్లగా ఒకరు మృతి చెందారు. వివరాలు.. బెంగళూరుకు చెందిన సత్యవేల్ (52), బంధువు ఇళంపరిధి (44)లు కలిసి సోమవారం సాయంత్రం సొంతపనిపై ద్విచక్ర వాహనంలో హోసూరుకు వచ్చారు. ఈ సమయంలో ముందు వెళ్తున్న ఆటోను ఢీకొని రోడ్డుపై బోల్తా పడింది. అదే సమయంలో వెనుక వస్తున్న కేఎస్ ఆర్టీసీ వీరిద్దరి మీద నుంచి దూసుకెళ్లింది. తీవ్ర గాయాల పాలైన బాధితులను స్థానికులు చికిత్స కోసం ఆస్పత్రికి తరలిస్తుండగా సత్యవేల్ మార్గమధ్యలో మృతి చెందాడు. ఇళంపరిధికి ఆస్పత్రిలో చికిత్సలందజేస్తున్నారు. హడ్కో పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ జరుపుతున్నారు.

ఏనుగు దాడిలో వృద్ధుడు మృతి



చౌడప్ప మృతదేహం

కెలమంగలం: మేతకెళ్లిన పశువు ఇంటికి తిరిగి రాక పోవడంతో పశువును వెతుక్కొంటూ వెళ్లిన రైతుపై ఒంటి ఏనుగు దాడి చేసి హత్య చేసింది. ఈ ఘటన డెంకణీకోట సమీపంలో చోటుచేసుకొంది. వివరాల మేరకు డెంకణీకోట సమీపంలోని జారకాలట్టి గ్రామానికి చెందిన చౌడప్ప (76) సోమవారం పశువులను తీసుకొని ముత్తూరు అటవీ ప్రాంతానికెళ్లాడు. అందులో ఓ పశువు తప్పిపోయింది. మళ్లీ మంగళవారం ఉదయం పశువును వెతుక్కొంటూ అటవీ ప్రాంతానికెళ్లాడు. ఈ సమయంలో పొదలో దాగి ఉన్న ఓ ఏనుగు చౌడప్పపై దాడి చేసింది. తీవ్ర గాయాలేర్పడిన చౌడప్ప ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ఇంకా ఇంటికి రాలేదేమని కుటుంబసభ్యులు చౌడప్పను వెతుక్కొంటూ అటవీ ప్రాంతానికెళ్లగా శవమై కనిపించాడు. డెంకణీకోట పోలీసులు కేసు నమోదు చేశారు.

నేత్రపర్వంగా చంద్రచూడేశ్వర రథోత్సవం



అలంకరించిన ఉత్సవమూర్తిని రథంపైకి తీసుకెళ్లుతున్న దృశ్యం



రథాన్ని లాగి ప్రారంభిస్తున్న కలెక్టర్, సబ్‌కలెక్టర్, ఎమ్మెల్యే, ఎంపి, మేయర్ తదితరులు

- భారీగా తరలివచ్చిన భక్తజనం

హోసూరు: హోసూరు తేరుపేట భద్రాది కొండపై మరకతాంబ సమేత శ్రీ చంద్రచూడేశ్వరస్వామి బ్రహ్మ రథోత్సవం మంగళవారం కోలాహలంగా జరిగింది. జిల్లా కలెక్టర్ దీపక్‌జేకప్, హోసూరు ఎమ్మెల్యే వై. ప్రకాష్, మేయర్ ఎస్.ఏ.సత్య, జిల్లా ఎంపీ సెల్లకుమార్, సబ్‌కలెక్టర్ శరణ్య, డీఎస్పీ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొని పూజలు నిర్వహించి రథాన్ని లాగి ప్రారంభించారు. రథోత్సవ కార్యక్రమంలో తమిళనాడులోని క్రిష్ణగిరి, ధర్మపురి, కర్ణాటకలోని కోలారు, బళ్లారి, ఆనేకల్, బెంగళూరు, ఆంధ్రప్రదేశ్ చిత్తూరు జిల్లాల నుంచి వేలాది మంది ప్రజలు రథోత్సవంలో పాల్గొన్నారు. శివనామ స్మరణ చేస్తూ తేరును లాగి మొక్కులు తీర్చుకున్నారు. మొదట వినాయకుడి రథం ముందు కదలగా, చిన్నతేరు, పెద్ద తేరు తిరువీధుల్లో కదిలాయి. రథాలు కదలడాన్ని చూసేందుకు వేలాది మంది ప్రజలు తేరుపేట తిరువీధుల్లో కిక్కిరిసి పోయారు. పెద్ద ఎత్తున భక్తులు ఆలయం వద్ద ఉన్న పచ్చకొలనులో ఉప్పుచెల్లి తమ కష్టాలు తీరాలని మొక్కుకున్నారు. హోసూరు డీఎస్పీ నేతృత్వంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



తిరువీధుల్లో రథాన్ని లాగుతున్న భక్తులు

వైద్య కళాశాలలో కలెక్టర్ తనిఖీ

హోసూరు: జిల్లా కేంద్రం క్రిష్ణగిరిలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో కలెక్టర్ దీపక్‌జేకప్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మొదట అక్కడ కొత్తగా ఏర్పాటు చేసిన డిజిటల్ ఎక్స్‌రే, సి.టి.స్కాన్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం శస్త్ర చికిత్స విభాగం, క్రిమిసంహారక ఉపకరణాలు, ఔషధాల నిల్వ, ఔట్‌పేషెంట్ విభాగం, అత్యవసర చికిత్స విభాగం, ముఖ్యమంత్రి ఆరోగ్యబీమా పథకం ద్వారా చికిత్స పొందుతున్న ప్రత్యేక విభాగాన్ని పరిశీలించారు. కళాశాలలో అదనపు భవనాల నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ రాజశ్రీ, స్వాత్విక, చంద్రశేఖర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల ఇద్దరు ఆత్మహత్య

క్రిష్ణగిరి: భార్య విడిపోవడంతో జీవితంపై విరక్తి చెందిన కార్మికుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొన్న ఘటన క్రిష్ణగిరి పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. క్రిష్ణగిరి కొత్తపేటకు చెందిన ఉస్సేన్ (58) 12 ఏళ్ల క్రితం జరిగిన గొడవల్లో విడిపోయి ఒంటరి నివాసం ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో జీవితంపై విరక్తి చెందిన ఉస్సేన్ సోమవారం రాత్రి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

కడుపు నొప్పి తాళలేక ...

కావేరి పట్టణం సమీపంలోని పనగముట్లు గ్రామానికి చెందిన మునిరాజ్ భార్య అనిత (27) అనారోగ్యంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. విషయం గమనించిన స్థానికులు చికిత్స కోసం కావేరిపట్టణం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం క్రిష్ణగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఫలితంలేక సోమవారం రాత్రి మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

చెన్నకేశవ స్వామి రథోత్సవం



విజయపుర: పట్టణంలోని చెన్నకేశవ స్వామి రథోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, విశేష పూజల అనంతరం రథోత్సవం నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు స్థానికులు అల్పాహారం, తాగునీరు అందించారు.

ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ప్రారంభం

కృష్ణరాజపురం: నగరంలోని మహాదేవపుర పరిధి దొడ్డనెక్కుంది వద్ద ఉన్న రింగ్ రోడ్డులో నూతనంగా నిర్మించిన ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ముఖ్యమంత్రి బసవరాజ బొమ్మై, హోం మంత్రి అరగ జ్ఞానేంద్ర ప్రారంభించారు. కార్యక్రమంలో మహాదేవపుర ఎమ్మెల్యే అరవింద లింబావళి, మాజీ కార్పొరేటర్ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



స్కీట్‌లో గనీమత్ జాతీయ రికార్డు సమం

ప్రపంచకప్ షాట్‌గన్ షూటింగ్ టోర్నమెంట్‌లో మహిళల స్కీట్ ఈవెంట్‌లో భారత షూటర్ గనీమత్ సెఖోన్ జాతీయ రికార్డును సమం చేసింది. దోహాలో జరుగుతున్న ఈ టోర్నీలో చండీగఢ్‌కు చెందిన 22 ఏళ్ల గనీమత్ క్వాలిఫయింగ్‌లో 125 పాయింట్లకుగాను 120 పాయింట్లు స్కోరు చేసింది. అయితే ఆమె ఫైనల్‌కు అర్హత సాధించలేకపోయింది. షూట్ ఆఫ్‌లో గనీమత్ గురి తప్పి టాప్-8లో నిలువలేకపోయింది. భారత్‌కే చెందిన దర్శన రాథోడ్ 117 పాయింట్లతో 25వ స్థానంలో, మహేశ్వరి చౌహాన్ 116 పాయింట్లతో 28వ స్థానంలో నిలిచారు.

మెయిన్ 'డ్రా'కు ప్రణవ్ రావు అర్హత



థాయ్‌లాండ్ ఇంటర్నేషనల్ చాలెంజ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ కుర్రాడు గంధం ప్రణవ్ రావు మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించాడు. బ్యాంకాక్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వాలిఫయింగ్ మ్యాచ్‌లో ప్రణవ్ రావు 15-21, 21-14, 21-17తో చాంగ్ షి చియె (చైనీస్ తైపీ)పై గెలుపొంది ముందంజ వేశాడు. భారత్‌కే చెందిన హేమంత్ గౌడ, రవి కూడా మెయిన్ 'డ్రా'లోకి అడుగు పెట్టారు.

లానింగ్, జొనాసెన్ చెలరేగగా...

ఢిల్లీ క్యాపిటల్స్ ఘన విజయం ● 42 పరుగులతో యూపీ ఓటమి ● మహిళల ప్రీమియర్ లీగ్

ముంబై: మహిళల ప్రీమియర్ లీగ్‌లో ఢిల్లీ క్యాపిటల్ మరోసారి భారీ స్కోరుతో విజయాన్ని అందుకుంది. మంగళవారం జరిగిన పోరులో ఢిల్లీ 42 పరుగుల తేడాతో యూపీ వారియర్స్‌పై జయభేరి మోగించింది. ముందుగా క్యాపిటల్స్ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 211 పరుగుల స్కోరు చేసింది. కెప్టెన్ మెగ్ లానింగ్ (42 బంతుల్లో 70; 10 ఫోర్లు, 3 సిక్స్‌లు), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' జెస్ జొనాసెన్ (20 బంతుల్లో 42 నాటౌట్; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించారు. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన యూపీ వారియర్స్ 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 169 పరుగులకే పరిమితమైంది. సహచరులు తడబడినా... తాహ్లియా మెక్‌గ్రాత్ (50 బంతుల్లో 90 నాటౌట్; 11 ఫోర్లు, 4 సిక్సర్లు) అసాధారణ పోరాటం చేసి అజేయంగా నిలిచింది.



లానింగ్

లానింగ్ అర్ధ సెంచరీ

తొలి రెండు ఓవర్లు నెమ్మదిగా ఆడిన ఓపెనర్లు లానింగ్, షఫాలీ ఆ తర్వాత భారీ షాట్లతో విరుచుకుపడ్డారు. షబ్నిమ్ ఐదో ఓవర్లో లానింగ్ ఒక సిక్స్, రెండు బౌండరీలతో 16 పరుగులు పిండుకుంది. రాజేశ్వరి వేసిన ఆరో ఓవర్లో షఫాలీ ఫోర్ కొడితే లానింగ్ మూడు బౌండరీలతో రెచ్చిపోయింది. పవర్ ప్లేలో ఢిల్లీ స్కోరు 62/0. మరుసటి ఓవర్లోనే షఫాలీ (17; 1 ఫోర్, 1 సిక్స్) ఆటను తాహ్లియా ముగించగా, మెగ్ లానింగ్ మాత్రం తన ధాటిని కొనసాగించి 32 బంతుల్లో (7 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధసెంచరీ సాధించింది. తర్వాత కాసేపు వాన ఆటంకపరిచింది. ఆట తిరిగి మొదలయ్యాక 11వ ఓవర్లో ఢిల్లీ స్కోరు 100 దాటింది. స్వల్ప వ్యవధిలో మరిజన్ (16; 2 ఫోర్లు), లానింగ్ నిష్క్రమించారు. తర్వాత వచ్చిన జెమిమా (22 బంతుల్లో 34 నాటౌట్; 4 ఫోర్లు), క్యాప్సీ (10 బంతుల్లో 21; 1 ఫోర్, 2 సిక్స్‌లు) కూడా ఢిల్లీ వేగాన్ని కొనసాగించారు. ఆఖర్లో జొనాసెన్ భారీ సిక్సర్లతో విరుచుకుపడింది. దీంతో ఆఖరి 4 ఓవర్లలో ఢిల్లీ 58 పరుగులు సాధించడంతో వరుసగా రెండో మ్యాచ్‌లోనూ 200 మార్క్ దాటింది.



జొనాసెన్

మెక్‌గ్రాత్ ఒంటరి పోరాటం

కొండంత లక్ష్యం ముందుంటే యూపీ వారియర్స్ టాపార్డర్ నిర్లక్ష్యంగా వికెట్లను పారేసుకుంది. కెప్టెన్ అలీసా హీలీ (17 బంతుల్లో 24; 5 ఫోర్లు), శ్వేత (1), కిరణ్ నవ్‌గిరే (2) 'పవర్ ప్లే'లోనే పెవిలియన్‌కెళ్లారు. తర్వాత వచ్చిన వారిలో తాహ్లియా ఒంటరిపోరాటం చేసింది. దీప్తి శర్మ (12), దేవిక వైద్య (21 బంతుల్లో 23; 2 ఫోర్లు)లు దూకుడుగా ఆడబోయి వెనుదిరిగారు. బ్యాటింగ్‌లో మెరుపులు మెరిపించిన జొనాసెన్ స్పిన్ బౌలింగ్‌తో యూపీని చావుదెబ్బ తీసింది. మెక్‌గ్రాత్ 36 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసుకున్న మెక్‌గ్రాత్... ఆఖరి ఓవర్లలో ఆమె ఫోర్లు, సిక్సర్లు బాదడంతో యూపీ 150 పైచిలుకు స్కోరు చేయగలిగింది.

డబ్ల్యూపీఎల్‌లో నేడు

గుజరాత్ జెయింట్స్ X బెంగళూరు

రాత్రి గం. 7:30 నుంచి

స్పోర్ట్స్ 18 చానెల్‌లో, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

స్కోరు వివరాలు

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: మెగ్ లానింగ్ (బి) రాజేశ్వరి 70; షఫాలీ (సి) నవ్‌గిరే (బి) తాహ్లియా 17; మరిజన్ (సి) దీప్తిశర్మ (బి) ఎకిల్‌స్టోన్ 16; జెమిమా నాటౌట్ 34; క్యాప్సీ (సి) ఎకిల్‌స్టోన్ (బి) షబ్నిమ్ 21; జొనాసెన్ నాటౌట్ 42; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (20 ఓవర్లలో 4 వికెట్లకు) 211. వికెట్ల పతనం:** 1-67, 2-96, 3-112, 4-144.
బౌలింగ్: షబ్నిమ్ 4-0-29-1, అంజలీ 3-0-31-0, రాజేశ్వరి గైక్వాడ్ 2-0-31-1, తాహ్లియా మెక్‌గ్రాత్ 3-0-37-1, దీప్తిశర్మ 4-0-40-0, సోఫీ ఎకిల్‌స్టోన్ 4-0-41-1.

యూపీ వారియర్స్ ఇన్నింగ్స్: హీలీ (సి) జెమిమా (బి) జొనాసెన్ 24; శ్వేత (సి) తానియా (బి) మరిజన్ 1; కిరణ్ నవ్‌గిరే (సి) క్యాప్సీ (బి) జొనాసెన్ 0; తాహ్లియా మెక్‌గ్రాత్ నాటౌట్ 90; దీప్తిశర్మ (సి) రాధ (బి) శిఖా 12; దేవిక (సి) రాధ (బి) జొనాసెన్ 23; సిమ్రన్ నాటౌట్ 6; ఎక్స్‌ట్రాలు 11; మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 169. **వికెట్ల పతనం:** 1-29, 2-31, 3-31, 4-71, 5-120.
బౌలింగ్: మరిజన్ 4-1-29-1, శిఖాపాండే 4-0-18-1, జెస్ జొనాసెన్ 4-0-43-3, నోరిస్ 2-0-25-0, క్యాప్సీ 4-0-25-0, రాధ 1-0-11-0, అరుంధతి 1-0-14-0.

ఆఖరి పోరుకు జోరుగా సాధన

అహ్మదాబాద్: బోర్డర్-గావస్కర్ ట్రోఫీలో చివరి అంకానికి ముందు భారత జట్టు సాధన జోరందుకుంది. ఆస్ట్రేలియాతో గురువారంనుంచి జరిగే నాలుగో టెస్టుకు రెండు రోజుల పాటు టీమిండియా ఆటగాళ్లు నెట్స్‌లో సుదీర్ఘ సమయం పాటు ప్రాక్టీస్‌లో పాల్గొన్నారు. నిజానికి మంగళవారం 'ఆప్షనల్ ప్రాక్టీస్' అయినా సరే జట్టు ఆటగాళ్లంతా సాధనకు మొగ్గు చూపారు. ముఖ్యంగా చాలా కాలంగా టెస్టుల్లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోతున్న విరాట్ కోహ్లి ఎక్కువ సేపు ప్రాక్టీస్‌పై దృష్టి పెట్టాడు. వేర్వేరు పిచ్‌లపై అతను దాదాపు రెండు గంటల పాటు నిరంతరాయంగా సాధన చేయడం విశేషం. మరో వైపు అందరి దృష్టి వికెట్ కీపర్ ఇషాన్ కిషన్‌పై నిలిచింది. కోచ్ ద్రవిడ్ ప్రత్యేకంగా కిషన్ ప్రాక్టీస్‌పై దృష్టి పెడుతూ సూచనలు ఇచ్చాడు. ఇండోర్ టెస్టు అనుభవం తర్వాత భారత టీమ్ మేనేజ్‌మెంట్ ఈ సారి బ్యాటింగ్ పిచ్‌ను కోరుకున్నట్లు తెలుస్తోంది. అదే జరిగితే కిషన్ దూకుడైన ఆట జట్టుకు అదనపు ప్రయోజనం కలిగించవచ్చని భావిస్తున్నారు. వికెట్ కీపర్‌గా ఆంధ్ర ఆటగాడు కోన శ్రీకర్ భరత్ అద్భుతంగా ఆకట్టుకున్నా... అతని బ్యాటింగ్ సంతృప్తికరంగా లేదనే వాదన వినిపిస్తోంది. ఐదు ఇన్నింగ్స్‌లలో కలిపి భరత్ 57 పరుగులే చేశాడు. కీలక సమయాల్లో భరత్ బ్యాటింగ్‌తో జట్టుకు ఉపయోగపడలేదు కాబట్టి కిషన్‌కు అవకాశం దక్కవచ్చని సమాచారం. అయితే కోచ్ ద్రవిడ్ దీనిపై మాత్రం ఎలాంటి స్పష్టతనివ్వలేదు. తీవ్ర ఒత్తిడి మధ్య, సవాల్‌తో కూడుకున్న పరిస్థితుల్లో భరత్ బాగా కీపింగ్ చేశాడని ప్రశంసించాడు. మరో వైపు మంగళవారం భారత జట్టు సభ్యులంతా ఆడి పాడి హోలీ పండుగను వేడుకగా జరుపుకున్నారు.



టీమ్ బస్సులో భారత క్రికెటర్లు కోహ్లి, రోహిత్, గిల్ హోలీ సంబరాలు

నెట్స్‌లో శ్రమించిన భారత ఆటగాళ్లు

డబ్ల్యూటీసీ పాయింట్ల కోసమే...

ఇండోర్ పిచ్‌ను ఐసీసీ 'నాసిరకం'గా తేల్చి మూడు డీమెరిట్ పాయింట్లు శిక్షగా విధించడంపై కోచ్ రాహుల్ ద్రవిడ్ ఆచితూచి స్పందించాడు. మ్యాచ్ రిఫరీకి తన నివేదిక ఇచ్చే అధికారం ఉందన్న ద్రవిడ్...ప్రపంచవ్యాప్తంగా కూడా పిచ్‌లు ఇదే తరహాలో ఉంటున్నాయని గుర్తు చేశాడు. 'ఇప్పుడు ప్రతీ సిరీస్‌లో సాధించే వరల్డ్ టెస్టు చాంపియన్ పాయింట్లు ఎంతో కీలకంగా మారాయి. అందుకే అన్ని జట్లు డ్రా కోసం ఫలితం తేల్చే పిచ్‌లు కావాలనే కోరుకుంటున్నాయి. స్వదేశంలో అయితే తమకు కాస్త అనుకూలించే వికెట్ తయారు చేసుకోవడం సహజమే. ఏ టీమ్ అయినా ఒక టెస్టులో గెలిచి 12 పాయింట్లు సాధించాలని కోరుకుంటుంది తప్ప డ్రా చేసుకొని 4 పాయింట్లతో సరిపెట్టుకోదు. భారత్‌లోనే కాదు ప్రపంచవ్యాప్తంగా కూడా అన్ని చోట్లా ఇదే పరిస్థితి ఉంది. మేం దక్షిణాఫ్రికాలో ఆడినప్పుడు ఆ పిచ్‌లు స్పిన్నర్లకు అసలు ఏమాత్రం అనుకూలించలేదు' అని ద్రవిడ్ వ్యాఖ్యానించాడు.

శ్రీజ ముందంజ

సింగపూర్: ప్రపంచ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) సింగపూర్ స్మాష్ టోర్నీలో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ మెయిన్ 'డ్రా' బెర్త్‌కు విజయం దూరంలో నిలిచింది. మంగళవారం జరిగిన మహిళల క్వాలిఫయింగ్ సింగిల్స్ తొలి మ్యాచ్‌లో జాతీయ చాంపియన్ శ్రీజ 11-5, 8-11, 11-8, 12-10తో చార్లోటి లుట్జ్ (ఫ్రాన్స్)పై గెలిచింది. నేడు జరిగే క్వాలిఫయింగ్ రెండో రౌండ్ మ్యాచ్‌లో దక్షిణ కొరియాకు చెందిన జూ చెన్‌హుయ్‌తో శ్రీజ ఆడుతుంది. ఈ మ్యాచ్‌లో శ్రీజ గెలిస్తే మెయిన్ 'డ్రా'కు చేరుకుంటుంది.



రష్మిక జోడీ ఓటమి

బెంగళూరు: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మహిళల టోర్నీ డబుల్స్ విభాగంలో హైదరాబాద్ క్రీడాకారిణులు భమిడిపాటి శ్రీవల్లి రష్మిక, సహజ యామలపల్లిలకు నిరాశ ఎదురైంది. మంగళవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో రష్మిక-వైదేహి (భారత్) ద్వయం 6-7 (5/7), 7-5, 5-10తో హెసీ అమండైన్ (ఫ్రాన్స్)-దాలియా జకుపోవిచ్ (స్లొవేనియా) జోడీ చేతిలో... సహజ-సోహా సాదిక్ (భారత్) ద్వయం 4-6, 6-7 (3/7)తో ఎలీనా టియోడోరా (రొమేనియా)-డయానా మర్సిన్‌కెవికా (లాత్వియా) జోడీ చేతిలో ఓడిపోయాయి. రెండో సీడ్ అంకిత రైనా-రుతుజా భోస్లే (భారత్) ద్వయం 5-7, 6-3, 10-6తో షర్మదా బాలు (భారత్)-సారా రెబెకా (జర్మనీ) జోడీని ఓడించి క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది.

మెయిన్ 'డ్రా'కు తస్నీమ్

ముల్హీమ్: జర్మన్ ఓపెన్ బీడబ్ల్యూఎఫ్ సూపర్ 300 టోర్నమెంట్ మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత జోడి సుమీత్ రెడ్డి - అశ్విని పొన్నప్ప ఆట ముగిసింది. మంగళవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లోనే సుమీత్ - అశ్విని 10-21, 12-21 తేడాతో స్కాట్లాండ్‌కు చెందిన ఆడమ్ హాల్ - జూలీ మాక్‌ఫెర్సన్ చేతిలో పరాజయంపాలయ్యారు. మరో వైపు మహిళల సింగిల్స్‌లో తస్నీమ్ మీర్ మెయిన్ డ్రాకు అర్హత సాధించింది. క్వాలిఫయింగ్ మ్యాచ్‌లో తస్నీమ్ 24-22, 21-8 స్కోరుతో రాచెల్ దరాగ్ (ఐర్లాండ్)ను ఓడించింది. పురుషుల సింగిల్స్‌లో మాత్రం శంకర్ ముత్తుసామి మెయిన్ డ్రాకు అర్హత సాధించడంలో విఫలమయ్యాడు. చివరి క్వాలిఫయింగ్ మ్యాచ్‌లో ముత్తుసామి 21-23, 19-21తో రెస్కీ ద్వికాయో (అజర్‌బైజాన్) చేతిలో ఓడాడు.

బెంగళూరును గెలిపించిన ఛెత్రి



ముంబై: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్) మొదటి సెమీ ఫైనల్ తొలి అంచెలో ముంబై సిటీ ఎఫ్‌సీపై బెంగళూరు ఎఫ్‌సీ పైచేయి సాధించింది. మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌లో బెంగళూరు 1-0 గోల్ తేడాతో ముంబైని ఓడించింది. మ్యాచ్ 79వ నిమిషంలో స్టార్ ఆటగాడు సునీల్ ఛెత్రి చేసిన ఏకైక గోల్‌తో బెంగళూరు విజేతగా నిలిచింది. అయితే ఈ గెలుపుతో బెంగళూరు ఫైనల్ చేరడం ఖాయం కాలేదు. ఇంటా, బయటా పద్ధతిలో ఒక సెమీస్ మ్యాచ్‌ను రెండు అంచెలుగా నిర్వహిస్తుండగా... ఇరు జట్లు ఆదివారం బెంగళూరులో జరిగే రెండో అంచె పోరులో మళ్లీ తలపడతాయి. మరో వైపు రెండో సెమీఫైనల్లో భాగంగా గురువారం హైదరాబాద్ ఎఫ్‌సీ, ఏటీకే మోహన్ బగాన్ మధ్య గురువారం హైదరాబాద్‌లో తొలి అంచె మ్యాచ్ జరుగుతుంది.

సినిమా



హంసా నందిని

చిరునవ్వుతో పోరాడా - హంసా నందిని

"కేన్సర్ అని నిర్ధారణ అయ్యాక గతం తాలూకు భయాలు, అయోమయాలు, ఒత్తిడి... అన్నీ మళ్లీ నన్ను చుట్టుముట్టినట్లు అనిపించింది. పలుమార్లు వైద్య పరీక్షలు, పలు స్కానింగ్స్ చేయించుకుని, శస్త్ర చికిత్స పూర్తయ్యాక ఇక ఏ భయం లేదు అనుకుంటున్న సమయంలో మరో రొమ్ముకి కూడా కేన్సర్ సోకే ప్రమాదం ఉందని నిర్ధారణ అయింది. మళ్లీ పోరాటం ఆరంభం" అని హంసా నందిని చెప్పారు. 2020లో ఆమెకు గ్రేడ్ 3 'కార్సినోమా' (రొమ్ము కేన్సర్) నిర్ధారణ అయింది.
ఈ మహిళా దినోత్సవం సందర్భంగా హంసా నందిని ఆ సంగతులు పంచుకున్నారు.

"18 ఏళ్ల క్రితం మా అమ్మగారికి బ్రెస్ట్ కేన్సర్ అని నిర్ధారణ అయింది. దురదృష్టం కొద్దీ ఆ పోరాటంలో ఆమె ఓడిపోయారు. ఇక నాకు కేన్సర్ నిర్ధారణ అయ్యాక 9 సార్లు కీమోథెరపీ జరిగింది. ఈ క్లిష్ట పరిస్థితి ముగిసిందనుకున్నాను. కానీ ఆ ఆనందం కొన్నాళ్లే. ఎందుకంటే 'బీఆర్‌సీఏ1' (వంశ పారంపర్య రొమ్ము కేన్సర్) అని, జీవితంలో మరో రొమ్ముకి కూడా 70 శాతం కేన్సర్ సోకే ప్రమాదం ఉందని తేలింది. దాంతో పలు శస్త్ర చికిత్సలు, మరో ఏడు సార్లు కీమోథెరపీ చేయించుకోవాల్సి వచ్చింది. నిజానికి ఇది ఎంతో సవాల్‌తో కూడుకున్నది. అందుకే 'చిరునవ్వుతో పోరాడాలి. మళ్లీ స్క్రీన్ మీద (నటించాలి) కనబడాలి. ఇతరులకు స్ఫూర్తిగా నిలిచేలా మన జీవితం గురించి చెప్పాలి' అని నాకు నేనుగా వాగ్దానం చేసుకున్నాను. నేను జీవించడానికి, ఆరోగ్యంగా ఉండడానికి ముందుగా రోగ నిర్ధారణ కావడం, మంచి డాక్టర్లు, నా ఫ్యామిలీ, నా పాజిటివ్ మైండ్ కారణం. గత నవంబర్‌లో షూటింగ్ సెట్లోకి కూడా అడుగుపెట్టాను.

ఎప్పటికప్పుడు అందరూ రెగ్యులర్ చెకప్స్ చేయించుకోండి. నేను సజీవంగా ఉన్నందుకు ఈ విశ్వానికి ధన్యవాదాలు చెబుతున్నాను. కీమోథెరపీ చేయించుకుంటున్నప్పుడు నాకు నేనుగా ఓ ప్రామిస్ చేసుకున్నాను. 'ప్రతి నిమిషాన్ని ఇదే చివరి నిమిషం అనుకుని బతకాలన్నది' ఆ ప్రామిస్. ఈ సందర్భంగా మా అమ్మగారి పేరు మీద 'యామినీ కేన్సర్ ఫౌండేషన్'ని ఆరంభించాలనుకుంటున్న విషయాన్ని ఆనందంగా పంచుకుంటున్నాను.

మరోసారి ఆర్ఆర్ఆర్



'ఆర్ఆర్ఆర్' సినిమా మరోసారి ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మించిన ఈ చిత్రం గత ఏడాది మార్చి 25న విడుదలైన విషయం తెలిసిందే. ఈ సినిమా మళ్లీ ఈ నెల (మార్చి) 10న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో రీ రిలీజ్ కానుంది. ఈ విషయాన్ని చిత్రయూనిట్ ప్రకటించింది. ఈ నెల 12న లాస్ ఏంజిల్స్‌లో జరగనున్న 95వ ఆస్కార్ ప్రదానోత్సవం సందర్భంగా 'ఆర్ఆర్ఆర్'ను రీ రిలీజ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఎందుకంటే ఈ మూవీలోని 'నాటు నాటు' పాట 'బెస్ట్ ఒరిజినల్ సాంగ్' విభాగంలో ఆస్కార్‌కు నామినేట్ అయిన సంగతి తెలిసిందే.



అలీ, న్యాయమూర్తి నందా, శ్రీలేఖ, కోటి, విజయేంద్రప్రసాద్

అందుకే మ్యూజిక్ డైరెక్టర్ అయ్యింది - విజయేంద్ర ప్రసాద్

"చిన్నప్పుడు నేను శ్రీలేఖకు ఒక ఆశ చూపించాను. ఆ ఆశ కోసమే తను మ్యూజిక్ డైరెక్టర్ అయ్యింది. మంచి పాటలతో ప్రేక్షకులను అలరించింది. శ్రీలేఖ అన్న కీరవాణి సంగీతంలో ఆస్కార్ రేసులో ఉన్నారు. తన అన్నలానే శ్రీలేఖ కూడా ఆస్కార్ అంతటి అవార్డు అందుకోవాలి" అన్నారు రచయిత, ఎంపీ విజయేంద్ర ప్రసాద్. 'నాన్నగారు' (1994) సినిమాతో సంగీత దర్శకురాలిగా పరిచయమైన శ్రీలేఖ ఇప్పటి వరకూ 5 భాషల్లో 80 చిత్రాలకుపైగా సంగీతం అందించారు. ఆమె సినిమా రంగంలోకి వచ్చి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా 25 దేశాల్లో 25మంది సింగర్స్‌తో ఈ నెల 17 నుంచి 'వరల్డ్ మ్యూజిక్ టూర్'ని స్టార్ట్ చేయనున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో శ్రీలేఖ మాట్లాడుతూ– "ఇండస్ట్రీకి వచ్చి ఇన్నేళ్లయినా ఇప్పటికీ అద్దె ఇంట్లోనే ఉంటున్నాను. ఆస్తులు సంపాదించకపోయినా నా పాటలతో ప్రేక్షకుల అభిమానం సొంతం చేసుకోవడం హ్యాపీగా ఉంది" అన్నారు.

నా పాత్ర సరికొత్తగా ఉంటుంది - వెంకటేశ్



రానా, వెంకటేశ్


"ఒక నటుడిగా కొత్త పాత్రలు చేయాలని ఎప్పుడూ ఉంటుంది. 'రానా నాయుడు'లో నాగ నాయుడు పాత్రలో కొత్తగా చేయడానికి అవకాశం దొరికింది. ఇలాంటి పాత్రని నేను గతంలో చేయలేదు. సరికొత్తగా ఉండే నా పాత్ర ప్రేక్షకులకు నచ్చుతుంది'' అని హీరో వెంకటేశ్ అన్నారు. కరణ్ అన్షుమాన్, సుపర్ణ్ ఎస్.వర్మ దర్శకత్వం వహించిన వెబ్ సిరీస్ 'రానా నాయుడు'. ఇందులో వెంకటేశ్ నాగ నాయుడు (తండ్రి), రానా.. రానా నాయుడు (కొడుకు) పాత్రలు పోషించారు. సుందర్ ఆరోన్, లోకోమోటివ్ గ్లోబల్ నిర్మించిన ఈ వెబ్ సిరీస్ ఈ నెల 10 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో వెంకటేశ్ మాట్లాడుతూ–"'రానా నాయుడు' నాకు కొత్త ప్రపంచం. ఓటీటీలో చేయడం ఇదే మొదటిసారి . చాలా విషయాలు నేర్చుకున్నాను. ఇందులో భావోద్వేగ సన్నివేశాలు చాలా కొత్తగా, పవర్‌ఫుల్‌గా ఉంటాయి. రానాతో తొలిసారి ఫుల్ లెంత్ స్క్రీన్‌ను పంచుకోవడం చాలా సంతోషంగా ఉంది. కరణ్, సుపర్ణ్ వర్మలతో పని చేయడం గొప్ప ప్రయాణంలా అనిపించింది'' అన్నారు. రానా మాట్లాడుతూ– "'రానా నాయుడు' డార్క్ కామెడీ డ్రామా. ఇలాంటి కథలు సినిమాల్లో చేయడం కష్టం. హైదరాబాద్‌కి చెందిన ఓ కుటుంబం ముంబై వెళ్లి అక్కడ గ్యాంగ్‌స్టర్ పనులు చేస్తే ఎలా ఉంటుంది? అనే ఆసక్తికర అంశాలు ఇందులో ఉంటాయి. ఈ సిరీస్ కోసం బాబాయ్‌తో (వెంకటేశ్) పని చేయడం మర్చిపోలేని అనుభూతి''అన్నారు. "వెంకటేశ్, రానాగార్లతో పని చేయడం ఆనందంగా ఉంది'' అన్నారు కరణ్ అన్షుమాన్, సుపర్ణ్ వర్మ. "'రానా నాయుడు' వీక్షకులను తప్పకుండా అలరిస్తుంది'' అన్నారు నిర్మాత సుందర్ ఆరోన్.

ఆనందాల హోలీ



హోలీ పండగ సందర్భంగా మంగళవారం రంగులతో ఆడారు సినీ తారలు. ఆ ఆనందోత్సాహాలను సోషల్ మీడియా వేదికగా ఫొటోల రూపంలో అభిమానుల కోసం షేర్ చేశారు. నేపాల్‌లో హోలీ సెలబ్రేషన్స్ జరుపుకున్నారు తమన్నా. పెళ్లైన తర్వాత తొలి హోలీ ఫెస్టివల్‌ను భర్త సోహైల్ కతూరియాతో జరుపుకున్నారు హన్సిక. కరీనా కపూర్, కరిష్మా కపూర్, అనన్యా పాండే కూడా హోలీ సంబరాల్లో మునిగారు. బాలీవుడ్ ప్రముఖ రచయిత జావేద్ అక్తర్ ఏర్పాటు చేసిన హోలీ సెలబ్రేషన్స్‌లో ఫర్హాన్ అక్తర్, రిచా ఛద్దా, అలీ ఫజల్ తదితర తారలు పాల్గొన్నారు.

స్టయిలిష్ డీజే



సుధీర్‌బాబు

సుధీర్ బాబు హీరోగా నటించిన తాజా చిత్రం 'మామా మశ్చీంద్ర'. నటుడు–దర్శకుడు హర్షవర్ధన్ దర్శకత్వం వహించారు. సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు తెలుగు, హిందీ భాషల్లో నిర్మించారు. సుధీర్ బాబు ఈ చిత్రంలో చేసిన మూడు పాత్రల్లో దుర్గ, పరశురామ్‌ల లుక్స్ ఇప్పటికే విడుదల కాగా, తాజాగా స్టయిలిష్‌గా ఉన్న డీజే క్యారెక్టర్ పోస్టర్‌ను రిలీజ్ చేసింది చిత్రయూనిట్. "వినూత్న కాన్సెప్ట్‌తో యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా రూపొందింది'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సమర్పణ: సోనాలి నారంగ్, సృష్టి (సృష్టి సెల్యూలాయిడ్), సంగీతం: చేతన్ భరద్వాజ్, కెమెరా: పీజీ విందా.

వెన్నెల్లో ఆడపిల్ల..



కార్తికేయ, నేహా శెట్టి

'వెన్నెల్లో ఆడపిల్ల.. కవ్వించే కన్నెపిల్ల... కోపంలో చూస్తే ఎల్లా. క్షణంలో అగ్గిపుల్ల' అంటూ ప్రేమగీతం పాడుతున్నారు గుమ్మకొండ కార్తికేయ. క్లాక్స్ దర్శకత్వంలో కార్తికేయ, నేహా శెట్టి జంటగా నటించిన చిత్రం 'బెదురులంక 2012'. సి. యువరాజ్ సమర్పణలో రవీంద్ర బెనర్జీ ముప్పానేని నిర్మించారు. మణిశర్మ స్వరపరచిన ఈ చిత్రంలోని 'వెన్నెల్లో ఆడపిల్ల..' పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. విస్సాప్రగడ సాహిత్యం అందించిన ఈ పాటను హారిక నారాయణ్, జేవీ సుధాంశు ఆలపించగా, బృంద మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు. "గోదావరి తీర ప్రాంతంలోని ఓ గ్రామంలో ఎనిమిదెకరాల రొయ్యల చెరువు మధ్య రాత్రి వేళల్లో తీసిన పాట ఇది. త్వరలో విడుదల తేదీ వెల్లడిస్తాం'' అన్నారు రవీంద్ర బెనర్జీ.

పల్లెటూరి ప్రేమకథ



గీత

గీతా శైనీ, శ్రీ చరణ్ రాచకొండ జంటగా నటిస్తున్న చిత్రం 'కన్యాకుమారి'. 'పుష్పక విమానం' చిత్ర దర్శకుడు దామోదర స్వీయ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. దామోదర మాట్లాడుతూ–"రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ ఇది. శ్రీకాకుళం నేపథ్యంలో సాగే పల్లెటూరి ప్రేమకథా చిత్రం. ప్రస్తుతం ఫైనల్ షెడ్యూల్ జరుగుతోంది'' అన్నారు. ఈ సినిమాకు సంగీతం: సాహిత్య సాగర్, కెమెరా: శివ గాజుల, సహ నిర్మాతలు: సతీష్ రెడ్డి, వరీనియా మామిడి, సిద్ధార్థ్ .ఎ.

మీటర్.. పక్కా మాస్ కమర్షియల్ - బాబీ

"మీటర్' టీజర్ చూస్తుంటే పక్కా మాస్ కమర్షియల్ మూవీ అనిపిస్తోంది. ఈ సినిమా హిట్ కావాలి'' అని డైరెక్టర్ బాబీ కొల్లి అన్నారు. కిరణ్ అబ్బవరం, అతుల్య రవి జంటగా రమేష్ కాదూరి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మీటర్'. నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి సమర్పణలో చిరంజీవి (చెర్రీ), హేమలత పెదమల్లు నిర్మించిన ఈ సినిమా ఏప్రిల్ 7న విడుదల కానుంది. ఈ చిత్రం టీజర్‌ని బాబీ రిలీజ్ చేశారు. చెర్రీ మాట్లాడుతూ–"చక్కని కథతో మాస్ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా 'మీటర్'ని తీశారు రమేష్'' అన్నారు. "థియేటర్‌లో విజిల్స్ కొట్టి చూసే కమర్షియల్ సినిమా ఇది'' అన్నారు కిరణ్ అబ్బవరం. "నన్ను ఇంత దూరం తీసుకొచ్చిన బాబీ, గోపీచంద్ మలినేనిగార్లకు థ్యాంక్స్'' అన్నారు రమేష్ కాదూరి. చిత్ర సంగీత దర్శకుడు సాయి కార్తీక్ పాల్గొన్నారు.



రమేష్ కాదూరి, బాబీ, కిరణ్ అబ్బవరం, చిరంజీవి

సవరణ:
మంగళవారం సంచికలో 'కెమెరామేన్ ప్రవీణ్ కన్నుమూత' వార్తలో వాడిన ఫొటో కెమెరామేన్‌ది కాకుండా అదే పేరుతో ఉన్న వేరే వ్యక్తిది ప్రచురితమైంది. పొరపాటుకు చింతిస్తున్నాం.

సాక్షి బిజినెస్
బుధవారం
8-3-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (సోమవారం ముగింపు)	
సెన్సెక్స్ ▲ 415	60,224
నిఫ్టీ ▲ 117	17,711

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	11,630	▽	46
డోజోన్స్	33,066	▽	366
ఎఫ్‌టీఎస్ఈ 100	7,919	▽	10
డాక్స్	15,560	▽	94
షాంఘై	3,285	▽	37
నికాయ్	28,309	△	71

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (24 క్యారట్)	55,210
బంగారం (22 క్యారట్)	52,580
వెండి (కిలో)	70,000

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	80.08	83.76
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	96.04	100.87
€	యూరో	ఎస్‌బీఐ	85.18	88.66
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	47.00	73.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.28	57.14
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	58.60	63.14
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	20.85	22.52
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.04	23.02
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.69	12.77

స్టార్టప్‌లలో మహిళల హవా

ఇన్నోవేషన్‌లోనూ ముందంజ • విజయవంతంగా వ్యాపారాల నిర్వహణ • స్టాక్ ఎక్స్ఛేంజీల్లోనూ సంస్థల లిస్టింగ్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: గతంలో పురుషులకు మాత్రమే పరిమితమైన దేశీ స్టార్టప్ రంగంలో ఇప్పుడు మహిళలు దూసుకెళుతున్నారు. కొంగొత్త ఆవిష్కరణలతో అంకుర సంస్థలను విజయవంతంగా నడిపిస్తున్నారు. టెక్నాలజీ, ఈ-కామర్స్, ఫైనాన్స్ తదితర రంగాల్లో రాణిస్తున్నారు. మహిళల సారథ్యంలోని నైకా, జివామి, షీరోస్ వంటి పలు విజయవంతమైన అంకుర సంస్థలు ఇందుకు నిదర్శనం. ఫల్గుణీ నాయర్ నేతృత్వంలోని ఫ్యాషన్ ప్రొడక్ట్స్ సంస్థ నైకా... సంచలన స్థాయిలో స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్టయ్యింది. ఇన్వెస్టర్లు భారీగా ఎగబడి మరీ షేర్లు కొన్నారు. ఇక అంతకన్నా ముందు .. దాదాపు నలభై ఏళ్ల క్రితం రజని బెక్టర్ ఏర్పాటు చేసిన బేకరీ ఉత్పత్తుల సంస్థ మిసెస్ బెక్టర్స్ లిస్టింగ్‌కు వస్తే ఇన్వెస్టర్లు బ్రహ్మరథం పట్టారు. ఇలాంటి సానుకూల స్పందన ఊతంతో మరిన్ని స్టార్టప్‌లు కూడా లిస్టింగ్ బాట పడుతున్నాయి. గజల్ అలగ్ సహ-వ్యవస్థాపకురాలిగా ఉన్న ఆరోగ్య ఉత్పత్తుల సంస్థ మామాఎర్త్ కూడా తాజాగా ఐపీవో యత్నాల్లో ఉంది. ఇలా పలు అంకుర సంస్థలు మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు మహిళలకు అవసరమైన ఉత్పత్తులు, సర్వీసులను అందించడంపై ప్రధానంగా దృష్టి పెట్టేవిగా ఉంటున్నాయి. 2014లో చిన్న, మధ్య తరహా వ్యాపారాలు సహా దేశీయంగా మహిళల సారథ్యంలోని స్టార్టప్‌ల సంఖ్య .. మొత్తం అంకుర సంస్థల్లో 8 శాతంగా ఉండేది. ప్రస్తుతం ఇది దాదాపు 14 శాతానికి చేరినట్లు గణాంకాలు చెబుతున్నాయి. పురుషుల సారథ్యంలోని అంకుర సంస్థలతో పోలిస్తే మహిళల నేతృత్వంలోని స్టార్టప్‌లు 2.5 రెట్లు ఎక్కువగా మహిళలకు ఉపాధి కల్పిస్తున్నాయని, పెట్టుబడులపై 35 శాతం అధికంగా రాబడులు అందించగలుగుతున్నాయని పరిశ్రమవర్గాలు పేర్కొన్నాయి.



లక్ష్యంపైనే గురి..

వ్యాపారాన్ని ప్రారంభించడమంటే అనేక సవాళ్లతో కూడుకున్న వ్యవహారం కావడంతో పాటు మిగతా వర్గాల నుంచి సహకారం లభించడం కూడా కీలకం. వ్యాపారం ప్రారంభించడానికి ముందే టార్గెట్ మార్కెట్, పోటీ, తాము అందించే సర్వీసులు, ఉత్పత్తుల ప్రత్యేకత వంటి అంశాలపై స్పష్టమైన అవగాహన ఉండాలని స్పేస్‌మంత్ర వ్యవస్థాపకురాలు నిధి అగర్వాల్ పేర్కొన్నారు. మహిళా ఎంట్రప్రెన్యూర్లు మరింత తరచుగా తమ నిర్ణయాలను ప్రశ్నించుకుంటూ ముందుకు సాగాల్సి వస్తుందని టిరావిటా వ్యవస్థాపకురాలు రాహీ అంబానీ తెలిపారు. అయితే, ఒడిదుడుకులను అధిగమించి, లక్ష్యంపైనే దృష్టి పెడితే విజయం సాధించవచ్చని ఆమె పేర్కొన్నారు.



ప్రభుత్వాల తోడ్పాటు..

స్టార్టప్ రంగంలోనూ మహిళలు రాణించేలా ప్రభుత్వాలు, వివిధ సంస్థలు తోడ్పాటు అందిస్తుండటం కూడా వారికి సహాయకరంగా ఉంటోంది. అటల్ ఇన్నోవేషన్ మిషన్, స్టాండప్ ఇండియా వంటి స్కీములు స్టార్టప్‌లకు అండగా ఉంటున్నాయి. నిధులపరంగానూ, ఇతరత్రా సహాయాన్ని అందించేందుకు యాక్సిలరేటర్లు, ఇన్‌క్యుబేటర్లు మొదలైనవి ఉన్నాయి.

ఏడబ్ల్యూఎస్ నుంచి యాక్సెలరేట్‌హర్ 2023

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్), ప్రముఖ వెంచర్ క్యాపిటల్ సంస్థ లైట్‌స్పీడ్ కలిసి యాక్సెలరేట్‌హర్ 2023 పేరిట ప్రత్యేక ప్రోగ్రాంను ఆవిష్కరించాయి. ప్రారంభ స్థాయి దేశీ స్టార్టప్‌ల మహిళా వ్యవస్థాపకులు తమ సంస్థలను నిర్మించుకునేందుకు, వృద్ధిలోకి తెచ్చుకునేందుకు, విజయవంతమైన వ్యాపారాలుగా తీర్చిదిద్దుకునేందుకు అవసరమైన తోడ్పాటు దీని ద్వారా పొందవచ్చు. ఈ ఆరు వారాల యాక్సిలరేషన్ ప్రోగ్రామ్‌నకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఏడబ్ల్యూఎస్ ఇండియా హెడ్ (స్టార్టప్ ఎకోసిస్టమ్) అమితాబ్ నాగ్‌పాల్ తెలిపారు. దీనికి ఎంపికైన స్టార్టప్‌లు నిధుల సమీకరణ, సాంకేతిక అంశాలపరమైన మద్దతు పొందవచ్చని ఆయన పేర్కొన్నారు. కనీస లాభదాయకత ఉత్పత్తి కలిగి ఉండి, మూడు మిలియన్ డాలర్ల కన్నా తక్కువ నిధులను సమీకరించిన స్టార్టప్‌లు దీనికి దరఖాస్తు చేసుకోవచ్చు.



మహిళా మాసంగా మార్చి ..

ఐసీఐసీఐ లాంబార్డ్

ఆర్థిక, ఆరోగ్య విషయాల్లో మహిళలకు సాధికారత కల్పించే ప్రయత్నాల్లో భాగంగా మార్చి నెలను మహిళా మాసంగా పాటిస్తున్నట్లు ప్రైవేట్ రంగ బీమా సంస్థ ఐసీఐసీఐ లాంబార్డ్ వెల్లడించింది. ఈ సందర్భంగా కాంప్లిమెంటరీ హెల్త్ చెకప్‌లను అందిస్తున్నట్లు తెలిపింది. దేశవ్యాప్తంగా అన్ని ప్రధాన ప్రాంతాల్లోనూ ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్ (ముందుగా వచ్చిన వారికి) ప్రాతిపదికన 10,000 మంది మహిళలకు ఈ అవకాశాన్ని కల్పిస్తున్నట్లు వివరించింది. దీని కింద థైరాయిడ్ ప్రొఫైల్, విటమిన్ డీ, బీ12 తదితర టెస్టులను నిర్వహిస్తారు. అలాగే మహిళా మోటరిస్టులకు కాంప్లిమెంటరీగా రోడ్‌సైడ్ అసిస్టెన్స్ సర్వీసులు అందిస్తున్నట్లు సంస్థ తెలిపింది. ఇక మహిళా ఎంట్రప్రెన్యూర్‌షిప్‌ను ప్రోత్సహించే దిశగా మహిళా ఏజెంట్లను రిక్రూట్ చేసుకునేందుకు, అవగాహన కల్పించేందుకు సమగ్ర శిక్షణ కార్యక్రమం కూడా నిర్వహించనున్నట్లు కంపెనీ ఈడీ సంజీవ్ మంత్రి పేర్కొన్నారు.

ఫండ్ మేనేజర్లలో 10 శాతమే..

గడిచిన కొన్నేళ్లుగా మ్యూచువల్ ఫండ్ పరిశ్రమలో మహిళల మేనేజర్ల సంఖ్య పెరుగుతున్నా ఇప్పటికీ అది సుమారు 10% స్థాయిలోనే ఉన్నట్లు మార్నింగ్‌స్టార్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ ఇండియా వార్షిక నివేదిక పేర్కొంది. దీని ప్రకారం మహిళా ఫండ్ మేనేజర్ల సంఖ్య గతేడాది 32గా ఉండగా ప్రస్తుతం 42కి పెరిగింది. అదే సమయంలో మొత్తం ఫండ్ మేనేజర్ల సంఖ్య 399 నుంచి 428కి చేరింది. వీరిలో 42 మంది మహిళలు.. ఫండ్స్‌ను ప్రైమరీ లేదా సెకండరీ మేనేజర్లుగా నిర్వహిస్తున్నారు. 2017లో 18 మందికి పరిమితమైన ఫండ్ మేనేజర్ల సంఖ్య ఆ తర్వాత నుంచి క్రమంగా పెరిగినట్లు మార్నింగ్‌స్టార్ పేర్కొంది. ప్రస్తుతం 24 ఫండ్ సంస్థల్లో 42 మంది మహిళా మేనేజర్లు ఉన్నారు.

మహిళల కోసం సిగ్నిటీ ప్రత్యేక కార్యక్రమాలు

టెక్నాలజీ రంగంలో మహిళలకు తోడ్పాటునిచ్చే దిశగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సిగ్నిటీ టెక్నాలజీస్ సంస్థ వెల్లడించింది. మార్చి 9న 'ఉమెన్ ఇన్ టెక్ రౌండ్‌టేబుల్' వర్చువల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపింది. పలు మహిళా దిగ్గజాలు పాల్గొనే ఈ చర్చాగోష్టికి సంస్థ ఎస్‌వీపీ శిరీష పెయ్యేటి సారథ్యం వహిస్తారు. అలాగే, మహిళలు కొత్త విషయాలను నేర్చుకునేలా, అనుభవజ్ఞుల నుంచి సలహాలు పొందేలా వెసులుబాటు కల్పించే దిశగా 'హర్‌డిజిటల్‌స్టోరీ' పేరిట ప్రత్యేక ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందిస్తున్నట్లు సిగ్నిటీ పేర్కొంది. ఇక కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద హైదరాబాద్‌లోని ప్రభుత్వ ఎంఎన్‌జే ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీతో కలిసి పనిచేస్తున్నట్లు, 'ప్రాజెక్ట్ సిగ్నిఫికెన్స్' పేరిట 100 మంది గ్రామీణ ప్రాంత మహిళలకు డిజిటల్ నైపుణ్యాల్లో శిక్షణ కల్పిస్తున్నట్లు వివరించింది.

ప్రైవేటు పెట్టుబడులు పెరగాలి: మోదీ



న్యూఢిల్లీ: బడ్జెట్‌లో ప్రభుత్వం కల్పించిన ప్రతిపాదనలను అనుకూలంగా మలుచుకోవాలని భారత పరిశ్రమలను (ఇండియా ఇంక్) ప్రధాని మోదీ కోరారు. ప్రభుత్వం మూలధన వ్యయాలను పెంచినట్టే, ప్రైవేటు రంగం కూడా మరిన్ని పెట్టుబడులతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అప్పుడే గరిష్ఠ ప్రయోజనం పొందగలమన్నారు. బడ్జెట్‌పై నిర్వహించిన 10వ వెబినార్‌లో భాగంగా ప్రధాని మాట్లాడారు. ప్రభుత్వం మూలధన వ్యయాల లక్ష్యాన్ని చారిత్రక గరిష్ఠ స్థాయి అయిన రూ.10 లక్షల కోట్లకు పెంచినట్టు గుర్తు చేశారు. అంతర్జాతీయంగా భారత్ ఎకానమీకి ప్రశంసలు లభిస్తున్న విషయాన్ని ప్రస్తావించారు. జీఎస్‌టీసహా ఆదాయపన్ను, కార్పొరేట్ పన్ను తగ్గింపు వల్ల పన్నుల భారం గతంతో పోలిస్తే గణనీయంగా తగ్గినట్టు ప్రధాని తెలిపారు. ఈ చర్యలతో పన్నుల వసూళ్లు మెరుగుపడ్డాయని.. 2013–14 నాటికి 11 లక్షల కోట్లుగా ఉన్న పన్నుల ఆదాయం 2023–24 నాటికి రూ.33 లక్షల కోట్లకు చేరుకోవచ్చన్నారు.

శ్రీసిటీ, దాద్రాలో విస్తరణ: బ్లూ స్టార్



చెన్నై: హోమ్ అప్లయెన్సెస్ తయారీ దిగ్గజం బ్లూ స్టార్ లిమిటెడ్ ఆంధ్రప్రదేశ్‌లోని తడవద్దగల శ్రీ సిటీ యూనిట్‌ను విస్తరించనున్నట్లు తాజాగా పేర్కొంది. రెండో దశలో భాగంగా ఇందుకు రూ. 200 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు వెల్లడించింది. రూ. 350 కోట్లు వెచ్చించి ఏర్పాటు చేసిన శ్రీ సిటీ యూనిట్ ఈ ఏడాది జనవరిలో ఉత్పత్తిని ప్రారంభించింది. ఈ బాటలో గుజరాత్‌లోని దాద్రా ప్లాంటును సైతం విస్తరించనున్నట్లు తెలియజేసింది. ఇప్పటికే రూ. 180 కోట్ల పెట్టుబడులు వెచ్చించనట్లు వెల్లడించింది. కాగా.. ఏడు తయారీ ప్లాంట్లు కలిగిన కంపెనీ దాద్రా, శ్రీ సిటీలలో ఒక్కొక్క యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు బ్లూ స్టార్ ఎండీ బి.త్యాగరాజన్ పేర్కొన్నారు. హిమాచల్ ప్రదేశ్, అహ్మదాబాద్, దాద్రా, వాద్రా(మహారాష్ట్ర), శ్రీ సిటీలలో కంపెనీకి తయారీ యూనిట్లున్నాయి. గతేడాది(2021–22)లో రూ. 6,045 కోట్ల టర్నోవర్ సాధించిన కంపెనీ 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ. 8,200 కోట్ల ఆదాయం అంచనా వేస్తోంది.

అదానీ గ్రూప్ రుణ చెల్లింపులు



న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ తాజాగా 2025 ఏప్రిల్‌లో మెచ్యూరిటీ కానున్న రూ. 7,374 కోట్లమేర రుణాలను తిరిగి చెల్లించింది. తాజా చెల్లింపులతో 4 కంపెనీలలో ప్రమోటర్ల వాటాలను తనఖా నుంచి తిరిగి పొందింది. వీటిలో అదానీ ఎంటర్‌ప్రైజెస్‌కు చెందిన 3.1 కోట్ల షేర్లు(4% వాటా), అదానీ పోర్ట్స్ అండ్ సెజ్‌కు చెందిన 15.5 కోట్ల షేర్లు(11.8% వాటా)తోపాటు అదానీ ట్రాన్స్‌మిషన్‌కు చెందిన 3.6 కోట్ల షేర్లు(4.5% వాటా), అదానీ గ్రీన్ ఎనర్జీకి చెందిన 1.1 కోట్ల షేర్లు(1.2% వాటా) ఉన్నట్లు పేర్కొంది. ఈ నెలాఖరుకల్లా ఇలాంటి మరిన్ని రుణాలను ముందస్తుగానే చెల్లించనున్నట్లు తెలియజేసింది. తద్వారా గ్రూప్ రుణ భారంపై ఇన్వెస్టర్లలో తలెత్తిన ఆందోళనలకు చెక్ పెట్టే సన్నాహాలకు తెరతీసింది. కాగా.. ఫిబ్రవరి మొదట్లో చేపట్టిన చెల్లింపులతో కలిపి మొత్తం 2.016 బిలియన్ డాలర్ల రుణ భారాన్ని తగ్గించుకున్నట్లు గ్రూప్ వివరించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

8-3-2023	
విశాఖ	420–00
చిత్తూరు	458–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	417–00
విజయవాడ	417–00
రిటైల్ ధర (డజను)	66.00
7-3-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	400–00
వరంగల్	402–00
రిటైల్ ధర	4.60

హిందూ వృద్ధి రేటు అనడం అపరిపక్వమే: ఎస్‌బీఐ



న్యూఢిల్లీ: భారత్ ప్రమాదకర హిందూ వృద్ధి రేటుకు చేరువ అవుతోందంటూ ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ చేసిన వ్యాఖ్యలు.. తప్పుడు భావనతో, పక్షపాతంతో, అపరిపక్వంగా ఉన్నాయని ఎస్‌బీఐ రీసెర్చ్ సంస్థ పేర్కొంది. 1950 నుంచి 1980 వరకు భారత్ జీడీపీ వృద్ధి అత్యంత తక్కువగా, సగటున 3.5 శాతంగా కొనసాగింది. దీన్ని హిందూ వృద్ధి రేటుగా భారత ఆర్థికవేత్త అయిన రాజ్ కృష్ణ సంబోధించారు. దీంతో తక్కువ వృద్ధి రేటును హిందూ వృద్ధి రేటుగా అభివర్ణిస్తుంటారు.

జాబ్ పాయింట్

స్టాఫ్ సెలక్షన్ కమిషన్‌లో 5369 పోస్టులు

స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ).. కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో పనిచేసేందుకు వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 5369
» **పోస్టుల వివరాలు:** ఇన్వెస్టిగేటర్ గ్రేడ్-2, డేటా ప్రాసెసింగ్ అసిస్టెంట్, లైబ్రరీ ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్, హిందీ టైపిస్ట్, సౌండ్ టెక్నీషియన్, అకౌంటెంట్, ప్లానింగ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్, సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్, టెక్స్‌టైల్ డిజైనర్, రీసెర్చ్ ఇన్వెస్టిగేటర్, రీసెర్చ్ అసిస్టెంట్, లాబొరేటరీ అసిస్టెంట్, జూనియర్ కంప్యూటర్ అసిస్టెంట్, లైబ్రరీ కమ్ ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్, సెక్షన్ ఆఫీసర్, అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్, జూనియర్ సైంటిఫిక్ అసిస్టెంట్, డ్రాఫ్ట్స్ మాన్, ప్రాసెసింగ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్, అసిస్టెంట్ వెల్ఫేర్ అడ్మినిస్ట్రేటర్, నావిగేషనల్ అసిస్టెంట్ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి మెట్రిక్యులేషన్, హయ్యర్ సెకండరీ ఎడ్యుకేషన్, గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 18 నుంచి 30 ఏళ్లు ఉండాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు వయసులో సడలింపు ఉంటుంది.
» **ఎంపిక విధానం:** స్కిల్ టెస్ట్/కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్/డేటాఎంట్రీ టెస్ట్/కంప్యూటర్ పరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
» **పరీక్ష విధానం:** పరీక్షలో భాగంగా జనరల్ ఇంటెలిజెన్స్ నుంచి 25 ప్రశ్నలు ఇస్తారు. అందుకు 50 మార్కులు కేటాయిస్తారు. జనరల్ అవేర్‌నెస్ 25 ప్రశ్నలు– 50 మార్కులు, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ నుంచి 25 ప్రశ్నలు– 50 మార్కులు, ఇంగ్లిష్ నుంచి 25 ప్రశ్నలు– 50 మార్కులు ఉంటాయి. ప్రతి తప్పు సమాధానానికి 0.50 రుణాత్మక మార్కు ఉంటుంది.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 06.03.2023.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 27.03.2023
» **ఆన్‌లైన్ పేమెంట్ చివరితేది:** 28.03.2023.
» **కంప్యూటర్ ఆధారిత పరీక్ష తేది:** జూన్–జూలై 2023.
» **వెబ్‌సైట్:** www.ssc.nic.in

విదేశీ విద్యకు.. ముందస్తు ప్రణాళిక!

» విదేశీ విద్యవైపు భారత విద్యార్థుల చూపు
» గత మూడేళ్లలో దాదాపు మూడింతల వృద్ధి
» తొలి గమ్యంగా అగ్రరాజ్యం అమెరికా
» ఎక్కువ మంది చేరేది ఎంఎస్, ఎంబీఏలోనే!
» ముందస్తు సన్నద్ధతతోనే సక్సెస్ అంటున్న నిపుణులు

స్టడీ అబ్రాడ్.. విదేశీ విద్య. నేడు దేశంలో లక్షల మంది స్వప్నం! ముఖ్యంగా సైన్స్, ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్ వంటి ప్రొఫెషనల్ కోర్సుల విద్యార్థులు ఉన్నత విద్య కోసం విదేశాలకు పయనమవుతున్నారు. ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లిన భారతీయ విద్యార్థుల సంఖ్య గత మూడేళ్లలో మూడింతలు పెరగడమే ఇందుకు నిదర్శనం! కోవిడ్ కారణంగా కఠిన నిబంధనలు అమలు చేసిన అమెరికా యూనివర్సిటీల్లోనే మన విద్యార్థులు ఎక్కువగా చేరినట్లు ఇటీవల అధికారిక గణాంకాలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో.. మన విద్యార్థులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్న దేశాలు, చేరుతున్న కోర్సులు, ప్రవేశ విధానాలు, ముందస్తు సన్నద్ధతపై ప్రత్యేక కథనం..

విదేశీ విద్యకు వెళ్లాలనుకునే మన విద్యార్థులు ఎంతో ముందుగానే ప్రణాళికలను సిద్ధం చేసుకొని అడుగులు వేస్తున్నారు. ఫలితంగానే..విదేశీ యూనివర్సిటీల్లో చేరే భారతీయ విద్యార్థుల సంఖ్య ఏటేటా పెరుగుతోంది. దేశం నుంచి స్టడీ అబ్రాడ్‌కు వెళ్లిన విద్యార్థుల సంఖ్య గత మూడేళ్లలో భారీగా పెరిగిందని తాజాగా బ్యూరో ఆఫ్ ఇమిగ్రేషన్ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. విదేశాలకు వెళ్లిన మన విద్యార్థుల సంఖ్య 2020లో 2,59,655గా ఉంటే.. 2021లో 4,44,553గా, 2022లో 7,50,365గా ఉంది.

ఎంఎస్, ఎంబీఏ కోసమే

విదేశాల్లో ఉన్నత విద్య కోసం పయనమవుతున్న వారిలో ఎక్కువ మంది ఎంఎస్-కంప్యూటర్ సైన్స్, లేదా ఎంబీఏ కోర్సుల్లో చేరుతున్నారు. మొత్తం విద్యార్థుల్లో వీరి సంఖ్య దాదాపు 80 శాతంగా ఉంది. ఇతర ప్రొఫెషనల్ కోర్సుల విషయానికొస్తే.. హాస్పిటాలిటీ, నర్సింగ్, అగ్రికల్చర్ విభాగాలు ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి. ఈ కోర్సులకు సంబంధించి యూకే, ఆస్ట్రేలియా భారతీయ విద్యార్థులకు ప్రధాన గమ్యాలుగా నిలుస్తున్నాయి.

యూఎస్.. ఓపీటీతో కొలువు

యూఎస్‌లో అడుగుపెట్టాలంటే.. పలు అర్హత ప్రమాణాలు తప్పనిసరి. పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు అమెరికాలోని అధిక శాతం యూనివర్సిటీలు 16 ఏళ్ల (10+2+4) విధానంలో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొంటున్నాయి. మరికొన్ని విశ్వవిద్యాలయాలు మాత్రం 10+2 తర్వాత మూడేళ్ల బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేసిన వారికి కూడా అవకాశం కల్పిస్తున్నాయి. ప్రఖ్యాత యూనివర్సిటీలు(హార్వర్డ్, ఎంఐటీ, యూసీ, కార్నెగీ తదితర) మాత్రం తప్పనిసరిగా 10+2+4 విధానంలో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలని స్పష్టం చేస్తున్నాయి. దీంతోపాటు సైన్స్, ఇంజనీరింగ్ కోర్సుల అభ్యర్థులు జీఆర్ఈలో, మేనేజ్‌మెంట్ కోర్సుల విద్యార్థులు జీమ్యాట్‌లో మంచి స్కోర్ సాధించాల్సి ఉంటుంది. ప్రవేశం ఖరారయ్యాక వర్సిటీలు అందించే ఐ-20 ఫామ్ ద్వారా స్టూడెంట్ వీసాకు దరఖాస్తు చేసుకోవాలి.

కొలువుకు మార్గం: అమెరికాలో ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్(ఓపీటీ) పేరుతో ప్రత్యేక విధానాన్ని అమలు చేస్తున్నారు. దీని ప్రకారం-యూఎస్‌లోని ఏదైనా యూనివర్సిటీలో పీజీ కోర్సులో చేరిన అంతర్జాతీయ విద్యార్థులు చదువు పూర్తయిన తర్వాత ఓపీటీ పేరుతో అక్కడి సంస్థల్లో 12 నెలలపాటు పని చేయొచ్చు.స్టెమ్(సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్) కోర్సుల విద్యార్థులు 36 నెలలపాటు ఓపీటీ విధానంలో యూఎస్‌లోని సంస్థల్లో పని చేసే అవకాశం ఉంటుంది. ఆ సమయంలో చక్కటి పనితీరుతో సదరు సంస్థలను మెప్పిస్తే.. అదే కంపెనీలో శాశ్వత కొలువు కోసం అభ్యర్థుల తరఫున హెచ్-1బి పిటిషన్‌కు కంపెనీలు దరఖాస్తు చేసే అవకాశముంది. వాస్తవానికి గత కొన్నేళ్లుగా యూఎస్‌లో దాఖలవుతున్న హెచ్-1బి పిటిషన్లలో ఓపీటీ పూర్తి చేసుకున్న విద్యార్థుల సంఖ్యే ఎక్కువగా ఉంటోంది.

ఫీజు 50 వేల డాలర్లు: అమెరికాలోని వర్సిటీల్లో కోర్సుల వార్షిక ఫీజు 35 వేల డాలర్ల నుంచి 50 వేల డాలర్ల వరకు ఉంటోంది. హార్వర్డ్, ఎంఐటీ, యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, బర్కిలీ యూనివర్సిటీ వంటి ప్రతిష్టాత్మక ఇన్‌స్టిట్యూట్‌లలో చదవాలంటే.. ఏడాదికి కనీసం యాభై వేల డాలర్ల ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

కెనడా.. సైన్స్, రీసెర్చ్

సైన్స్, ఇంజనీరింగ్, రీసెర్చ్ కోర్సుల విద్యార్థులకు కెనడా బెస్ట్ డెస్టినేషన్‌గా నిలుస్తోంది. అమెరికాకు పొరుగునే ఉండడంతో భవిష్యత్తు అవకాశాలను దృష్టిలో పెట్టుకొని ఎక్కువ మంది కెనడాకు ప్రాధాన్యం ఇస్తున్నారు. అక్కడ ప్రభుత్వం అమలు చేస్తున్న సింప్లిఫైడ్ వీసా ఫ్రేమ్ వర్క్ విధానం, వర్క్ పర్మిట్, ఇమిగ్రేషన్ విధానం భారతీయులకు వరంగా మారింది. ఈ దేశంలో కోర్సు పూర్తి చేసుకున్న తర్వాత ఏడాది పాటు అక్కడే ఉండి ఉద్యోగాన్వేషణ సాగించొచ్చు. ఆ సమయంలో ఉద్యోగం సొంతం చేసుకుని స్పాన్సర్‌షిప్ లెటర్ ఆధారంగా వర్క్ వీసాకు దరఖాస్తు చేసుకోవచ్చు. మూడేళ్లపాటు పని అనుభవంతో పర్మనెంట్ రెసిడెన్సీ కోసం దరఖాస్తు చేసుకునే విధంగా సరళీకృత నిబంధనలను కెనడా రూపొందించింది.

కెనడా..బెస్ట్ కోర్సులు: ప్రస్తుతం కెనడాలో సైన్స్, డెయిరీ టెక్నాలజీ, రీసెర్చ్, హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్, హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్, జనరల్ మేనేజ్‌మెంట్, ఏవియేషన్ టెక్నాలజీ, ఆస్ట్రానమీ, ఆటోమొబైల్ ఇంజనీరింగ్ బెస్ట్ కోర్సులుగా నిలుస్తున్నాయి. ఈ కోర్సుల వ్యవధి 14 నెలల నుంచి 24 నెలలు. ఇక్కడ ఫీజులు ఏడాదికి 30 వేల డాలర్ల నుంచి 40 వేల డాలర్ల వరకు ఉంటున్నాయి. మెక్‌గిల్ యూనివర్సిటీ; క్వీన్స్ యూనవర్సిటీ; యూనివర్సిటీ ఆఫ్ టొరంటో; వాటర్‌లూ యూనివర్సిటీ; యూనివర్సిటీ ఆఫ్ బ్రిటిష్ కొలంబియా; యూనివర్సిటీ ఆఫ్ అల్బెర్టా;యూనివర్సిటీ డి మాంట్రియల్; మెక్‌మాస్టర్ యూనివర్సిటీ; వెస్ట్రన్ యూనివర్సిటీ; యూనివర్సిటీ ఆఫ్ కల్గెరీ వంటి టాప్-10 యూనివర్సిటీల్లో చదవాలంటే.. ఏడాది 40 వేల డాలర్లకు పైగా ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

యూకే.. ఏడాది పీజీ

మన విద్యార్థుల మరో ముఖ్య గమ్యం.. యూకే. ఇక్కడి వర్సిటీల్లో బిజినెస్ మేనేజ్‌మెంట్, ఇంజనీరింగ్,హ్యుమానిటీస్ కోర్సుల్లో చేరుతున్నారు. ప్రధానంగా మేనేజ్‌మెంట్, ఫైనాన్స్, ఎకనామిక్స్, బ్యాంకింగ్, లా కోర్సులకు యూకే కేరాఫ్‌గా నిలుస్తోంది. యూకేలోని చాలా యూనివర్సిటీల్లో పీజీ కోర్సును ఒక ఏడాదిలోనే పూర్తి చేసే అవకాశం ఉండటం మన విద్యార్థులకు కలిసి వస్తోంది. ఫీజులు కూడా అమెరికా, కెనడాలతో పోల్చుకుంటే తక్కువగా ఉంటున్నాయి. ఏడాది వ్యవధిలో ఉండే పీజీ కోర్సు ఫీజు 10వేల పౌండ్ల నుంచి 25 వేల పౌండ్ల మధ్యలోనే ఉంటోంది. ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్, ఇంపీరియల్ కాలేజ్ ఆఫ్ లండన్,లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్,యూనివర్సిటీ ఆఫ్ సెయింట్ ఆండ్రూస్,వార్విక్ యూనివర్సిటీ, కింగ్స్ కాలేజ్, ఎడిన్‌బర్గ్ యూనివర్సిటీ, లాంకెస్టర్ యూనివర్సిటీ, గ్లాస్గో యూనివర్సిటీలు టాప్-10 జాబితాలో నిలుస్తున్నాయి.

ఆస్ట్రేలియా..అవకాశాలకు మార్గం

ఇటీవల కాలంలో మన విద్యార్థులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్న దేశం.. ఆస్ట్రేలియా. అగ్రికల్చర్, డెయిరీ టెక్నాలజీ, హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్, బిజినెస్ మేనేజ్‌మెంట్, ఇంజనీరింగ్, ఆర్కిటెక్చర్ కోర్సులు అందించడంలో ఇక్కడి యూనివర్సిటీలకు మంచి పేరుంది. మేనేజ్‌మెంట్ కోర్సుల వ్యవధి 14 నెలల నుంచి 20 నెలలు; ఇంజనీరింగ్ కోర్సుల వ్యవధి 24 నెలల వరకు ఉంటోంది. కోర్సు పూర్తి చేసిన తర్వాత అక్కడే ఏడాది పాటు ఉద్యోగాన్వేషణ సాగించే అవకాశం ఉంది. ఆ సమయంలో ఉద్యోగం లభిస్తే అక్కడే కొనసాగే అవకాశముంది.



ఫిబ్రవరి, జూలై నెలల్లో ఇక్కడి యూనివర్సిటీల్లో అకడమిక్ సెషన్ ప్రారంభమవుతుంది. ఫీజు కనిష్ఠంగా 22 వేల ఆస్ట్రేలియన్ డాలర్లు, గరిష్ఠంగా 50 వేల ఆస్ట్రేలియన్ డాలర్ల వరకూ ఉంది. ఆస్ట్రేలియా నేషనల్ యూనివర్సిటీ; యూనివర్సిటీ ఆఫ్ మెల్‌బోర్న్; యూనివర్సిటీ ఆఫ్ సిడ్నీ; అడిలైడ్ యూనివర్సిటీ; మొనాష్ యూనివర్సిటీ; యూనివర్సిటీ ఆఫ్ క్వీన్స్‌లాండ్; యూనివర్సిటీ ఆఫ్ న్యూ సౌత్ వేల్స్; యూనివర్సిటీ ఆఫ్ వెస్ట్రన్ ఆస్ట్రేలియా వంటి వర్సిటీల్లో ఏడాదికి సగటున 30 వేల ఆస్ట్రేలియన్ డాలర్లను ఫీజులుగా చెల్లించాల్సి ఉంటుంది.

జర్మనీ..రీసెర్చ్‌కు కేరాఫ్

భవిష్యత్తులో రీసెర్చ్ దిశగా అడుగులు వేయాలనుకునే అభ్యర్థులకు కేరాఫ్‌గా నిలుస్తోంది.. జర్మనీ. ఆటోమొబైల్, మాన్యుఫ్యాక్చరింగ్ విభాగాల్లో ఎంఎస్ బై రీసెర్చ్, ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ కోర్సులు ఇంజనీరింగ్ విద్యార్థులకు ప్రధాన ఆకర్షణగా చెప్పొచ్చు. వీటి తర్వాత స్థానంలో మేనేజ్‌మెంట్ కోర్సులు నిలుస్తున్నాయి. అకడమిక్ సెషన్ జనవరి, జూలై నెలల్లో ప్రారంభమవుతుంది. ఇక్కడ అధిక శాతం యూనివర్సిటీలు ప్రభుత్వ ఆధీనంలో ఉండటంతో ఫ్రీ ఎడ్యుకేషన్ విధానం అమలవుతోంది. విద్యార్థులు సెమిస్టర్‌కు కనీసం రూ.500 యూరోలు డెవలప్‌మెంట్ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ప్రైవేటు యూనివర్సిటీల్లో మాత్రం పది వేల యూరోల నుంచి 20 వేల యూరోల వరకు చెల్లించాల్సి ఉంటుంది. కోర్సు పూర్తయ్యాక 18 నెలలపాటు ఆ దేశంలోనే ఉండి ఉద్యోగాన్వేషణ సాగించే విధంగా సరళీకృత ఇమిగ్రేషన్ విధానం అమల్లో ఉంది. హంబోల్ట్ యూనివర్సిటీ, ఫ్రీ యూనివర్సిటీ ఆఫ్ బెర్లిన్, టెక్నికల్ యూనివర్సిటీ మ్యునిచ్, జార్జ్ అగస్ట్ యూనివర్సిటీ, ఎబర్‌హార్డ్ కార్ల్స్ యూనివర్సిటీ, టెక్నికల్ యూనివర్సిటీ బెర్లిన్, లీప్‌జిగ్ యూనివర్సిటీ, జెనా యూనివర్సిటీ, బ్రెమెన్ యూనివర్సిటీ, రెగెన్స్‌బర్గ్ యూనివర్సిటీలు టాప్‌లో నిలుస్తున్నాయి.

ఫాల్, స్ప్రింగ్.. ప్రవేశాలు

- విదేశీ యూనివర్సిటీలు ఫాల్, స్ప్రింగ్ సెషన్ పేరుతో ఏటా రెండుసార్లు ప్రవేశ ప్రక్రియ నిర్వహిస్తున్నాయి.
- ఫాల్ సెషన్ ఆగస్ట్‌లో, స్ప్రింగ్ సెషన్ జనవరిలో ప్రారంభమవుతుంది. వీటికి సంబంధించిన ప్రవేశాలు సదరు సెషన్ ప్రారంభానికి ఆరు నెలల ముందుగానే ప్రారంభమవుతున్నాయి.
- ఫాల్ సెషన్ అడ్మిషన్ల కోసం జనవరి నుంచి ఏప్రిల్ నెల వరకు, స్ప్రింగ్ సెషన్ ప్రవేశాలకు జూన్ నుంచి సెప్టెంబర్ మధ్య కాలంలో యూనివర్సిటీలు దరఖాస్తులు స్వీకరిస్తున్నాయి.
- ఫాల్, స్ప్రింగ్ సెషన్లతోపాటు కొన్ని యూనివర్సిటీలు రోలింగ్ అడ్మిషన్ల పేరిట ఏడాది ఆసాంతం దరఖాస్తు ప్రక్రియ చేపడుతుంటాయి.
- అమెరికాకు వెళ్లాలనుకునే విద్యార్థులు తాము చేరదలచుకున్న సెషన్‌కు కనీసం 15 నుంచి 18 నెలల ముందుగా కసరత్తు ప్రారంభించాలి. అలాగే ఇతర దేశాలకు కూడా ముందస్తు కసరత్తు ప్రారంభించడం మేలు చేస్తుంది.

స్టాండర్డ్ టెస్టులు తప్పనిసరి

- విదేశీ యూనివర్సిటీల నిబంధనల ప్రకారం–నిర్దేశిత స్టాండర్డ్ టెస్ట్‌లలో ఉత్తీర్ణత సాధించి నిర్దేశిత స్కోర్ సొంతం చేసుకుంటేనే ప్రవేశం లభిస్తుంది.
- సైన్స్,ఇంజనీరింగ్ కోర్సుల విద్యార్థు లు జీఆర్ఈలో కనీసం 300కుపైగా పాయింట్లు సాధించాలి.
- మేనేజ్‌మెంట్ కోర్సుల అభ్యర్థులు జీమ్యాట్‌లో 650కు పైగా స్కోర్ సొంతం చేసుకుంటే బెస్ట్ యూనివర్సిటీల్లో ప్రవేశం లభిస్తుంది.
- విదేశీ విద్య అభ్యర్థులు లాంగ్వేజ్ టెస్ట్‌లలోనూ స్కోర్ సొంతం చేసుకోవాలి.
- టోఫెల్‌లో కనీసం 100స్కోర్; ఐఈఎల్‌టీఎస్‌లో 9బ్యాండ్స్‌లో కనీసం 6.5 బ్యాండ్స్ సొంతం చేసుకుంటే.. బెస్ట్ యూనివర్సిటీల్లో ప్రవేశాలు పొందొచ్చు.
- అకడమిక్‌గా పదో తరగతి నుంచి బ్యాచిలర్ డిగ్రీ వరకు కనీసం 60 శాతం మార్కులు లేదా దానికి సమానమైన జీపీఏ సాధించిన వారికి ప్రవేశాల్లో ప్రాధాన్యం దక్కుతోంది.

ఈ డాక్యుమెంట్లు సిద్ధంగా

విదేశీ విద్య అభ్యర్థులు దరఖాస్తు ప్రక్రియ ప్రారంభించే ముందే కొన్ని డాక్యుమెంట్లను సిద్ధం చేసుకోవాలి. అవి.. అప్లికేషన్, కవరింగ్ లెటర్; అప్లికేషన్ ఫీజు; జీఆర్ఈ, జీమ్యాట్, టోఫెల్, ఐఈఎల్‌టీఎస్, ఎస్ఏటీ పరీక్షల్లో స్కోరు; స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్; లెటర్ ఆఫ్ రికమండేషన్; వ్యాసాలు; అకడమిక్ సర్టిఫికెట్లు; ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్స్; పాస్‌పోర్ట్; స్పాన్సర్ లెటర్స్, స్పాన్సర్స్ ఆదాయపు పన్ను స్టేట్‌మెంట్.



రజిత... వేదహిత

మహిళల్నే దేవతలుగా, అమ్మవారి అంశగా భావించే మన దేశంలో మహిళలు ఎందుకు వేద విద్య అభ్యసించకూడదు.. ఎందుకు పౌరోహిత్యం చేయకూడదు.. ఎందుకీ వివక్ష? అని భావించిన చిత్తూరు జిల్లా నగరికి చెందిన రజిత అడ్డంకులన్నిటినీ అధిగమించింది. అవరోధాలను దాటుకుని వేదాలు, శాస్త్రాలు చదివి పౌరోహిత్యాన్ని వృత్తిగా స్వీకరించింది. నగరి ఎస్‌ఆర్ నగర్‌కు చెందిన దిలీప్ భార్య రజిత వేద విద్యను అభ్యసించడంతో పాటు పలు శుభకార్యాల్లో పౌరోహిత్యం చేస్తూ అందరితోనూ ప్రశంసలు పొందుతోంది. ఈ స్థాయికి చేరుకున్న రజిత పేద కుటుంబానికి చెందినవారు. తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా జిల్లేడు చౌదరి గూడెం ఆమె స్వగ్రామం. రజిత తల్లిదండ్రులు సుమిత్ర, జంగారెడ్డి నిరుపేదలు. ఆ కుటుంబంలో రజిత నాలుగో కుమార్తె. ఈమె మేనమామ మర్రి కృష్ణారెడ్డి రజితకు వేదవిద్యను అందించాలని సంకల్పించారు. వారణాసిలో పాణినీ కన్యా విద్యా గురుకులంలో చిన్నతంలోనే చేర్పించారు. అక్కడే రజిత శాస్త్రి విద్య వరకు వేదవిద్యను అభ్యసించింది. ఆచార్య విద్యాభ్యాసం చేసేటప్పుడు సంస్కృత వ్యాకరణంలో బంగారు పతకం సాధించింది. అమ్మాయిలు వేద విద్యను అభ్యసించడం ఏమిటని బంధువులు వెటకారం చేసినా మేనమామ ప్రోత్సాహంతో రజిత ముందుకే వెళ్లింది. వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు, ఇతిహాసాలు, భగవద్గీత శ్లోకాలు, పౌరోహిత్యం ఇలా అన్ని అంశాలను ఔపోసన పట్టింది. ఆ తర్వాత తిరుపతిలోని కేంద్రీయ సంస్కృత విద్యాపీఠ్ నుంచి డాక్టరేట్ సాధించింది. మహిళలు వేదాలు చదవడానికి పనికి రారని.. తాను చదివిన వేద పురాణాల్లో ఎక్కడా లేదని పురుషులకు సమానంగా పెళ్లిళ్లు, శుభకార్యాలు లాంటివి చేస్తూ రజిత ముందుకు సాగుతోంది.

సంస్కృత విద్యనందిస్తా..

ప్రతి ఇంట్లో మహిళలే పూజ చేస్తుంటారు. కానీ బయటి కార్యక్రమాల దగ్గరికొచ్చేసరికి మాత్రం పురుష పూజారులే కనిపిస్తుంటారు. దేవుడికి సేవ చేస్తూ పాటలు పాడడం, మంత్రాలు చదవడం ఒక కొత్త అనుభూతి. త్వరలో గురుకులం ఏర్పాటుచేసి మహిళలకు సంస్కృత విద్యాబోధన చేయాలన్నది నా ఆశయం. – రజిత, నగరి



క్లుప్తంగా...

‘సీపెట్’ ఆధ్వర్యంలో ఉచిత ఉపాధి శిక్షణ

సాక్షి, అమరావతి: విజయవాడలోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోకెమికల్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సీపెట్)లో నిరుద్యోగ యువతకు ఉచిత ఉపాధి శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ జాయింట్ డైరెక్టర్ సీహెచ్ శేఖర్ మంగళవారం తెలిపారు. గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (గెయిల్) సౌజన్యంతో ఈ శిక్షణ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. 30 మంది అభ్యర్థులను ఎంపిక చేసి ‘ప్లాస్టిక్స్ ప్రొడక్ట్ మాన్యుఫాక్చరింగ్ ఆపరేటర్’ కోర్సులో 4 నెలల పాటు శిక్షణ ఉంటుందన్నారు. కనీసం ఎనిమిదో తరగతి చదివి, 18–28 సంవత్సరాల వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఎంపికైన వారికి ఉచిత యూనిఫాం, ట్రైనింగ్ కిట్, సేఫ్టీ షూస్‌తో పాటుగా ఉచిత భోజన, వసతి సదుపాయాలను కల్పిస్తామన్నారు. తరగతి శిక్షణ విజయవంతంగా పూర్తిచేసుకున్న వారికి మరో 2 నెలలు పరిశ్రమల్లో ఇంటర్న్‌షిప్ ఉంటుందని, అనంతరం వారికి సర్టిఫికెట్ ఇచ్చి ప్రముఖ ప్లాస్టిక్స్, అనుబంధ సంస్థలలో ఉద్యోగ అవకాశం కల్పిస్తామన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు 78935 86494 నంబర్‌లో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని శేఖర్ సూచించారు.

సమస్య పరిష్కారానికి ఏం విధానం అనుసరిస్తున్నారో చెప్పండి


పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డుకు హైకోర్టు ఆదేశం



సాక్షి, అమరావతి: పోలీసు కానిస్టేబుల్ పరీక్షలో ప్రశ్నలకు సమాధానాలు తప్పు అయినప్పుడు ఆ వివాదాన్ని పరిష్కరించేందుకు సాధారణంగా ఎలాంటి విధానాన్ని అనుసరిస్తున్నారు? అందుకు సంబంధించిన మార్గదర్శకాలు ఏమిటి? తదితర వివరాలను తమ ముందుంచాలని హైకోర్టు మంగళవారం పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డును ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 9వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు ఉత్తర్వులు జారీ చేశారు. పోలీస్ కానిస్టేబుల్ రాత పరీక్ష ప్రిలిమ్స్‌లో 8 ప్రశ్నలకు సరైన జవాబులను నిర్ణయించలేదని, ఈ వ్యవహారాన్ని నిపుణుల కమిటీకి నివేదించడంతో పాటు తమను దేహదారుఢ్య పరీక్షకు అనుమతించేలా రిక్రూట్‌మెంట్ బోర్డుకు ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ జలగం సహజ మరో 79 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే.

చంద్రబాబుపై క్రిమినల్ కేసు పెట్టాలి

వైఎస్సార్‌సీపీ ఎంపీ భరత్‌రామ్



సాక్షి, న్యూఢిల్లీ: పోలవరం ప్రాజెక్టు నిర్మాణం జాప్యంతో ప్రజాధనం దుర్వినియోగం కావడానికి కారణమైన టీడీపీ అధినేత చంద్రబాబుపై క్రిమినల్ కేసు పెట్టాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టులో కాఫర్ డ్యాంలు పూర్తికాకుండా డయాఫ్రంవాల్ కట్టారని ఆరోపించారు. రెండేళ్ల కిందట వరద నీటితో ఒత్తిడి ఎక్కువై డయాఫ్రంవాల్ దెబ్బతిందని గుర్తుచేశారు. ఢిల్లీలోని ఏపీ భవన్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు ప్రభుత్వం ఇప్పటికీ ఉండి ఉంటే డయాఫ్రంవాల్‌కు ఏదో మేకప్ చేసి దానిపై ఈసీఆర్‌ఎఫ్ డ్యాం నిలబెట్టేవారని తద్వారా జరగకూడనిది జరిగితే గోదావరి జిల్లా పూర్తిగా నీటమునిగేదని పేర్కొన్నారు. ప్రాజెక్టు ఆలస్యం కావడంతో అంచనా ధర మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ విధంగా ప్రజాధనం దుర్వినియోగం చేసిన చంద్రబాబుపై క్రిమినల్ కేసు పెట్టాలన్నారు. చంద్రబాబు హయాంలో చేసిన నిర్వాకంపై ప్రాజెక్టు అథారిటీ అప్పుడు ఏం చేసిందని ప్రశ్నించారు. నాడు టీడీపీ చేసిన తప్పులు సరిదిద్దుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ముందుకెళ్తున్న విషయాన్ని ప్రజలందరూ గుర్తించాలని కోరారు.

తల్లి కోసం పులి కూనల కలవరం

రెండు రోజులు గడిచినా జాడలేని పెద్ద పులి

- తల్లి చెంతకు చేర్చేందుకు అధికారుల ముమ్మర ప్రయత్నాలు
- ఇప్పటికే 70 ఇన్‌ఫ్రారెడ్ కెమెరాల ఏర్పాటు
- మనుషులు తాకిన పిల్లలను తల్లి పులి తిరస్కరించే అవకాశం!
- జాప్యం జరిగితే కూనలు మర్చిపోయే ఛాన్స్
- శాస్త్రీయ పద్ధతుల్లో తల్లి వద్దకు తప్పక చేరుస్తామని అధికారుల ధీమా



ఆత్మకూరు రూరల్: నంద్యాల జిల్లా కొత్తపల్లె మండలం పెద్ద గుమ్మడాపురం శివార్లలోకి నాలుగు పిల్లలతో వచ్చిన తల్లి పులి జాడ రెండు రోజులైనా కానరాలేదు. తల్లి కోసం పులి కూనలు విలవిల్లాడుతున్నాయి. వాటిని తల్లి చెంతకు చేర్చేందుకు అటవీ అధికారులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు పులి కూనలను ఎలా కాపాడుకోవాలనే మీమాంస అధికారుల్లో నెలకొంది. పులి కూనలు లభ్యమైన ప్రాంతంలో రెండు కిలోమీటర్ల వలయంలో 70 ఇన్‌ఫ్రారెడ్ ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేశారు. తొలుత తల్లి పులిని గుర్తించి ఆపై ఆ ప్రాంతానికిఏ పులి కూనలను చేర్చడం ద్వారా వాటిని తల్లితో కలపడం కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ‘తల్లి ఎపులిని గుర్తించిన తరువాత ఒక చిన్నపాటి ఎన్‌క్లోజర్‌లో పులి కూనలను అదే ప్రాంతంలో ఉంచుతారు. తల్లి వాటిని గుర్తించి దగ్గరగా వస్తే కూనలను ఎన్‌క్లోజర్ నుంచి వదులుతారు.

ఆ నాలుగూ ఆడ కూనలే

పెద్ద పులులు సాధారణంగా ఒక కాన్పులో మూడు పిల్లల్ని కంటాయి. వీటిలో మగ, ఆడ కూనలు ఉంటాయి. వాటిలో రెండు మాత్రమే బతికే అవకాశం ఉంటుంది. బతికిన వాటిలో సాధారణంగా ఒక్కొక్క ఆడ, మగ కూనలు ఉండవచ్చు. పెద్ద పులుల సంరక్షణ, సంతతి పెరుగుదలలోనూ ఆడ పులులదే ప్రధాన పాత్ర. గుమ్మడాపురంలో ఏకంగా ఒకే ఈతలో నాలుగు ఆడ పులి పిల్లలు పుట్టడంతో అటవీ శాఖ అధికారులకు పెద్ద సంబరమే అయ్యింది. ఒక ఆడపులి తన జీవిత కాలంలో (అడవిలో అయితే 18 ఏళ్లు) 20 పులులను పునరుత్పత్తి చేయగలదు.

చేరదీస్తుందో.. లేదో!

వన్యప్రాణుల్లో పెద్ద పులి, దొమ్మల గొండి (హైనా) తమ పిల్లల విషయంలో చిత్రంగా ప్రవర్తిస్తాయి. బిడ్డలకు ఏ కారణంగా అయినా మనిషి స్పర్శ తగిలితే వాటిని తిరిగి తమ దగ్గరకు రానీయవు. పులి కూనలను ఇక్కడి జనం ఇష్టం వచ్చినట్లు పట్టుకుని ఫొటోలు తీసుకోవడం, వాటితో ఆటలాడటం వంటి పనులు చేయడంతో పులి కూనలను తల్లి పులి అక్కున చేర్చుకునే అవకాశం ఉండకపోవచ్చని నిపుణులు చెబుతున్నారు. మరోవైపు పిల్లలను తల్లి చెంతకు చేర్చడంలో జాప్యం జరిగితే.. తల్లి వాటిని మర్చిపోయే అవకాశం కూడా ఉంటుందంటున్నారు. కాగా, మనిషి ముట్టిన వాసనలను పోగొట్టేందుకు వీలుగా అటవీ అధికారులు పులి పిల్లల మూత్రాన్ని సేకరిస్తున్నారు. దీంతో పులి పిల్లల వంటిని తడపనున్నారు.

అన్ని సందర్భాల్లో వర్తించదు

మనిషి స్పర్శ తగిలితే పులులు కూనలను తిరస్కరించడం సహజమే అయినా ఇది అన్ని సందర్భాల్లో వర్తించదని నాగార్జునసాగర్–శ్రీశైలం టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ డిప్యూటీ డైరెక్టర్ విఘ్నేష్ పేర్కొన్నారు. తల్లికి, పిల్లలకు మధ్య ఉండే బలమైన బంధం, ప్రత్యేక పరిస్థితులు దీనికి మినహాయింపు కావచ్చన్నారు. అందువల్ల పిల్లల్ని జూకు తరలించడం కంటే తల్లి వద్దకు చేర్చేందుకే ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు.

శాస్త్రీయ పద్ధతుల్ని అవలంభిస్తాం

పులి కూనలను అత్యంత శాస్త్రీయ పద్ధతుల్లో క్షేమంగా తల్లి వద్దకు చేరుస్తామని ప్రాజెక్టు టైగర్ ఫీల్డ్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి చెప్పారు. ఆత్మకూరులోని అటవీ శాఖ అతిథి గృహంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత ఏడాది డిసెంబర్‌లో గర్భంతో ఉన్న పులిని ఇన్‌ఫ్రారెడ్ కెమెరాల్లో గుర్తించామన్నారు. నాలుగు కూనలకు సరైన రక్షిత ప్రాంతాన్ని వెతుకుతూ గుమ్మడాపురం గ్రామ శివార్లకు తీసుకొచ్చి ఉండవచ్చన్నారు. తిరుపతి శ్రీవెంకటేశ్వర జంతు ప్రదర్శన శాల వన్యప్రాణి వైద్య నిపుణులు డాక్టర్ తోయిబా సింగ్ పులి కూనల ఆరోగ్య స్థితిగతులు పరిశీలించారన్నారు. కూనలను తల్లి వద్దకు చేర్చేందుకు నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా నిబంధనలు, మార్గదర్శకాలను పాటిస్తున్నామన్నారు. సమావేశంలో ప్రాజెక్ట్ టైగర్ డిప్యూటీ డైరెక్టర్ అలెన్ చోంగ్ టెరాన్, విఘ్నేష్ పాల్గొన్నారు.

బుడతడు.. గుండె ఆగినంత పనిచేశాడు..

- ఆడుకుంటూ బాత్‌రూమ్ డోర్‌కు బయట గడియ పెట్టిన ఏడాదిన్నర బాబు
- ఆ తర్వాత బాల్కనీలోని గ్రిల్‌లో కాలు ఇరుక్కుని గుక్కపట్టిన చిన్నారి
- బాత్‌రూమ్ నుంచి బయటకు రాలేక, బయట ఏం జరిగిందో తెలియక తల్లడిల్లిన తల్లి
- అగ్నిమాపకశాఖ రాకతో ఉత్కంఠకు తెర



బాల్కనీలో చిక్కుకున్న బాలుడు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): ఓ చిన్నారి ఆడుకుంటూ తల్లి స్నానానికి వెళ్లిన రూమ్‌కు బయట గడియ పెట్టేశాడు. ఆ తర్వాత ఆడుకుంటూ బాల్కనీలోని గ్రిల్స్‌లో కాలు పెట్టగా అది ఇరుక్కుపోయి గుక్కపట్టి ఏడ్వడం మొదలు పెట్టాడు. బాత్‌రూమ్‌లో ఉన్న తల్లికి బయట ఏం జరిగిందో తెలియక గుండె ఆగినంత పని అయ్యింది. రెండు మూడు గంటల ఉత్కంఠకు ఫైర్ సిబ్బంది రాకతో తెరపడింది. వివరాల్లోకి వెళితే... రాజమహేంద్రవరం ప్రకాశ్‌నగర్‌లోని సాయిరాఘవ టవర్స్ మూడో అంతస్తులో ఎం.సంతోషలక్ష్మి కుటుంబ సభ్యులు ఉంటున్నారు. ఆమెకు ఏడాదిన్నర బాబు (సాయిరామ్) ఉన్నాడు. మంగళవారం ఉదయం సాయిరామ్‌ను తీసుకుని తల్లి బాత్‌రూమ్‌కు వెళ్లింది. ఎప్పటిలా స్నానం చేయించి రూమ్ బయటకు వదిలింది. తర్వాత తానూ స్నానానికి ఉపక్రమించింది. ఇంతలో ఆ బాలుడు బాత్‌రూమ్ డోర్ వద్ద ఆడుకుంటూ గడియ పెట్టేశాడు. అక్కడి నుంచి నెమ్మదిగా బాల్కనీలోకి వచ్చాడు. బాల్కనీలోని గ్రిల్‌లో కాలు పెట్టగా ఇరుక్కుపోయింది. కాలు బయటకు రాకపోయేసరికి గుక్కపట్టి ఏడ్వడం మొదలు పెట్టాడు. బాబు ఏడుపు బాత్‌రూమ్ నుంచి విన్న తల్లి బయటకు రాలేక, బాబుకు ఏం జరిగిందో తెలియక తీవ్ర ఆందోళన చెందింది. ఏం చేయాలో తెలియక గట్టిగా కేకలు వేసింది. కింది భాగంలో నివాసం ఉంటున్న వారు విని పైకి వచ్చారు. లోపలికి వెళ్దామంటే మెయిన్ డోర్ వేసి ఉంది. లోపల ఏం జరుగుతుందో అర్థంకాని అయోమయ పరిస్థితి. దీంతో వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు వెంటనే అపార్టుమెంటుకు చేరుకుని నిచ్చెన ద్వారా పైకి ఎక్కి బాల్కనీలోని గ్రిల్స్‌లో ఇరుక్కున్న బాలుడి కాలు బయటకు తీశారు. తర్వాత లోనికి వెళ్లి బాత్‌రూమ్ గడియ తీయడంతో తల్లి సంతోషలక్ష్మి బయటకు వచ్చింది. ఇద్దరూ క్షేమంగానే ఉండటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఫైర్ సిబ్బందిని స్థానికులు అభినందించారు.

పేదరిక నిర్మూలనలో పొదుపు సంఘాల పాత్ర గణనీయం

- పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్
- మహిళాదినోత్సవం సందర్భంగా పొదుపు సంఘాల సమాఖ్యలకు సత్కారం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పేదరిక నిర్మూలనలో పొదుపు సంఘాల పాత్ర గణనీయమైందని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితిరాజశేఖర్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మంగళవారం గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఆధ్వర్యంలో ఉత్తమ ప్రతిభ కనబరచిన పొదుపు సంఘాల సమాఖ్యలను సత్కరించారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన డీపీఎం, ఏపీఎం, సీసీ, వీవోఏ కేటగిరీ ఉద్యోగుల్లో ఒక్కొక్కరి చొప్పున సన్మానించారు. కాగా, సెర్ప్ సీఈవో ఇంతియాజ్ అహ్మద్ ఓ కవితను కార్యక్రమంలో చదివి వినిపించారు.

ఢిల్లీ మద్యం కేసులో పిళ్లై అరెస్టు

- కవిత ప్రతినిధినని పిళ్లై ఒప్పుకున్నాడు
- రిమాండు రిపోర్టులో పేర్కొన్న ఈడీ

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం అవకతవకల కేసులో హైదరాబాద్‌కు చెందిన వ్యాపారవేత్త అరుణ్ రామచంద్రన్ పిళ్లైని మనీ లాండరింగ్ అభియోగాలపై ఈడీ సోమవారం రాత్రి అరెస్టు చేసి, మంగళవారం స్థానిక రౌజ్ అవెన్యూ కోర్టులో హాజరు పరిచింది. పిళ్లైని మార్చి 13 దాకా ఈడీ కస్టడీకి న్యాయమూర్తి అనుమతించారు. సౌత్ గ్రూప్‌ నుంచి రూ.100 కోట్ల ముడుపులను ఢిల్లీలోని ఆమ్ ఆద్మీ పార్టీకి చేరవేశారన్నది పిళ్లైపై అభియోగం. ఈ కేసులో పిళ్లై కీలక వ్యక్తి అని, ఇతర నిందితులైన మద్యం వ్యాపారి సమీర్ మహేంద్రు, ఆయన భార్య గీతికా మహేంద్రు, వారి కంపెనీ ఇండో స్పిరిట్ గ్రూప్‌తో కూడా ఆయనకు సంబంధాలున్నాయని తెలిపింది. ‘‘సౌత్ గ్రూప్‌నకు ప్రతినిధులుగా పిళ్లై, అభిషేక్ బోయినపల్లి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత సీఏ బుచ్చిబాబు వ్యవహరిస్తున్నారు. సౌత్ గ్రూప్ నుంచి ఆప్‌కు ముడుపులు చేరవేశారు. ప్రేమ్ రాహుల్‌తో కలిసి కవిత, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, మాగుంట రాఘవ్‌ల బినామీ పెట్టుబడులకు ప్రతినిధిగానూ ఉన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ ప్రలోభాలు

- పంచాయతీ కార్యాలయంలో రూ.5.30 లక్షల నగదు పట్టివేత
- ఇద్దరు టీడీపీ నేతల అరెస్ట్

తాడిపత్రి: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ప్రలోభాలకు తెరతీసింది. డబ్బు పంపిణీకి సిద్ధమైంది. ముందస్తు సమాచారం అందుకున్న ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు, పోలీసులు మంగళవారం సంయుక్తంగా దాడులు నిర్వహించి అనంతపురం జిల్లా తాడిపత్రిలో రూ.5.30 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ మద్దతుతో బరిలోకి దిగిన అభ్యర్థులకు ఓటమి భయం పట్టుకుంది. ఎలాగైనా గెలవాలన్న ఉద్దేశంతో ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేందుకు సిద్ధమయ్యారు. తాడిపత్రి పట్టణ శివారులోని గన్నెవారిపల్లి పంచాయతీ కార్యాలయాన్నే డబ్బుల పంపిణీకి కేంద్రంగా ఎంచుకున్నారు. ఎన్నికల స్క్వాడ్ అధికారులు రూరల్ పోలీసుల సహకారంతో మంగళవారం పంచాయతీ కార్యాలయంలో సోదాలు చేసి పంపిణీకి సిద్ధంగా ఉన్న రూ.5.30 లక్షల నగదును పట్టుకున్నారు. టీడీపీ నాయకులు శివశంకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ చింబిలి వెంకటరమణ సోదరుడు చింబిలి ప్రసాద్‌నాయుడులను అరెస్ట్ చేశారు.

బ్యాంకు ఖాతాలను ఈడీ స్తంభింపజేయొచ్చు

- జేసీ ప్రభాకర్‌రెడ్డి బస్సుల వ్యవహారంలో హైకోర్టు స్పష్టీకరణ
- ఆయన బినామీల బ్యాంకు ఖాతాల నుంచి 15 రోజులు లావాదేవీలు జరపకూడదని ఆదేశం

సాక్షి, అమరావతి: సుప్రీంకోర్టు నిషేధించిన బీఎస్–3 వాహనాలను తుక్కు కింద కొని, బీఎస్–4 వాహనాలుగా మార్చి కోట్ల రూపాయలు కొల్లగొట్టిన వ్యవహారంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత జేసీ ప్రభాకర్‌రెడ్డి బినామీలకు చెందిన బ్యాంకు ఖాతాలను స్తంభింపజేసేలా ఉత్తర్వులు జారీ చేసేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కు హైకోర్టు వెసులుబాటునిచ్చింది. మనీ లాండరింగ్ చట్టం సెక్షన్ 17 ప్రకారం సంబంధిత అధీకృత అధికారి చర్యలు చేపట్టవచ్చునని స్పష్టం చేసింది. ప్రభాకర్‌రెడ్డి బినామీగా ఆరోపణలు ఎదుర్కొంటున్న చవ్వా గోపాల్‌రెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, భార్య లక్ష్మీదేవి పేరు మీద ఉన్న యాక్సిస్, యూనియన్ బ్యాంకుల ఖాతాల నుంచి 15 రోజుల పాటు ఎలాంటి నగదు లావాదేవీలు జరపడానికి వీల్లేదని ఆదేశించింది. ఈ ఆదేశాలు ఈడీ అధీకృత అధికారి సెక్షన్ 17 (1)(ఏ) కింద జారీ చేసే ఉత్తర్వులకు లోబడి ఉంటాయని చెప్పింది. ఇదే సమయంలో విష్ణువర్ధన్‌రెడ్డి, లక్ష్మీదేవి బ్యాంకు ఖాతాల్లో ఎలాంటి డెబిట్ లావాదేవీలు జరగకుండా స్తంభింపచేయాలంటూ యాక్సిస్, యూనియన్ బ్యాంకులకు ఈడీ అసిస్టెంట్ డైరెక్టర్ పంపిన ఈ–మెయిళ్లను రద్దు చేసింది. సెక్షన్ 17 (1)(ఏ) కింద జారీ చేయని కారణంతోనే ఈ–మెయిళ్లను రద్దు చేస్తున్నట్లు తెలిపింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరీ మంగళవారం తీర్పునిచ్చారు. అశోక్ లేలాండ్ సంస్థ నుంచి బీఎస్–3 వాహనాలను తుక్కు కింద కొని, బీఎస్–4 వాహనాలుగా మార్చిన వ్యవహారంలో జేసీ ప్రభాకర్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు, బినామీలపై పోలీసులు 46 కేసులు నమోదు చేశారు. ఈ వ్యవహారంలో మనీ లాండరింగ్ జరిగినట్లు ఆరోపణలు రావడంతో ఈడీ దర్యాప్తు మొదలు పెట్టింది. కొల్లగొట్టిన సొమ్మును ప్రభాకర్‌రెడ్డి బినామీ గోపాల్‌రెడ్డి తన కుమారుడు, భార్య బ్యాంకు ఖాతాల్లో దాచినట్లు ఈడీ దర్యాప్తులో తేలింది. దీంతో ఆ ఇద్దరి బ్యాంకు ఖాతాల్లో ఎలాంటి డెబిట్ లావాదేవీలు జరగకుండా చూడాలంటూ యాక్సిస్, యూనియన్ బ్యాంకులకు ఈడీ అసిస్టెంట్ డైరెక్టర్ ఈ–మెయిళ్లు పంపారు. బ్యాంకు అధికారులు లావాదేవీలు నిలిపివేశారు. ఈడీ అసిస్టెంట్ డైరెక్టర్ ఈ–మెయిళ్లను సవాలు చేస్తూ గోపాల్‌రెడ్డి అండ్ కో, దాని మేనేజింగ్ పార్ట్‌నర్ గోపాల్‌రెడ్డి, ఆయన కుమారుడు విష్ణువర్ధన్‌రెడ్డి, భార్య లక్ష్మీదేవీలు హైకోర్టులో 2022లో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై న్యాయమూర్తి రవినాథ్ తిల్హరీ గత నెలలో పూర్తిస్థాయిలో వాదనలు విన్నారు. ఈడీ తరఫున జోస్యుల భాస్కరరావు, పిటిషనర్ల తరఫున న్యాయవాది ఐ.కోటిరెడ్డి వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ తిల్హరీ మంగళవారం తన నిర్ణయాన్ని వెలువరించారు.

విద్యార్థుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు

అధికారులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర ఆదేశం



సాక్షి, అమరావతి: గిరిజన విద్యాసంస్థల్లోని విద్యార్థుల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని, అటువంటి అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర హెచ్చరించారు. గిరిజన విద్యాసంస్థల్లో విద్యార్థుల సంరక్షణకు అవసరమైన చర్యలను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ఆయన ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మంత్రి పలు అంశాలపై సమీక్షించి, అధికారులకు కొన్ని ఆదేశాలు జారీచేశారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యాన్ని పరిరక్షించడానికి గతంలో ఉన్న ఏఎన్‌ఎంల సేవలను పునరుద్ధరించాలని చెప్పారు. గిరిజన విద్యాసంస్థల్లో ఉన్న సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయించాలని, అవసరమైన చోట కొత్తవి ఏర్పాటు చేయాలన్నారు. పదో తరగతి పరీక్షల్లో గిరిజన విద్యార్థులు మంచి ఫలితాలను సాధించేలా పర్యవేక్షణ పెంచాలని ఆదేశించారు. కాఫీ రైతులకు బకాయిలను త్వరగా చెల్లించడానికి, కాఫీ రైతులకు గిట్టుబాటు ధరలను కల్పించడానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి కాంతిలాల్ దండే, అడిషనల్ డైరెక్టర్ రవీంద్రబాబు, జీసీసీ ఎండీ సురేష్‌కుమార్, ఈఎన్‌సీ శ్రీనివాసులు, ట్రైకో ఎండీ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక రంగంలో కొత్తగా 41వేల మందికి ఉపాధి

పర్యాటక శాఖ మంత్రి రోజా

సాక్షి, అమరావతి: ఇటీవల విశాఖలో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో పర్యాటక రంగానికి రూ.21,941 కోట్ల పెట్టుబడులతో 129 ఒప్పందాలు జరిగాయని, వీటి ద్వారా 41,412 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని పర్యాటక, క్రీడలు, సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్‌కే రోజా తెలిపారు. జీఐఎస్ విజయవంతమైన నేపథ్యంలో రాష్ట్ర సచివాలయంలో మంగళవారం మంత్రి రోజా కేక్ కట్ చేసి సంతోషాన్ని వ్యక్తంచేశారు. ఆమె విలేకరులతో మాట్లాడుతూ పర్యాటకరంగంలో పెట్టుబడుల కోసం చేసుకున్న ఒప్పందాలను సాధ్యమైనంత త్వరగా అమలుపరచి ఏడాదిలోనే గ్రౌండ్ అయ్యేలా చూస్తామన్నారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ రజత్ భార్గవ, ఏపీటీడీసీ ఎండీ కె.కన్నబాబు పాల్గొన్నారు.

ఆర్టీసీలో పారదర్శకంగా డీజిల్ కొనుగోలు

- దురుద్దేశంతోనే కొన్ని మీడియా సంస్థల దుష్ప్రచారం
- ఆ సంస్థలపై పరువు నష్టందావా వేస్తాం
- ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమలరావు



సాక్షి, అమరావతి: ఆర్టీసీలో డీజిల్ కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా సాగుతోందని ఆ సంస్థ ఎండీ సీహెచ్.ద్వారకాతిరుమలరావు స్పష్టం చేశారు. నిబంధనల మేరకు టెండర్ల ప్రక్రియ నిర్వహించి నాణ్యత, పరిమాణం విషయంలో పూర్తి జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. అదేరీతిలో పొరుగు రాష్ట్రాల నుంచి డీజిల్ కొనుగోలు చేయడం ద్వారా రాష్ట్ర ఖజానాకు గండి పెట్టకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నామన్నారు. కానీ దురుద్దేశపూరితంగా కొన్ని మీడియా సంస్థలు ఆర్టీసీ డీజిల్ కొనుగోలుపై దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. అటువంటి మీడియా సంస్థలపై పరువు నష్టం కేసు వేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. విజయవాడలోని ఆర్టీసీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఆర్టీసీ నేరుగా ఇంధన కంపెనీల నుంచే డీజిల్‌ను కొనుగోలు చేసేదన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో గత ఏడాది ఫిబ్రవరి నుంచి ఇంధన కంపెనీల వద్ద బల్క్ డీజిల్ ధర రిటైల్ డీలర్ల వద్ద ధర కంటే పెరిగిందని చెప్పారు. దీంతో పొదుపు చర్యల్లో భాగంగా టెండర్ల ప్రక్రియ ద్వారా రిటైల్ డీలర్ల నుంచి డీజిల్ కొనుగోలుకు ఆర్టీసీ ఆర్‌ఎంలకు అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. తద్వారా 2022 ఫిబ్రవరి నుంచి 2023 మార్చి వరకు రూ.593 కోట్లు ఆదా చేశామని తెలిపారు. కొన్నిచోట్ల రిటైల్ డీలర్లు వారికి ఇంధన కంపెనీలు ఇస్తున్న కమీషన్ కంటే కూడా తమకు ఎక్కువ డిస్కౌంట్ ఇచ్చేందుకు ముందుకురావడాన్ని గుర్తించామన్నారు. డీజిల్ కొలత, నాణ్యతలో మోసాలు చేయడంగానీ, పొరుగు రాష్ట్రాల నుంచి కొనుగోలు ద్వారాగానీ అంతతక్కువ ధరకు డీజిల్ సరఫరా చేయగలరని పేర్కొన్నారు. ఈ విషయమై గత అక్టోబరులో రాష్ట్ర వాణిజ్యపన్నుల శాఖ కమిషనర్ కూడా ఆర్టీసీని అప్రమత్తం చేశారని తెలిపారు. దీంతో ఆర్టీసీ ఆర్‌ఎంలు, డిపో మేనేజర్లను అప్రమత్తం చేసి ఎక్కడా ఎలాంటి అవకతవకలు లేకుండా, రాష్ట్ర ఖజానాకు నష్టం కలగకుండా డీజిల్ కొనుగోలు ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మళ్లీ బల్క్ డీజిల్ ధరలు తగ్గడంతో ఈ నెల 1వ తేదీ నుంచి నేరుగా ఇంధన కంపెనీల నుంచే డీజిల్ కొనుగోలు చేయాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ప్రస్తుతం రిటైల్ డీలర్ల నుంచి డీజిల్ కొనుగోలు నిలిపేశామన్నారు. ఆర్టీసీ ప్రతిష్టను దెబ్బతీసేందుకు కొన్ని మీడియా సంస్థలు దురుద్దేశపూరితంగా వ్యవహరించడం తగదని పేర్కొన్నారు.

త్వరలో 2,736 బస్సులు

త్వరలో సంస్థలోకి 2,736 బస్సులు వస్తాయని చెప్పారు. 1,500 డీజిల్ బస్సులు, వెయ్యి ఎలక్ట్రిక్ బస్సులు కొంటామని, 200 డీజిల్ బస్సులను రెట్రోఫిట్ చేస్తామని, 36 బస్సులను అద్దె విధానంలో తీసుకుంటామని వివరించారు. ఇందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనుమతించారని ఆయన చెప్పారు.

ఈవోలు ఉన్నతాధికారులకు సబార్డినేట్‌లు కాదు

- దేవాలయ భూములు, ఆస్తుల పరిరక్షణలో స్వతంత్రంగా వ్యవహరించాలి
- స్పష్టం చేసిన హైకోర్టు... తదుపరి విచారణ 21కి వాయిదా

సాక్షి, అమరావతి: దేవాలయాల భూములు, ఆస్తులను రక్షించే విషయంలో ఆయా దేవస్థానాల ఈవోలు వారి ఉన్నతాధికారులకు సబార్డినేట్‌లు కాదని హైకోర్టు వ్యాఖ్యానించింది. భూములు, ఇతర ఆస్తుల పరిరక్షణ విషయంలో ఈవోలు స్వతంత్రంగా వ్యవహరించాలంది. హుండీ కాపాడుకోవడం ఒక్కటే ఈవోల బాధ్యత కాదని గుర్తు చేసింది. ఈవో పోస్టు ఎంతమాత్రం అలంకారప్రాయం కాదంది. దేవాలయాల భూములను పరిరక్షించేందుకు కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వులు అడ్డంకిగా ఉంటే, వాటిని ఈవోలు తగిన వేదికలు (దేవదాయ ట్రిబ్యునల్, హైకోర్టు) ముందు సవాలు చేయవచ్చునంది. గుంటూరులోని కంచికామాక్షి ఏకాంబరేశ్వర స్వామి దేవస్థానం భూముల విషయంలో కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేసేందుకు కొంత గడువు కావాలని ఆ దేవస్థానం ఈవో కోరడంతో హైకోర్టు అందుకు అనుమతినిచ్చింది. తదుపరి విచారణను ఈ నెల 21వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ వక్కలగడ్డ రాధాకృష్ణ కృపాసాగర్ ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. కంచికామాక్షి ఏకాంబరేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన 2 ఎకరాల భూమి విషయంలో కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వులపై హైకోర్టులో పిల్ దాఖలైంది. దీనిపై సోమవారం విచారణ జరిపిన సీజే ధర్మాసనం, ఆ భూమిని ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేసేందుకు దేవదాయ కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వుల విషయంలో ఏం చేయనున్నారో వివరణ ఇవ్వాలని, ఇందు కోసం స్వయంగా తమ ముందు హాజరుకావాలని ఆ దేవస్థానం ఈవోను ధర్మాసనం ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ ఆదేశాల మేరకు ఈవో సొమ్య మంగళవారం ధర్మాసనం ముందు హాజరయ్యారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943